# పడిలేచిన కెరటం

నవల

\- గంటి భానుమతి



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: ౧౨౫

కౌముది మాసపత్రికలో

జనవరి 2019 సంచిక నుంచి మార్చ్ 2020 సంచిక వరకూ

సీరియల్‌గా వచ్చిన నవల

# (ప్రారంభం)

**" మీతో మాట్లాడాలి."** కాలేజీ లైబ్రెరీలో చేస్తున్న పనిని ఆపి తలెత్తి , ఎదురుగా నుంచున్న మనిషిని ఆశ్చర్యంగా చూసింది శృతి.

ఆమె ఎదురుగా నుంచున్నది ఎవరో కొత్త మనిషి కాదు. రోజుకి ఓ సారైనా లైబ్రెరీకి వస్తాడు. పలకరిస్తాడు. జనరల్ గా పుస్తకాల గురించి, కలల గురించి, నిజాలు, నమ్మకాలు, ఆశలు గురించి, అద్భుతాల గురించి, కాలంలో కరిగిపోతున్న మనుషుల గురించి, తీసుకెళ్ళిన పుస్తకాల గురించి ,ఓ భావుకుడిలాగా,ఓ విమర్శకుడిలాగా చెప్తాడు. అతని మాటల్లో ఆకర్షణ ఉంటుంది. ఆమె మంత్ర ముగ్ధురాలిలాగా వింటూంది. అలా ఏదో ఒకటి మాట్లాడే మానవ్, రోజూ కనపడే మానవ్. ఇవాళ కొత్తగా మీతో మాట్లాడాలి అంటూంటే శృతికి ఆశ్చర్యం అనిపించింది.

" రోజూ మాట్లాడుతూంటారు కదా , ఏంటీ ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నారు మాట్లాడాలి అని . మాట్లాడండి. అడ్డేం ఉంది " అంది నవ్వుతూ.

"ఇక్కడ కాదు. వేరే చోట ఎక్కడైనా" అంటూ ఆమె కళ్ళల్లోకి చూసాడు.

ఆ చూపుల్లోని తేడాకి శృతి కలవర పడింది. వెంటనే చూపులు తిప్పుకుంది. ఆలోచనలో పడింది. ఎక్కడో మాట్లాడాల్సిన విషయం ఏం ఉంటుంది.?

"సారీ. మానవ్ . మీరు ఏది మాట్లాడాలనుకున్నా ఇక్కడే మాట్లాడండి"

" కానీ ఇది లైబ్రెరీ కదా. ఎవరైనా రావచ్చు."

" ఇప్పుడు ఎవరూ రారు. పరవాలేదు.చెప్పండి. "చేతిలోని పుస్తకానికి పేజీ గుర్తుగా అక్కడే ఉన్న మార్కర్ ఉంచింది.

కొంచెం అటూ ఇటూ చూసి గొంతు సవరించుకున్నాడు.

" మీకు అభ్యంతరం లేకపోతే మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను." గబగబా అప్ప చెప్పాడు.

ఉలిక్కి పడింది. పెళ్ళా! ఆ పదాన్ని మర్చిపోయి చాలా రోజులైంది. ఆ పదాన్ని వాడిన మానవ్ ని ఒక్కసారి చూసింది.

వెంటనే జవాబివ్వలేదు. జవాబివ్వలాంటే , ఎంతో ఆలోచించాలి. ఎన్నో ఆలోచించాలి. ఎన్నింటినో గుర్తు తెచ్చుకోవాలి. పాత పుస్తకం లోని చాప్టర్ల లోకి తొంగి చూడాలి. అన్నింటి కన్నా పెళ్ళి. గురించి. ఆ పదం చాలా రోజుల తర్వాత వింటూంటే,కొత్తగా అనిపిస్తోంది. నిజానికి ఆ పదాన్ని మర్చిపోయింది. ఇప్పుడు మానవ్ అంటూంటే ఎక్కడో జ్ఞాపకాల పొరల్లోంచి ఎన్నింటినో చీల్చుకుంటూ ఆ పదం పైకి వచ్చింది.

ఈ మానవ్ తన గత జీవితాన్ని చూడడానికి ప్రయత్నిస్తున్నాడు. మరోసారి ,మరోవ్యక్తి. తన జీవితంలోకి అతి దగ్గరగా రావడానికి ప్రయత్నిస్తున్న వాడు. మొదట ఆర్ణవ్, వంశీ,ఇప్పుడు ఈ మానవ్.

ఆలోచించాలి, దాని గురించి ఇంత వరకూ ఆలోచించాలనిపించలేదు, ఇప్పుడు ఆలోచించాలి. ఎదురుగా ఉన్న మానవ్ అడిగే సరికి ఇప్పుడు ఆలోచించాలి. పెళ్ళి చేసుకోవాలా వద్దా, అని.అడుగడుగునా మొలుస్తున్న ప్రశ్నలు,వాటిని కలుపు మొక్కల్లా పీకి పారేయ్యాలి.

అలా ఆలోచించే ముందు తన గురించి మానవ్ కి చెప్పాలా వద్దా అన్న దాని గురించి కూడా ఆలోచించాలి. ఇంత వరకూ తన గతం గురించి, ఎడారి లాంటి గతం గురించి, ఎవరికీ చెప్పుకునే పరిస్థితి రాలేదు. ఆ జ్ఞాపకాలు ఒయాసిస్ కాదు,సెద తీర్చేవి కాదు.,గాలివానలకి రెపరెపలాడే చిగురాకులు. అందుకే వాటిని తలుచుకోడానికి ఇష్టపడదు.

" ఏం అంటారు ? " తలని బాగా వొంచి, ఆమె మొహం లోకి చూస్తూ అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది. ఏం అంటారు అని అడుగుతూంటే అసలు తన గురించి ఏం తెలుసని ఆ నిర్ణయానికి వచ్చాడు.

" నాకు పెళ్ళి చేసుకునే ఉద్దేశం లేదు.మీ మనసులోంచి ఆ అభిప్రాయం తీసేయండి " అని తలవంచుకుని టేబుల్ మీద ఉన్న పుస్తకాల దొంతరపైనున్న పుస్తకాన్నితీసి, టైటిల్ ని ఇంకా వివరాలని కంప్యూటర్ లో ఎక్కించింది.

" మీరు ఆలోచించుకోండి వెంటనే చెప్పాలని ఏం లేదు " అని లేవబోయాడు.

" ఆలోచించుకోవాల్సింది ఏం లేదు. సారీ. నాకు పని ఉంది. " మీరెళ్ళండి అని డైరెక్ట్ గా చెప్పలేక పోయింది.

" ఓకే " అని అప్పటికి వెళ్ళిపోయాడు. కాని మర్నాడు అదే సమయానికి వచ్చాడు. అదే మాట.

" అసలు నా గురించి మీకేం తెలుసు, ఏమీ తెలీదు. అలాంటప్పుడు ఏం చూసి చేసుకుంటానని అంటున్నారు ? "

"నాకు తెలిసినంత వరకూ మీరు నాకు అర్థం అయ్యారు. నాకు నచ్చారు. అది చాలు నేను మిమ్మల్ని ఇష్టపడడానికి "

" సారీ, అది చాలదు. మీకు నా గురించి ఏమీ తెలీదు. తొందరపడి అంత పెద్ద నిర్ణయాలు తీసుకోవద్దు. ఇలా అప్పుడప్పుడు కలుసుకోవడం మాట్లాడుకోవడం వల్ల పైకి కనిపించేవి మాత్రమే తెలుస్తాయి. కానీ లోతైన విషయాలు తెలీదు పైగా మన మధ్య ఏం అంత పెద్ద స్నేహం కూడా లేదు "

" కానీ ఆ స్నేహం చాలు ఒకరి గురించి తెలుసు కోడానికి. పెళ్ళవుతే " అంటూ ఆగి శృతిని చూసాడు.

"ముందు ఇది చెప్పండి,అసలు పెళ్ళి అనేది ఎందుకు చేసుకుంటారు ? "

" అదేం ప్రశ్న. ఎందుకంటే ఏం చెప్తాను, అది ఓ సంస్థ. ఓ వ్యవస్థ. అందులోకి ప్రతీవ్యక్తి వెళ్లాలి అని అనుకుంటారు . దానికి కారణాలు ఎన్నో ఉంటాయి.వంశవృద్ధి చేసుకోడానికో, తోడు కోసమో, సామాజిక కారణాల మూలంగానో , ఇంటిపరిస్థితుల మూలంగానో, శారీరక సుఖాల కారణంగానో, కారణం ఏదైనా కావచ్చు కానీ నేను మాత్రం మిమ్మల్ని ఇష్టపడుతున్నాను. అందుకని అడుగుతున్నాను "

“ సరే. మీరే అన్నారు అది ఓ వ్యవస్థ అని . ఆ వ్యవస్థకి స్త్రీ పురుషులిద్దరూ రెండు అంగాల్లాంటి వాళ్ళు. ఒప్పుకుంటారు కదా. అంటే ఇద్దరూ ఉండాల్సిందే. అప్పుడే అది సంపూర్ణం అవుతుంది. అలాంటి వ్యవస్థలోకి వెళ్తున్నప్పుడు,ఎన్నో చూడాలి. ఎందుకంటే వాటి ప్రభావం ఎప్పుడూ మనిషి మీద ఉంటుంది.”

“ నాకు ఆ లోతైన విషయాలు అక్కర్లేదు ”

ఎంత సులభంగా అనేసాడు ఆ విషయాలు ఏవీ అక్కర్లేదని. అయితే పెళ్ళికి ఈ రెండేళ్ళ పరిచయం సరిపోతుందా! మరోసారి స్నేహం మీద నీడలు పడుతున్నాయి.

ఎప్పటికీ సమాధానం రాక పోయేసరికి ,ఆమె మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్నాడు.

“ నా గురించి అనుమానాలున్నాయా , నా చదువు,ఉద్యోగం అన్నీ మీకు తెలుసు. నేను సంపూర్ణ ఆరోగ్య వంతుడిని. మీకు ఆ విషయంలో సందేహంఉందేమో! “ కొంచెం సేపు ఆలోచించి అన్నాడు.

“ మీరు కావచ్చు, కానీ నేను కాదు ” అని మానవ్ మొహం లోకి చూసింది.

“ అంటే ? “ఆశ్చర్యంగా చూసాడు.

“ అందుకే అన్నాను, నా గురించి మీకు ఏం తెలీదని. నేను ఓ రెండేళ్ళు మానిక్ డిప్రెషన్ లో ఉండిపోయాను. ఓ రెండు సార్లు ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేసాను. ఓసారి నేను టెంత్ లో ఉన్నప్పుడు స్లీపింగ్ పిల్స్ తీసుకున్నాను. ఇంట్లో వాళ్ళు తొందరగా కనిపెట్టారు , దగ్గర్లో ఉన్న నర్సింగ్ హోం కి తీసుకెళ్ళారు. కాస్త సీరియస్ అయింది. ఆ తరవాత మరోసారి, అప్పుడే నేను ఓ ఆర్నెల్లు మెంటల్ హాస్పిటల్ లో ఉన్నాను. మరో ఆర్నెల్లు సైకియాట్రిస్ట్ ల పర్యవేక్షణలో ఉన్నాను. ”

అదే ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోని మానవ్ అలాగే శృతిని చూసాడు.

“ నమ్మడం లేదా! కానీ ఇదే నిజం. ”

మానవ్ ఓ నిమిషం ఏం మాట్లాడ లేదు. ఆమెనే చూస్తూండిపోయాడు.మనిషి మంచి రంగు. శిల్పి చెక్కినట్లుగా ఉంటే చక్కని ఆకారం . పొందికగా ఉండే వస్త్రధారణ,వీటన్నిటికీ మించి ఓ రెండు డిగ్రీలు, మరో రెండు డిప్లొమాలు, ఇవి కాకుండా ఆమె మంచి చిత్రకారిణి, రచయిత్రి. ఇవన్నీ ఆమె సొంతం. అలాంటి ఈమె మెంటల్ హాస్పిటల్ లో ఉందా ! నమ్మాలనిపించలేదు.

“ నేను నమ్మను. నేను ఇన్ని రోజులుగా చూస్తున్నాను, మీలో నాకు ఏం తేడా కనిపించ లేదు. నేను ప్రపోజ్ చేసానని, నన్ను పెళ్ళి చేసుకోడం ఇష్టం లేక అలా అంటున్నారా? ”

“ ఇష్టం లేకపోతే ఇష్టం లేదనే చెప్తాను, అబద్ధం ఎందుకు చెప్తాను? మీకు నిజమే చెప్పాను. ఓ పదేళ్ళ క్రితం నేను బీఎస్సీ ఫైనలియర్ లో ఉన్నప్పుడు డిప్రెషన్ తో బాధ పడ్డాను. అప్పుడు ఆసుపత్రిలో ఉన్నాను. అప్పటి నుంచి మందులు వాడుతున్నాను. వాటిని మధ్యలో మానేయడానికి లేదు. జీవితాంతం మందులు వాడాల్సిందే ”

"అంతే కదా, అది పెద్ద సీరియస్ విషయం కాదు, మా పేరెంట్స్ ఇద్దరికీ బీపీ షుగర్ ఉన్నాయి. వాళ్ళు కూడా మందుల్ని జీవితాంతం వాడాలని అంటారు. మధ్యలో మానేయడానికి వీల్లేదుట . అయినా ఈ డిప్రెషన్ నుంచి బయట పడిన వాళ్ళు ఎంతో మంది ఉన్నారు. ఉదాహరణలు ఇవ్వనా?"

" అక్కర్లేదు. పైగా అదీ ఇదీ ఒకటి కాదు. ఎందుకు కాదో మీకు తెలియాలి. అంటే నా గురించి నీకు తెలియాలి. ఇంత వరకూ నా పర్సనల్ విషయాలు నేనెవ్వరికీ చెప్పలేదు. అలా చెప్పుకోడానికి సిగ్గు పడక్కర్లేదని నన్ను ట్రీట్ చేసిన డాక్టరు గారు అన్నారు. అయినా ఇంత వరకూ ఆ అవసరం రాలేదు. కానీ ఈ రోజున మీరు అడిగారు, దానికి సమాధానంగా చెప్పాల్సి వస్తోంది. ఇప్పుడు చెప్పక పోతే మరోసారి నన్ను అడిగే అవకాశం ఉంది. ఇప్పుడు మీరు అక్కర్లేదు ఆ అవసరం లేదు అని అన్నా కానీ మీరు తెలుసుకోవాలి. మీరు నాగురించి, నా గతం గురించి ఏం తెలీకుండా పెళ్ళి గురించి మాట్లాడకూడదు "

" సరే. మీరంతగా నేను వినాలని పట్టుబడుతున్నారు కాబట్టి, వింటాను. కాని ఒక్కటి గుర్తుంచుకోండి. మీ గతం గురించి తెలుసుకోవాలని, నాకేమాత్రం ఉత్సాహం , ఆసక్తి లేదు "

"అంటే గతం చెప్పకుండానా? అది నాకిష్టం లేదు. గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్లుంటుంది "

" ఇదో పెద్ద రోగం అని అనుకోను. ఎంతో మంది మానసికంగా బాధ పడిన వాళ్లున్నారు. ఎక్కువ బాధలు పడ్డ వాళ్ళు కూడా ఉన్నారు. ఎటువంటి లోతైన గాయం అయినా ఏదో ఓ రోజున మానిపోతుంది. ఇది ఇవల్యూషన్. నీ కన్నా ముందు ఎంతో మంది సినిమా వాళ్ళూ , ఆర్మీలో వాళ్ళూ, సైంటిస్ట్ లూ, పోటీ ప్రపంచంలో ఉన్న వాళ్ళూ డిప్రెషన్ తో బాధ పడ్డారు.ఇంకా ఇప్పటికీ ఉన్నారు. వాళ్ళంతా గతాన్ని తవ్వుకుంటూ కూచో లేదు. ఆ బలహీన క్షణాలని జయించడానికి బలమైన మార్గాలు వెతుక్కున్నారు. పెళ్ళిళ్ళు చేసుకున్నారు, పిల్లలు కూడా ఉన్నారు, ఇది పెద్ద సీరియస్ కాదు. మీరెన్ని చెప్పినా నా నిర్ణయం మారదు. ముందు ఇది చెప్పండి ఎక్కడ కలుద్దాం ? " అంటూ ఆమెని చూసాడు.

" ముందు నేను మానసికంగా చెప్పడానికి తయారయ్యాకా , అప్పుడు ఎక్కడ కలుసుకోవాలో ఆలోచించి చెప్తాను "

" అలాగే " అంటూ మానవ్ వెళ్ళి పోయాడు.

అతను వెళ్ళిన వైపే చూస్తూండిపోయింది. నిన్నటి వరకూ స్నేహితుడని అనుకుంది. కానీ ఇప్పుడు దాని అర్థం మార్చేసాడు. అది ఇప్పుడు ప్రేమ ,పెళ్ళికి మారి పోయింది. స్నేహం వేరు, ప్రేమ వేరు ఆ తేడా వాళ్ళకి తెలీడం లేదు. ప్రతీసారి,ఈ స్నేహం పెళ్లికి దారి తీయాలా! మొదటి సారి అర్ణవ్ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు మానవ్ .

ఇప్పుడు తన గురించి చెప్పకపోతే మానవ్ ని డార్క్ లో ఉంచినట్లవుతుంది. తన గురించి చెప్పాలంటే తన గతం చెప్పాలి . ఆ భయంకరమైన గతం చెప్పాలి. అందులో ముఖ్యమైనవాడు అర్ణవ్. అర్ణవ్ గురించి చెప్పాలి. ఆ ఛాప్టెర్ ముగిసిపోయింది. కానీ రెఫరెన్స్ కోసం దాన్ని ఇప్పుడు చదువుకోవాలి. గతాన్ని గుర్తు పెట్టుకోక పోతే తిరిగి అనుభవించాల్సి వస్తుంది . ఏం చెయ్యాలో తెలియడం జ్ఞానం. ఏం చెయ్యకూడదో తెలియడం విద్వత్తు.

మానవ్ కి ఇప్పుడు చెప్పాలంటే ఎక్కడినుంచి మొదలెట్టాలి? తన జీవితంలో అలజడి ప్రారంభమైన దగ్గరి నుంచా? అవును అక్కడినుంచే మొదలెట్టాలి. ఆ రోజున జరిగినది జీవితంలో మలుపు తిప్పేసింది. అదే ఆరంభం,జీవితంలోని అల్లకల్లోలానికి ,పాతాళంలోకి దిగి పోడానికి ,ఎంత దిగాలో అంత కిందికి దిగిన రోజు,జారుడు మెట్లలా జారడం మొదలైన రోజు.

చిన్నగా నిట్టూర్చి,టేబుల్ మీద ఉన్న పుస్తకాలు సద్దుతూ ఎదురుగా ఉన్న కాలెండర్ ని చూసింది. శనివారం. ఇవాళ అనాధాశ్రమానికి వెళ్ళాలి. అక్కడ పిల్లలకి చెప్పాల్సిన కథల పుస్తకాలు తీసి పెట్టుకుంది. చిన్నప్పుడు పిల్లల పుస్తకాలు చదివే అవకాశం లేక పోయింది. అందుకే గులాబకావళి కోసం అడివి దారి పట్టిన యువకుల కథలు, వెళ్ళవద్దన్న ఉత్తర దిక్కుకి వెళ్ళి దారి తప్పిన రాకుమారుల కథలు, రాక్షసుడి చెరలో ఉన్న రాకుమార్తెను విడిపించి, పెళ్ళి చేసుకున్న విజయసింహుల కథలు,రాకాసి లోయలు, వజ్రాల దీవులు, ఇలాంటి అద్భుతమైన కథలున్న పుస్తకాలు చదవలేక పోయింది. ఇప్పుడు ఆ పిల్లలకి చెప్తూంటే తను కూడా ఓ చిన్న పిల్లై పోతోంది. మరోసారి బాల్యాన్ని అనుభవిస్తోంది. ఆ రోజు తను చదవాలనుకున్న పుస్తకం కూడా తీసి పక్కన పెట్టుకుంది. ప్రస్తుతం తనకి ఇదే కావాలి, డాక్టర్లు అన్నది కూడా ఇదే. ఏదో పని కల్పించుకోవాలి. మనసుని ఖాళీగా ఉంచద్దు. అందుకే అనాధాశ్రమానికి, వృద్ధాశ్రమానికి వెళ్ళి, వాళ్ళకి ఎన్నో విషయాల్లో సాయ పడుతోంది. వాళ్ళని చూస్తూంటే,అర్థం అవుతోంది,తను ఎన్నో విషయాల్లో అదృష్ట వంతురాలు అని. వాళ్ల కష్టాల ముందు ,వాళ్ళ ఇబ్బందుల ముందు తనకి బాధలు ఏం లేనట్టే .

మళ్లీ మానవ్ గుర్తొచ్చాడు.ఈ మానవ్ విషయం అమ్మకి నాన్నకి చెప్పాలా . చెప్పాలంటే ఎప్పుడు చెప్పాలి.కానీ బాగా ఆలోచిస్తే ప్రస్తుతానికి అనవసరం అనిపించింది.

ఆ మర్నాడు ఆదివారం ఉదయం మానవ్ కి ఫోన్ చేసి చెప్పింది,బంజారా హిల్స్ లో ఉన్న హోటల్ కి బ్రంచ్ కి రమ్మనమని.

ముందుగా అనుకున్నట్లుగా , పదకొండు గంటలకి శృతి,మానవ్ హోటల్లో కలుసుకున్నారు. లోపలికి వెళ్ళారు. ఆ హోటల్లోనే ఏవో రెండు కాన్ఫరెన్స్ లున్నట్లున్నాయి, ఆ బోర్డులు లోపలికి వెళ్ళే దగ్గర పెట్టే ఉన్నాయి.ఒకే రంగు సూటు వేసుకున్న ఓ పాతిక మంది డెలిగేట్స్ లా ఉన్నారు, వాళ్ళు ప్లేట్లు పట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ కనిపించారు, అయినా ఖాళీ ఖాళీగానే కనిపించింది. ఈ మూల నుంచి ఆ మూల వరకూ ఉన్న రకరకాల టిఫెన్లు. అన్నీ ఓసారి చూసి, తినడానికి ఓ రెండు రకాలు, తాగడానికి పళ్ళ రసం తెచ్చుకుని ఎవరు లేని ఓ మూల టేబుల్ దగ్గర ఎదురెదురుగా కూచున్నారు. కాస్త తిన్నాకా తలెత్తింది శృతి. చెప్పండి అన్నట్లుగా ఆమె వైపు చూసాడు.

" మొదటినుంచి అంతా వివరంగా చెప్పడం బోర్ గా ఉంటుంది.నా జీవితం ఎక్కడ మలుపు తిరిగిందో అక్కడినుంచే చెప్తాను "

" మీ ఇష్టం.ఎక్కడినుంచైనా మొదలు పెట్టండి. విండానికి నేను వింటాను "

" మా నాన్నగారికి , మేం ఉంటున్న ప్లేస్ నుంచి ఓ యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న హైదరాబాదుకి ట్రాన్స్ ఫర్ అయింది. మేం మరో నాలుగు రోజుల్లో ఆ ఊరు విడిచి వెళ్ళిపోతున్నాం.

ఆరోజు నా కాలేజీకి ఆఖరి రోజు. నేను ఇంటికి వచ్చేస్తూంటే అందరం ఒకరికొకరం చిన్న చిన్న బహుమతులు ఇచ్చుకున్నాం. వాళ్ళ ఫోన్ నంబర్లు నాకు ఇచ్చారు. నేను హైద్రాబాదు వెళ్ళకా నా నంబరు ఇస్తానన్నాను. ఒకళ్ళకొకళ్ళం వీడ్కోలు చెప్పుకున్నాం ,భారంగా నేను మాఇంటి వైపుకి తిరుతూంటే, సువర్ణ నన్ను పిలిచి ఆపింది. చుట్టూ చూసాను. అప్పటికే అందరూ వెళ్ళిపోయారు, మేమిద్దరమే ఉన్నాం.

" నీతో కొంచెం మాట్లాడాలి " అంది నా ముఖంలోకి చూస్తూ.

నాకు తెలుసు ఆమె ఏం మాట్లాడాలనుకుంటోందో.

" ఆర్ణవ్ గురించి అయితే మాట్లాడాల్సిన పని లేదు. తనకి నేను చాలా సార్లు చెప్పాను .అర్థం చేసుకోలేకపోతే అది నా తప్పు కాదు " అని కోపంగా అన్నాను.

"అదే ఇదివరకూ చెప్పిందే మరోసారి చెప్పు. అదే మాట్లాడు. ఓ సారి ఫోన్ చెయ్యి. మాట్లాడితో  అంతా క్లియర్ అయిపోతుంది. అయినా  మన మనసు గురించి మనకి బాగా తెలియాలి.  దానికి గాయం అయితే మందు ఎవరో వచ్చి రాయరు. మన గాయాలకి మనమే మందు రాసుకోవాలి.ఇతరులని వంచించడం ఈజీ, మనలని మనం వంచించుకోడం కష్టం "

నాకు అసలు అర్థం కాలేదు. మనసేంటీ, గాయం ఏంటీ ? మందులేంటీ?  ఇలాంటి మాటలు ఎందుకు మాట్లాడుతోంది నేను వంచించడం ఏంటీ? అంటే నేను కూడా ఆర్ణవ్ ని ప్రేమించానని అనుకుంటోందా! అలా అని నేను చెప్పకుండా ప్రేమించినట్లు ఒప్పుకోడంలేదని అనుకుంటోందా? అబద్ధం చెప్పి, నన్ను నేను వంచించుకుంటున్నానని అనుకుంటోందా? ఇదా సువర్ణ మనసులో ఉన్నది?

" చూడు సువర్ణా నువ్వు ఆర్ణవ్ ని వెనకేసుకుని రాకు. నా మనసు గురించి నాకు బాగా తెలుసు. నేను తనని ప్రేమించలేదు. అది గుర్తు పెట్టుకో. తను బాగా మాట్లాడుతాడు. మనిషి బావుంటాడు. నేను వద్దన్నా నన్ను పొగుడుతాడు. అందుకని  కొంచెం ఆకర్షితురాలనయ్యానేమో. దాన్ని ప్రేమ అనరు. ఇది ఇంకా ముందుకి వెళ్ళకుండా,నా మనసు  గాయపడకుండా ముందే జాగ్రత్త పడ్డాను.నువ్వు వంచన అన్నావు, ఇందులో వంచన ఏం ఉంది? నేనేం ఆర్ణవ్ వెంట పడలేదే! ప్రేమిస్తున్నాని అనలేదే!అతనిచ్చిన బహుమతులు తీసుకోలేదే,సినిమాలూ షికార్లు అంటూ నా వెంట తిప్పుకోలేదే..! నేనేం మోసం చెయ్యలేదే! నీ చుట్టం అని పరిచయం నువ్వు చేసావు.నీతో నా స్నేహం ఎంతో, ఎలాంటిదో,ఆర్ణవ్ తో కూడా అంతే. స్నేహం అంటే స్నేహం లాగా ఉంచాలి.కానీ ప్రేమ అంటే ఎలా!అయినా ఓ అమ్మాయితో చేసిన స్నేహం పెళ్ళితోనే ముగుస్తుందా!స్నేహానికి ముగింపు పెళ్ళా? దానికి ఈ రెండేళ్ళ పరిచయం పెళ్ళికి సరిపోతుందా? " అని అన్నాను.

సువర్ణ అలా ఎందుకు మాట్లాడిందో. ఆమె మనసులో ఏం ఉందో నాకు తెలుసు .తను నన్ను నమ్మడం లేదు.నేను ఆర్ణవ్ ని బాధ పెట్టున్నానని ఆమె అనుకుంటోంది.

ఎంతో ఉత్సాహంగా బయిటికి వెళ్ళిన దాన్ని నిశ్శబ్ధంగా ఇంటికి వచ్చాను. బాగా  ఆలోచించి  ఆర్ణవ్ కి మర్నాడు ఉదయాన్నే అమ్మ గుడికి వెళ్ళినప్పుడు ఫోను చేయాలనుకున్నాను. లేకపోతే ఎవరికి ఫోను చేస్తున్నావు,ఎందుకు చేస్తున్నావ్,అని అడుగుతుంది.

అమ్మ లేదు కాబట్టి ,ధైర్యంగా ఆర్ణవ్ కి చేసాను.

"నువ్వేనా శృతీ!నమ్మలేక పోతున్నాను.ఎంతటి సుదినం! నీతో మాట్లాడడానికి మీ ఇంటికి రెండు సార్లు ఫోను చేసాను.మీ మదర్ తీసారు.ఆ సంగతి నీకు చెప్పలేదా? ఆ సంగతి వదిలెయ్యి,ఇప్పుడు ఫోన్ చేసినందుకు థాంక్స్  ,శృతీ, థాంక్యూ " సంతోషం,ఉత్సాహం ఆ గొంతులోధ్వనిస్తోంది.

" నేను  నీతో మాట్లాడాలనుకుంటున్నాను.ఆ విషయమే సువర్ణకి చెప్పాను"  అన్నాడు

“సరే.ఎక్కడ?” జవాబిచ్చాను ముక్తసరిగా.

“నీ ఇష్టం ఎనీ టైం,ఎనీ ప్లేస్.ఏం సరేనా!చెప్పు ”ఎంతో ఉత్సాహంగా అన్నాడు.

నా గొంతులో ఏదో బాధ. మాటలు రాలేదు.అందుకే ఏం చెప్పలేక పోయాను.వెళ్ళేముందు ఈ మీటింగ్ లు అవీ ఏంటీ.ఆర్ణవ్ తో మాట్లాడడం నాకసలు ఇష్టం లేదు.ఏదో ప్రాధేయ పడుతున్నాడని సరే అన్నాను.

“ సరే అయితే నందిని రెస్టారెంటులో ఈ సాయంత్రం ఐదు గంటలకు,ఓ మూల కూచుని మాట్లాడుకుందాం.” అన్నాను.

“ఓ కే నీ కన్నా ముందే నేనుంటాను ” ఆ గొంతులో ధ్వనించిన తియ్యదనం,మార్ధవం నా కడుపులో దేన్నో కదిలించింది.ఇంక మాట్లాడడానికి ఏం లేదు.

”ఉంటాను” అని పెట్టేసాను.

ఆర్నవ్ అన్నమాట నిలపెట్టుకున్నాడు. నా కన్నా ముందరే వచ్చేసాడు.నన్ను చూడగానే గబ గబా ముందుకు వచ్చి నా కుడిచేతిని అందుకున్నాడు. రెస్టారెంటు లోపలికి వెళ్ళాం. ఓ మూలకి దారి తీసాను.ఇద్దరం ఎదురెదురుగా కూచున్నాం.

“కలవాలని అన్నావు. దేనికి? “ఆశగా నా వైపు చూస్తూ అన్నాడు.

“నేనా , ఆమాట నేననలేదు,నువ్వు అన్నావని, నిన్ను ఓసారి కలవమని సువర్ణ అంటే ..”పూర్తిగా అనలేకపోయాను.

“ అవును అన్నాను.ఉట్టిగానే,చాలా రోజులైంది కదా,పైగా నువ్వు వెళ్ళే సమయం దగ్గర పడుతోంది కదా. అందుకని. ” నా మొహంలోకి పరీక్షగా చూస్తూ అన్నాడు .

నేనేం అనలేదు. తల తిప్పుకున్నాను.

**థాంక్స్**, నువ్వు వచ్చినందుకు. అసలు నువ్వు వస్తావో రావో అని మనసులో సందేహంగానే ఉంది, కానీ వచ్చావు. మంచి పని చేసావ్. నువ్వు వెళ్ళి పోతావని తెలిసినప్పటినుంచి, నేను నిద్ర కూడా పోవడం లేదు.ఇప్పుడు చెప్పు, ఏదైనా మాట్లాడు ” అన్నాడు నా కళ్ళల్లోకి చూస్తు.నేను చూపులు తిప్పుకున్నాను.

“మాట్లాడడానికి ఏం ఉంది.ఏం లేదు,.” అన్నాను

దెబ్బతిన్నట్టు చూసాడు. ఆర్నవ్ చూపుని. ఎప్పటికీ మర్చిపోలేను

“నాకు తెలుసు, ఆరోజు జరిగిన దానికి,నా మీద అభిప్రాయం మారిపోయింది. అప్పటినుంచి నువ్వు నాతో సరిగా మాట్లాడడం లేదు.”

నేను మౌనంగా ఎటో చూస్తూ ఉండిపోయాను.

"ఆరోజు జరిగినదానికి నీకు చాలా సార్లు సారీ చెప్పాను,ఇంకా ఆ కోపమే ఉందా?"

"కాదు,అదేం లేదు " అన్నాను అది పైకే,కానీ లోపల చాలా కోపం ఉంది.

ఆరోజు రాత్రి జరిగింది గుర్తు తెచ్చుకోవాలని లేదు. కాని,ఇప్పుడు ఆర్ణవ్ మళ్ళీ ఆ విషయాన్ని ఎత్తి గుర్తు చేసాడు.నిజానికి నేనూ మర్చి పోలేదు.అది మర్చిపోయే సంఘటన కాదు కదా. పెద్ద ప్రమాదం తప్పిన రోజు.

ఆ రోజు. డిసెంబర్ ముప్పై ఒకటి రాత్రి. కొత్త సంవత్సరం పార్టీ ఇస్తానని రమ్మన్నాడు. అదో పెద్ద హోటల్ అని అన్నాడు. నేను పెద్ద హోటళ్ళు ఎలా ఉంటాయో ఎప్పుడూ చూళ్ళేదు. ఓ సారి చూద్దామన్న ఉత్సాహంతో సరే అన్నాను. ఆ ఉత్సాహంలో చేస్తున్నది తప్పో ఒప్పో కూడా ఆలోచించలేదు. పైగా మోటార్ సైకిల్ మీద ఎప్పుడూ వెళ్ళలేదు.ఆ సరదా ఇప్పుడు తీర్చుకోవచ్చు, ఆ తీసుకెళ్తున్నది, ఆర్ణవ్ కాకుండా మరొకరు, తెలిసున్న మనిషి అయినా నేను వెళ్ళేదాన్ని. ఓ అబ్బాయితో వెళ్తున్నానని నిజం చెప్తే అమ్మ పంపించదు. అందుకని, ఇంట్లో అమ్మా వాళ్ళకి అబద్ధం చెప్పాను, సువర్ణా వాళ్ళు హాస్టల్లో కొత్త సంవత్సరం సెలిబ్రేట్ చేసుకుంటున్నారని ,అన్నాను.అమ్మ ఏం అనలేదు. తొందరగా వచ్చేసెయ్యి అని అంది.సరే అన్నాను. అమ్మని మోసం చేస్తున్నానని కొంచెం బాధ పడ్డాను.

కాని ఎంతో ఉత్సాహంగా ఆర్ణవ్ ని కలుసుకున్నాను. బైక్ మీద కూచోవాలన్న నా కోరిక తీరుతోంది. వెనకాల కూచున్నాను. చలిగాలిలో నేను, ఆర్ణవ్ బైకు మీద జాగ్రత్తగా మా మధ్య కొంచెం స్థలం ఉంచి దూరంగా ఒళ్ళు తగలకుండా వెనకాల కూచున్నాను. తేలిపోతున్నట్లుగా ఉంది. సినిమాలో లాగా మెడని వెనక్కి వంచి రెండు చేతులూ బాగా చాచాను. మొదట్లో భయం వేసినా తరవాత బాగా ఉన్నట్టునిపించింది. నున్నటి రోడ్డు మీద వెళ్ళడం నాకు ఎంతో బావుంది. అటూ ఇటూ చెట్లూ, పొలాలు అంతా చీకటి. పైన నక్షత్రాలతో అందంగా ఉన్న నీలాకాశం. రివ్వున వీస్తున్న గాలి.. ఎంతో హాయిగా ఉంది. తొందరగా ఆ హోటల్ రాకుండా ఉండాలి అనుకున్నాను. అలాగే వెళ్తూ ఉంటే బావుంటుందని అనిపించింది. కాని,ఆ హోటల్ వచ్చింది. గోడలకి, పొదలకి, చెట్లకి అన్ని చోట్లా రంగురంగుల జిగేల్ జిగేల్ మంటున్న లైట్లున్నా మూల మూలల్లో అంతా చీకటి చీకటిగానే ఉంది. అది హోటల్ కాదు, ఏదో రిసార్ట్స్ అని అక్కడ ఉన్న బోర్డులని బట్టీ తెలిసింది.

విశాలంగా ఉన్న ఆవరణ నిండా కార్లూ,మోటారు సైకిళ్ళు. ఎన్నో సార్లు స్కూల్లో, కాలేజీలో ఫ్రెండ్స్ తో ఏదో ఒక సందర్భంగా ,మామూలు కాంటీన్లకి, రెస్టారెంట్లకి హోటళ్ళకి వెళ్ళాను. కాని ఇలా రిసార్ట్స్ కి , పైగా ఊరికి దూరంగా ఉన్న దానికి వెళ్ళడం ఇదే మొదటి సారి. అందుకే చాలా ఎక్సైట్ అయ్యాను. చాలా దూరం నడిచాకా ఓ అందమైన బిల్డింగ్ లాంటి హోటల్ వచ్చింది. అంతా పట్ట పగలులాగా ఉంది. రిసెప్షన్ దాటి లోపలికి వెళ్ళాము.

లోపల అంతా చీకటి గా ఉంది. ఏం కనిపించడం లేదు. సినిమాల్లో చూపించే ఏదో విలన్ల మాయా లోకంలా భయంకరంగా ఉంది.ఒక్క క్షణం భయపడ్డాను. పైనా కిందా పక్కనా అన్ని చోట్లా రంగు రంగుల లైట్లు. ఆరుతూ వెలుగుతూన్న లైట్లూ, డిమ్ గా ఉన్న లైట్లు, మసక వెలుతురు. ఎక్కడైనా పడతానేమో అని భయపడ్డాను. అయితే ఆర్ణవ్ నా చేయి పట్టుకుని నడుస్తున్నాడు. అది నాకు తప్పనిపించ లేదు. ఎందుకంటే అసలు దారి ఏం కనిపించడం లేదు. దానికి తోడు అంతా పొగ. కళ్ళు ఆ చీకటికి వెలుగుకి అలవాటు పడ్డాకా, కొంచెంగా కనిపించడం మొదలైంది. చుట్టూ చూశాను. అది చాలా పెద్ద హాలు. చీకటి వెలుగుల మధ్య కదులుతున్న మనుషులు. ఊగిపోతున్న

మనుషులు,తాగుతున్న మనుషులు. అస్పష్టంగా కనిపిస్తున్న మనుషులు జంటలుగా డాన్స్ చేస్తున్న వాళ్ళు. ఎవరి మొహాలూ స్పష్టంగా కనిపించడం లేదు. ఆ హాలంతా సిగరెట్ల పొగ, ఆల్కోహాల్ వాసన తో నిండి ఉంది. భరించ లేక పోయాను. తల తిరిగుతునట్లుగా, వికారంగా అనిపించింది, చెవులు బద్దలయ్యేలా పంజాబీ ,హిందీ పాటలు. ఒక్కసారిగా ఆర్ణవ్ నన్ను గట్టిగా పట్టుకుని దగ్గరికి లాక్కున్నాడు. ఓ సారి తనని చూసి చటుక్కున అతడి పట్టుని విడిపించుకున్నాను. చెయ్యి విదిలించుకున్నాను. ఆశ్చర్యంగా చూసాడు.

"న్యూ ఇయర్ సెలిబ్రేషన్ ఇలాగే ఉంటుంది " దగ్గరగా వచ్చి చెవిలో అన్నాడు.

"నాకు ఇలాంటివి నచ్చదు " అంటూ పక్కకి జరిగాను.ఆర్ణవ్ అదేం పట్టించుకోలేదు.

"నచ్చదంటే ఎలా.న్యూఇయర్ సెలిబ్రేట్ చేసుకుంటే బావుంటుందని ఇక్కడికి తీసుకొచ్చాను. ఎంజాయ్ చేద్దాం. మనం కూడా డాన్స్ చేద్దాం. పద " అంటూ మళ్ళీ నా నడుము మీద చేయి ఓ అడుగు ముందుకి వేసాడు. వెంటనే ఆర్ణవ్ ని ఒక్క తోపు తోసి గబగబా పరుగు లాంటి నడకతో బయట లాబీలోకి వచ్చేసాను. ఆర్ణవ్ కూడా నా వెనకాలే వచ్చాడు. నన్ను ఆపాడు.

"ఏం జరిగింది? "అని రెండుసార్లు అడిగాకా చెప్పాను.

"చూడు ఆర్ణవ్ , నాకు ఇలాంటి వాతావరణం నాకు నచ్చదు. నేను లోపల ఉండలేక పోతున్నాను. అయినా నువ్వు నన్ను ఇలాంటి చోటుకి తీసుకొస్తావని అసలు అనుకోలేదు. పైగా హొటల్ అంటే నేను వేరే గా ఊహించుకున్నాను. మేం చూసిన రెస్టారెంట్లకన్నా ఇంకాస్త బావుంటుందని అనుకున్నాను. నాకిలాంటి హొటళ్ళూ తాగడాలూ. డాన్సులాడడాలు అవీ నచ్చదు " అని కోపంగా అని బయటికి వెళ్ళడానికి తయారయ్యాను. నా వెనకాలే గబగబా వచ్చి చేయి పట్టుకుని ఆపాడు. నేను ఆగిపోయాను.

కాస్సేపు మాట్లాడ లేదు. వెంటనే ఇంటి దగ్గర దింప మన్నాను. నిశ్శబ్దంగా బయటికి వచ్చి బైకు దగ్గరికెళ్ళి స్టార్ట్ చేసాడు. వెనకాల కూచున్నాను. ఆ కూచోడంలో వచ్చేటప్పుడున్న ఎక్సైట్ మెంటు ఇప్పుడు లేదు. యాంత్రికంగా కూచున్నాను. నన్నుఇంటి దగ్గర దింపేసాడు..

" టైము ఎనిమిది కూడా కాలేదు, అప్పుడే వచ్చేసావేంటీ ? " అని అమ్మఅడిగితే ఏదో సద్ది చెప్పేసాను. ఆ మర్నాడు పేపర్లో అంతకు ముందు రాత్రి మేము వెళ్ళిన రిసార్ట్స్ లో రైడ్ జరిగిందని, చాలా మందిని అరెస్ట్ చేసారని.,అక్కడ యువత డ్రగ్స్ కూడా తీసుకున్నారని, కొంత మంది ప్రైవేసీ కోసం అని,రూములు కూడా బుక్ చేసుకున్నారని అసభ్య, అసాంఘీక కార్య కలాపాలకి పాలుపడ్డారని ఫొటోలతో సహా పేపర్లో వచ్చింది. అంతా మొహాలు కప్పుకుంటూ నడుస్తున్న ఫొటోలు.

ఆ రోజున అమ్మ ఓ పెద్ద లెక్చర్ తీసుకుంది. "చూడు నా పెంపకం ఎలా ఉందో. ఓ వయసొచ్చిన పిల్లలని చాలా జాగ్రత్తగా పెంచాలి. ఎక్కడికెళ్తోందో ఎవరితో వెళ్తోందో అన్నీ గమనిస్తూండాలి. అన్నీ కనుక్కోవాలి. నేను నిన్ను అలాగే పెంచాను కాబట్టి ఇంటికి తొందరగా వచ్చావు . ఆ మాత్రం భయం ఆడపిల్లకి ఉండాలి." అని, నన్ను మెచ్చుకొని పట్టుబద్ద మిగిలిన ఆడ పిల్లలని వాళ్ళ పేరెంట్స్ ని విమర్శించింది.

అమ్మకి తెలీదు నేను కూడా అక్కడికి వెళ్ళానని. ఒక వేళ నేను కూడా ఆర్ణవ్ తో అక్కడ ఉండి ఉంటే నా పేరు కూడా బయటికి వచ్చేది. నా ఫోటో కూడా వచ్చేది. అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్ళిన వాళ్ళల్లో నేను కూడా ఓ ముసుగు వేసుకుని ఉండే దాన్ని. ఆ ఊహే చాలా భయంకరంగా అనిపించింది.

ఒక్క విషయం అర్థం కాలేదు. ఆర్ణవ్ ఎందుకలా చేసాడు? నాకంటే తెలీదు,పెద్ద హొటళ్ళు రిసార్ట్స్ ఎలా ఉంటాయో, ఆర్ణవ్ కి కూడా తెలీదా? కనుక్కో లేదా!,అన్నీ తెలుసు. వాతావరణం ఎలా ఉంటుందో కూడా తెలుసు .అయినా తీసుకెళ్ళాడు. తెలిసీ కూడా అసలు అలాంటి చోటుకి నన్ను ఎందుకు తీసుకెళ్ళాలీ? నేను ఎలాంటి వాతావరణంలో పెరిగానో, మా కుటుంబం కన్సర్వేటివ్ అని కూడా తెలుసు. అయినా నన్ను ఏం అనుకున్నాడు.? పిలవగానే వస్తానన్నానని కదా అని ఇలాంటి హోటలుకి తీసుకొస్తాడా? ఫ్రెండంటే మంచిగా ప్రవర్తించగలగాలి, ఎంత డిగ్నిఫైడ్ గా ఉండాలి!? ఇలాంటి వాటికి ఇష్టపడి వెళ్ళే వాళ్ళుంటారు. ఎంత చదువుకున్నా నేను ఇంకా అంత ప్రోగ్రెసివ్ కాదు.

ఏదైనా ఆర్ణవ్ మనసు తెలిసింది. ఏ మాత్రం చనువిచ్చినా ఉపయోగించుకునే రకం అనిపించింది. ఇక మీదట కాస్త జాగ్రత్తగా ఉండాలి. నా గురించి ఎక్కువగా ఊహించద్దని చెప్పేయాలి. ఇంక మాట్లాడ కూడదని అనుకున్నాను. నిజంగానే ఆ తరవాత కోపంతో చాలా రోజులు ఆర్ణవ్ తో మాట్లాడ లేదు. ఎన్నిసార్లో సంజాయిషీ ఇచ్చుకున్నాడు. ఎన్నోసార్లు బతిమాలాడు. జరిగింది మర్చిపొమ్మన్నాడు. మామూలుగా అయిపోయినట్లు నటించినా అది పైపైనే. కానీ నేను మాత్రం మర్చిపోలేదు.

ఇన్నాళ్ళ తరవాత ఈ నందినీ రెస్టారెంట్ లో, ఇప్పుడు మళ్ళీ గుర్తు చేసాడు. పైగా ఇది జరిగి ఓ నాలుగు నెలలు అయిందనుకుంటాను.

"ఇప్పుడు ఆ కోపం మనసులో పెట్టుకున్నావా? కొత్త సంవత్సరం మనం బాగా ఎంజాయ్ చేయాలని అక్కడికి తీసుకెళ్ళాను. అంతే నిన్ను బాధించాలని కాదు.అప్పటి ఆ కోపం ఇంకా ఉందా? నిజంగానువ్వు వెళ్ళిపోతావా? నేనంటే నీకిష్టం లేదా? మళ్ళీ ఈ అవకాశం నాకు వస్తుందో లేదో, నిజం నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నీ కోసం ఏం చెయ్యమన్నా అది చేస్తాను ప్లీజ్ ఇక్కడే ఉండిపో " మళ్ళీ ఆ గొంతులో బాధ. నేను గమనించాను.

"నీకు ఇదివరకే చెప్పాను. నువ్వు దీన్ని మళ్ళీ మొదటికే తీసుకు రాకు. ఇష్టం వేరు. ప్రేమ వేరు. మనది స్నేహం మాత్రమే. అంతకు మించి మరేం లేదు " గట్టిగా చెప్పేసాను.

" కాని నేను నిన్ను ప్రేమించాను. మనం పెళ్ళి చేసుకుందాం. మన పెళ్ళికి నా వైపు నుంచి అభ్యంతరం ఏమీ లేదు. నాకు అమ్మా నాన్నా లేరు. ఉన్నది ఒక్క బామ్మ. ఆమెకి నీ విషయం చెప్పాను. అందుకని నువ్వు వెళ్ళే లోపు ఏదో ఒకటి క్లియర్ చేసుకుందాం. మీ వాళ్ళని నేను ఒప్పిస్తాను. నువ్వు ఎవరికీ భయపడాల్సింది లేదు. ఈ ఏడాదితో నా డిగ్రీ అయిపోతుంది. ఏదో ఉద్యోగం వస్తుంది. మనం హాయిగా ఉందాం. నువ్వు సరే అను " ఆవేశంగా అన్నాడు, నా చేతిని పట్టుకుంటూ. ఆ ఆవేశం చూసి కొంచెం భయపడ్డాను.

" ఏంటీ పిచ్చీ,పెళ్ళేంటీ. ఆ ఆలోచన ఎలా వచ్చింది నీకు? నీకిదివరకే చాలా సార్లు చెప్పాను, ఇష్టం వేరు, ప్రేమ వేరు అని" కోపంగా అన్నాను.

" పిచ్చా పిచ్చేంటీ! ఇది చాలా సీరియస్ సబ్జెక్ట్. నేను చాలా సీరియస్ గా ఉన్నాను "

మరో సారి షాక్ తిన్నాను. ఆ మొహం, ఆ చూపు చూస్తే ఎందుకో కాస్త భయం వేసింది. అయోమయంగా చూసాను. అంత సీరియస్ గా ఉన్నాడా. ఏంటీ పిల్లాడు!

"కాదు శృతీ నా దృష్టి లో ఇష్టం,ప్రేమ రెండు వేరే కాదు. మొదట స్నేహం చేసినా తరవాత అది ఆకర్షణ అయింది. అది ప్రేమగా మారింది. ఈ ప్రేమ ఎప్పుడు మొదలైందో నాకు తెలీదు. ఇప్పుడు నువ్వు వెళ్ళి పోతున్నావు దానికి ఓ ఆకారం వచ్చింది. అందుకే అంటున్నా పెళ్ళి,చేసుకుందాం అని . ఈ విషయం అందరికీ తెలవాల్సిన పని లేదు. నీకు అంతగా భయంగా ఉంటే సీక్రెట్ గా కోర్టు మారేజ్ చేసుకుందాం. కాదంటే నువ్వు ఇక్కడే ఉండి చదువుకో. ఏదో ఒకటి చెయ్యి "

కోపం తన్నుకొచ్చేస్తోంది. ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలి.

"సారీ, నాకిలాంటివి ఇష్టం లేదు. నేను వెళ్ళాలి, మీ మొగపిల్లలు ఎప్పటికీ మారరు. మీ దృష్టి కూడా మారదు. స్నేహం అంటే పెళ్ళికి ఓ మొదటి మెట్టు అనుకుంటారు. అసలు నా గురించి ఏం తెలుసు నీకు,అలాగే నీ గురించి నాకేం తెలీదు. సారీ! "అంటూ లేచాను.

ఒక్కసారి చేయిని పట్టుకున్నాడు. వదిలించుకున్నాను. మళ్ళీ పట్టుకున్నాడు . నా మొహంలోకి చూస్తూ ఉండిపోయాడు.

" అలా అనకు శృతీ ,ఒకళ్ళ గురించి ఒకళ్ళకి తెలియకపోయినా ఇది వరకూ పెద్ద వాళ్ళు చేసిన పెళ్ళిళ్లు సక్సెస్ అవడంలేదా? పెళ్ళయ్యాకా అన్నీ తెలుస్తాయి. అదంతా ఎందుకు?నీకు నేనంటే ఇష్టం. ప్రేమ ఉంది అది నాకు తెలుసు. అందుకే నేను నీ పుట్టినరోజుకి ,పండగలకి గ్రీటింగ్స్ ఇస్తే తీసుకున్నావు కదా! " అన్నాడు,నావైపు చూస్తు.

ఒక్కసారిగా నోరు తెరిచాను. ఎటునుంచి ఎటు వెళ్తున్నాడు? తీసుకోడం తప్పయిపోయిందా? దాని అర్థం మార్చుకున్నాడా?

"నిజమే తీసుకున్నాను. నా పుట్టినరోజున,పండగలకి చాలా మంది ఇచ్చారు. ఓ స్నేహితుడుగా నువ్వు ఇచ్చావని తీసుకున్నాను. అంతే. నువ్వు సువర్ణ కజిన్ వి, నా స్నేహితుడివి ,సువర్ణ ఎంతో నువ్వు కూడా అంతే. ఇద్దరి మీదా ఒకేలాంటి ఇష్టం, నీ మీద ఇష్టం అనేది ఏంటో నాకే స్పష్టంగా తెలీదు. అది స్పష్టం అవడానికి కొన్నేళ్ళు పడుతుంది. అయినా ఇలాంటి వాటికి ఇంకా చాలా కాలం ఉంది. ఇప్పుడు నాకు నాచదువు, నాకు నా కెరీర్, నా పేరెంట్స్ ముఖ్యం అంతే. పైగా నా కల మెడిసిన్ అది సాకారం చేసుకోవాలి "

" అయితే నీ కోసం జీవితాంతం వెయిట్ చేస్తాను. నువ్వు సరే అను. నీ చదువు , కెరీర్ ఓ ట్రాక్ లో పడ్డాకే చేసుకుందాం. సరే అను " కళ్ళు చిన్నగా చేస్తూ అన్నాడు

ఎలా అంటాను?అనలేను. నాకు జీవితం మీద ఎన్నో ఆశలున్నాయి. కలలున్నాయి. పెళ్ళి అన్నది అందులో లేదు. అందుకని ప్రామిస్ ఎలా చేస్తాను? ఆర్నవ్ ఓ స్నేహితుడు మాత్రమే. అంతే. అందులో అంతకు మించిన ఇష్టం లేదు. ఏ అభిప్రాయమూ లేదు.

మాట్లాడినంత మాత్రానా ప్రేమించేయడమేనా? దాన్ని ప్రేమ అని అనుకుంటాడా? తన లాగే నేను కూడా అనుకోవాలా? దాన్నే ప్రేమ అని ఎలా చెప్తాను? ప్రేమిస్తున్నానని ఎలా చెప్తాను ? ఇంత వరకూ ఇలాంటి టాపిక్ రాలేదు . లేకపోతే ఎప్పుడో చెప్పేదానిని. చాలా సేపు ఏం మాట్లాడ లేదు.

" పోనీ టచ్ లో ఉండు. అదొక్కటే నేను అడిగేది "

“దానిలో ఉన్న లోతు నాకు అప్పుడు తెలియలేదు. ఇంక నేను వెళ్ళాలి” అని లేచాను. ఆర్నవ్ ని బాధ పెడ్తున్నానిపించింది. కాని ఇది నా జీవితం.నా ఫ్యూచర్. పైగా ఇప్పుడు నా వయసు పంతొమ్మిది. ఇది పెళ్ళిచేసుకునే వయసు కాదు. జీవితానికి ఓ అర్థం ఇచ్చుకునే దారిలో వెళ్ళడానికి తయారవుతున్నాను.

మరోసారి ఎంసెట్ రాయడానికి సిద్ధం అవుతున్నాను. బిఎస్సీ పూర్తి చెయ్యాలి. అలాగే పూర్తి కావలసిన కలలు కూడా ఉన్నాయి. ఆర్నవ్ కన్నా ఎంతో పెద్దవి నా కలలు, నేను, మెడిసిన్ చదవాలన్న కోరిక, నన్ను కన్న నాతల్లి దండ్రులు, ఇవన్నీ నా ముందున్నాయి. ఈ ఊరు దాటి వెళ్తున్నంత మాత్రాన నా కలల్ని ఎలా ఆపెస్తాను?

లేచాను. ఆర్ణవ్ కి సమాధానం చెప్పలేదు. ఆర్ణవ్ మొహం పాలిపోయింది.

“ ఇంకొంచెం సేపు కూచోకూడదా?“

“ ఉఁహూ .లేదు నాకు చాలా పనుంది, నా పుస్తకాలూ అవీ సద్దుకోవాలి, వాటిని పాక్ చేసుకోవాలి. రేపు పాకర్స్ వాళ్ళూ వస్తారు ” అని కుర్చీని వెనక్కి తోసి ఓ అడుగు ముందుకేసాను.

“ ఒక్క నిమిషం ఆగు శృతీ! నీకోసం తెచ్చాను. కనీసం ఈ లెటర్ గ్రీటింగ్,తీసుకుంటావా? ప్లీజ్! ” ప్రాధేయ పడుతున్నట్టుగా అన్నాడు.

“ సరే. ఓ స్నేహితుడు ఇచ్చినట్టుగా తీసుకుంటాను. ఇలా తీసుకున్నందుకు ఎక్కువగా ఊహించకు. గుడ్ బై ” అంటూ తిరిగాను.

నాతో పాటూ ఆర్నవ్ లేవలేదు అక్కడే కూచుండి పోయాడు. ఒక్క క్షణం వెనక్కి తిరిగి, “మనది స్నేహం మాత్రమే అందులో ప్రేమ లేదు. స్నేహానికి అర్థాన్ని మార్చకు” అని మరోసారి చెప్పాలనిపించింది. కానీ ఈ సంగతి ఇదివరకూ కూడా చెప్పాను. తనకి అర్థం అవడం లేదు. రెస్టారెంటులోంచి బయటికి వచ్చాను. ఇంక ఆ తరవాత ఏం ఆలోచించలేదు. ఇంటికెళ్ళాకా ఆ ఉత్తరాన్ని గ్రీటింగ్ ని ఏదో ఎదురుగా కనిపించిన ఓ పుస్తకం లో పెట్టాను.ఆ సంగతి అప్పుడే మర్చిపోయాను.

ఆ మర్నాడు మా పక్కింటి వాళ్ళు, బ్రేక్ ఫాస్ట్ కి పిలిస్తే అమ్మా నాన్నగారు వెళ్ళారు. నేను ఇంట్లో ఉండి పోయాను. ఫోన్ మోగింది. తీసాను. అవతల సువర్ణ.

“.....నువ్వు తనని కలుస్తావని ఆర్ణవ్ కి చెప్పాను. కలిసావా?”

“ఆఁ సాయంత్రం కలిసాను ”

" ఏం జరిగింది? ఎంత సేపు గడిపావ్? ఏం మాట్లాడావ్? "

దీని కోసం ఫోన్ చేసిందా? ఏంటీ ప్రశ్నలు? చిరాకేసింది.

"ఎంత సేపేంటీ, ఓ నలభై నిమిషాలు. ఏం మాట్లాడానా నీతో ఇదివరకూ అన్నదే. ఆ తరవాత వెంటనే చీకటి పడకుండా వచ్చేసాను. అయినా చూడు సువర్ణా! నేను మీ లాగా హాస్టల్ లో ఉండడం లేదు. నేను అమ్మా వాళ్ళ దగ్గర ఉంటున్నాను, ఏ మాత్రం ఆలస్యం అయినా ఎన్నో ప్రశ్నలు వేస్తారు. వాటికి జవాబులు ఇచ్చుకోవాలి. దీనికోసం ఇప్పుడు నువ్వు ఫోన్ చేసావా? "

"లేదు. శృతీ దానికోసం చెయ్యలేదు. ఆర్ణవ్ నిన్న సాయంత్రం నుంచి కనిపించడం లేదుట, రాత్రి కూడా ఇంటికి రాలేదుట. ఆర్ణవ్ బామ్మ కంగారు పడ్తోంది. పోలీసులకి రిపోర్ట్ ఇప్పుడే ఇచ్చారు. వాళ్ళు వెతుకుతున్నారు "

ఒక్కసారి తల తిరిగినట్లయింది. భయపడిపోయాను. గుండె ఆగినట్లయింది. కనపడడం లేదా? ఎక్కడికి వెళ్ళాడు? వెంటనే ఏం సమాధానం ఇవ్వ లేకపోయాను. అతి కష్టం మీద నోరు పెగిలింది.

"నిన్న సాయంత్రం రెస్టారెంటులో కలిసాను, అది కూడా ఒక నలభై నిమిషాలు మాత్రమే. నాకు పాకింగ్ ఉంది.అందుకోసం వచ్చేసాను. అంతే "

"అంతేనా?" రెట్టించి అడిగింది.

"అంతే. నేను చెప్పాల్సింది చెప్పేసి వచ్చేసాను. నాతో పాటూ తను బయటికి రాలేదు. నేను ఇంక వెనక్కి తిరిగి చూడలేదు. నేను అన్నది తప్పో ఒప్పో కానీ నా మనసంతా అలజడిగా ఉంది. గబగబా ఇంటికి వచ్చేసాను. ఆ తరవాత ఏం జరిగిందో నాకు తెలీదు " అన్నాను భయంగా.

వెంటనే సువర్ణ ఫోను పెట్టేసింది.

ఏం చేయాలో అర్థంకావడం లేదు. ఆర్ణవ్ కనపడక పోవడానికి నాకూ ఏం సంబంధం లేదు. ఈ విషయం ఆర్ణవ్ బామ్మకి చెప్పాలి. ఇంట్లో అమ్మ కూడా లేదు. కాబట్టి ఫోన్ చేయచ్చు. కానీ ఎక్కడో భయం ,ఎందుకో భయం. ఫోన్ దగ్గరికి వెళ్ళాను, కానీ చెయ్యలేకపోయాను. అక్కడే నుంచున్నాను.

ఎలాగైనా ఆర్నవ్ ఇంటికి ఫోన్ చేసి, వాళ్ళ బామ్మకి అంతకు ముందు రోజు మా ఇద్దరి మధ్య ఏం జరిగిందో చెప్పాలనిపించింది. దానికి ఆర్ణవ్ కనిపించక పోవడానికి ఏం సంబంధం లేదని చెప్పాలి.

కాని దాని వల్ల లాభం ఏం ఉండదు అని తెలుసు. ఏ ఫ్రెండు తోనో కలిసి బాగా తాగి ఉంటాడు అలా ఎన్నో సార్లు జరిగింది. ఆ సంగతే తనే చెప్పాడు. బామ్మకి భయపడి ఇంటికి వెళ్ళకుండా ఆ ఫ్రెండ్ గదిలోనే ఉండి పోయి ఉంటాడు. ఇలా ఇదివరకూ కూడా జరిగింది,బామ్మకి భయపడి ఇంటికి వెళ్ళలేదు అని అన్నాడు. ఇప్పుడు కూడా అదే జరిగి ఉంటుందని అనిపించింది. నా తిరస్కృతిని తట్టుకోడానికి ఎక్కవగా తాగి ఉంటాడు. ఏఫ్రెండ్ ఇంట్లోనో రోజంతా గడిపేసి ఉంటాడు,అని ఎంత అనుకున్నా ఏదో జరిగిందనిపిస్తోంది.

అయితే ఇందులో నా తప్పుందా? తనతో స్నేహం చేయడం తప్పా? ఆ స్నేహాన్ని అపార్థం చేసుకుంటే నేనేం చేయలేను. కానీ ఎందుకో లోపల్నుంచి ఏదో బాధ. రాత్రంతా రాలేదా? ఎక్కడికి వెళ్ళి ఉంటాడూ!? నిజంగా నా మాటల మూలంగానే వెళ్ళిపోయాడా? నేనేం అన్నాను? నా మనసులో మాట చెప్పాను అంతే. దానికి ఇంత కఠినంగా వ్యవహరిస్తాడా?

ఆ రోజు నా బట్టలూ పుస్తకాలూ డైరీలూ అన్నీ సద్దుకుంటున్నాను, కాని మనసు మనసులో లేదు. ఆర్నవ్ గురించే ఆలోచిస్తున్నాను. దొరికాడో లేదో, ఎక్కడున్నాడో, ఏ స్థితిలో ఉన్నాడో, ఎలా తెలుస్తుంది? ఎవర్నైనా అడగాలంటే భయం. అందుకే నా స్నేహితురాళ్ళతో మాట్లాడ లేదు. కలవలేదు. ఎక్కడ ఆర్ణవ్ ప్రస్తావన వస్తుందో ఏం వినాల్సి వస్తుందో అని.ఆ రోజంతా అలాగే అన్యమనస్కంగానే గడిపాను.

మర్నాడు ఉదయం అమ్మ పేపరు చూస్తోంది. ఆమెకి పేపరు చదువుతూ మధ్య మధ్య కొన్ని వార్తలు పైకి చదవడం, చెప్పడం అలవాటు. ఎప్పటిలాగా ఆ రోజున కూడా అలాగే గట్టిగా చదువుతోంది. నాన్నగారు టీవీ చూస్తూ అమ్మ మాటలు వింటున్నారు. నేను కూడా అక్కడే కూచుని కాఫీ తాగుతున్నాను.

కానీ నా ఆలోచనలన్నీ కూడా ఆర్నవ్ మీదే. రెండు రాత్రుళ్ళు గడిచాయి. ఎక్కడున్నాడో? అసలు ఇంటికి వచ్చాడో లేదో? వస్తే పరవాలేదు. రాకపోతే. మళ్ళీ భయం వేసింది. పోనీ ఓసారి వాళ్ళింటికి వెళ్తే తెలుస్తుంది. ఆర్ణవ్ వచ్చాడో లేదో, ఇంకా నా మీద కోపంగా ఉన్నాడా? బామ్మ దగ్గరికి వెళ్ళనా.? అమ్మకి తెలీకుండా వెళ్ళనా..!? కష్టం. అమ్మకి చెప్పి వెళ్ళాలి. చెప్తే ఒప్పుకోదు. అందుకని వెళ్ళాలన్న ఆలోచనని తీసేసాను.

“శృతీ, మేఘనా కాలేజీలో పిల్లలు ఎవరైనా నీకు తెలుసా? ఎవరో ఓ అబ్బాయి ఆ కాలేజీ వాడేట, సుబ్బరంగా తాగేసి,ఒళ్ళూ తెలీకుండా బండి తోలేస్తే ఏం జరుగుతుందో అదే జరిగింది. ఆ వార్తే దీన్లో వచ్చింది. ఆ పిల్లాడి ఫొటో కూడా వేసారు. పాపం చిన్నవాడే.”

”**మేఘనా** కాలేజీలో బిఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాడుట, పేరు రాయలేదు. ఓసారి చూడు నువ్వు గుర్తు పడతావేమో” అంటూ పేపరు నా చేతికివ్వ బోయింది.

“ ఏదీ నన్ను చూడనీ ”అంటూ నాన్నగారు అమ్మ చేతిలోంచి తీసుకున్నారు.

నా గుండె ఆగుతుందేమో అనిపించింది. మేఘనా కాలేజీ అంటే ఆర్ణవ్ చదివే కాలేజి. తను కూడా చదువుతున్నది బిఎస్సీ మూడో సంవత్సరమే, మొన్న సాయంత్రం నుంచి కనపడడంలేదు. సందేహం లేదు అన్నీకూడితే వచ్చే జవాబు ఆర్ణవ్.

అయితే తను చచ్చిపోయాడా! అది కూడా ఘోర ప్రమాదం.. రోడ్డు ప్రమాదంలో,

నమ్మశక్యంగా లేదు. ఆ చూపులు, మాటలు ప్రాధేయ పడతున్నఆర్ణవ్ మొహం కళ్ళముందు కనిపిస్తోంది. ఈ జరిగింది నా మూలంగానా! అమ్మ ఇంకా ఆ వార్త గురించి ఏదో అంటూనే ఉంది.

నాకే మాత్రం వినాలని లేదు. నా మాటలకి బాధపడి సుబ్బరంగా తాగేసి బైకు నడిపించాడా? అది యాక్సిడెంటా? కావాలనా? ఆత్మహత్య చేసుకున్నాడా? “అయినా నేనేం అన్నాను ? స్నేహానికి ప్రేమకి మధ్య ఉన్న తేడా నీకు తెలీలేదు. స్నేహం వేరు. ప్రేమ వేరు” అని

అన్నాను. అంతే. “ఆర్నవ్ అంటే ఇష్టమే కాని అది ప్రేమ వరకూ రాలేదని” అని అన్నాను. కాని,వచ్చిందని తను అన్నాడు. నేను అది ప్రేమ కాదని అన్నాను. అది ప్రేమే అని అన్నాడు. నేను తిరస్కరించాను. అయితే దానికి ఇంతగా తాగి నడపాలా తనకి తానే ఇలా చేసుకుంటాడా! నా మూలంగా పోయాడని తెలిస్తే,నన్ను పోలీసులు పట్టుకుంటారు. జైల్లో పెడతారు.భయంతో వణికి పోయాను. నాకేం తెలీనట్లుగా ఉండి పోతాను. అది తప్పని తెలుసు. కాని నేను నిస్సహాయురాలిని. ఇప్పుడు ఉన్న కష్టం అంతా నాకేం కావాలో తెలుసు.

“ఏదీ ఆ పేపరిల్లా ఇయ్యి. ఆ అబ్బాయి ఎవరో చూస్తాను ” అంటూ నాన్నగారి చేతిలోంచి తీసుకున్నాను. ఫొటో అస్పష్టంగా ఉంది. కాని ఆ బైకు ఆర్నవ్ దే. ఆ బైకు మీద కూచుని డిసెంబర్ ముప్పై ఒకటో తారీఖు రాత్రి రిసార్ట్ కి వెళ్ళాను. అందుకే గుర్తు పట్టగలిగాను. ఓ పక్కగా పడిపోయిన బైక్, కాస్త దూరంగా రక్తం మడుగులో ఆర్ణవ్. అంటే మొన్న రాత్రి యాక్సిడెంట్ అయిందన్న మాట, నిన్న ఆసుపత్రి కి తీసుకెళ్ళి ఉంటారు. అందుకని ఇవాళ్టి న్యూస్ లో వచ్చింది,ఆ బైక్ ని గుర్తు పట్టి,వెతికారుట, మేఘనా కాలేజీ లో బీఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థి. పేరు ఆర్ణవ్ , అమ్మ నా వైపే చూస్తోంది నానుంచి ఏం సమాధానం వస్తుందా అని కావచ్చు.

“ఆర్ణవ్, పేరు బాగా విన్నాను. నా క్లాస్ మేట్ సువర్ణకి చుట్టం. అంతే తెలుసు. ఈ అబ్బాయిది ఏ కాలేజియో నాకు తెలీదు. కానీ,నేను ఈ అబ్బాయిని చూసాను. ఓ యూత్ ఫెస్టివల్ లో సువర్ణ చూపించింది. అంతే,అంతకన్నా ఎక్కువ పరిచయం లేదు ” అంటూ పేపర్ని అమ్మ చేతికి ఇచ్చి, నన్ను నేను కంట్రోల్ చేసుకుంటూ అన్నాను. నాకు తెలీదని ఎంతగా అబద్ధం,ఎంత సులభంగా ఆడేసాను.

గదిలోకి వెళ్లి మంచం మీద కూచున్నాను. గుండె చాలా స్పీడుగా కొట్టుకుంటోంది. నొప్పి,భరించలేని నొప్పి,మనసంతా మొద్దు బారిపోతోంది. సువర్ణ ని కలుసుకోవాలి. నా తప్పేం లేదని చెప్పుకోవాలి,కాని ఆమెని నమ్మించగలనా! నమ్ముతుందా!నమ్మినా నమ్మకపోయినా తనకి జరిగినది చెప్పాల్సిందే. ఈ గుండె బరువుని నేను మోయలేను. నా వల్ల కావడం లేదు. అమ్మకి చెప్పాను సువర్ణని కలుసుకోడానికి వెళ్ళాలని . అమ్మ సరే తొందరగా వచ్చెయ్యి అని అంది.

ఆమెని కలుసుకోడానికి హాస్టల్ కి వెళ్ళాను. ఆమె కూడా నా కోసం ఎదురు చూస్తున్నట్లుగా ఉంది.ఇద్దరం హాస్టల్ బిల్డింగ్ దాటి కొంచెం దూరం నడిచి, ఎవరూ లేని చోట కూచున్నాం. ఆ వెంటనే ఏడ్చేసాను. కట్టలు తెంచుకుంటూ ఏడుపు వచ్చేస్తోంది . మధ్య మధ్య అంతకు ముందు నాకూ ,ఆర్నవ్ కి జరిగింది చెప్పాను. ఆమె నన్ను ఓదార్చింది.

“నువ్వేం మాట్లాడకు . ఏం జరుగుతుందో చూద్దాం . నీకేం కాదు ధైర్యంగా ఉండు”

“థాంక్యూ,సువర్ణా కాని ఒక్కటి చెప్పు, నేను స్వార్థంగా ప్రవర్తించానా! బామ్మ దగ్గరికి వెళ్ళి నా మూలంగానే పోయాడు . అని అనాలా , నేను స్వార్థపరురాలినా!”

“నువ్వు స్వార్థపరురాలివి కాదు శృతీ, నిజమైన స్వార్థపరుడు ఆర్ణవ్. తను అనుకున్నది ఆ క్షణాన దొరక్కపోతే అది శాశ్వతం కాకపోతే ఇంక అంతే . అంతగా తాగెయ్యాలా, తన విలువైన జీవితాన్ని కూడా లెక్కచెయ్యలేదు. ఇందులో నీ తప్పేం లేదు ”అని ఇంకా ధైర్యం నూరి పొయ్యడానికి ప్రయత్నించింది.

నేను పైకి గంభీరంగా ఉన్నా, లోపల భయం దొలిచెస్తోంది. పోలీసులకి తెలుస్తుందా? తెలుసుకుంటారా? యాక్సిడెంటుకి ముందు నన్ను కలిసాడని, నాతో మాట్లాడాడని, ఆ విషయం ఎవరు చెప్తే తెలుస్తుంది బామ్మ. అవును ఆమె చెప్తేనే తెలుస్తుంది . ఆమెకే తెలుసు ఆర్ణవ్

ఆ సాయంత్రం నాతో మాట్లాడాదని. ఆమె చెప్తుందా? తప్పకుండా చెప్తుంది. సువర్ణ ఎంత ధైర్యం చెప్పినా, భయపడుతూనే ఉన్నాను. ఇంటికి ఎలా వచ్చానో తెలీదు.

ఎందుకైనా మంచిదని ఇంటికెళ్ళాకా ఆర్నవ్ ఇంటికి ఫోన్ చేసాను. ఎప్పటిలాగే వాళ్ళ బామ్మ తీసారు. నేనెవరో చెప్పాకా ఆమె మొదట మాట్లాడ లేదు. ఆ తర్వాత నోరు విప్పింది.

"నాకు తెలుసు వాడు నిన్ను ప్రేమించాడని కానీ మీ ఇద్దరి మధ్య ఏం జరిగిందో నాకు తెలీదు. వాడి ప్రేమని తేలిగ్గా తీసుకున్నావు. ఆ సంగతి నీ మనసుకి తెలీదా. తెలుసు.వాడు నిన్ను ఇష్ట పడుతున్నాడని తెలుసు. నీ వైపు నుంచి ఆలోచిస్తే నీది కూడా తప్పులేదు. ఈ వయసులో ప్రేమని, పెళ్ళిని నేను ప్రోత్సహించను. అలా అని మా వాడిని తప్పు పట్టను. తల్లీ తండ్రీ దగ్గర పెరగ లేదు. అందుకే వాడిలో మానసిక పరిపక్వత కన్నా అమాయకత్వమే ఎక్కువ ఉంది. వాడు అమాయకుడు, బలి అయిపోయాడు. వాడి సంగతి వదిలెయ్,నీ సంగతి. ఒక్కసారి నీ మనసులోకి తొంగి చూడు. వాడి మాటలు ,అన్నీ ఒక్కసారి గుర్తు తెచ్చుకో, అందులో అంతా వాడి ప్రేమ కనిపిస్తుంది. మమత వినిపిస్తుంది. అయినా తల్లీ ఇతరుల మనసుని చూడడానికి వెలుగు కావాలి. కాని మనల్ని మనం చూసుకోడానికి అక్కర్లేదు. ఎంత చీకటిలో అయినా  చూసుకోగలం. మనలోకి మనం ప్రయాణం చెయ్యడమే ఆత్మజ్ఞానం . ఒక్కొక్కసారి ఇది ఎంతో అవసరం.

ప్రేమని ప్రేమికుడిని తేలిగ్గా చూడకు. అది నువ్వు చేసావు. నీ వైపునుంచే చూసావు, నీ స్వార్థం నువ్వు చూసుకున్నావు. వాడి గురించి అసలు ఆలోచించలేదు. వాడు నిన్ను కలుసుకోడానికి వెళ్తున్నానని నాతో అన్నాడు. ఆ సంగతి నాకు తెలుసు,తల్లి  , చిన్నప్పటి నుంచీ ఎవరి ప్రేమ పొందలేదు. తల్లీ తండ్రీ విడిపోయారు. ఆ ఇద్దరూ కూడా వాడిని వద్దనుకున్నారు. మనవడి మీద ప్రేమతో నేనే వాడిని పెంచాను. అందుకని ప్రేమ అన్నది అసలు మొదట్నించీ లేదు. నువ్వు మాట్లాడుతూంటే అదే నిజమైన ప్రేమ అనుకున్నాడు.

మీ ఇద్దరూ అక్కడ ఏం మాట్లాడుకున్నారో  తెలీదు. కానీ ఏం జరిగిందో ఊహించ గలను. ఇది యాక్సిడెంటు కి కారణం అయింది.  ఆ సంగతి నేను ఊహించ గలను. వాడిని పెంచడంలో నాతప్పు ఎంతుందో ఎక్కడుందో నాకు తెలీదు. కొడుకూ కోడలూ లేరు,.ఇప్పుడు మనవడు కూడా " అంటూ ఆవిడ ఏడ్చేసింది. టక్కున ఫోను పెట్టేసింది.

అది యాక్సిడెంటు అని ఆమె అనుకోడం లేదు. నా మూలంగానే ఆ యాక్సిడెంటు జరిగిందనుకుంటోంది. అదే నిజమా! నేనే తన మరణానికి కారణమా! బామ్మ మాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి. ఆ ఏడుపు నా హృదయాన్ని గుచ్చి గుచ్చి పెట్టింది.  నేను నాస్వార్థం చూసుకున్నానని ఆవిడ అన్నారు. మనం బావుండాలంటే ఎదుటి వాడు నాశనం కోరుకోనక్కర్లేదు. ఆమె మాటల్లో ఆ అర్థం వినిపించింది. కాని నేను ఆర్ణవ్ నాశనం కోరుకోలేదు. నా జీవితం ఎలా ఉండాలో ప్లాన్ వేసుకోడంలో తప్పు ఏం లేదు. నా కలలని మా పేరెంట్స్ ఆశయాలని నిజం చేసుకోవాలనుకున్నాను. ఆర్ణవ్ నన్ను సరిగా అర్థం చేసుకోలేదు.

తల్లి దండ్రి లేని ఆర్ణవ్ ని బామ్మ పెంచింది. ఆమె ప్రపంచం అంతా ఆర్ణవ్, మరి ఆర్ణవ్ కి ఆమె అంతా కాదా? ఆమె గురించి ఆలోచించలేదా? తను లేకపోతే ఆమె ఏమవుతుంది? అన్న ఆలోచన రాలేదా? చచ్చి నన్ను సాధించాలనుకున్నాడా ఎన్నో ప్రశ్నలు. జవాబులు దొరకని ప్రశ్నలు. తలుచు కుంటున్నకొద్దీ భయం వేస్తోంది. అమ్మా వాళ్ళకి తెలిస్తే. అసలు తెలిసే అవకాశం ఉందా.

ఆరోజు అంతా ఈ విద్యార్థులూ, స్నేహాలూ, విచ్చలవిడితనాలూ, స్వేచ్ఛనిచ్చేసిన తలిదండ్రులు, చేతినిండా డబ్బులూ, పబ్బులూ, తాగుడు ,చెడు అలవాట్లు, చేతిలో వెహికల్స్, రోడ్డు రూల్స్ పట్టించుకోని యువకుల గురించి , లైసెన్స్ లేకుండా బైకులు నడిపే పిల్లల గురించి రోడ్డు ప్రమాదాల గురించి , ఇంట్లో వాళ్ళ పెంపకం గురించి, మొగపిల్లల మైండ్ సెట్ గురించి, టీవీలో దాదాపు అన్ని చానెళ్ళల్లో దీనిమీదే చర్చలు , దాన్ని అమ్మా వాళ్ళూ ఎంతో ఆతృతగా చూస్తూ, వింటూ ,మధ్య మధ్య పిల్లల్లో డిసిప్లీన్ లేదంటూ, అలా పెంచిన పేరెంట్స్ ని తిడుతూ చూస్తున్నారు . అంతలోనే ఆర్ణవ్ ఇల్లు, మీడియా మనుషులు ఆ ఇంట్లోకి వెళ్తున్నారు. వాళ్ళ బామ్మని చూపించారు. ఆమెని ఛానెల్స్ వాళ్ళు ఏవేవో ప్రశ్నలు అడుగుతున్నారు.

ఆమె ఏం చెప్పడంలేదు. అంతలో పోలీసులు కూడా వచ్చారు. టీవీలో ఆమెతో మాట్లాడుతున్నారు. ఆమెని ఎన్నో ప్రశ్నలు వేసారు. ఆమె మాట్లాడుతున్న ప్రతీ మాట నన్ను గుచ్చెస్తోంది. ఆఖరికి అడిగేసారు. “ఏదైనా ప్రేమ వ్యవహారమా!ఎవర్నైనా ప్రేమించాడా? ” నా గుండె దడదడ లాడింది. ఊపిరిని ఆపేసాను. కళ్ళు విప్పార్చుకుని బామ్మనే చూస్తున్నాను.

“లేదు , నాకు తెలిసినంత వరకూ ఎవర్నీ ప్రేమించలేదు. వాడు అలాంటి వాడు కాదు ”

మనసులో ఏడ్చేసాను. నాకు తెలుసు ఆవిడ అబద్ధం చెప్తోంది. నా పేరు బయటికి రావడం ఆమెకి ఇష్టం లేదు. ఆవిడ సంస్కారానికి ఇంకా ఏడుపొచ్చింది.

“బామ్మగారూ, ఇది చెప్పండి,యాక్సిడెంటు జరిగిన రోజు బాగా తాగాడని తెలిసింది. రోజూ తాగుతాడా?”

ఆమె చాలా ఇబ్బందిగా చూసింది.

“ కుర్రాడు కదా,ఏదైనాఎప్పుడైనా పార్టీలో స్నేహితులతో, అది కూడా ఎప్పుడైనా,అంతే. తాగుబోతు మాత్రం కాదు. అంతకన్నా నాకేం తెలీదు ”

“ అంతకు ముదు రోజుఏదైనా పార్టీ ఉందా, ఎవరిని కలుసుకోడానికి వెళ్ళాడు అంటే ”

“ ఏమో నాకేం తెలీదు,నాకేం చెప్పలేదు “ ఆమె అనేసిది.అలా అంటూంటే నా గుండె మెలిపడింది.

“ బామ్మగారూ, మీకు తెలీక పోవచ్చు, మీకు చెప్పలేదేమో, ఎక్కడో ఏదో పార్టీ అయి ఉంటుంది. అక్కడ బాగా తాగి ఉంటాడు, సాధారణంగా బాగా తాగి నడిపితేనే ఇలాంటివి జరుగుతూంటాయి” అని అన్నా కూడా వాళ్ళకి నా పేరు చెప్పలేదు. నన్ను కలుసు కోడానికి వెళ్ళాడని చెప్పలేదు. అలాంటివి ఏం లేదు. అన్న స్టేట్ మెంట్ ఇచ్చింది.

బామ్మ అన్నట్లు నాలో ఇంత స్వార్థం ఉందా? నాదే చూసుకున్నానా? బామ్మ మనసుని అసలు చూడలేదు.ఓ ముసలి మనసుని ఎంతో కష్ట పెట్టాను. ఆలోచిస్తే బామ్మని కష్ట పెట్టింది ఆర్ణవ్.ఆమెని ఆమె మనసుని చూడలేదు. ఆమెగురించి ఆలోచించలేదు.

పోస్ట్ మార్టం రిపోర్ట్ వచ్చింది. ఆల్కహాల్ ఎక్కువ తీసుకోడం వల్ల బైక్ అదుపు తప్పి, రోడ్డు మధ్య నున్నడివైడర్ కి కొట్టుకోడం వలన ప్రమాదం జరిగింది.

ఆ మర్నాడు అంత్యక్రియలు,అందరూ వెళ్తూ నన్నూ రమ్మన్నారు. కానీ స్మశానికి నేను వెళ్ళలేదు. ఓ ముద్దలా అయిపోయిన ఆర్నవ్ ని చూడలేను అని తప్పించుకున్నాను. నేను కారణం కాకపోయినా నామూలంగా ఓ మనిషి పోయాడు. ఓ విధంగా నేను ఓ హంతకురాలినే. అతనూ అతని మాటలూ అన్నీ నాకు గుర్తు.

అయినా ఎందుకంత తాగాడు? నా మూలంగానా? ఎందుకంత పిచ్చి పని చేసాడు? జరిగింది ప్రమాదమా? కావాలని చేసినదా? ఏదైనా కాని,ఎన్ని ప్రశ్నలు వేసినా దానికి వచ్చే సమాధానాలు అన్నీ కూడా నన్నే తప్పు పడుతోంది. నేనే దోషి అని చెప్పకనే చెప్తోంది. నేనే కారణం అని అనిపిస్తోంది.

కాని నేను నిశ్శబ్ధంగా ఉండి పోయాను. నన్ను నేను దోషిని అని అనుకోకుండా తన ఛావుకి కారణం, అని నేను అనుకోకుండా ఉండాలంటే నేను ఏం చేసి ఉండాల్సింది. అసలు నేను ఏం చేసి ఉండచ్చు. ఏం మాట్లాడి ఆర్నవ్ కి సమాధానం ఇవ్వచ్చు.

సరే అని అనాలా ,లేకపోతే నేను కూడా నిన్ను ప్రేమిస్తున్నాను అని అనాలా? నేను హైద్రాబాదు వెళ్ళను, ఇక్కడే హాస్టల్ లో ఉంటాను. మనం ఎక్కడో ఓ చోట కలుసుకుందాం. అని అనాలా? కాని అలా అని అనలేదు. ఎలా అంటాను.? అవన్నీ మనసులోంచి రావాలి కదా. నాకు రాలేదు. ఎందుకంటే.. ఆర్ణవ్ కన్నా నా కలలు, నా ఆశయాలు, ఆశలు, నా పేరెంట్స్ ఎక్కువ కాబట్టి. ఆర్ణవ్ అంటే ఇష్టం అది కూడా, ఓ మంచి స్నేహితుడిగా మాత్రమే.

అయినా ఓ రెండేళ్ళ పరిచయం ప్రేమకి సరిపోతుందా? ఆ పరిచయం ఓ మనిషిని అర్థం చేసుకోడానికి చాలా, పెళ్ళికి అది చాలా, అందులో జీవితాంతం కలిసి ఉండాల్సిన మనిషితో.

ఆ మర్నాడు హైదరాబాదు కి వెళ్ళిపోయాం. ఊరు మారాం కాబట్టి అన్ని సద్దుకుంటాయనుకున్నాను. ఆర్నవ్ అధ్యాయం ముగిసిపోయింది అని అనుకున్నాను. కాని నేను తప్పు. ప్రతీరోజు ప్రతీ క్షణం గుర్తొస్తున్నాడు. అతని జ్ఞాపకాలు దొలిచేస్తున్నాయి. రాత్రిళ్ళు నిద్ర పట్టడం లేదు. ఒకవేళ పట్టినా మధ్య మధ్య ఉలిక్కిపడి కూచుంటున్నాను. తెలీకుండానే గట్టిగా ఏడ్చేస్తున్నాను. ఎక్కడో ఓ మూల కూచుంటున్నాను. ఎవరితో మాట్లాడాలనిపించడం లేదు. నాలోని మార్పుని అమ్మ గమనించ లేదు. అమ్మ బలవంతం మీద ఎంసెట్ కి తయారవుతున్నాను. ఎంత బిజీగా ఉండి చదువుతున్నా కూడా చచ్చి పోయిన ఆర్ణవ్ జ్ఞాపకాలనుంచి పూర్తిగా కోలుకోలేక పోతున్నాను.జరిగినది మర్చిపోలేక పోతున్నాను.

మళ్ళీ ఎంసెట్ రాసాను. మంచి రాంకే వచ్చింది. కానీ మెడిసిన్ లో సీటు రాలేదు. ఫిజియోథెరపీ లో వస్తుందని తెలుసు. కాని ఇంట్లో వద్దన్నారు, ఎలాగైనా మెడిసిన్ చదవాలని ఉంది కాబట్టి మళ్ళీ ఎంట్రెన్స్ రాయమని నాన్నగారు అన్నారు. నాకు రాయాలని లేదు. కానీ పైకి అనలేదు. అమ్మ పరోక్షంగా తిట్టింది.

ఆ రోజున చాలా ఏడ్చాను. అంతల్లాగా ఎప్పుడూ ఏడవలేదు. ఇలా ఎన్నిసార్లు రాయాలి. మళ్ళీ రాస్తాను, ఈసారి కూడా రాకపోతే, అమ్మా నాన్నగార్ల ఆశలని, అంచనాలని నీరు గార్చాననిపించింది. నాన్నగారు ఏమీ అనలేదు, కానీ మౌనంగా ఉన్నారు. ఏదైనా అన్నా బావుండేది. అమ్మ మాత్రం ఓ నాలుగు సార్లైనా అంది, ఇంకా కొంచెం కష్టపడాల్సిందేమో అని,.ఎవరెవరితోనో పోల్చడం మొదలెట్టింది. నామీద నాకు విరక్తి కలిగేలా మాట్లాడింది. నేనంటే ఇష్టం లేని ఇంట్లో నేనెందుకుండాలి. ఛస్తే పీడా పోతుందనిపించింది.

సీటు రానందుకు నాక్కూడా బాధగానే ఉంది. నిజానికి నేను ఎంతో కష్ట పడ్డాను. కాని రాలేదు ఇంకా కష్ట పడాలి అని అమ్మ ఎలా అనగలిగింది? నన్ను ఓదార్చకుండా వాళ్ళకి ఏదో అవమానం అయిపోయినట్లుగా ఎందుకు ఫీలయిపోతున్నారు ? నావైపు నుంచి కూడా ఆలోచించాలి, కష్టపడ్డావు కాని రాలేదు, ఏం చేస్తాం ,పరవాలేదు, ఏడవకు, జీవితం అంటే మెడిసినే అంతా కాదు. ఇప్పటికే మూడు సార్లు రాసావు. రాలేదు. పోనీలే ఈ బిఎస్సీ కూడా చదువే. అది పూర్తి చెయ్యి,అని ఎందుకు అనలేదు? ఎలాగూ బిఎస్సీ చదువుతున్నావు , అది అయిపోతే ఎమ్మెస్సీ చెయ్యచ్చు , అని కూడా ఎందుకు ఓదార్చలేదు ?

తలుచుకుంటున్నకొద్దీ అమ్మ మీద కోపం వచ్చేస్తోంది. వీళ్ళకి నా మీద ప్రేమ లేదు,నా రాంక్ మీద మాత్రమే ప్రేమ. నాకు మెడిసిన్ లో సీటు వస్తే నా మీద ప్రేమ చూపిస్తారా? ఒకవేళ మరోసారి రాసినా సీటు రాకపోతే, వాళ్ళ దృష్టిలో మరోసారి వేస్ట్ , నిజంగా నేను ఓ వేస్ట్ స్టూడెంటునా? నాకు తెలివి లేదా? నేను ఇంటెల్లిజెంట్ కాదా? మరి చిన్నప్పుడు నేను తెలివైనదానినని అందరికీ చెప్పి మురిసిపోయేది. అప్పుడు క్లాసులో ఫస్ట్ వచ్చాననా? మరి ఇప్పుడు మెడిసిన్ లో సీటు రావడం లేదనా? రాంక్ రావడం లేదనా? ఇంతేనా! ప్రతీసారీ నేను తెలివైన దానినని వీళ్ళ ముందు నిరూపించుకోవాల్సిందేనా? నాకు విలువ లేదా? నా మార్కుల కేనా విలువ? ప్రతీ తల్లిదండ్రులు ఇంతేనా? ఇలాగే ప్రవర్తిస్తారా?

ఈ రేసులూ, మార్కులూ, చదువులూ,ఎంసెట్లూ మా కుటుంబంలో మా మధ్య విలువలని చంపేసింది . ఇంట్లో వాళ్ళని చూస్తూంటేనే కోపం వచ్చేస్తోంది. మాట్లాడాలనిపించడం లేదు. వాళ్ళు కూడా ఓ మంచిమాట, ఓదార్పు మాట నాతో పంచుకోవడానకి ఇష్టపడడం లేదు. ఓ వారం రోజులు నాది మౌన పోరాటం.వాళ్ళది యుద్ధం. పరోక్షంగా విసురుతున్న మాటల బాణాల యుద్ధం. మాటలు ఎంత పదునుగా ఉంటాయో అమ్మ మాటలతో అర్థం అయింది. మళ్ళీ అనిపించింది ఛస్తే పీడా పోతుంది.

డిగ్రీ ఆఖరు సంవత్సరం చదవడానికి ఏ కాలేజీకి వెళ్ళాలో, ఎక్కడ చేర్పించాలో,అది దగ్గరుంటే బావుంటుందని,ఒక వేళ దగ్గర కాలేజీలో దొరకకపోతే మరో కాలేజీ , అమ్మా నాన్నా ఇలా నా చదువు గురించి, నేను చేరాల్సిన కాలేజి గురించి మాట్లాడు కుంటున్నారు, కానీ నన్నడగడంలేదు, పైగా అక్కడ నేనున్నానన్న విషయం కూడా లేనట్టుగా నేను ఏ కాలేజీలో చదవాలో మాట్లాడుకుంటుంటే,మళ్ళీ నాకు నేనే ఓ వేస్ట్ కాండడేట్ లా అనిపించాను. అసలు నేనేంచెయ్యాలో తెలియని అమ్మాయినా? నిజంగా నాకేం తెలియదా? నేను నిజంగా ఓ యూస్ లెస్ అమ్మాయినా? చెదిరిపోతున్న కలలు వాళ్ళని నన్నూ నిరాశపరిచాయి. మా మధ్య దూరం పెంచాయి, రిలేషన్స్ దెబ్బ తిన్నాయి. ఇప్పుడు మెడిసిన్ చదవడం అన్నది ఓ చెదిరిన కల. కాదు చెదిరిపోయిన కల. అది అలాగే నెరవేరకుండా ఉంటుందా?

“ కాలేజీలు మరో రెండు నెలల వరకూ తెరవరు. అంత వరకూ ఇంట్లో కూచోడం ఎందుకు. ఎంసెట్ కి ప్రిపేర్ అయిపో, ఈసారి ఎలాగైనా సీటు తెచ్చుకోవాలి. ఈలోపల ఇక్కడే ఫైనలియరు బిఎస్సీ చదువు ” అని అమ్మ అంది.

నేనేం చెయ్యాలో వాళ్ళకే సరిగా తెలీడం లేదు. ఓసారి ఓ మాట. మరోసారి మరోటి. ఆఖరికి కాలేజీలో చేరడం, ఎంసెట్ ప్రిపరేషన్ రెండూ, వాళ్ళే నిర్ణయించారు.

నేనేం చెయ్యాలో నన్నేమాత్రం సంప్రదించకుండా,దగ్గర్లో ఉన్నకోచింగ్ సెంటర్ లో చేర్పించడానికే నిశ్చయించుకున్నారు. వాళ్ళే నా చదువుని, నా కాలేజీని ,ఇంతకు ముందు నిర్ణయించినట్లే ఇప్పుడు కూడా నిర్ణయించేసారు.

కాలేజీలు తెరిచే లోపల ఎంసెట్ పెట్టేస్తారు. ఫుల్ టైం కోచింగ్ పగలు ఎంసెట్ కోచింగ్ సాయంత్రం మరో చోట కోచింగ్ అని ఓ బిజీ షెడ్యూల్ తయారు చేసారు. నేను వెళ్ళే కోచింగ్ సెంటర్ ఉన్న కాంప్లెక్స్ లోనే ఓ లైబ్రెరీ ఉంది. సహజంగా పుస్తకాలంటే ఉన్న ఇంట్రెస్ట్ తో మొదటి రోజే అందులోకి వెళ్ళాను. చూసాను. నాకు నచ్చింది. మెంబర్ అయ్యాను. కోచింగ్ ని వస్తూ ఏదో ఓ పుస్తకం తెచ్చుకుని చదివేదాన్ని. పుస్తకాలు చదువుతూంటే నేను చాలా విషయాలు మర్చిపోతున్నాను. ముఖ్యంగా ఆర్ణవ్ గురించినవి. పైగా నాలో ఏదో కొత్త మనిషి ప్రవేశించినట్లనిపితోంది. ఈ దశ నాకు బాగా ఉంది. అందుకే ఎక్కువ పుస్తకాలు ఎక్కువగా చదవడం మొదలెట్టాను.

ఓ వారం రోజులు గడిచే సరికి పుస్తకాలు అంటే అమితమైన ఇష్టం కలిగింది. ఎన్నో చదివాను. చదివి చదివి నాకూ ఆవేశం లాంటిది వచ్చేసింది. నాకు కూడా చిన్న చిన్న కవితలు వ్యాసాలు రాయాలన్న ఉత్సాహం కలిగింది. నేను ఆ రోజు సాయంత్రం లైబ్రెరీ నుంచి వస్తూ వస్తూ ,కనిపించిన, స్టేషనరీ షాపుకెళ్ళి, రెండు డైరీలు కొనుక్కొచ్చాను. కానీ రాయడం మొదలు పెట్టాకా ,రాసిన దానిని మరోసారి చదివాకా అర్థం అయింది.బాలేదనిపించింది. నేను రాసిందే నాకు నచ్చలేదు. నాకున్న భాషాపరిజ్ఞానం కవిత్వం రాయడానికి సరిపోదనిపించింది. అందుకని ఈసారి,ఇంగ్లీషు కావ్యాలు,కవితలూ తెలుగు కవిత్వానికి సంబంధించిన పుస్తకాలు తెచ్చుకోవాలని అను కున్నాను . అక్కడున్న పంతొమ్మిదో శతాబ్దపు, ఇరవైయ్యో శతాబ్ధపు కవుల పుస్తకాలు తెచ్చుకుని చదవడం మొదలు పెట్టాక,అనిపించింది ,ఈ సాహిత్యం ఓ పెద్ద సముద్రం అని. ఆ సముద్రంలో ఈదడానికి ప్రయత్నించాను. ఆ ప్రభావంతో రాయడం మొదలు పెట్టాను. అంతే. ఉత్సాహంతో రాత్రి కూడా రాయడం, నాకు తెలీకుండానే మొదలుపెట్టాను. రోజు రోజుకీ రాయాలన్న తపన , ఉత్సాహం ఎక్కువడంతో ఎక్కువ రాయడానికి ప్రయత్నిస్తున్నాను. పెద్దగా నిద్ర కూడా రావడం లేదు, ఎందుకో నిద్ర రావడం లేదు అనుకున్నాను కాని అదో రోగం అనుకోలేదు.

"**అంతసేపు చదవకు.** కళ్ళు పాడవుతాయి. పది గంటలకి లైట్లార్పెయ్యాలి. పొద్దున్న తొందరగా లేవచ్చు. ఆ సమయంలో చదినది బాగా గుర్తుంటాయి "

మళ్ళీ నేనేం చెయ్యాలో వాళ్ళే నిర్ణయించేసారు. అసంతృప్తి. ప్రతీ దాన్లో కలగ చేసుకుంటారెందుకో నా కర్థం కాలేదు. అమ్మ మీద కోపం వచ్చింది. ఆ కోపంలో ఇంకా రాసాను. ఏదో ఆవేశం, ఎన్నో రాయాలని ఆశ. అలా రాసెస్తున్నాను. నిద్ర కూడా పోకుండా రాసెస్తున్నాను. నేను నిద్ర పోవడం లేదని కూడా నాకు తెలీడం లేదు.

ఆ ఊపులోనే సువర్ణకి ఓ పెద్ద ఉత్తరం రాసాను. అది పెద్దదని అనుకోలేదు. మనసులో ఉన్నది రాసేసాను. అందులో మొదటి సారి మా ఫోన్ నంబరు కూడా ఇచ్చాను. దానికి అది వెంటనే ఫోను చేసింది.

"అది ఉత్తరంలా లేదు. మంచి ఎక్స్ ప్రెషన్ తో ఉన్నఓ వ్యాసం , నీ మనసులోంచి వచ్చిన రచన అది. దానికే కొంచెం మొదలూ చివర సరిగా ఓ ఆకారం ఇచ్చీ రాస్తే ఓ కథ అవుతుంది. ఎంత బాగా రాసావో. మంచి వ్యక్తీకరణ . ఇదే ఇలాగే కొనసాగిస్తే నువ్వో మంచి రచయిత్రివి అవుతావు. రాయడం ఆపెయ్యకు. వీలున్నప్పుడు రాస్తూండు. మీ కాలేజీలు ఎప్పుడూ తెరుస్తారు. నావి తెరిచేసారు. ఇప్పుడు ఓ ఇద్దరు కొత్తగా చేరారు మన గ్రూపులోనే ఉన్నారు, పర్వాలేదు వాళ్ళు కూడా మనలాంటి వాళ్ళే. లైక్ మైండెడ్ "

సువర్ణ ఉత్తరం చదివాక నేనో రచయిత్రిని అయిపోవాలని నిశ్చయించుకున్నాను. ఈ బీఎస్సీ,ఈ ఎంసెట్ కాలేజీ. అన్నింటినీ ఓ మూలకి తోసెయ్యాలనిపించింది. కానీ పూర్తిగా అలా చెయ్యలేక పోయాను. చదవడం రాయడం ఇదే నా వ్యాపకం అయింది. రెండు డైరీలు నిండి పోయాయి. అంతలో కాలేజీలు తెరిచారు.

నేను కాలేజీలో చేరాను. రాగింగ్ అంటూ కొంత చేసారు. నేనో వేస్ట్ కాండిడేట్ ని నాకు నేనే నిర్ణయించేసుకున్నాను. ఏమాత్రం స్పందన లేని దానిగా తయారయ్యాను. అందుకే వాళ్ళు ఏం చెయ్యమంటే అదే ఓ బొమ్మలా చేసాను . ఎక్కడా ప్రతిఘటించ లేదు. ఎందుకో తెలీదు. ఆర్నవ్ మరణం మూలంగా కావచ్చు , నాకు మెడిసిన్ లో సీటు రాలేదని కావచ్చు. ఎప్పుడూ చదువూ చదువూ అని విసిగిస్తున్న నాన్న,అమ్మా మూలంగా కావచ్చు. అన్నీ కలిపీ నన్నుఓ స్పర్శ లేని దానిగా చేయడం వలన కావచ్చు. నాలో అంతకంతకూ పెరుగుతున్న నిరాసక్తత కావచ్చు.

ఏదైనా వాళ్ల రాగింగ్ నన్నేంచేయ లేకపోయింది. అయితే ఆ తరవాత చాలా మంది నా ఫ్రెండ్స్ అయిపోయారు. వాళ్ళందరి కన్నా అందంగా ఉంటానని పబ్లిక్ గా ఒప్పేసుకున్నారు. ముఖ్యంగా ప్రద్యుమ్న,అతను నార్త్ ఇండియన్ ,హైదరాబాదు పాత సిటీలో పుట్టి పెరిగిన వాడు. అందుకని సహజంగానే ఉర్దూ ప్రభావం అతని మాటల్లో కనిపిస్తూంటూంది. అంతే కాకుండా ప్రద్యుమ్న కి సాహిత్యం అంటే ఇష్టం. తను రాయడు కాని ఉర్దూ కవితలని ఆశువుగా చెప్తాడు. హిందీ పాటల గురించి ,ముఖ్యంగా సాహిర్ లుధియాన్వీ పాటలు పాడి, దాని అర్థం చెప్పేవాడు. పుస్తకాలు బాగా చదువుతాడు. ఈ పుస్తకం బావుంది అంటూ ఆ పుస్తకం గురించి టూకీగా చెప్తాడు. నాకు హిందీ పెద్దగా రాదు, నా హిందీ, ఉర్దూ భాషలని ప్రద్యుమ్న వలనే కాస్త ఇంప్రూవ్ చేసుకున్నాను. మంచి మంచి పాటలు పాడేవాడు. ఉర్దూ పాటలు గజల్స్ ఎక్కువగా పాడేవాడు. దాని అర్థం చెప్పే వాడు. మాట్లాడుతున్న ప్రతీసారీ నా మొహంలోకి సూటిగా చూస్తూండే వాడు. ఒక్కొక్క సారి నాకు ఇబ్బందిగా అనిపించేది. కలవరపడి చూపులు తిప్పేసుకునే దాన్ని.

ప్రద్యుమ్న నన్ను ఆకర్షిస్తున్నాడనిపించింది. మళ్ళీ ఆకర్షణ, ఇష్టం.ఇది మూడో సారి. వంశీ, ఆర్ణవ్, ఇప్పుడు ప్రద్యుమ్న. ఇప్పుడు కూడా స్నేహం మాత్రమే. నేను ఆ మాటని ముందే ప్రద్యుమ్న కి చెప్పాను. ముందుకి వెళ్ళకుండా నేను కూడా జాగ్రత్త పడుతున్నాను "

శృతి ఆపి మానవ్ వైపు చూసింది. అతను ఆమెనే చూస్తున్నాడు.

" నేను ఏదైనా వేసుకొస్తాను " అంటూ తన ప్లేటు తీసుకుని వెళ్ళింది.

మానవ్ ఆమె వెళ్ళిన వైపే చూస్తూ ఆలోచనలో పడ్డాడు. శృతి ఇంత వరకూ చెప్పినది తన జీవితమా లేకపోతే కల్పించిన కథా.హృదయం మూగపోయిన జీవితం. విధి నడిపిస్తేనే తప్ప గతిలేని నడక అయింది జీవితం. ఆమె అనుభవించిన మానసిక సంఘర్షణ గురించి ఆలోచిస్తున్నాడు. తన ప్లేటు కూడా ఖాళీ అయిందని లేచి వెళ్ళి నింపుకుని వచ్చాడు .

" ఇప్పుడు చెప్పండి." కూచున్నాక అన్నాడు..

ఓసారి మానవ్ మొహంచూసి,చెప్పడానికి తయారైంది.

" చాలా రోజుల తరవాత అద్దంలో నా మొహం చూసుకున్నాను. అది నేనేనా. నాకే అనుమానం వచ్చింది. కాని అది నేనే. అద్దం అబద్ధం చెప్పదు. ఇది నేను. ఈ హైద్రాబాదు వచ్చాకా నాలో మార్పు వచ్చింది. ఇదివరకు ఎంతో అందంగా ఉండేదాన్ని. స్కూల్లో, జూనియర్ కాలేజీలో అందరి మధ్య నేను ఓ స్పెషల్ గా కనిపించేదాన్ని. ఇంటర్ లో డిగ్రీ లో కాలేజి బ్యూటి అని అనేవారు. ఇప్పుడూ అదే అందం. కానీ ఏదో లోటు. ఏదో లోపం. ఆ పలచటి లేత చర్మం , మెరుపు అన్నీ పోయాయి. ఆర్నవ్ మరణం, మెడిసిన్ లో సీటు రాక పోవడం,ఇంట్లో వాళ్ళ పోరు. నిద్ర లేకపోవడం,ఎంసెట్ కోసం అతిగా చదవడం, అన్నీ కలిపి నా మొహాన్ని మార్చేయి. అది నా పాత మొహం కాకపోయినా అది నేనే. ఈ రెండు నెలలూ ఇంట్లోనే ఉండడం వల్ల మొహం ఉబ్బినట్లుగా అయింది. అమ్మ కూడా అదే అంది.

" అలా వాకింగ్ కి వెళ్ళి రాకూడదా. మైండ్ ప్రశాంతంగా ఉంటుంది. వాకింగ్ నుంచి వచ్చాకా చదువుకో ఫ్రెష్ గా ఉంటావు."

మళ్ళీ నా చదువు సంగతి. నేనేం చెయ్యాలో అమ్మ నిర్ణయించేసింది.

అంతే అలారం పెట్టింది. బద్ధకంగా లేచాను తయారయి మా ఆవరణ లోనే వాకింగ్ చేయడానికి వెళ్ళాను. వాకింగ్ నుంచి వచ్చాకా నిజంగానే బావుంది. ఫైనలియర్ క్లాసు పుస్తకాలు,టెస్ట్ లు.రికార్డులు ప్రాక్టికల్స్ ,మరోసారి ఎంసెట్ ప్రిపరేషన్. అన్నీ టైం ప్రకారంగా వెళ్తున్నాయి. ఈ ఉత్సాహంలో నిద్రని పట్టించుకోడంలేదు. అసలు దానికి మొదట్లో ప్రాముఖ్యం కూడా ఇవ్వ లేదు. కానీ తరవాత నిద్ర పోదామని ఉన్నా నిద్ర రావడం లేదు. శరీరంలోని గడియారం ఇదివరకు లాగా పని చేయడం లేదు. నిశాచరిలా గదిలో అటూ ఇటూ తిరుగుతూ రాస్తూ ,చదువుతూ ,గడిపేస్తున్నాను

మంచం మీద పడుకుని,బలవంతంగా కళ్ళు మూసుకున్నా,నిద్ర రావడం లేదు. ఎక్కడో ఓ మూల నుంచి ఆర్ణవ్ పైకొచ్చేవాడు. నా మూలంగా పోయాడని దుఃఖం, దానితో భయం. ఆ వెంటనే ఏడుపొచ్చేసేది. ఒక్కొక్క సారి గట్టిగా ఏడ్చేసే దాన్ని. ఎందుకో నాకే తెలీదు. నిద్ర కోసం ఎన్ని చేయాలో అన్ని చేస్తున్నాను. మంచం మీద పడుక్కుని బలవంతంగా కళ్ళుమూసుకున్నా ఏవో పిచ్చి ఆలోచనలు. ఒక వేళ నిద్ర పట్టినా మగత, అందులో ఏవో లోకాలు. గ్రహాలు, నక్షత్రాలు, చీకటి ,లోయలు, వీటన్నిటి మధ్య ఆర్ణవ్ ,ఆర్ణవ్ మాటలూ ,చూపులూ,అతని మరణం ,మళ్ళీ అగాధాలు ,కలత నిద్ర. మగత నిద్ర. ఎక్కడికో పడిపోతున్నట్లుగా ఉంటోంది. ఉలిక్కి పడి లేస్తున్నాను. ఏదో తెలీని భయం. కళ్ళు తెరవడానికి ఇష్టపడడం లేదు , మెల్లిగా నన్నునేనే పోగొట్టుకుంటున్నాను. నేను ఎక్కడున్నానో తెలీడం లేదు.నన్ను నేను వెతుక్కుంటున్నట్లుగా ఉంది. కళ్ళు తెరిచాక దేని మీద ఉత్సాహం ఉండడం లేదు.

ఓ రోజు నేను కాలేజీనుంచి ఇంటికి వచ్చేసరికి,అమ్మ నాగది లోంచి అప్పుడే బయటికి వస్తోంది.

" ఏంటీ ,నీ గది ఇంత అసహ్యంగా ఉంది.శుభ్రంగా పెట్టుకోడం అదీ లేదా ! ఇది నీ గదే కదా ,ఎవరో పరాయి వాళ్ళ గది కాదు , నీకు తగిందే ఆ పని మనిషి కూడా. అది అంతే . అలా అలా పైపైనే తుడుస్తోంది. నన్ను నీ గదిలోకి రావద్దంటావు,ఏదీ ముట్టుకో వద్దంటావు. కాస్త సద్దుకో. లేకపోతే నన్ను సద్దమంటే నేను సద్దుతాను "

"నువ్వు వద్దు , నేనే సద్దుకుంటాలే అని అంటూ గదిలోకి వెళ్ళాను. ఓ సారి గదంతా పరికించి చూసాను. నిజమే ఏం బాగాలేదు. పుస్తకాలూ టేబుల్ అదీ సద్దుకుని చాలా రోజులైంది. తాగేసిన కాఫీ కప్పులు, గ్లాసులు, మంచి నీళ్ళ సీసాలు, హల్దీరాం ఖాళీ పాకెట్లూ, ఎంసెట్ క్వొశ్చెన్ బాంక్ పుస్తకాలూ, మోడల్ పేపర్లూ, క్లాసు పుస్తకాలూ, టేబుల్ మీదా, మంచం పైనా, కిటికీలో అన్నిచోట్లా ఉన్నాయి. పనిమనిషికి

చెప్పలేదు కాబట్టి తీయదు. సద్దదు. గదిని ఇంత అసహ్యంగా ఎలా ఉంచుకున్నానో నాకు తెలీడం లేదు, నా మనసు ,బుర్రా ఎలా గజిబిజిగా ఉందో నా గది కూడా అలాగే ఉంది. పైపై వి అన్నీ తీసాను. నా మటుక్కి సద్దాననుకున్నాను.

మర్నాడు సాయంత్రంకాలేజీ నుంచి ఇంటికొచ్చేసరికి చాలా ఆలస్యం అయింది. దాదాపు చీకటి పడింది. నాన్న ఇంటికి వచ్చేసారు. ఇల్లంతా నిశ్శబ్ధంగా ఉంది.

నా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ముందు గదిలోనే అమ్మా నాన్న కూచుని ఉన్నారు. చీకటి పడుతూండగా ,లేటుగా వచ్చానన్న కోపం కావచ్చు. ఆడపిల్ల ఇంకా ఇంటికి రాలేదన్న ఆందోళన కావచ్చు,భయం కావచ్చు. ఏదైనా కానీ వాళ్ళచూపులు నన్ను కలవర పెట్టాయి. ఏదైనా తప్పు చేసానా! వాళ్ళ చూపులు తప్పించుకుంటూ నా గది లోకి వెళ్ళాను. గది నిన్న నేను చేసిన దానికన్నా చాలా బావుంది. అంతా శుభ్రంగా ఉంది. ఈ సారి నుంచి బాగా సద్దుకుంటానని చెప్పాలి.

అమ్మ కోపంగా ఎందుకుంది. చెప్పినా కూడా గదిని అసహ్యంగా ఉంచినందుకా!వాళ్ళతో బలవంతంగా క్లీన్ చేయించినందుకా! కాని నేను అమ్మని గదిని సద్దమని అనలేదు. నేనే చేసుకునే దాన్ని కదా, చేయడం ఎందుకు,కోపంగా ఉండడం ఎందుకు. ఓ కే ఇప్పుడు చేసేసింది కాబట్టి, క్షమించమని అడగాలి. ఇక ముందు ఇలా జరగదు అని అనాలి. మనసులో అలా అనుకుంటూ ముందు గదిలోకి వచ్చాను.

కానీ అమ్మ చేతిలో ఉన్నది చూసాకా నేను మాటలు మరిచిపోయినట్లుగా బొమ్మలా ఉండిపోయాను. కారణం అమ్మ చేతిలో ఉన్న కవర్. అందులో ఓ ఉత్తరం గ్రీటింగ్స్ అదీ ఉంటాయి. అది ఆర్నవ్ నాకు ఆఖరి సారిగా కలసి నప్పుడు నందిని రెస్టారెంటులో ,వెళ్ళిపోతున్నప్పుడు ఇచ్చిన గ్రీటింగ్స్,ఓ చిన్న ఉత్తరం. ఆ గ్రీటింగ్ ని ఉత్తరాన్ని రెస్టారెంటు లోంచి బయటికి రాగానే, వెంటనే చింపలేకపోయాను. ఓసారి చదివితే అని అనుకున్నాను. కానీ ఎందుకో చదవాలనిపించలేదు. ఎవరైనా చూస్తారేమోనన్న భయం అలజడి తో ఇంటికి రాగానే ఏదో ఎదురుగా కనపడ్డ పుస్తకం లో పెట్టేసాను. అంతే . తరవాత దాని గురించి మర్చిపోయాను. ఆరోజున అలా పుస్తకంలో కంగారుగా ఉంచిన ఆ ఉత్తరం గ్రీటింగ్స్, ఇప్పుడు నా ఎదురుగా అమ్మ చేతిలో ఉంది. కడుపులోంచి ఒక్కసారి భయం తన్నుకొచ్చింది. ఏం చెయ్యాలో ఏం అనాలో అర్థం కాక నోరు తెరిచాను. కానీ సమాధానం ఇచ్చేందుకు నాదగ్గర ఏంలేదు. ఉన్నా ఏమీ ఇవ్వదల్చుకోలేదు. ఇచ్చినా ఆమెని కన్విన్స్ చెయ్యలేను. నమ్మించ లేను.

ఆ ఉత్తరాన్ని, గ్రీటింగ్ ని వాళ్ళు చూసేసారు. నిజానికి నేనే వాటిని చూడలేదు. అందులో ఏం రాసాడో తెలీదు. చదవని దాన్ని ఎందుకు ఉంచానో నాకు తెలీదు. అది నాపొరపాటు ,తప్పు ఒప్పుకోడానికి మనసు ఇష్టపడడం లేదు.

ఏదైనా కానీ అది నావి. నేను చదవనిది వాళ్ళు చదివారు. నా ప్రైవేసీ మీద దాడి జరిగింది. ఇలా జరుగుతుందని నేను అనుకోలేదు. ఇది వరకూ చాలా జాగ్రత్తగా ఉండేదాన్ని. ఈమధ్య చాలా నిర్లక్ష్యంగా ఉంటున్నాను. అమ్మా వాళ్ళు ఎందుకు చూస్తారు, వాళ్ళకి నాగదిలో అవసరం ఏం ఉంటుంది , వాళ్ళెందుకు వస్తారు, ఏం చూస్తారు,అయినా చూడడానికి ఏం ఉంది, ఏమీ లేదు,చూడరు అన్న భావంలో ఉన్నాను.

కానీ కాదు. నా అభిప్రాయం తప్పు. వాళ్ళు నా గదిలోకి వచ్చారు,నా రహస్యాలన్నీ తెలుసుకున్నారు, చూసారు. ఇది నా నిర్లక్ష్యానికి ఫలితం. ఓ అబ్బాయి నుంచి ఉత్తరం ఓ అమ్మాయి అందుకోవడం అన్నది వాళ్ల దృష్టిలో పెద్ద నేరం.

ఆ ఉత్తరం ఎన్నో జ్ఞాపకాలని నా ముందుంచింది. చచ్చిపోయే ముందు నాతో అన్న మాటలు, అతని చూపులు,అన్నింటి కన్నా అర్ణవ్ యాక్సిడెంట్. రక్తపు మడుగులో ఆర్ణవ్. నా ముందు కదులుతున్నాయి. నామూలంగా పోయాడు. మనసులో ఏడ్చేసాను.

"ఏంవిటిదీ? " నాన్న గట్టిగా అరిచారు.

" నువ్వు కాలేజీకి వెళ్తున్నది వీటికోసమా? ఈ మనిషి ఎవరూ? ఈ ఉత్తరం ఏంవిటీ? ఈ గ్రీటింగ్ ఏంవిటీ? " కోపంతో అమ్మగొంతు కీచుగా మారింది.

"ఎవరీ మనిషి? ఉత్తరం ఎందుకు రాశాడు? నువ్వు ఏదో అలుసు ఇచ్చి ఉంటావ్. అందుకే రాసాడు. అయినా ఎంత ధైర్యం ఇలా ఉత్తరాలూ అవీ రాయడానికి " నాన్నగొంతు పెంచక పోయినా ,అందులో కాఠిన్యం ఉంది.

ఆర్ణవ్ కింద సంతకం పెట్టలేదా? అందుకే ఆర్ణవ్ పేరు వాళ్ళకి తెలీదు. అందుకే ఎవరీ మనిషి అన్నారు.

ధైర్యమా ! నాకా ! లేకపోతే ఉత్తరం రాసిన ఆర్నవ్ కా! కాదు,ఇద్దరం పిరికివాళ్ళమే.

"నువ్వు కూడా రాసావా? బుద్ధి లేదా రాయడానికి ,ఎన్ని రాసావ్ ? ఇదేనా ! ఇంకా లోపలెక్కడైనా దాచావా? "

నేనేం మాట్లాడలేదు. బాధ,కోపం,విచారం,సిగ్గు,అన్నీ కలిసి కడుపులో సుళ్ళు తిరుగు తున్నాయి. ఆ ఉత్తరం ,ఆ గ్రీటింగ్స్ నా వ్యక్తిగతం. దాన్ని వీళ్ళు ఎందుకు చూడాలి? నన్ను ఎందుకు నిలదీయాలి? ఇలా నిలదీసీ అడిగే హక్కు వీళ్ళకుందా? నేను చిన్నపిల్లని కాను. ఒకవేళ చిన్న పిల్లనయితే అది వేరే విషయం. కాని, నేను మేజర్ ని . బీఎస్సీ రెండు సంవత్సరాలు అయిపోయాయి. మూడో సంవత్సరం చదువుతున్నాను. పంతొమ్మిదేళ్ళు నిండుతాయి.

"చెప్పు ఆ ఉత్తరం రాసిన పిల్లాడు ఎవరూ.?" అమ్మ నా మొహంలో మొహం పెట్టి అడిగింది.

ఆ పిల్లాడి పేరు ఆర్నవ్. నా క్లాస్ మేట్ ఫ్రెండ్, సువర్ణ కజిన్ . నేనంటే ప్రాణం పెట్టిన వాడు.నా మూలంగా ప్రాణం తీసుకున్నవాడు. తను.ఓ ప్రేమికుడు.నా స్వార్థం నేను చూసిన దాన్ని. నా మూలంగానేపోయాడు. కాని ఆ విషయాన్ని నేను చెప్పి ఒప్పుకోడానికి ధైర్యం లేకపోయింది. తను ఈ లోకంలో లేడు. చచ్చిపోయాడు. ఓ విధంగా నేనే కారణం. ఇలా ఎన్నో అనుకున్నాను. కానీ నోరు పెగల్లేదు.

"చూడండి రాయిలా ఎలా నిలబడిందో. నాకయితే ఈ చెంపా ఆ చెంపా వాయించాలన్నంత కోపం వచ్చేస్తోంది " అమ్మ కోపంతో ఊగిపోతోంది. నాన్న అటూ ఇటూ తిరుగుతున్నారు.ఆ అడుగులు కోపంతో పడుతున్నవని తెలుసు. మధ్య మధ్యలో ఆగి అమ్మని నన్ను చూస్తున్నారు.మరోసారి రెట్టించి అమ్మ అడిగింది.

అయినా నేనేం అనలేదు. నా మౌనం వాళ్ళకి ఇంకా అనడానికి అవకాశం ఇస్తోంది. అమ్మ ముందుకి వచ్చింది .ఒక్కసారి నా ఎడమ భుజం పైనా గట్టిగా ఒక్క దెబ్బ వేసింది. అబ్బా! అని అన్నాను. ఆ వెంటనే రెండు చెంపల మీద టపా టపా దెబ్బలు వేసింది. రెండు చేతులతో రెండు చెంపలు నిమురుకుంటూ చూసాను. ఆశ్చర్యం నా కళ్ళల్లోంచి నీళ్ళు రాలేదు.

“జవాబు చెప్పు. ఇది ఎప్పటి ఉత్తరం? ”

అంటే ఆర్ణవ్ తేదీ కూడా వెయ్యలేదన్నమాట

“ ఇది ఇక్కడిదా ? ఇంతకు ముందు మనం ఉన్న ఊరిదా ? అక్కడిదే అయితే ఇక్కడికి ఎందుకు తెచ్చావ్ ? తెచ్చి ఎందుకు దాచావ్? ఈ పిల్లాడు ఇక్కడ ఉంటాడా? మీ ఇద్దరికీ ఏం సంబంధం? అది స్నేహమా ,పెళ్ళి వరకూ వెళ్ళిందా మీ స్నేహం? చేసుకునే ఆలోచన కూడా ఉందా? మీ స్నేహం అంత వరకేనా,ఇంకా ముందుకు వెళ్ళిందా? “ అంటూ అసహ్యంగా మొహం పెట్టింది.

అమ్మ అలా మాట్లాడే సరికి చాలా సిగ్గనిపించింది.

ఒకరి తరవాత మరొకరు , ప్రశ్నలు వేసి వేసి అలసిపోయనట్లుగా ఒక్కసారిగా ఇద్దరూ ఆగారు . నా సమాధానం కోసం , నావైపే చూస్తున్నారు.

వాళ్ళ ప్రశ్నలకి జవాబివ్వాల్సిన పని లేదు. ఎందుకంటే ఆర్నవ్ కి నాకు మధ్య ఉన్న స్నేహాన్ని చెప్పితే అర్థం కాదు. అర్థం చేసుకోరు.ఈ వయసులో మొగ ఆడ మధ్య సహజంగా కలిగే ఆకర్షణ అని కూడా అనుకోరు. పైగా అది సహజం అని కూడా అనుకోరు. ఇప్పుడు ఆ మనిషి లేడన్నసంగతి వీళ్ళకి చెప్పాలి. అప్పుడు కోపం కొంచెం తగ్గుతుంది.

ఎందుకంటే వీళ్ళది మధ్య తరగతి మనస్తత్వం. ఓ మామూలు కుటుంబం నుంచి కష్టపడి పైకొచ్చారు. వాళ్ళ పరిధి అంతే. దాన్ని దాటి ఒక్క ఇంచి కూడా వెళ్ళరు. జీవితంలో ముందుకి వెళ్ళాలంటే ప్రేమ కోరిక, మొగపిల్లలతో స్నేహం ,వయసు, భావోద్వేగం ,ఇలాంటి వాటికి చోటుండకూడదు. ఉండదు. ఎంతసేపూ చదువు మార్కులు ఆ చుట్టూనే వీళ్ళ ప్రపంచం .

“ అతను ఈ లోకంలో లేడు ” అతి కష్టం మీద అన్నాను.

ఇద్దరూ ఒక్కసారిగా నిశ్శబ్ధం అయిపోయారు. ఆశ్చర్యంగా చూసారు.

ఎలా పోయాడో, ఎందుకు పోయాడో చెప్తే ఈ నిశ్శబ్ధం యిలాగే ఉంటుందా . ఆలోచిస్తున్నాను.

నాన్న అమ్మ వైపు తిరిగి,అమ్మని తిట్టడం మొదలెట్టారు.

. ”నువ్వు ,నువ్వే అంతా చేసావ్. అసలు అది ఇలా అవడానికి కారణం నువ్వే. దాన్నిపాడు చేసావ్. ఒక్కగానొక్క కూతురు , మా ఇంటి మహలక్ష్మి అంటూ గారం చేసావ్. నేను ఆఫీసుకి వెళ్ళిపోతాను. నువ్వు కదా ఇంట్లో ఉండేది. కొంచెం స్ట్రిక్ట్ గా ఉండాలని నీకు తోచలేదా? అది ఎవరితో మాట్లాడు తోందో ఎక్కడికి వెళ్తోందో. చూడక్కర్లేదా ? ఇది ఇలా ఉంది కాబట్టే ఎంసెట్ లో మూడు సార్లు రాసినా మంచి రాంక్ రావడం రాలేదు. ”

"నేనేం చేసాను? నన్ననకండి .అది ఇంట్లో కన్నా బయటే కదా ఎక్కువ ఉంటోంది. బయట ఏం జరుగుతోందో నాకేం తెలుస్తుంది. స్కూల్లో ఉన్నంత సేపూనేను కనిపెట్టుకుని ఉన్నాను. నాచెప్పుచేతల్లో ఉంది. ఇప్పుడు చెయ్యి దాటిపోయింది. పెద్దైపోయింది కదా మరి నాది సరే, మీరు ఎప్పుడైనా దాన్ని ఏదైనా అడిగారా? ,లేదు.మీరు మీ ఆఫీసు.ఇంటి విషయాలు పట్టించుకున్నారా లేదు. అది అలా అవడానికి కారణం నేనని ఎలా అంటారు? "

ఎప్పటిలాగా వాళ్ళిద్దరూ నా ముందు దెబ్బలాడుకున్నారు. నువ్వు కారణం అంటే నువ్వని గొడవ పడ్డారు. నేను అలాగే గోడకి చేరబడి నుంచున్నాను. కొంచెం సేపటికి వాళ్ళు మామూలైపోయారు ,ఇద్దరూ నావైపు తిరిగారు.

"సరే, ఆ పిల్లాడు పోయాడని అంటున్నావు కదా, అలాంటప్పుడు ఈ ఉత్తరాన్ని ఎందుకు దాచి ఉంచావు ? ఇలా ఉంచినందుకు ఏం జరుగుతుందో నని ఎప్పుడైనా ఆలోచించావా? " మళ్ళీ నాన్న గట్టిగా అన్నారు.

దాన్ని దాచాలని దాచలేదు, అలజడిగా ఉన్న మనసుతో ఇంటికి ,హడావుడిగా వచ్చి,ఎదురుగా ఉన్న పుస్తకంలో ఉంచాను. ఇలాంటిది ఓ రోజున జరుగుతుందని తెలిస్తే అప్పుడే చింపేసే దాన్ని.

కోర్టులో ఓ దోషిని నిలబెట్టి మాట్లాడుతున్నట్లు గా అన్నీ అడుగుతున్నారు.

ఆలోచించలేదన్నట్లుగా తలఊపాను.

"ఇదొక్కటేనా ?ఇంకా ఏదైనా ఉందా.?ఇలాంటి ఉత్తరాలు గ్రీటింగ్ లూ అవీ. మరోటీ మరోటీ. "

లేదు.అన్నట్గా తల అడ్డంగా ఊపాను.

"మరి వీటి మాట ఏంటివీ..?."

అప్పుడు చూసాను.అక్కడ ఓ ట్రాన్సపరెంట్ కవర్ లోంచి కనిపిస్తున్నఉత్తరాలు. ఆశ్చర్య పోయాను. కళ్ళు పెద్దగా చేసి చూసాను. అంటే వీళ్ళు వీటిని కూడా చూసారా? తేదీల ప్రకారంగా వరసగా పెట్టినవి. అవి వంశీ రాసినవి, వంశీ నా క్లాస్ మేట్. పదో క్లాసులో నాతో పాటూ చదువుకున్నాడు, క్లాసులో నేను ఎప్పుడూ ఫస్ట్, వంశీ సెకండు. అదే కాదు,కాంపిటీషన్స్ లో కూడా అంతే . బహుమతులన్నీ మా యిద్దరికే. అది మా స్నేహానికి పునాది, స్కూళ్ళల్లో ఆ స్నేహం అంత వరకే ఉంటుంది. పైగా మేము మార్కులు, పరీక్షలు,ప్రిపరేషన్,ఏది ఇంపార్టెంట్, పాత ప్రశ్నా పత్రాలు చూస్తూ ,ఏ డయాగ్రంస్ రిపీట్ అవుతున్నాయి,ఇలా చదువు గురించే మాట్లాడుకునే వాళ్ళం. అంతే.కొంచెం కూడా మా స్నేహం ముందుకి వెళ్ళలేదు. వంశీ వాళ్ల అమ్మా నాన్న వేరే ఊళ్ళో ఉంటారు .అక్కడ చదువు సరిగా లేదు అని అమ్మమ్మ ఇంట్లో ఉండి చదువు కుంటున్నాడు.

పదో క్లాసు అయిపోయాకా వంశీ తన పేరెంట్స్ దగ్గరికి వెళ్ళిపోయాడు. పరీక్షలు అయిపోయాకా స్కూలు వదిలి వెళ్ళే రోజున అందరం ఏడ్చేసాం. బాధగా,విడి పోతూ పోతూ ఒకరి నొకరు ఓదార్చుకుంటూ నవ్వుకుంటూ అందరూ స్నేహితులతో ఆటోగ్రాఫ్ లు తీసుకున్నారు. అడ్రస్సులు తీసుకున్నారు.అలాగే వంశీ కూడా అందరివీ తీసుకున్నాడు. అంతే. అయితే వంశీ ఉత్తరం రాస్తాడని అనుకోలేదు. కానీ రాసాడు. నాకొక్కదానికే కాదు, మరి కొంతమందికి కూడా రాసాడు. ఉత్తరాలు చదువుతూంటే బావుందనిపించింది. జవాబు రాసాను.

తను వెళ్ళిన కొత్త చోటు,కొత్త స్కూలు,ఎందుకంటే అక్కడ జూనియర్ కాలేజీ లేదు. సీబిఎస్సీ సిలబస్. లెవెన్త్ ,ట్వెల్త్ ఉన్న స్కూల్లో చేరానని రాసాడు. పన్నెండో క్లాసు అయ్యాకా,ఐఐటీ చెయ్యాలని అనుకుంటున్నానని , దానికి కోచింగ్ తీసుకుంటున్నాని రాసాడు.

నేను కూడా నా ఇంటరు ,క్లాసులు,కొత్త స్నేహాలు ఇలా ఎన్నో రాసాను. రాను రాను స్నేహం ఇంకా కాస్త ముందుకి వెళ్ళింది. ఎన్నో రాసుకున్నాము. టీచర్లు, పాఠాలు, సిలబస్, భవిష్యత్తు,ఆశలూ కలలూ. ఏం చదవాలని అనుకుంటున్నామో. ఇంకా సినిమాలు, పాటలు, పుస్తకాలు,టూరిస్ట్ ప్లేసులు ప్రపంచం లోని వింతలూ. విడ్డూరాలు. ఇలా ఎన్నో, తనకి తెలిసినవి నాకు తెలిసినవి రాసుకునే వాళ్ళం. వంశీ మొగ పిల్లాడు , నేను ఓ ఆడపిల్లని అన్నఊహ అసలు రానే లేదు. మాది స్నేహం,ఎంతో ఉత్సాహాన్నిస్తున్న స్నేహం అదొక్కటే మాకు తెలిసింది. తరవాత వంశీకి ఐఐటీ లో సీటొచ్చింది. చెన్నై వెళ్ళిపోయాడు. నాకు మెడిసిన్ లో సీటు రాలేదు. బిఎస్సీ లో చేరాను. ఇంక ఇప్పుడు రాసుకునే విశేషాలు ఏం లేదు,మా ఇద్దరికీ చదువుల మూలంగా తీరిక దొరకడం లేదు. అందుకని,కొత్త సంవత్సరానికి ,దీపావళికి, పుట్టిన రోజుకి గ్రీటింగ్స్ పంపుకుంటున్నాం. మా మధ్య ఉత్తరాలు తగ్గాయి కానీ మానెయ్యలేదు.ఇప్పడు ఆ ఉత్తరాలు అవీ,నీట్ గా ఓ ఫైల్లో ఉంచిన ఉత్తరాలు ఇప్పుడు సోఫాలో ఉన్నాయి.

అది కూడా చదివారా ? భయంతో వణికి పోయాను. అమ్మ ఏదేదో అంటోంది.

ఆమె మాటలు గుండెని కోసేసాయి. ప్రతీ పదం ఓ గాజుముక్కలా గుండెని గుచ్చుతోంది, ఆ ముక్కలు చర్మాన్ని చీల్చుకుని బయటికి వచ్చేస్తాయేమో ననిపించింది. లోపల ఏదో తెలీని భయం. ఏదో పెద్ద తప్పు చేసానని అంటూంటే సిగ్గుగా అనిపించింది. గిల్టీగా కూడా అనిపించింది.

“ఇప్పుడు నేను చేయాల్సింది ఒక్కటే.అదే చేస్తాను ” అంటూ నా ముందు నుంచుని తన చెయ్యి చాపింది.

“ఈ ఉత్తరాలూ అవీ ఇంక రాయనని ప్రామిస్ చెయ్యి. అదృష్టం బావుంది కాబట్టి,నీ వ్యవహారం ఇంకా ముందుకి వెళ్ళకుండానే మేము చూడడం జరిగింది. నిన్ను హెచ్చరించడం జరిగింది. మేము నీ పేరెంట్స్. నీ శతృవులం కాదు. కానీ సమాజానికి భయపడే వాళ్ళం. ఈ ఉత్తరాలూ అవీ నీ వైవాహిక జీవితాన్ని నాశనం చేస్తాయి. అది నీకు తెలీడం లేదు. నీ జీవితం బాగుండాలి. మాకు నీ భవిష్యత్తు ముఖ్యం ”

**నేనేం** మాట్లాడ లేదు. ప్రామిస్ కూడా చెయ్యలేదు. నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్నారు.

“ఇలారా ఇప్పుడు చేయాల్సింది మరొకటి ఉంది ” అంటూ కదిలారు,ఇద్దరూ.

వాళ్ళ మనసులో ఏం ఉందో నాకు తెలీదు. తెలిసినా నేనేం చేయలేను. వాదించలేను. గబ గబా ఓ పెద్ద కత్తెర తెచ్చి,ఒకదాని తరవాత మరోటి అన్నీ చిన్న చిన్న ముక్కలుగా చేసి, మెల్లిగా, కొంచెం కొంచెం గా అన్నీ కాల్చేసారు. ఎర్రటి మంట, ఆతరవాత నల్లటి పొగ.

అవన్నీ ముందుగా ప్లాన్ వేసుకున్నట్లుగా ఉన్నారు. అందుకే అన్నీ కూడా ఒకదాని వెనక జరిగిపోతున్నాయి.

గుండె గొంతులోకి వచ్చెస్తోంది. గుండె అంతకంతకూ బరువై పోతోంది. బద్దలైపోతుందేమో అనిపిస్తోంది. గట్టిగా ఏడ్చేస్తానేమో ననిపించింది. కానీ అలాంటిది ఏం జరగలేదు. నా కంట్లోంచి ఒక్క చుక్క కూడా రాలేదు.

నేను ఓడిపోయాను ,ఆర్ణవ్,వంశీ మొహాలు కనిపిస్తున్నాయి. పూర్తిగా ఓడిపోయాను. ఎందుకో అవమానం అనిపించి ఆ క్షణాన్నే చచ్చి పోవాలని పించింది. నేను ఏం పోగొట్టుకున్నానో, ఏం కోల్పోయానో . ఆ నల్లగా మసి అయిన కాగితం ముక్కలు,చూస్తే అర్థం అయింది. ఎందుకో నా శరీరం కూడా అలాగే మండిపోతే, మాడిపోతే, బూడిదైపోతే , నల్లగా మారిపోతే, పొగలాగా పైకెళ్ళిపోతే , వీళ్ళకి అప్పుడు బావుంటుందా?

" ఇంక ఇప్పుడు అన్నీ సద్దుకుంటాయి. పరిస్థితి మామూలుగా అయిపోతుంది. ఇవ్వాళ నుంచి నువ్వు ఓ కొత్త మనిషివి. గతాన్ని మర్చిపో. వాటిని గుర్తు తెచ్చుకోకు. అంతే,నీ ముందున్నది ఎంసెట్,మెడిసిన్,నీ కల, మా కల,.అంతే. ఈ స్నేహాలు అవీ, ఎందుకూ పనికి రావు,వేస్ట్,పైగా ఈ చదువుకి చేటు " అనేసి మళ్ళీ నా గదిలోకి వెళ్ళారు.

వాళ్ళన్నట్లుగా నేను అన్ని మర్చిపోతానా? ఉహూఁ, మర్చి పోలేను. నేను అంతా మర్చి పోతానని వాళ్ళు అనుకుంటున్నారు. వంశీ తో స్నేహంగా ఉన్నప్పుడూ, ఆర్ణవ్ తో స్నేహంగా ఉన్నప్పుడు , ఇష్టపడినప్పుడు నా ఆశలని, కలలని నేను మర్చి పోలేదు. కొన్ని లక్ష్యాలుండేవి. అందుకే వాటికి ఇచ్చిన ప్రాముఖ్యం ఆర్ణవ్ కి,వంశీకి ఇవ్వలేదు. అందుకే ఊరు మారినా నాలో ఏ మార్పు రాలేదు.

నేను నా జీవితంలో ఏదో చేయాలనుకున్నాను. ఆ ఉద్దేశంతో అలాంటి కలతో వచ్చాను. మెడిసిన్ లో సీటు రాకపోతే మరోసారి ఎంట్రెన్స్ రాస్తాను. వంద లోపు రాంక్ వస్తుంది. అమ్మా వాళ్ళ కోరిక కూడా నెరవేరుతుంది. నేను డాక్టర్ కావడం వాళ్ళ కల. నాక్కూడా అదే కల. ఆ కలనిమళ్ళీ మళ్ళీ కనడానికి నాకు అభ్యంతరం ఏంలేదు, అది ఒకప్పుడు.

కానీ ఇప్పుడు కాదు. ఇప్పుడు ఆ కల భయంకరంగా కనిపిస్తోంది. తలచుకోడానికే భయం వేస్తోంది. ఈ రోజున ఇంత జరిగాకా, అవి అన్నీ ఉంటాయా? ఉండవు. అవి కూడా కాలిపోయాయి. ఇప్పుడు అవేవి లేవు. వాళ్ళ కలని నిజం చేయాలని లేదు. ఇప్పుడంతా శూన్యం,అంతా ఖాళీ. ఇంటర్ లో పదో క్లాసులో ఎంసెట్ రాస్తున్నప్పుడూ నేను కన్న కలలు ఉన్నవి అన్నీ కూడా ఎక్కడికి వెళ్ళాయో తెలీదు. ఇప్పుడు మళ్ళీ ఆ కలని కనాలని లేదు. అవి నాకక్కర్లేదు.

జరిగినదంతా ప్రతీనిమిషం కళ్ళముందు కనిపిస్తోంది. అసహనంగా ఉంది. ఏంచేయాలో తెలీడంలేదు. నిద్ర రావడం లేదు. చచ్చిపోయిన ఆర్ణవ్ మాటలూ, చూపులు, వంశీ ఉత్తరాలూ, ప్రద్యుమ్న పాటలూ, ఇవే,ఇవే . కాలిపోతున్న ఉత్తరాలు. ఇవే కళ్ళ ముందు తేలిపోతూ కనిపిస్తున్నాయి. తెలీని బాధ. కోపం. ఆశ్చర్యం ఎందుకో ఏడవ లేదు. ఏడుపు రాలేదు.

ఏం చేస్తే అమ్మా వాళ్ళ మీద కోపం తగ్గుతుంది. నేను చేయగలిగినది ఒక్కటే సూసైడ్,పైన చూసాను ఫాన్ తిరుగుతోంది. చున్నీ తీసాను. ఇదే నేను చేస్తాను . నేను,చస్తే గొడవ పోతుంది . కానీ వెంటనే ఆ పని చెయ్యలేక పోయాను. సూసైడ్ అంత ఈజీ కాదని తెలుసు. అది ఓసారి అనుభవం అయింది.

ఓ నాలుగు రోజులు గడిచాయి. నేను పైకి మామూలుగానే ఉన్నా లోపల మాత్రం నొప్పి, భరించలేని నొప్పి. ఈ నొప్పి ఎలా తగ్గుతుంది. నా గదిలోనే అటూ యిటూ రెస్ట్ లెస్ గా తిరిగాను. చేతికి టేబుల్ కోణం గట్టిగా తగిలింది. ఆశ్చర్యం నొప్పి అనిపించలేదు. వెంటనే నా గోళ్లతో చేతిమీద నొక్కి పెట్టాను. అలా చాలా సార్లు. ఇంకా లోపలికి గుచ్చాను. కళ్ళు మూసుకున్నాను. కొంచెం నొప్పి తగ్గినట్లనిపించింది. అమ్మ వాళ్ళ మీద కోపం కొంచెం తగ్గింది.

మర్నాడు కూడా అలాగే టేబుల్ కోణానికి గట్టిగా కొట్టు కున్నాను. గోళ్ళతో చేతిమీద గీరుకున్నాను. నొప్పి కొంచెం తగ్గింది. కాని పూర్తిగా తగ్గ లేదు. ఏం చెయ్యాలో తోచక అటూ ఇటూ తిరిగాను. గది అంతా వెతికాను. ఓ చిన్న కత్తి దొరికింది. దాన్ని ఎప్పుడో ఏదో పండు కోయడానికి తెచ్చి ఉంటాను. వెంటనే మళ్ళీ వంటింట్లో పెట్టలేదు. ఇప్పుడు దాన్ని నా చేతిలో పట్టుకుని ఆలోచించాను. పదును గా ఉందా లేదా అని చేతి మీద కోసుకున్నాను . ఎర్రటి చార ,రక్తం పైకి రాలేదు కానీ చాలా పదునుగా ఉంది. మరోసారి, దాన్ని తీసుకుని మణికట్టు దగ్గర అడ్డంగా కోసాను. రక్తం పైకొచ్చింది. మరోటి, రక్తంతో ఓ గీత,దాన్నే చూస్తూ ఉండిపోయాను.

ఇప్పుడు పర్వాలేదు, లోపలి నొప్పి కాస్త తగ్గింది. లోపలున్న కోపం కూడా తగ్గింది, ఈ కత్తి కోత వల్ల వచ్చిన ఈ పైన నొప్పి నిజం అయింది. దీన్ని నేను ఓర్చుకోగలను. కారుతున్న రక్తం తుడవాలని దూది కోసం అంతా వెతికాను. దొరికింది. డెట్టాల్ వేసి తుడిచాను.

నేను ఏం చేసానో అమ్మా వాళ్ళకి తెలీదు. అయితే దీన్ని వాళ్లకి తెలియ కుండా చెయ్యగలను. ఒకవేళ తెలిసినా నన్నేంచేయగలరు. ఏం చేయలేరు. ఇది నా శరీరం. నా ఇష్టం, దీని మీద అధికారం నా ఒక్కదానికే ఉంది. దీన్ని నేనేం అయినా చేసుకుంటాను, వాళ్ళకి ఏ విధమైన అధికారం లేదు. ఇది వాళ్ళు చేసిన దానికి ప్రతీకారం తీర్చుకోవడం. ఎందుకో అలిసిపోయాను. ఎదురుగా మంచం కనపడింది. దానిమీద వాలిపోయాను.కళ్ళు మూసుకున్నాను.

ఇప్పుడు నా మనసంతా ఖాళీ. శూన్యం. అందులో ఏంలేదు. నేను ఏదైనా వింటున్నానంటే కాలి పోయిన ఉత్తరాల్లోంచి వస్తున్న ఆక్రందనలు. నన్ను రక్షించు అన్న ఆక్రోశాలు. ఆర్ణవ్ మాటలూ, చూపులూ.అతని భయంకరమైన చావు.

అవి అన్నీ అరిచి బాధగా కాలిపోతూ మాడి మసి అయిపోయాయి. వాటిని అలాగే చూస్తూండి పోయాను.

అమ్మా వాళ్ళు అన్నారు, నువ్వు ఇప్పుడు కొత్త మనిషివి. అమ్మా,నాన్న అన్నట్లు ఆ మాట సత్యం. నిజమే నేను కొత్త మనిషినే. కానీ వాళ్ళు అనుకుంటున్నట్లుగా కాదు.

నా మనసు పని చేయడం మానేసింది. దానిలోని జీవం చచ్చిపోయింది. కారణం నాలోపలిది ఏదో చచ్చిపోయింది. అది ఏంటో నాకు తెలుసు. అది నా ఆత్మ. ఇప్పుడు ఆత్మ లేని శరీరం తో తిరుగుతున్నాను. ఇలా ఉన్న నేను చస్తే ఏం? నేను ఓవేస్ట్ అమ్మాయిని. బతికి ఉండడం దండగ యూస్లెస్ లైఫ్ ఈజ్ ఎన్ అర్లీ డెత్..

ఎంత సేపు అలా ఉన్నానో నాకే తెలీదు. ఇంత జరిగాకా నేను మరోసారి ఏమీ చెయ్యనని వాళ్ళు అనుకున్నారు . అందుకే నా మానాన నన్ను స్వేచ్ఛగా వదిలేసారు. నా గదిలోకి వాళ్ళు ఎవరూ రాలేదు. నేను ఓ కొత్త మనిషిని అని. నిజంగానే కొత్త మనిషినే. ఆత్మలేని మనిషిని. బతికీ లాభం లేదు.అమ్మా,నాన్నా ఇద్దరూ పెద్ద శతృవుల్లా కనిపిస్తున్నారు,వాళ్ళని చూసినప్పుడల్లా ఛావాలన్న కోరిక రోజు రోజుకి బలంమైపోతున్నట్లుగా అనిపిస్తోంది.

అమ్మ అన్నం తినడానికి రమ్మనమని రెండు సార్లు పిలిస్తే వెళ్ళాను. వెళ్ళక పోతే ఓ పెద్ద ఇష్యూ చేస్తారు. అన్నం తింటున్నప్పుడు ఎడమ చేతి మణికట్టుని అమ్మ చూసింది. వెంటనే అడిగింది .

"ఏంటీ ఆ ఎర్ర గాట్లు ?అలా గీరుకుపోయింది..? " వెంటనే ఏం చెప్పాలో తెలీలేదు, ఆలోచిస్తున్నాను.

“కాలేజీలో ,.డిసెక్షన్ చేస్తూంటే ఏదైనా కోసుకుందా ? ” అని అమ్మ మళ్ళీ తనే అంది.

“అవును” అన్నట్లుగా తల ఊపాను.

“ఈ సారి నుంచి జాగ్రత్తగా ఉండు. ఇప్పుడే ఇలా అజాగ్రత్తగా ఉంటే రేపు మెడిసిన్ లో అనాటమీ వాటిల్లో ఏం చేస్తావ్? ” ఇలాంటివి ఎన్నో ఉంటాయి.

నా నోట మాట రాలేదు. అమ్మ ఎంత ముందు వెళ్ళిపోయింది? మెడిసిన్ నేను చదవడం లేదు. అంత ముచ్చటగా ఉంటే ఆ అనాటమీ, ఫిజియాలజీ ఏదో నువ్వే చదువుకో అని మనసులో అనుకున్నాను. నిశ్శబ్దంగా తినేసాను. నిద్ర పోయాను. అది కలత నిద్ర. ఆ కలతలోనే పీడ కలలు. ఏదో లోయల్లోకి జారిపోతున్నట్లుగా అనిపించి ఉలిక్కి పడి లేచాను. ఎక్కడో ఆర్ణవ్ గొంతు. నువ్వే నన్ను చంపేసావ్ అంటున్నట్లుగా వినిపిస్తోంది.లేదు నేను చంపలేదు . బామ్మ ఏడుపు, నా ఏడుపు, నిద్ర లోంచి లేచిపోతున్నాను.

దేనికో భయం, ఎందుకో తెలీదు, ఇంతకు ముందు ఇలా జరగలేదు. ఏదో ఫీలింగ్ గొంతు వరకూ వచ్చేసి, గొంతుని నొక్కేస్తోంది.నాన్న నావెనకాల నుంచుని నా గొంతుని పిసికేస్తున్నారు. చిన్నప్పుడు అమ్మ ఎప్పుడూ అనేది,ఇది ఛస్తే పీడాపోయేదిఅని అప్పుడు నిజంగా అందా! అది మొమెంటరీ రియాక్షన్ కావచ్చు.కో పంలో ఏదో అని ఉంటచ్చు. కాని ఇప్పుడు ఆ మాట అనలేదు. కానీ,నాకు నిజంగానే ఛావాలని అనిపిస్తోంది. కాని ఇప్పుడు నాన్నగొంతు నులిమేస్తున్నారు. అంటే నేను ఛస్తే వీళ్ళకి పరవాలేదా!

మళ్ళీ తెలివి వచ్చేసింది. కళ్ళు తెరిచాను. ఎందుకిలా జరుగుతోంది ? పిచ్చి ఎక్కుతుందా ? కారణం చెప్పలేను కానీ నాలో ఏదో భయంకరమైన మార్పులు జరుగుతున్నాయి. కిటికి తెరిచి బయటికి చూసాను. తెల్ల వారుతోంది. వాకింగ్ వాళ్ళు , నిశ్శబ్దంగా వెళ్ళిపోతున్నారు. పేపరు వాళ్ళు,అరటి పళ్ళ వాళ్ళు బిజీగా వెళ్తున్నారు. పక్క వీధిలో ఉన్న గుళ్ళోంచి గంటలు విని పిస్తున్నాయి.అంటే రాత్రంతా నిద్ర పోలేదా..

అలికిడికి అమ్మ లోపలికి వచ్చింది. అమ్మలాగా అనిపించడం లేదు ఓ శత్రువు లాగా అనిస్తోంది. ”లేచావా? చక్కగా మొహం కడుక్కుంటే మంచి చిక్కటి కాఫీ ఇస్తాను “

నేను వెనక్కి తిరగలేదు. అలాగే కిటికీ లోంచి చూస్తున్నాను. అమ్మ కి సమాధానం ఇవ్వలేదు. కానీ అమ్మ నా దగ్గరికి వచ్చింది. నాభుజం మీద చేయి వేసింది.

“ నీ మీద మాకేం కోపం లేదు. బాధ అంతే. పిల్లలు మంచి దార్లో వెళ్ళాలనే అందరూ కోరుకుంటారు. మేమూ అంతే. మా మీద కోపం పెట్టుకోకు, నీ మంచి కోరే వాళ్ళం. మాకేం పది మంది లేరు. మాకు నువ్వొక్కదానివి. మా ఆశలన్నీ నీ మీదే ఉంటాయి. జరిగినవన్నీ మర్చిపో, అదో పీడకల. కలలన్నీ శాశ్వతంగా ఉండవు. పీడ కలలు కూడా అంతే. ఇది కూడా అంతే. అలాంటిదే. అలాంటి వాటిని గుర్తు తెచ్చుకుంటే బాధ మాత్రం మిగులుతుంది. అందుకని వాటిని గుర్తు చేసుకోకూడదు” అంటూంటే ఆమె గొంతు వణికింది. నాకు తెలుస్తోంది అమ్మ ఏడుస్తోందని.

నేను ఏడవలేదు. అమ్మఏడ్చి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తోంది, ఇది అంతా ఓ నాటకం. ఈ ఇమోషన్ నిజం కాదు. దీనికి నేను లొంగకూడదు. కానీ అమ్మని ఇప్పుడు ఎదిరించలేను. ఎదిరించి గొడవ పెట్టదలుచు కోలేదు. నాన్నగారు ఇంట్లోనే ఉన్నారు,మధ్యలో వచ్చి కలగచేసుకుంటారు. అప్పుడు మళ్ళీ అమ్మని నాన్నగారు ఏదో అంటారు. అసలు విషయం పక్కదార్లోకి వెళ్తుంది వాళ్ళిద్దరూ దెబ్బలాడుకుంటారు. అందుకే నా మూలంగా వాళ్ళ మధ్య గొడవ పెట్టుకోదల్చు కోలేదు.

నిశ్శబ్దంగా ఉన్న నన్నుచూసింది. " పద పద. కాఫీ తాగితే కొంచెం తేరుకుంటావు. రా " ఓ రెండు సార్లు అని గదిలోంచి వెళ్ళిపోయింది.

నేను మొహం కడుకుని నా కాఫీ గ్లాసు తెచ్చుకుని , కిటికీ లోంచి బయటికి చూసాను. ఆరో అంతస్థులోని కిటికి అది. కాలేజీలకి వెళ్ళే వాళ్ళు,ఆఫీసులకి వెళ్ళే వాళ్ళు, వెళ్తున్నారు. స్కూలు పిల్లలు వాళ్ళ బస్సుకోసం ఎదురు చూస్తున్నారు వాళ్ళ పక్కనే ఆ పిల్లల సంచులు మోస్తూ పెద్దవాళ్ళు. అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలు,అటూ ఇటూ తిరుగుతున్నారు. నేనూ అలాగే స్కూలుకెళ్ళాను. అలాగే బస్సుకోసం ఎదురు చూస్తూ నా తోటి పిల్లలతో ఆడుకున్నాను. అప్పుడు జీవితం గురించిన ఏం ఆశల్లేవు. జీవితం నుంచి ఏమీ ఆశించ లేదు. జీవితం అంతా ఇలాగే హాయిగా ఉటుందనుకున్నాను. ఆ వయసులో నాకేం కలల్లేవు. కానీ నా బదులు అమ్మ ఆ కలలు కనింది. ఇప్పుడు అక్కడున్న ఆ తల్లులు కూడా అంతే. ఏవే పెద్ద ఆశలు, కలలతో ఉండి ఉంటారు .ఎందుకో ఒకసారి అనిపించింది. ఈ ఆరో అంతస్థు నుంచి కిందకి దూకితే ఏమవుతుంది ? చచ్చి పోతానా. ఆ పిల్ల మధ్య పడిపోతే.

ఇలా ఊహిచుకుంటూన్న కొద్దీ భయం వేస్తోంది. భయం గుప్పెట్లో నేను. చెమటల్లు పట్టేస్తున్నాయి. ఈ మధ్య రాత్రిళ్ళు నిద్ర లేకపోవడం వల్ల లోపల ఏదో లా అవుతోంది. కడుపు లోంచి ఏవో పుల్లటి రసాలు పైపైకి వచ్చేస్తున్నాయి. కిందకి మళ్ళీ చూసాను. కళ్ళు తిరిగినట్లయింది. వాంతి వస్తున్నట్లవుతోంది. వెంటనే బాత్రూంలోకి వెళ్ళాను. కాఫీ అంతా బయటికి వచ్చేసింది. మంచం దగ్గరికి వచ్చేసాను. బాగా నీరసంగా ఉంది. కాళ్ళుపైకి పెట్టుకుని మంచం మీద కూచున్నాను.

నీకేం కాలేదు. ఏం పర్వాలేదు, అని నన్ను నేను ఓదార్చుకున్నాను. అయినా లాభం లేకపోతోంది. ఏదో అవుతోంది. నాకేం అవుతోందో తెలీడం లేదు. గడియారం వైపు చూసాను. ఇంకాస్సేపు అయితే నేను కాలేజీకి వెళ్ళడానికి తయారవాలి . కాలేజీ,పుస్తకాలు, పిల్లలు , ఏదో భయం. ఊపిరి పీల్చడానికి రావడం లేదు. ఏదో నొక్కుకు పోతోంది. చచ్చి పోతానా. చచ్చి పోతే ఏం జరుగుతుంది ,ఏం తెలీదు. పక్కన ఏం జరుగుతోందో ఏం తెలీదు. అమ్మా వాళ్లు అనేది ఏదీ వినపడదు. అమ్మ ఏడుపు వినిపించదు. అంతలో అమ్మ మాటలు వినపడ్డాయి. మామూలుగా అయిపోయాను. ఏం చేయాలో అర్థ కాక , వెంటనే వంటింట్లోకి వెళ్ళాను. అమ్మ నాన్నగారికి రెండోసారి కాఫీ తయారు చేస్తోంది. నా రాక గమనించి తల ఎగరేసింది. ఏఁవిటన్నట్లుగా చూసింది. నేను వెంటనే వంట గట్టుని ఆనుకుని ఒక్కసారి గట్టిగా ఏడ్చేసాను ఎక్కిళ్ళు పెట్టేస్తున్నాను.

" ఏంటిది.చిన్న పిల్లలా? ఎందుకంత ఏడుపూ ? ఏం జరిగింది? " అంటూ కంగారుగా భయంగా నన్ను పట్టుకుని దగ్గరికి తీసుకుంది.

నాకే తెలీదు ఏం జరిగిందో. ఏం జరుగుతోందో, అలాంటప్పుడు ఏం జరగలేదు అని ఎలా చెప్తాను. అందుకని ఏం చెప్పలేదు. కాని "భయంగా ఉంది" అని మాత్రం అన్నాను.

"నిన్న కాలేజీలో ఏదైనా గొడవ జరిగిందా?"

తల అడ్డంగా ఊపాను.అసలు నిన్న కాలేజీలో ఏం జరిగిందో గుర్తే లేదు.

" ఏం లేదు అంతా బాగానే ఉంది " ఏదో తోచింది చెప్పేసాను.

ఎంత మెల్లిగా మాట్లాడుకున్నా, నాన్నగారికి కొంచెం వినపడింది. అమ్మ ఏదో అనబోతూంటే అమ్మ నాన్నని చూసి ఆపేసింది. అంతలోనే వంటింట్లోకి నాన్న వచ్చి నా పక్కన నుంచున్నారు. ఏం జరిగిందన్నట్లుగా మా ఇద్దరిని చూసారు.

అమ్మ చెప్పింది అంతా విన్నారు. వెంటనే నా వీపు మీద రాస్తూ అన్నారు.

" ఏంకాదు.అంతా మామూలుగా అయిపోతుంది " అని అన్నారు. ఎంతో మృదువుగా. ఆ ఆప్యాయతకి ఇంకా ఏడుపొచ్చింది.

కానీ  అంతా మామూలుగా అవడం లేదు. నా ఏడుపు ఇంకొంచెం ఎక్కువైంది. అమ్మ నన్ను  వంటింట్లోనే ఉన్నసింక్ దగ్గరికి తీసుకెళ్లి, కుళాయి తిప్పి,చల్లటి నీళ్ళతో నా కళ్ళూ,చెంపలూ,మొహం కడిగింది. తన కొంగుతో తుడిచింది. ఆ తడి చేతులతో  జుట్టుని,అటూ ఇటూ దువ్వినట్లుగా దువ్వి, పైకి తోసింది. నేను చిన్నపిల్లలా అన్నీ చేయించు కున్నాను. ఏడుపు ఆపాను.

వాళ్ళకి ఏం చెయ్యాలో తెలీలేదు. వంటింట్లోంచి నన్ను భుజం పట్టుకుని డ్రాయింగ్ రూం లోకి తీసుకొచ్చి కూచోపెట్టారు. నాన్న మంచి నీళ్లు తెచ్చి తాగించారు. ఆ తర్వాత ఆ గది లోనే అటూ ఇటూ చాలా సీరియస్ గా ఆలోచిస్తూ తిరుగుతున్నారు.

" ఇన్ని ఏళ్ళల్లో ఇలా ఎప్పుడూ అవలేదు.ఇంత గట్టిగా ఎప్పుడూ ఏడవలేదు.కొత్తగా చేరింది కదా. రాగింగ్ అదీ చేసారేమో. అది గుర్తొచ్చి " ఆగి, అన్నాకా తిరిగి అటూ ఇటూ నడవడం మొదలెట్టారు.

" కొత్త ఎందుకయింది. చేరి ఆరు నెలల పైనే అవుతుంది. కొత్తలో రాగింగ్ చేసారంది కాని, అది కూడా  ఓ నాలుగు రోజులేనట, నేను అన్నీ కనుక్కున్నాను. ఇది దాని ప్రభావం కాదు"

" మరి,ఏంవై ఉంటుంది.ఈ మధ్య బొటానికల్ టూర్ వెళ్ళారు అక్కడేదైనా జరిగి ఉంటుందా? "

" లేదు, ఆ టూరుకి ఈ సంవత్సరం ఇంకా వెళ్ళలేదు. మీరంటున్నది లాస్టియర్ ది "

"  ప్రాక్టకల్స్ డిసెక్షన్స్ వాటికి భయపడిందేమో చదువు అలాంటిది. కొత్త వాతావరణం, టైం  పడుతుంది. అంతేనా " అని నన్ను చూసారు.

నాకేం చెప్పాలో తెలీలేదు. నిజానికి డిసెక్షన్స్ అవీ ఇంటర్ నుంచే ఉన్నాయి. అది నాన్న మర్చిపోయారు.

"అదేం అయి ఉండదు. మొన్న రెండు సార్లు పరీక్షలు పెట్టారుట, వాటిలో మార్కులు బాగానే వచ్చాయిట. ఏదో కంటెస్ట్ లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని చెప్పింది. ఇంకేదైనా కారణం కావచ్చు. ఆ ఉత్తరాల మూలంగానా.

ఉత్తరాల మూలంగా అంటారా " నేను అక్కడ లేనట్లుగానే మాట్లాడుకుంటున్నారు . ఆ మాటలు తనలో తనే అనుకుంటూ, వెంటనే గుర్తొచ్చినట్లుగా అమ్మ నా దగ్గరికి వచ్చింది. గడ్డం పట్టుకుని మొహం ఎత్తి నా మొహంలోకి చూసింది.

" ఉత్తరాల మూలంగానా?" నా మొహంలోకి చూస్తూ అంది.

కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపాను. అది నిజం కాదని నాకు తెలుసు. అవునని చెప్పలేను. నా ఈ పరిస్థితికి మీరే కారణం , మీ మూలంగానే నాకు పిచ్చి పట్టేట్లుంది అని అనలేను.

"ఉత్తరాల మూలంగానే అని నాకనిపిస్తోంది '' అని నాన్నతో అని, నావైపు తిరిగింది.

"అలా కాల్చినందుకేనా. దానికి భయపడాల్సిందేం లేదు. ఒకవేళ కాల్చామే అనుకో,మేము మంచి పనే చేసాం. ఈ పరాయి మొగవాళ్ళ ఉత్తరాలకి నీ జీవితంతో పని లేదు. జీవితంలో వాటికి చోటు లేదు. అలాంటివి ముందు ముందు నీ వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. ఈ ఉత్తరాల మూలంగా సంసారాల్లో ఎన్నో జరగకూడనివి జరిగాయి. ఇలాంటివి ఎన్నో విన్నాం. చూసాం,సినిమాలూ, టీవీలో కథలూ. అందుకే,నీకు అలా జరగకూడదు. మేము ఏం చేసినా నీ మంచికే అని నువ్వనుకోవాలి "

అమ్మఏదో అంటోంది. వినపడడంలేదు,పెదవులు కదులుతున్నాయి. నాకేం చెప్పాలో తెలియలేదు. ఎందుకో చేతులు చల్లపడిపోతున్నాయి. గది అంతా చిన్నగా అయిపోయింది. ఎవరో గొంతు ని నొక్కేస్తున్నట్లుగా ఉంది. ఊపిరి అందడం లేదు.ఎక్కడికో ,ఏదో లోయల్లోకి వెళ్లిపోతున్నట్లుగా అనిపిస్తోంది. నాలుగువైపుల నుంచి నొక్కేస్తున్నట్లాగా ఉంది. అక్కడే ఉన్న అమ్మా నాన్న మాట్లాడుకుంటూనే ఉన్నారు. కానీ నేను విన దల్చుకోలేదు. ఎక్కడినుంచో అమ్మ మాటలు వినపడుతున్నాయి.

" ఎలా ఉంది? ఇప్పుడు పరవాలేదా?" నేనేం జవాబు ఇవ్వలేదు. ఇవ్వాలనిపించలేదు.

అమ్మ తల మీద చేయి వేసి నిమురుతోంది. నాన్న నా వీపు మీద రాస్తున్నారు.

" ఏం భయం లేదు. నీకు మేం ఉన్నాం. నీకేం కాలేదు. నువ్వు మామూలుగా అయిపోతావు కాస్సేపు కళ్ళు మూసుకుని దేవుడిని తల్చుకో " నాన్న నా దగ్గరికొచ్చి నుంచున్నారు. నన్ను మెల్లిగా కూచోపెట్టారు.

నాన్న అన్నట్లుగానే కళ్ళు మూసుకున్నాను . కాస్సేపు అయ్యాకా కళ్లు తెరిచాను. నిజంగానే భయం కాస్త తగ్గినట్లనిపించింది. కొంచెం పరవాలేదు. అమ్మా నాన్న ఆందోళనగా, ఆతృతగా చూస్తూ కనిపించారు. "ఏం జరిగింది ? రేపేమైనా పరీక్ష ఉందా? బాగా చదవలేదేమో కదా అవునా ? "

పరీక్ష ఏమీ లేదు అన్నట్టు తలని అడ్డంగా ఊపాను. వాళ్ళ మాటలకి నేనేం మాట్లాడ లేదు. కానీ నాకు ఎందుకిలా అవుతోంది.! దేనికి భయ పడుతున్నాను.!

" ఏదో యాంక్సైటీ.అంతే ఇంకేం లేదు.అంతకు మించి ఏంలేదు. రేపటికి అంతా మామూలై పోయి సద్దుకుంటుంది. ఇవాళ కాలేజీకి వెళ్ళక్కర్లేదు " అనేసారు. వాళ్ళు అనకపోయినా నేను వెళ్ళ దలుచుకోలేదు. ఇల్లు కదలాలని లేదు. గదిలోనే ఒంటరిగానే బావుంది. అందుకే ఆరోజంతా గదిలోనే బయటికి రాకుండా గడిపాను.

మర్నాడు క్లాసులున్నాయి. ప్రాక్టికల్స్ ఉన్నాయి. ఇంట్లో వాళ్ళు వెళ్తావా అని అడగలేదు. నేను కూడా వెళ్తానని అనలేదు.

" ఈ రోజు విశ్రాంతి తీసుకో. అంతా బాగా అయిపోతుంది. రేపు కాలేజీకి వెళ్ళచ్చులే "అని అన్నారు.

ఆ రోజంతా నా గదిలోనే గడిపాను.మంచం మీదే పడుకున్నాను. చదవాలని కూడా అనిపించలేదు. కవితలు రాయాలనిపించలేదు. నోట్స్ రాసుకోవాలి . జువాలజీ రికార్డ్ సబ్మిట్ చేయమన్నారు. అది చేసుకోవాలి. కానీ అది కూడా రాయాలనిపించ లేదు. ఇవన్నీ ఇదివరకూ కూడా చేసాను. అప్పడున్న ఉత్సాహం ఇప్పుడు లేదు.

ఆ మర్నాడు కూడా వెళ్ళలేదు. అమ్మ గదిలోకి వచ్చింది కానీ ఏమీ అడగలేదు. నేనుకూడా చూసీ చూడనట్లుగా కళ్ళు మూసుకుని ఉన్నాను. దగ్గరగా వచ్చి నా నుదుటి మీద చేయవేసి చూసింది.సరిగ్గా అదే సమయానికి ఫోన్ వచ్చింది. అమ్మ ఫోను అందుకోడానికి వెళ్ళింది.

"హలో" అంటూ తీసింది. అవతల నున్నది ఎవరో కానీ అమ్మ కొంచెం గట్టిగా సమాధానం ఇస్తోంది

" శృతికి కొంచెం బాగా లేదు. ఫోను వరకూ కూడా రాలేదు . అందుకని మాట్లాడదు. కాలేజీకి వచ్చినప్పుడు మాట్లాడుతుంది " అంటూ టక్కున పెట్టేసింది. తను ఏం మాట్లాడిందో నాకు వినపడింది. అయినా ఆ సంగతి అమ్మ నాతో చెప్పింది. అమ్మ జవాబిచ్చిన తీరుని బట్టి, ఆ ఫోను ప్రద్యుమ్న దగ్గరి నుంచి అయి ఉంటుంది నేను ఎందుకు రావడం లేదో కనుకుందామని ప్రద్యుమ్న ఫోన్ చేసి ఉంటాడు.

నేను డిగ్రీలోకి వచ్చాను, ఐనా నాకు స్కూల్లో పెట్టిన పాత రూల్స్ ఇప్పటికీ వర్తిస్తాయి. అప్పుడూ అంతే, నాకెవరైనా ఫోన్ చేస్తే మొగపిల్లలైతే, మాట్లాడనిచ్చేదీ కాదు. ఇప్పుడూ అంతే.

రేపు కాలేజీకి వెళ్ళినప్పుడు ప్రద్యుమ్న కనిపిస్తాడు. అడుగుతాడు. నేను సంజాయిషి ఇచ్చుకోవాలి. నేను ఇంట్లో ఎందుకున్నానో చెప్పాలి. ఏం చెప్ప గలను ? ఎలాంటి సంజాయిషీ ఇచ్చుకోగలను?

భయం వేసింది. కాలేజీలో మనుషులని చూడడానికి,వారి ఎదుట పడడానికి భయ పడు తున్నాను. ఎందుకో తెలీదు.!

అందుకే మర్నాడు కూడా వెళ్ళలేదు. అమ్మా వాళ్ళకి అనుమానం వచ్చింది. నుదురు మీద చెయ్యి

వేసి చూసింది. జ్వరం అదీ ఏం లేదు. మరి ఎందుకు మానేస్తున్నట్టూ,అని తనలో తనే అనుకుంటూ, వచ్చింది.

" పైకి బాగానే ఉన్నావు కదా. కాలేజీకి వెళ్ళడానికి ప్రయత్నించకూడదూ. నలుగురి మధ్యలో ఉంటే కొంచెం బావున్నట్లనిపిస్తుంది. వెళ్ళు.నీక్కూడా కొంచెం మార్పు " కాస్త గట్టిగానే అంది.

మళ్ళీ ఛాయిస్ లేదు. వెళ్ళమన్నారు, వెళ్ళాలి. పుస్తకాలు అవీ సద్దుకున్నాను. టైముకి తయారయ్యాను. బస్సుకోసం స్టాపులో నుంచున్నాను. కానీ ఎందుకో లోపల్నించి భయం. రోజూ ఇదే స్టాపులో నుంచుని బస్సెక్కే దానిని. అదే రోడ్డు.ఏ మార్పు లేదు, కానీ నాలోనే మార్పు. భయం అక్కడ ఉండలేక పోతున్నాను. నా పక్కన ఎవరో నుంచున్నారు. రెండు రోజుల్నించి కనపళ్ళేదు. అని అడిగింది. ఆ పలకరించింది ఎవరో  వెంటనే గుర్తుకి రాలేదు. ఎక్కడో చూసాను. కాని ఎక్కడో  తెలీడం లేదు. ఏదో కొంచెం బాగాలేదు ,అని అన్నాను. ఆమె ఇంకా ఏదో అడగ బోతూండగానే బస్సొచ్చింది. అందరూ ఎక్కడానికి ముందుకెల్ళారు. నేను అక్కడే ఉండిపోయాను. ఆమె నన్ను పిలుస్తోంది రమ్మనమని, నేను చూడనట్లు నన్ను కానట్లు ఉండిపోయాను. బస్సు వెళ్ళిపోయింది.

మరో బస్సు వచ్చింది. ఈసారి ఎక్కడానికి ముందుకెళ్ళాను. కాని ఎక్కలేదు. నా వెనకాల వాళ్ళు నన్ను పక్కకి తప్పించి,తోసి ఎక్కుతున్నారు.

నా వెనకాల ఎవరో ఉండి నన్ను  తరుముతున్నారు , ముందుకి తోస్తున్నారు. ఆ ఎవరో చూడాలంటే వెనక్కి తిరగాలి. కాని,వెనక్కి తిరగాలంటే భయం. ఓ బస్సు వెళ్ళిపోయింది. మరోటి వచ్చింది ఎక్కలేదు. ఎక్కుతూంటే తోసెస్తారేమో నన్నభయం. రోడ్డంటే భయం వేస్తోంది. బస్సంటే భయం వేస్తోంది.

ఎందుకో ఏంటో తెలీని భయం.కడుపులో ఏదో వికారం, ఇంటికి వెళ్ళిపోవాలి. అక్కడ భయం లేకుండా   ఉంటాను. ఇంట్లో ఎవరూ ఉండరు. ఎవరూ వెనక నుంచి రారు.  తరిమేయరు. తోసెయ్యరు. ఇంట్లోనే సేఫ్. అందుకే వెంటనే పరుగు పరుగున ఇంటికి వచ్చేసాను. తలుపు తీసిన అమ్మ ఆయాస పడుతున్న నన్ను చూసి కంగారు పడింది. చెమటలు,ఒళ్ళంతా తడిసి పోతోంది.

“ ఏం జరిగింది. ఒంట్లో బాగాలేదా ? అప్పుడే వచ్చేసావేంటీ? “ అంటూ అమ్మ అడుగుతూనే తలుపు తీస్తూ పక్కకి జరిగింది. నేనేం మాట్లాడ లేదు.

“  కాలేజీలో  ఏదో జరిగి ఉంటుంది, నువ్వు సరిగా మాతో చెప్పడం లేదు. అడిగితే ఏం లేదని అంటున్నావు, ఇప్పుడు కూడా అడుగుతున్నాను. ఏం లేదని బుకాయించకు. ఏం లేకపోతే కాలేజీకి ఎందుకు వెళ్ళనంటావు, చెప్పు , ఒంట్లో బావుండడం లేదా. డాక్టరు దగ్గరికెల్దామా ”

నాకు బావుందని చెప్పలేను. బాగాలేదు. అది కూడా చెప్పలేను. ఇంటికి ఎందుకు వచ్చేసానో కూడా చెప్పలేను. కానీ అమ్మ అడిగిందే అడుగుతోంది. ఏం అయింది అని ఓ పది సార్లు అడిగినట్లనిపించింది.

అమ్మమాటలకి లోపల్నించి కోపం వచ్చెస్తోంది.ఎదురుగా ఉన్న అమ్మని గట్టిగా తన్నానిపిస్తోంది “ఎన్ని సార్లు అడుగుతావ్.ఎన్ని సార్లు చెప్పాలి ” గట్టిగా అరిచాను. అమ్మ బిత్తరపోయింది.

” ఎన్ని సార్లు అడిగాను ఒక్కసారే కదా అడిగాను. ఆ అడగడం కూడా తప్పేనా. దానికంత గట్టిగా అరిచి సమాధానం ఇవ్వాలా. నీకేదో  పిచ్చి పట్టింది .”

“అవును నాకు పిచ్చి పట్టింది. చాలా! పిచ్చి పట్టింది. దెయ్యం పట్టింది. సరేనా. ఇంక వెళ్లు...”.అన్నాను గట్టిగా ఏడుస్తూ.

అమ్మ నోరు తెరుచుకుని ఉంది. ఏం మాట్లాడ లేదు. బొమ్మలా నుంచుండి పోయింది. నేను నా గదిలోకి వెళ్ళి పోయి మంచం మీద వాలిపోయాను. నేనెందుకు అమ్మమీద అరిచాను. నాకేం అయింది, అమ్మని అన్నందుకు ఫీలయ్యాను. వెంటనే అమ్మ దగ్గరికి వెళ్ళి సారీ అన్నాను. ఏంటో ఏదో అనేసాను. వెంటనే అమ్మ నన్నుదగ్గరికి తీసుకుని ,ఒక్కసారి గట్టిగా హత్తుకుంది.

కాసేపటికి అమ్మ నన్నుగదిలోకి తీసుకెళ్ళింది. “ కొంచెం పడుకో. ఏవేవో ఆలోచనలు మనసులో పెట్టుకున్నావు. అవి నిన్ను ఇలా వీక్ చేస్తున్నాయి. అందుకే నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలీడం లేదు. జరిగిన దాన్లోని మంచి మాత్రం గుర్తు చేసుకో అన్నీ బావుంటాయి ” అని దుప్పటీ సరిచేసి వెళ్ళిపోయింది.

“అలాగే “ అని అనుకుంటూ మంచం మీద వాలికళ్ళు మూసుకున్నాను.

ఎక్కడి నుంచో అమ్మా,శృతీ అంటూ పిలిచిన గొంతు వినిపించింది. నేను ఏంఅనలేదు.

ఓ పది నిమిషాలయ్యాకా అమ్మ నా దగ్గరికి వచ్చింది. పద,అంది. ఎక్కడికి అన్నట్లు చూసాను

“ గుడికి వెళ్దాం. కొంచెం బాగుంటుంది. “ అని అంది.

“ నాకేం రావాలని లేదు. నేనేం దేవుడి దగ్గరికి వెళ్ళాలని అనుకోడంలేదు. నాకేం కోరాలని లేదు. అసలు నాకు ఇల్లు కదలాలంటేనే భయంగా ఉంది” అని అన్నాను.

“ నీ పక్కనే నేనుంటాను , నీకేం భయం లేదు. భయం అని అనుకుంటే అది అలాగే ఉండిపోతుంది. భయం లేదనుకుంటే ఏ భయాలూ ఉండవు, పద,వెళ్దాం ”

నేను కదల్లేదు,

“ అదిగో ఆ భయం అదీ పోవాలనే కదా గుడికి రమ్మంటున్నది. గుడికి వెళ్తే ఓ విధమైన శాంతి. మన అంతరాత్మ తలుపులని మనమే తెరుస్తాం. మనకి ఏం కావాలో చెప్పుకుంటాం. కళ్ళు మూసుకుంటాం. ప్రార్థిస్తాం.మనల్ని మనం మర్చి పోతాం. ఇవన్నీనువ్వు కూడా ఆ దేవుడి ముందు చెయ్యి. నీ మనసుకి కాస్త,ప్రశాంతత రా తల్లీ. హాయిగా ఉంటుంది ” అంది అమ్మ లాలనగా.

చూద్దాం. అమ్మ అన్నట్లు మనసు ప్రశాంతంగా ఉంటుందేమో చూస్తాను. లేచాను. తయారవడానికి ఏం లేదు. కాలేజీకి తయారైన బట్టలు నలగ కుండా ఉన్నాయి.

ఆటో మాట్లాడింది. ఎక్కడానికి కూడా భయపడ్డాను. ఆ డ్రైవరు నన్ను కింద పడేస్తాడేమోనని. కాని అలాంటిది ఏమీ జరగలేదు. జాగ్రత్తగానే వెనక వీధిలో ఉన్న గుడికి తీసుకెళ్ళాడు. గుడి చాలా విశాలంగానే ఉంది. మనుషులు కూడా ఎక్కువ మంది లేరు,భక్తులు వచ్చే టైము కూడా కాదు. ఎందుకంటే టైము పది దాటింది. డిసెంబరు నెలేమో, ఎండ ఉన్నా గాలి కూడా ఉంది. ఉన్న నాలుగు చెట్లూ ఊగుతూ

చల్లటి గాలినిస్తోంది. అమ్మ అన్నట్లు ఆలయం పరిసరాలూ ప్రశాంతంగా ఉన్నాయి, నేను తొందరగా ఎప్పుడూ గుడికి వెళ్ళను. పండగలప్పుడు మాత్రమే వెళ్ళాను. అది కూడా చాలా చిన్నప్పుడు. పెద్దయ్యాకా చదువులో పడి వెళ్ళడమే మానేసాను.

మళ్ళీ ఇన్నేళ్ళకి గుడికి వచ్చాను. ది శివాలయం. అమ్మ వెనకాలే ప్రదక్షణాలు చేసి లోపలికి వెళ్ళి తీర్థం తీసుకుని,పూజారి ఇచ్చిన గన్నేరు పువ్వుని ,క్లిప్ తో కట్టిన జుట్టులో పెట్టాను. అక్కడ ఉన్నరావి చెట్టు చుట్టూ ఉన్న తిన్నె మీద కూచున్నాం. మేము ఏం మాట్లాడుకోలేదు.

" ఏదో అనుకుంటాం కాని ,ఈ ప్రార్థన అనేది సెల్ఫ్ సజెషన్. నిన్ను నువ్వు ఉత్తేజ పరుచు కోడానికి, కాస్త మనశ్శాంతి కోసం మనం చేసే ఓ ప్రక్రియ మాత్రమే. మానసిక సోమరులం కాకుండా దేవుడు మనకి కొండంత అండగా ఉంటాడు. మనశ్శాంతిని ఇవ్వమని దేవుడిని కోరుకో నీకంతా బాగా అయిపోవాలని. " నిశ్శబ్ధంగా అమ్మ చెప్పినవన్నీ విని తల ఊపాను..ఇంటికొచ్చాక కొంచెం సేపు బాగానే ఉంది. మళ్ళీ మామూలే.భయం చెమట్లు.

నాన్న సాయంత్రం ఇంటికొచ్చారు . అమ్మ ఏం చెప్తోందో అన్నీ వినపడుతున్నాయి. గబగబా నా దగ్గరికి వస్తూనే నుదురు మీద చేయిని వేసారు. జుట్టుని పైకి తోసారు.నా మొహంలోకి చూసారు.

" ఏమ్మా,శృతీ !ఎలా ఉంది? అసలేం జరుగుతోంది? కాలేజీనుంచి వచ్చేసావా?" అంటూ తలని నిమిరారు. ఏం చెప్పలేక ఏడవడం మొదలెట్టాను. ఆపుకోలేకపోయాను.

ఈ ఊరు వచ్చినప్పుడు ఈ కళ్ళల్లో కలలు, గుండెల్లో ఆశలూ ఉన్నాయి. కానీ ఇప్పుడు ఏం లేవు. ఎక్కడికో వెళ్ళిపోయాయి. అందనంత దూరంలో ఉన్నాయి. ఇప్పుడు మాత్రం కళ్ళల్లో నీళ్ళు, గుండెల్లో మోయలేని బరువు. నా వాళ్లని మోసం చేస్తున్నాను. అంతే కాకుండా నన్ను నేను మోసం చేసుకుంటున్నాను.

ఆ తరవాత, రోజూ కాలేజీకని బయల్దేరడం, వెంటనే భయంతో ఇంటికి వచ్చేయడం, అలా ఇంట్లో వారం రోజులున్నాను. చదువు గురించి ఆలోచించడం లేదు. తిరిగి కాలేజీకి వెళ్ళాలనిపించడం లేదు. అలా అని అమ్మకి నాన్నకి చెప్పలేదు. కానీ వెళ్ళడం లేదు. కాలేజీకి ఎప్పుడు వెళ్తావూ అని ఉదయం లేవగానే అడుగుతున్నారు. కానీ నేనేం సమాధానం ఇవ్వలేదు, వాళ్ళకి ఏం చెయ్యాలో తెలియడం లేదు.

నాన్నగారు కాలేజ్ కి వెళ్ళి మాట్లాడి వచ్చారు. అక్కడ ఏం మాట్లాడారో తెలీదు. నేను అడగ లేదు. తెలుసు కోవాలనిలేదు. నాకు వెళ్ళాలని లేనప్పుడు అడిగి లాభం ఏం ఉంది? ఏదో స్థబ్దత నన్ను చుట్టెస్తోంది. మంచం మీద ఎంత సేపని పడుకుంటాను. అందుకని చేతికొచ్చిన పుస్తకం తీసి చదవడం మొదలు పెట్టాను. ఏం చదువు తున్నానో నాకేం తెలీడంలేదు. చదివింది మర్చిపోతున్నాను. చాలా సార్లు ప్రయత్నించాను, అసలు ఏం చదువుతున్నానో నాకేం అర్థం కావడం లేదు. ఎందుకిలా అవుతోంది ?

ఎప్పటికీ ఇంతేనా? ఇలాగే మొద్దులా ఉండిపోతానా ? ఏం చెయ్యాలో తెలీడంలేదు. కోపం వచ్చెస్తోంది ,నా మీద నాకే కోపం. ఏం చేయాలో తోచక అటూ ఇటూ చూసాను. అంతే , చదవలేక పోతున్నానన్న కోపంతో చేతిలో ఉన్న పుస్తకాన్ని విసిరేసాను. ఆ పుస్తకం అక్కడ టేబుల్ మీద ఉన్న కాఫీ కప్పు, మంచినీళ్ళ సీసా,మీద పడింది. వెంటనే ఆ రెండూ కూడా ఒక్కసారి కింద భళ్ళుమని శబ్ధం చేస్తూ పడ్డాయి. ఆశబ్ధానికి ఒక్కసారి భయ పడ్డాను..

వెంటనే కంగారు పడుతూ అమ్మ గదిలోకివచ్చింది " ఏంటీ శబ్ధం? ఏం పడిపోయింది? " అని జరిగింది తెలుసుకోడానికి అమ్మ గదిలోకి వచ్చింది. వస్తూనే నన్నూ,కింద పడిన వాటినిచూసింది.

" అహఁ ఏం లేదు. టేబుల్ తుడుస్తూంటే ఆ రెండూ కింద పడ్డాయి " అని అన్నాను. ఆ అనడంలో భయం అమ్మ కనిపెట్టింది. వెంటనే నా దగ్గరికి వచ్చింది.

" ఏం పర్వాలేదు. కప్పు విరిగిందని భయపడుతున్నావా? ఏం పరవాలేదు.కంగారు పడకు , లోపల ఇంకా చాలా ఉన్నాయిలే" అని అనునయంగా మాట్లాడింది.

అమ్మ ఓ సారి నన్ను చూసి ,వెళ్ళిపోయింది. అమ్మ వెళ్ళిపోయినా భయం ఎక్కువైంది . ఆ భయం రాను రానూ నొప్పిగా మారింది. భరించలేని నొప్పి. అర్థం లేని భయం, అర్థం లేని ఆలోచనలు, నేను డిప్రెషన్ లోకి వెళ్తున్నాననిపిస్తోంది. డిప్రెషన్ అంటే ఇదా? ఇలాగే ప్రవర్తిస్తారా ? అమ్మ అన్నట్లు నాకు పిచ్చా,ఇది ఓ రకమైన పిచ్చా? అంటే. నేను. ఆలోచించలేను. నాకు పిచ్చి అన్న విషయాన్నినేను ఊహించలేను. జీర్ణించుకోలేక పోతున్నాను. కత్తి తీసుకున్నాను. నన్ను నేను బాధ పెట్టుకోవాలి. శిక్షించుకోవాలి, అప్పటికిగాని,ఈ బాధలు తగ్గవు.

కత్తి తీసాను. మణికట్టు దగ్గరగా పెట్టి కోసుకోబోయాను. ఇక్కడ కోస్కుంటే రక్తం కింద పడుతుంది. కింద అంతా అసహ్యంగా అవుతుంది. బాగా ఆలోచించి బాత్రూం లోకి వెళ్ళాను. మణికట్టు దగ్గర కోసుకోబోయాను. ఎలా వచ్చారో ఎప్పుడు వచ్చారో నాన్న వచ్చి నా చేయి పట్టుకున్నారు. నాన్న వస్తారని అనుకోలేదు. కాని అప్పటికే కొంచెం గీసుకుని పోయింది. గాయం అయిన దగ్గరనుంచి రక్తం కారుతోంది. దాన్ని చూసి నాన్న షాక్ తిన్నారు..

" ఆఁ ఆఁ. అదేంటీ ?ఏంటిది? ఏంచేస్తున్నావ్? " అన్నారు గట్టిగా. ఆ గొంతులో బాధ స్పష్టంగా తెలుస్తోంది. ఆ మాటలు విన్న వెంటనే అమ్మకూడా పరుగున బాత్రూం లోకి వచ్చింది. కనిపిస్తున్న దృశ్యం చూసి నోరు తెరిచింది

"అయ్యో.అయ్యో. ఇదేంటీ ? ఆ రక్తం ఏంటీ ? ఈ కోత ఏంటే ? చేతిలో ఆ కత్తేంటీ, నీకేం అయిది?.ఏమైనా పిచ్చా వెర్రా !" అంటూ అమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

నాకు ఏం చేయాలో తెలీలేదు. తప్పు చేసినట్లుగా తలొంచుకని నేను అలాగే బాత్రూంలో కూచుండి పోయాను. కదల్లేదు. వెర్రిగా నేల వైపు చూస్తూండిపోయాను. అమ్మ మెల్లిగా నన్ను లేవదీసింది. నేను చిన్నపిల్లలా ,లేచి వాళ్ళతో గదిలోకి వెళ్ళాను. నాన్న దూదితో మణికట్టు కడిగి శుభ్రం చేసి మందు రాసారు.

"నాలుగురోజుల క్రితం కూడా ఇలాంటిదే ఏదో చేసినట్టుంది. ఇలాగే మణికట్టు మీద గీరలున్నాయి. ఏంటని అడిగాను. ఏదో చెప్పింది.అయితే ఆ రోజున కూడా ఇలా కోసుకుందా? అసలు ఐడియా కూడా రాలేదు, ఇది ఇలా కూడా చేయగలదని. ఏళ్ళు వెడుతున్నకొద్దీ మొద్దులా తయారవుతోంది. ఇది ఏంటిల్లా తయారయింది " అని అమ్మ అంటూంటే నన్ను కానట్టు ఉన్నాను.

" పడుకో. భయంగా ఉంటే మా గదిలో పడుకో. మేము ఇక్కడే ఉంటాం "

నా గురించి నిజంగానే బాధ పడుతున్నారు. నేను వీళ్ళని తప్పుగా అర్థంచేసుకున్నాను. వీళ్ళు నా శతృవులనుకున్నాను. కానీ కాదు. వాళ్ళు నా దగ్గరికి వద్దామని ప్రయత్నిస్తున్నారు కానీ నేనే దూరం జరిగిపోతున్నాను. ఓ గూడులో ఉండిపోతున్నాను. నన్ను నేను ఓ ఖైదీగా చేసుకున్నాను. అందులోంచి బయటికి రావడానికి ఇష్టపడడంలేదు. ఎవరితో మాట్లాడడానికి ఇష్టపడడంలేదు. ఒంటరితనాన్ని కోరుకుంటున్నాను. అలాగే మంచం మీద వాలిపోయాను. ఎంత సేపున్నానో తెలీదు. అమ్మ వచ్చింది. నా నుదురు మీద చేయి వేసింది. ఆ చేతిని అలాగే పైకి జరిపి జుట్టు సవరించింది.

" లే,కొంచెం అన్నం తిను.నాన్నగారు కూచుని ఉన్నారు"

అన్నం తినే టైమయిందా. అంత సేపు పడుకున్నానా నాకసలు తినాలని లేదు. తినకపోతే బాధ పడతారు. వెళ్ళి నాన్న గారి పక్కన కూచున్నాను. వాళ్ళ సంతృప్తి కోసం తింటున్నాను.

అమ్మ పక్కన కూచుని కొసరి కొసరి తినిపిస్తోంది. బలవంతంగా తింటున్నాను

ఇలా ఎన్నాళ్ళు ?ఎందుకిలా చేస్తోంది ? పోనీ ఏదైనా డాక్టరు దగ్గరికి వెళ్దామంటే,ఏం చెప్తాం ?ఏ రోగం ఉందని తీసుకెళ్తాం? ప్రాబ్లెం ఏంటీ అంటే ఏం చెప్తాం? అసలు ఇది ఏంటో మనకి ఎవరు చెప్తారు ?

నేను వాళ్ళిద్దరిని చూస్తున్నాను. నిజమే. నాకు ఏంటి? ఏ రోగం ఉంది ? ఏం తెలీడం లేదు? ఎవరు చెప్తారు?

"సైకియట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే బావుంటుంది" అని నాన్నగారు తిరిగి అన్నారు.

" అంటే శృతికి" అమ్మ ఆపేసింది. ఆ తర్వాత మాటని అనలేక పోయింది.

"అదేం కాదు. కానీ ఎందుకైనా మంచిది, ఓ సారి సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్తే బావుంటుందని నాకనిపిస్తోంది. ఎందుకంటే శృతి చేస్తున్నది ,నార్మల్ గా లేదు. ఆ కోపం,అరవడాలూ,ఏడవడాలు, చేయి కోసుకోడాలూ ఇవి మామూలు వాళ్ళు ఎవరూ చేయరు" అని అన్నారు

"అందరికీ తెలిస్తే ఏ౦వనుకుంటారూ ? కొన్నిరోజులు పోతే అదే సద్దుకుంటుంది "

"ఎవరికో తెలుస్తుందని దాన్ని ఇలా నరకంలో ఉంచెస్తామా! చెప్పు,ఇప్పుడది కాలేజీ మానేసింది . ఇంట్లో ఉట్టిగా కూచుంటోంది. ఇలా మామూలుగా పిల్లలెవరూ చెయ్యరు. ఒక్కొక్క సారి దాని పిచ్చి కోపం చూస్తే అర్థం అవుతోంది. దానికి ఏదో మెంటల్ ప్రాబ్లెం ఉందని. ఎంతో యాక్టివ్ గా ఉండేది. ఇప్పుడ అలా లేదు అంటే ఏదో లోపం అనే అనిస్తుంది. మనం ఓ డాక్టరు దగ్గరికి వెళ్ళాల్సిందే,నువ్వేం అడ్డు చెప్పకు."

అమ్మ ఏడుస్తోంది.నాన్న ఏదో అంటున్నారు.

వాళ్ళ దృష్టిలో నేను నార్మల్ గా లేను, నన్ను ఓ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాని కదా వాళ్ళు అను కుంటున్నారు. అంటే డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళే స్థితిలో ఉన్నానంటే నేను ఓ పేషెంటుని. ఆ సంగతి నన్ను అడగాలి గదా. ఏంటమ్మా ఏం అవుతోంది, ఓసారి డాక్టరు దగ్గరికి నిన్ను తీసుకెళ్తాం. వస్తావా ,మనం డాక్టరు దగ్గరికి వెళ్ళున్నాం అని అనాలి కదా. అదేం చెయ్యలేదు.నన్నుఏమీ అడగలేదు. నాకు కోపం వస్తోంది.

ఎప్పుడూ వాళ్ళ ఇష్టమేనా. నాకు ఇష్టాయిష్టాలుండవా ఉంటాయి కానీ అడగరు. నేను వాళ్ళు చూపించిన ఆ డాక్టరు దగ్గరికి వెళ్ళను. ఏంచేస్తారో చూస్తాను. అని కోపంగా మనసులోనే అనుకున్నాను.

" డాక్టరు అంటే ఎవరున్నారు ? మీకు తెలిసిన వాళ్ళు ఎవరైనా ఉన్నారా ? ఎక్కడైనా బోర్డు చూసారా ? విన్నారా? " అంది అమ్మ ఏడుపు ఆపి.

" లేదు . ఇంతవరకూ అలాంటి బోర్డులని ఎక్కడా చూడలేదు. మనకి ఆ అవసరం కూడా రాలేదు. పక్కవీధిలో ఓ మల్టీ స్పాలిటీ హాస్పిటల్ ఉంది. అక్కడ ఎవరైనా ఉంటారేమో చూస్తాను. లేకపోతే సైకియట్రిస్ట్ ఎక్కడ ఉంటారో చెప్తారు. కనుకొస్తాను " అంటూ బయటికి వెళ్ళారు. ఓ పావుగంట తరవాత వచ్చారు.

" సైకియాట్రిస్ట్ గురించి కనుకున్నాను.వాళ్ళ పానెల్ లో ఓ సైకియాట్రిస్ట్ ఉన్నారుట. ఆవిడ పేరు శిఖా ఆ డాక్టరు శిఖా ఈ ఆసుపత్రికి రోజూ మధ్యాహ్నం పన్నెడు తరవాత వస్తారట. వచ్చి, ఓ గంట ఉంటారుట. అవసరం అయినప్పుడు కూడా టైముతో నిమిత్తం లేకుండా వస్తారుట, ఆవిడకో క్లినిక్ ఉందిట. ఆ క్లినిక్ కి పగలు మాత్రమే వస్తారుట, ఆ క్లినిక్ మనకి దగ్గరంటే దగ్గర కాదు కానీ, ఓ పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆవిడ ఫోన్ నంబరు అడిగి తీసుకునివచ్చాను. అపాయింట్ మెంట్ తీసుకుందాం. " అని వెంటనే ఆ డాక్టరుకి ఫోన్ చేసి మాట్లాడి అపాయింట్ మెంట్ తీసుకున్నారు.

" డాక్టరు గారు పన్నెండు గంటల వరకే ఉంటారుట, మనకి మనం తొమ్మిది గంటలకే బయల్దేరి వెళ్దాం. ఉదయం పది గంటలకి అపాయింట్ మెంటు ఇచ్చారు. ఆ సమయానికి రమ్మన్నారు "

" అయితే నేను ముందుగానే వంట అదీ చేసేస్తాను. తిరిగి వచ్చేసరికి ఎంత టైమైనా పరవాలేదు. మనం టిఫిన్ చేసి వెళ్దాం. " అంటూ శృతీని చూసింది.

జరుగుతున్నది నా విషయం కాదన్నట్లుగా టీవి చూస్తూ కూచున్నాను కళ్ళు ఆర్పకుండా వింటున్నాడు మానవ్. శృతిని ఆశ్చర్యంగా చూస్తూ తినడం మానేసాడు. ప్లేటులో పెట్టుకున్నవి అలాగే ఉన్నాయి. ఈమె జీవితంలో ఇంత భయంకరమైన గతం ఉందా? అదే అన్నాడు ఆమెతో.

" ఇంతకన్నా భయంకరమైనవి జరిగాయి. ఇంకా ఉన్నాయి. వింటారా? ఆపెయనా "

" ఆపద్దు. ఇంతవరకూ వచ్చాకా ఆపెస్తాననకండి. మీరు ఎలా నార్మల్ అయ్యారో తెలుసు కోవాలి. అయితే ఒక్కనిమిషం. వేరే ప్లేటులో మనకి వేరే పదార్థాలు వేసి తీసుకొస్తాను " అంటూ లేచాడు.

అలాగే అన్నట్లుగా తల ఊపి నవ్వింది. రెండు ప్లేట్లల్లో పెరుగు వడలు వేసి తీసుకొచ్చాడు. ఓ ప్లేటు ఆమె ముందుంచి చెప్పండి అన్నట్లు శృతిని చూసాడు. ఆమె అర్థం చేసుకుని మొదలు పెట్టింది

**“ఆ మర్నాడు** వాళ్ళతో రానని గొడవ పెట్టాను. ఏడ్చాను.లాభం లేకపోయింది. నాలుగు సార్లు బతిమాలించుకున్నాకా వాళ్ళతో వస్తానన్నాను. కానీ కోపంగానే ఉన్నాను. పది గంటలకి ముగ్గురం డాక్టరు క్లినిక్ కి వెళ్ళాం. బిజీగా ఉన్న రోడ్లో ఓ నాలుగు అంతస్థుల భవనం లో ఆమె క్లినిక్ ఉంది. కింద అన్నీ దుకాణాలు అవి తెరిచీ ఉన్నాయి. పైన అన్నీవరసగా డాక్టర్ల క్లినిక్ లు. మెడికల్ షాపులు ఉన్నాయి అందులో ఒకటి డాక్టర్ శిఖా క్లినిక్ . అది ఓ మల్గీ.దాని షట్టర్ పూర్తిగా పైకి ఎత్తీ ఉండడంతో ఎంట్రెన్స్ వెడల్పు గా ఉంది. ముందు అడ్డుగా ఓ చెక్క పార్టిషన్ ఉంది. ఓ మనిషి వెళ్ళేంత దారి ఉంది,

లోపలికి వెళ్ళాం. అది ఓ పెద్ద గది. దాని మధ్యలో పార్టిషన్ లాగా నీలి రంగు తెర ఉంది. కానీ అది ఓ పక్కకి లాగేసి ఉంది. అందుకని లోపల ఏం జరుగుతోందో బాగా కనపిస్తోంది.ఓ చేత్తో ఫోన్ లో మాట్లాడుతూ, మరో చేత్తో ఏదో రాస్తూన్న లేడీ డాక్టరు కనిపించారు.ఆవిడ మమ్మల్ని చూసి, కూచో మన్నట్టు తల ఊపుతూ చేత్తో సైగ చేసింది.. ఓ పక్కకి చూసాం. గోడకి వైపున వరసగా నాలుగు తెల్ల ప్లాస్టిక్ కుర్చీలున్నాయి. ఓ మూల టీపాయ్ ,దానిమీద రెండు పేపర్లున్నాయి. దంతం రంగు గోడల మీద అందంగా ఉన్న పెయిటంగ్ లున్నాయి. పైన ఫాన్ మెల్లిగా తిరుగుతోంది. చాలా నీట్ గా ఉన్న క్లినిక్ అది.

మేము కూచున్న ఓ ఐదు నిమిషాలకి, ఫోన్ పెట్టేసి, తెర ని పూర్తిగా లాగి వేసేసింది. మరో రెండు నిమిషాలకి వెంటనే తెరని పక్కకి కొంచెం జరిపి,మళ్ళీ ఆమె లోపలికి వెళ్ళింది. మరో ఐదు నిమిషాలు అయ్యాకా తెర పక్క నుంచి బయటికి వచ్చి, రమ్మన్నట్టుగా తలఊపి. తన టేబుల్ దగ్గరికి వెళ్తూ, మమ్మల్ని పలకరింపుగా చిన్న నవ్వు నవ్వింది.

మేము లోపలికి వెళ్ళాం. కూచోమంది. అందరం కూచున్నాం . ఆమె పేరు డా.శిఖా చోప్రా. ఆ పేరు పక్కనే ఓ రెండు డిగ్రీలు ఉన్న ఓ చెక్కముక్క ఆటేబుల్ మీద ఓ పక్కగా ఉంది. టేబుల్ మీద ఉన్న గాడు పలక కింద ఏవో రెండు ఫొటోలున్నాయి.ఆమె సన్నగా చిన్నగా, తెల్లగా, కత్తిరించిన నల్లటి జుట్టుతో చక్కగా, చెదరని నవ్వుతో మమ్మల్నే చూస్తోంది.

మేము అందరం కూచోగానే నవ్వుతూ పలకరించింది. అలా పలకరించడం ఆమె వృత్తి. అది ఆమె ప్రొఫెషన్. ఆ నవ్వు,ఆ మాటల్లోని మెత్తదనం,మంచిదనం అంతా బూటకం, పై పూత నాటకం. ఈ సంగతి నాకు తెలుసు. అందుకే ఏం అనలేదు. మౌనంగా ఉన్నాను.

నాతో ఏదో మాట్లాడింది . కానీ నేను జవాబివ్వలేదు. అయినా ఆమె నవ్వుతూనే ఉంది.

“ముందు పేరెంట్స్ గా మీరు మీ అమ్మాయితో ఎలా ఉంటారో నాకు తెలియాలి. ఆ తరవాత దానిపై మీకు కొన్ని విషయాలు చెప్పాలి, మిమ్మల్ని కొన్ని విషయాలు అడగాలి. ఏదీ దాచకుండా అన్నీ చెప్పండి ” నాన్న ఆశ్చర్యంగా ,కొంచెం ఆందోళనగా చూసారు.

అమ్మ భయంగా చూసింది. నాన్న కూడా ఇంచు మించు అలాగే ఉన్నారు. ఇద్దరూ నా వైపు చూసారు. అది డాక్టర్ గమనించారు.

“శృతీ బయట కూచో ” అని ఆమె అన్నారు. నేను బయటకి వెళ్ళాను.

ఆ డాక్టరు వాళ్ళని ఏవో అడుగుతారు. నాకు తెలుసు వాళ్ళు అన్నీ అబద్దాలు చెప్తారు. నన్ను ఎంతో బాగా చూసుకుంటున్నామనే చెప్తారు. వాళ్ళ తప్పు ఏం లేదు అన్నట్లుగా జవాబులిస్తారు. వాళ్ళ మాటలు నమ్మకండి అనాలి.

ఓ పది నిమిషాలయ్యాకా నన్ను లోపలికి రమ్మన్నారు. నేను వెళ్ళి కూచున్నాను. ఆమె ఏం అడిగిందో తెలీదు కానీ చాలా సీరియస్ గా ఉన్నారు అమ్మ నాన్నగారు.

" ముందు కొన్ని ప్రశ్నలుగా అడుగు తాను. నిజాయితితో జవాబులివ్వండి " అని అమ్మని చూసింది.

నేను అమ్మనే చూస్తున్నాను. ఎటువంటి జవాబులు ఆమె ఇస్తుందో, అమ్మ నా వైపు చూసింది. అది ఆ డాక్టరు అర్థం చేసుకున్నట్టుంది.

"ఓ కే, మీరు చెప్పద్దు. ఇప్పుడు మీకు ఓ పేపరిస్తాను , మీరు నిజాయితిగా దానికి జవాబులిస్తే నాకు అర్థం అవుతుంది. ఇంట్లో అమ్మాయి పట్ల మీ ప్రవర్తన ఎలా ఉంటుందో నాకు తెలుస్తుంది " అంటూ ఆవిడ ఇద్దరికీ చేరో కాగితం ఇచ్చింది. నేను మౌనంగా వాళ్ళనే చూస్తున్నాను.

నా గురించి వాళ్లని అడగడం ఏంటీ ? అసలు మా వాళ్ళ గురించి నన్ను అడగాలి. నన్ను చెప్పమంటే బావుంటుంది. నాతో వాళ్ళెలా ఉంటారో నేను చెప్తాను. ఇంట్లో ఎలా ఉంటారో , వాళ్ళేం చేస్తారో మీకు తెలీదు. డాక్టరు గారూ వాళ్ళని రాయమనద్దు. వాళ్ళ నోటితోనే చెప్పించండి, నేను వినాలి.

నేను అన్నం తింటున్నప్పుడు కూడా సలహాలు ఇవ్వడం మానెయ్యరు. నేనేం చెయ్యాలో , ఎంత సేపు చదవాలో, ఏ సబ్జెక్ట్ కి ఎంత టైము కేటాయించాలో, ప్రిపరేషన్ ఎలా ఉండాలో, ఏం చేస్తే మార్కులు ఎక్కువ వస్తాయో ఇవే చెప్తూంటారు. నేను కనపడితే చాలు, ఇదే,నాతో మాట్లాడడానికి వేరే సబ్జెక్ట్ ఏం ఉండదు. ఎంతో కోపం వచ్చేది . అయినా ఎంతో ఒబీడియెంట్ గా ,అన్నీ అలాగే చేసాను. అది నాకెంత విసుగుని ,చిరాకుని తెప్పిస్తుందో వాళ్ళకి తెలీదు. చెప్పిందే చెప్తారు. ఒక్కోసారి కోపం కూడా వచ్చేది. అబ్బా నాకు తెలుసు మీరు అన్ని సార్లు చెప్పకండి, అని అనాలనిపిస్తుంది కానీ అనలేదు. ఒక్క మార్కు తగ్గినా అమ్మ, ఎన్ని అనేదో, అవి తిట్లు కాదు. కాని ఇంకా ఎక్కువ సేపు చదవాలి, అలా అయితేనే నీకు మెడిసిన్ లో సీటు వస్తుంది. లేకపోతే. ఏ బిఎస్సీ లో నో చేరాలి. ఒక్కోసారి నా చదువు విషయమై ఇద్దరూ వాదించుకునే వారు.

ఆఫీసు నుంచి వస్తూనే , నాన్న గారు రాగానే వేసే మొదటి ప్రశ్న, రేపు ఏదైనా పరీక్ష ఉందా, ఉంటే టిఫిన్ తినేసి, కాస్సేపు రెస్ట్ తీసుకుని, ప్రిపేర్ అయిపో , అది అయిపోతే , ఎంసెట్ మోడల్ పేపరు ప్రాక్టీసు చెయ్యి. స్టాప్ క్లాక్ దగ్గర పెట్టుకో, పర్ఫెక్ట్ గా ఉండాలి . ఇలా ఉంటుంది మా ఇంట్లో మామధ్య సంభాషణలు, ఇరవై నాలుగ్గంటలూ చదువు, మార్కులూ ఇది నా నేపథ్యం. నా కన్నా నా చదువు మీదే ఎక్కువ ఇష్టం. ఈ అతి ప్రేమ అతి శ్రద్ధ, నాకేం ఇష్టం లేదు. ఇవన్నీ నన్నడిగితే చెప్పేదాన్ని. నన్ను రాయమంటే రాసేదాన్ని.

వాళ్ళ మీద నాకు అనుమానమే, ఉన్నదున్నట్టుగా జరిగింది జరిగినట్లుగా వాళ్ళు రాస్తారన్న నమ్మకం లేదు. రాయరు, వాళ్ళ కోణంలోంచి చూస్తూ రాస్తారు. నన్ను రాయమంటే బావుంటుంది.

ఓ ఐదు నిమిషాల్లో ఇద్దరూ రాసి ఇచ్చేసారు. ఆవిడ వాటిని ఓసారి చూసి ఓ పక్కగా ఉంచింది. అమ్మానాన్నగారు ఆమెనే చూస్తున్నారు, ఏం చెప్తారో అని.వాళ్ళిద్దరిని డాక్టరు గారు చూసారు.

మధ్య మధ్యలో నాన్న, ఆమెకి నా గురించి,ఈ మధ్య కాలంలో జరిగినవి అన్నీ, రెండు సార్లు కత్తితో కోసుకోడం, ఏడవడం, అదీ ఒక దాని తర్వాత ఒకటి చెప్తున్నారు. కానీ అన్నీ చెప్పలేదు. ముఖ్యంగా పదో క్లాసులో ఉన్నప్పటి సంగతి ,వాళ్ళు చేసినది చెప్పలేదు . ఒకవేళ నన్నడిగితే నేను చెప్తానా, బహుశా చెప్పక పోవచ్చు. డాక్టరు ముందు నా వాళ్ళని నేను డిగ్రేడ్ చేయలేను. జరిగిన దాన్నివాళ్ళు ఓ విధంగా, నేనో విధంగా చెప్పం.

ఓ రెండు నిమిషాలయ్యాకా డాక్టరు నాన్నవైపు చూసింది, తలని కదిలించింది.

“నేను శృతితో కొంచెం పర్సనల్ గా మాట్లాడుతాను. మీరు కాస్త బయటికి వెళ్ళి కూచోండి. అని నెమ్మదిగా అంది ” ఆమె అలా అనగానే అమ్మా నాన్న బయటికి వెళ్ళిపోయారు.

“నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను.కి అడుగుతాను,సమాధానం చెప్తావా....”.ఆమె అదే శాంత స్వరంతో అంది.

తలఊపాను.

“రాత్రి లేట్ గా పడుకుంటావా ? ” అసలు నిద్రే పోను అయినా నీకెందుకూ అని అందామనుకున్నాను,

కాని అనలేదు. “అప్పుడప్పుడు ” ఆమె మొహం చూడడానికి ఇష్టపడలేదు.

అక్కడితో ఆగలేదు. అన్నం సరిగా తింటావా. ఏ కూరలిష్టం. ఏది ఎక్కువ ఇష్టం. పాత జీవితం,ఏదీ వదల్లేదు. ఎన్నో అడిగింది. అన్నింటికి సమాధానంగా చిన్న చిన్న పదాలు ఇస్తూ వచ్చాను.

“ఎవర్నైనా ప్రేమించావా ?“ ఉలిక్కి పడ్డాను.

అది ప్రేమో కాదో తెలీదు కాని వంశీ, ఆర్నవ్, ఇప్పుడు ప్రద్యుమ్న. ఈ ముగ్గురూ నాజీవితంలో పదో క్లాసు,డిగ్రీలో నాకు దగ్గరగా వచ్చిన వాళ్ళు. ఇప్పుడు వంశీ ఐఐటీ చెన్నై లో ఉన్నాడు ,ఆర్నవ్ ఈ లోకంలోనే లేడు. ప్రద్యుమ్నకి నా కన్నా, నా కవితలు సాహిత్య పరిజ్ఞానం అంటే ఇష్టం. కానీ ఇవన్నీ ప్రేమ లోకి కావు. ఒకవేళ వచ్చినా ఆమెకి ఎందుకు చెప్తాను ? అబద్ధం చెప్పాలి. ఆమెకి నా స్నేహాల గురించి ఎందుకు చెప్పాలి ? ఒక వేళ చెప్తే, ఆమె ఏం చేస్తుంది ?ముందు అమ్మా వాళ్ళకి చెప్తుంది. వాళ్ళు నన్ను నిలబెట్టి, మళ్ళీ ఇంట్లో పెద్ద సినిమా తీస్తారు. ఇవన్నీ విన్నాకా . సలహా ఇస్తుందా?ఈ క్షణాన బాగానే ఉంటుంది.ఇంటి కెళ్ళాక పని చేస్తుందా?

అందుకే “ లేదు “అన్నాను.

“కొన్ని ప్రశ్నలు అడుగుతాను, సూటిగా సమాధానాలు ఇవ్వాలి ”

తల ఊపాను. ఆమె ఏదో అడుగుతోంది . నేను ఏం చెప్తున్నానో నాకు తెలీదు.

కానీ నా జవాబులన్నింటికీ ప్రశంసా పూర్వకంగా చూస్తోంది. బాగా చెప్పావ్ అన్నట్లు చూస్తోంది.

పైగా ఆమె స్నేహ పూర్వకంగా నవ్వింది. కాని నేను నవ్వలేదు.పైగా కోపం వస్తోంది. చేతిలో ఉన్నదానితో ఆమె మోహాన్ని కొట్టాలనిపించింది.

ఆమె ఓ సారి నామొహం వైపు చూసింది. ఇంక చాలు.అంది ఆమె. నేను నవ్వాను.హమ్మయ్య అయిపోయింది. సంతోషం. చాలా రోజుల తరవాత నవ్వాను.

ఓ పది నిమిషాల తరవాత,బయట కూచున్న అమ్మా నాన్నని లోపలికి పిలిచింది. వాళ్ళు చాలా ఆతృతగా డాక్టరునే చూస్తున్నారు. ఆమె చెప్తున్నదంతా శ్రద్ధగా వింటూ అలాగా అన్నట్లుగా చూస్తున్నారు. వాళ్ళ మొహాల్లో కృతజ్ఞత కనిపిస్తోంది.

“మీ అమ్మాయిని స్టడీ చేసాను. అది పేరెంటల్ అబ్సెషన్స్, మొదటినుంచి మీ ప్రెషర్ చాలా ఉన్నట్టనిపిస్తోంది. అందుకే ఈ విధంగా ఉంది. మీరు ఆమెని ఏ విషయంలో కూడా ఫోర్సు చెయ్యకండి. ఆమెకి ఇష్టం లేని పనులు చేయించకండి. అంతే. ఆమె ప్రస్తుతం డిప్రెషన్ లో ఉంది. సూసైడ్ చేసుకోడానికి ప్రయత్నించిందని అన్నారు. ఆ టెండెన్సీ కూడా ఉన్నట్టుగా ఉంది. అదంతా డిప్రెషన్ మూలంగానే. దీనికి మందులు మొదలు పెడదాం. ఏం పరవాలేదు. ఇంకా ఎక్కువ అవకుండా నేను ప్రయత్నిస్తాను ” అని ఆమె తల ఓ పక్కకి వంచి ,ప్రిస్క్రిప్షన్ రాసి నాన్నగారి చేతికిచ్చింది.

దాన్ని ఓ అపూర్వ,అమూల్యమైన రత్నంలా. గుళ్ళోపూజారి ఇచ్చిన దేవుడి ప్రసాదంలా ఎంతో భక్తితో అందుకున్నారు. వాళ్ళ కళ్ళల్లో కృతజ్ఞత,స్పష్టంగా కనిపిస్తోంది.

“ తగ్గి పోతుందా?“ ఆశగా అమ్మఅడిగింది.

ఆ ప్రశ్న కన్నాఎందుకొచ్చిందీ అని అమ్మ అడిగితే బావుంటుంది. దానికి సమాధానం,మీరే మీమూలంగానే అని డాక్టరు అంటుంది. కానీ అమ్మ అడగలేదు. కాని ఆవిడ అన్న పేరెంటల్ అబ్సెషన్స్ అన్నదాని అర్థం అదే. దాని అర్థం అమ్మకి తెలిసిందో లేదో ! ఈ ఒత్తిడి అన్నది కూడా వినిపించుకుని ఉండదు. ఆమె అన్నవి సరిగా విని ఉంటే నేనిల్లా అవడానికి కారణం వాళ్ళే అని అర్థం అవుతుంది.

“ ఈ మందులు డిప్రెషన్ కి, ఇవి వాడితే ఆమె మూడ్ ని తగ్గించచ్చు. అది తగ్గితే ఆ కోపం, అరవడం ఏడవడం అవీ తగ్గచ్చు. ఓ పదిహేను రోజుల తరవాత అమ్మాయిని తీసుకురండి ” ఇంక వెళ్ళచ్చు అన్న ట్లుగా తల ఊపింది. బయటికి వచ్చాక నాకు చాలా అసంతృప్తిగా ఉంది. ఆమె సరిగా మాట్లాడ లేదనిపించింది. కమర్షియల్ గా అనిపించింది. ఓడాక్టరు పేషెంటు మధ్య ఉండాల్సిన ఆత్మీయత లేదు..

మా వాళ్ళు ఎంత డబ్బిచ్చారో నాకు తెలీదు.నా ఎదురుగా మాట్లాడు కోలేదు.మందులు మెడికల్ షాపులో కొన్నారు.

“ నీకేం కాదమ్మా,కొన్నిరోజుల్లో నీకు బాగా అయిపోతుంది.నువ్వు మామూలుగా అయిపోతావు. అదే మాట ఆవిడ కూడా చెప్పారు కదా. నువ్వు విన్నావు కదా “ వాళ్ళ గొంతులోని మెత్తదనానికి మళ్ళీ ఏడుపొచ్చింది. ఎందుకో తెలీదు కానీ ఇంటికి వెళ్ళే వరకూ వెక్కి వెక్కి ఏడుస్తూనే ఉన్నాను.

ఇంటికి వెళ్ళగానే నాన్న ప్రిస్క్రిప్షన్ చూసి, నేను వేసుకోవాల్సిన మందులిచ్చారు. వేసుకున్నాను. కొంచెం పని చేసినట్లయింది. నిద్ర వచ్చింది. పడుకున్నాను. అమ్మా వాళ్ళు కాస్త కుదుట పడ్డారు. టాబ్లెట్లు వేసుకుంటున్నాను. అవి దేనికో తెలీదు,కాని,అమ్మా వాళ్ళ కోసం వేసుకుంటున్నాను.

ఇది వరకూ అయితే ఆ టాబ్లెట్లు దేనికీ అన్న ఇంట్రెస్ట్ ఉండేది. దాన్లో ఉండే లీఫ్ లెట్ ని తీసుకుని,అందులో ఉన్నదంతా చదివేదాన్ని. అది ఏం మాత్రో,దేనికిచ్చారో,ఎలా పని చేస్తుందో. ఇండికేషన్స్, సైడ్ ఎఫెక్ట్స్ ఏంటీ, దానిలోని యాక్టివ్ కాన్స్ టిట్యుయెంట్స్,ఇంగ్రిడియెంట్స్,

ఫార్మకోపియా, ఎప్పుడు తయారు చేసారో,ఎప్పటి లోపుగా వాడాలో,ఆఖరికి ఏ కంపెనీ తయారు చేసిందో కూడా చూసేదాన్ని.ఇవన్నీ చూస్తుంటే నేను ఓ డాక్టరైపోయినట్లు ఫీలైపోయేదాన్ని. సైన్సు స్టూడెంట్ ని కాబోయే డాక్టర్ని,ఇవన్నీ తప్పకుండా తెలుసుకోవాలి అని అనుకునే దాన్ని. ఇప్పుడు అదేంటో ఏమీ చూడడం లేదు..

మర్నాడు పొద్దున్న నాన్న టాబ్లెట్, అమ్మ మంచినీళ్ళు పట్టుకుని రెడీగా ఉన్నారు.

“ఈ టాబ్లెట్లు వేసుకుంటే నాకు మత్తుగా ఉంటోంది ” అని అన్నాను.

“మంచిదే ఇన్ని రోజులూ నిద్ర సరిగా లేకనే కదా నీకు ఈ మానసిక సమస్య ”

“కానీ పొద్దున్న నిద్ర లేచాకా కూడా ఆ మత్తు అలాగే ఉంటోంది ”

“ఇప్పుడు నీకు అదే కావాలి , ఇప్పుడు నీ శరీరానికి, మైండ్ కి విశ్రాంతి కావాలి. అది నిద్ర మూలంగానే వస్తుంది. అయినా ఇది ఎక్కువ రోజులు కాదు,కొన్ని రోజులు మాత్రమే వేసుకోవాలి ”

ఎందుకో ఎప్పటిలా వాదించ లేదు. దెబ్బలాడ లేదు. బుద్ధిగా వాళ్ళ మాటలు విన్నాను.

మత్తు నిద్ర. ఎప్పుడు పడుకుంటున్నానో తెలీదు. కానీ, పడుకుంటున్నాను. ఎప్పుడు లేస్తున్నానో తెలీదు. ఏదీ గుర్తుండడం లేదు. ఎక్కడున్నానో తెలీడం లేదు. నేనెవరో తెలీడం లేదు. ఈ అయోమయం నన్ను భయపెట్టేస్తోంది .

ఒక్కొక్కసారి మంచం మీద కాకుండా, మంచం పక్కన కింద పడుక్కుని ఉంటున్నాను. ఎప్పుడు కిందకి వెళ్తున్నానో తెలీదు. కింద నుంచి లేచే ప్రయత్నాలు పెద్దగా ఫలించడం లేదు. లేవడానికి ప్రయత్నించినా తొందరగా లేవడం లేదు. అసలు నేను ఓ పంతొమ్మదేళ్ళ అమ్మాయిలా లేను. ఓ ముసలమ్మలా నాలుగు కాళ్ళమీద పాకుతూ లేస్తున్నాను. ఈ శరీరం నా శరీరంలా లేదు నాకు నేను ఓ అపరిచితురాలిలా ఉన్నాను. ఈ మధ్య ఇదే ఫీలింగ్స్.

ఆ రోజు కూడా అంతే.మోకాళ్ళ మీద పాకుతూ మంచం మీదకి చేరాను. అతి కష్టం మీద నేనెవరో గుర్తుకి తెచ్చుకున్నాను. నా పేరు శృతి. బిఎస్సీ మూడో సంవత్సరం చదువుతున్నాను. నేను ప్రస్తుతం హైద్రాబాదులో ఉంటున్నాను.

అంతలో ఏవో మాటలు వినిపించాయి. అవి పక్క గదిలోంచి అని అర్థం అవడానికి చాలా సమయం పట్టింది. ఎవరివా గొంతులు తెలీదు. ఆలోచించాను, ఎవరిదై ఉంటుంది, ఓ పది నిమిషాలకి గుర్తు పట్టాను, అవి అమ్మ నాన్నలది. మంచం పైనే అలా పడుకుని ఉన్నాను.

ఓ టైము లేదు..ఓ డిసిప్లీన్ లేదు. ఎప్పుడంటే అప్పుడు నిద్ర. అయితే ఒక్కటి మాత్రం నిజం. ఈ స్థితి కూడా బావుంది. ఏ ఆలోచనలు లేవు. అంతా శూన్యం . ఓ నల్లటి ముసుగు నా మనసు మీద కెప్పేసి నట్లుగా ఉంది. అంతులేనిశూన్యం. ఓ నరికేసిన చెట్టులా పడుకుంటున్నాను. మొద్దులాకూచుంటున్నాను. పక్షవాతం వచ్చినట్టుగా అన్నీ అవయవాలు పని చేయడం మానేసాయి. రాత్రి లేదు పగలూ లేదు. నిద్ర లేకపోతే, మత్తు. రాత్రళ్ళూ ,పగళ్ళూ ఏకం అయిపోయాయి. కర్టెన్లు పూర్తిగా దగ్గరికి జరపడంతో,వెలుగు గదిలోకి రావడంలేదు. చీకటి,మసక మసక వెలుతురుకి నా కళ్ళు అలవాటు పడిపోయాయి. ఇప్పుడు దాన్నే ఇష్టపడుతున్నాను.

ఓ రోజు  అలా ఎంతో సేపు మంచం మీదే పడుకుని ఉండిపోయాను. టైము కూడా చూసుకోడం లేదు. బాత్రూముకెళ్ళాలి . తెలీదు కానీ ఎందుకో బాగా చెమటపట్టింది. మొహం కడుక్కుంటే బావుంటుందనిపించింది, అతి కష్టం మీద లేచాను. కానీ బాత్రూము వరకూ నడవగలనా, అది ఏంటో చాలా దూరంలో ఉన్నట్టనిపించింది. అంత దూరం వెళ్ళడం కష్టం  అనిపించింది .కాని అలాగే నడిచాను. తలుపు పూర్తిగా వేసుకోలేదు.

బాత్రూంలో ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. కళ్ళు ఎర్రగా బాగా ఉబ్బి వాచినట్లుగా ఉన్నాయి బుగ్గలు,మొహం పెద్దగా ఉంది. చాలా  భయంకరంగా ఉన్నాను. ఆ బింబం నా మొహంలా లేదు. ఎవరో. నేను కాదు. నా మొహం ఎప్పుడూ ఇలా లేదు. ఏంటో జిడ్డుగా చిరాగ్గా అనిపించింది. స్నానం చెయ్యాలనిపించింది.

అంతే  షవరు తిప్పి,దాని కింద నుంచున్నాను. అలా చాలా సేపు ఉన్నాను. పక్కనే ఉన్నఅద్దం ముందు నుంచున్నాను. ఎర్రగా ఉన్న కళ్ళు, తడిసిపోయిన జుట్టు ,మొహాన ,భజాలమీదా ఇనప ఊసల్లా జారుతూ మెరుస్తున్నాయి.

ఎప్పుడు వచ్చిందో అమ్మవచ్చింది.ఆశ్చర్యంగా చూసింది.

"ఏదో కుళాయి శబ్ధం వస్తూంటే,సడన్ గా మెలకువ వచ్చింది. మా బాత్రూంలో ఏమైనా పొరపాటున తిప్పి ఉంచేసామా అని పరుగున బాత్రూం లోకి వెళ్ళిచూసాను. మామూలుగానే ఉంది మా దగ్గర కాదు. అప్పుడు నీ గదిలోకి వచ్చి చూసాను. నువ్వు మంచం మీద లేవు బాత్రూం లో ఉన్నావు.   ఏం అవుతోంది?  ఇంత రాత్రి వేళ స్నానం ఏంటీ?  టైమెంతో తెలుసా ?  కాస్సేపైతే తెల్లారిపోతుంది " అంటూ గబగబా ఓ పెద్ద తువ్వాలు తీసి నాకిచ్చింది

"సుబ్బరంగా ఒళ్ళు ఒత్తుకుని ఈ నైటీ వేసుకుని రా,నేనిక్కడే ఉంటాను. " అంటూ తలుపుని దగ్గరగా వేసి బయటికి వెళ్ళింది.

నేను బయటికి వచ్చాకా నన్ను చూసి చేతిలో ఉన్న పలచటి తువ్వాలుతో దగ్గరికి వచ్చింది.

"అయినా ఈ అర్థరాత్రి తల స్నానం ఏంటీ? " ఇంకా ఏదో అనబోయింది.

అంతలో నాన్న కూడా వచ్చారు.ఇద్దరూ నా గురించి మాట్లాడుకున్నారు.

" పిచ్చి ఎక్కువైందా? " అని అమ్మ మెల్లిగా నాన్నతో అంది.

"మాట్లాడకు " అన్నట్లు నాన్న సైగ చేసారు. నాకు పిచ్చెక్కిందా !?

"జుట్టు ఆరాక పడుకోకు కూచో " అంటూ నా భుజం తట్టి వెళ్ళిపోయారు.

అమ్మ నన్నుఫాన్ కింద కూచోపెట్టి, తలని తుడిచింది. స్నానం చేసాకా కొంచెం పరవాలేదు. ఫ్రెష్ గా అనిపిస్తోంది. తడి జుట్టుని గాలికి వదిలేసాను. వెళ్ళి బాల్కనీలో కూచుని,అన్ని వైపులా చీకటి. అవును మరి అర్ధరాత్రి అని అమ్మఅంది కదా. ఆ చీకట్లోంచే బయటికి చూస్తున్నాను. ఇక్కడ కూచుని ఇవన్నీ ఎప్పుడో చూసినట్లనిపిస్తోంది. ఎప్పుడో గుర్తు రావడం లేదు.

బయట చూస్తూంటే అన్నీ తెలిసినట్లే ఉంటోంది. కాని ఏం తెలీడం లేదు. ఆలోచనలు కూడా అంతే ఆలోచిస్తూనే ఉన్నాను. ఈ ఆలోచనలు నావి కావు. అందుకే తప్పులు అలా జరిగి పోతున్నాయి. అలాగే

ఉన్నాయి. ఇదివరకే నయం కాస్త బుర్ర పనిచేసేది. కవిత్వం రాసేదాన్ని. అప్పుడప్పుడు బొమ్మలు గీసేదాన్ని. ఇప్పుడదేం లేదు. ఇప్పుడు నేనేం చెయ్యాలో తెలీడం లేదు. మళ్ళీ నొప్పి, భరించలేని నొప్పి.తప్పించుకోవాలని ప్రయత్నిస్తున్నా చాలా కష్టంగా ఉంది.

నేను కూచోడం చూసిన అమ్మ ,తను కూడా ఓ కుర్చీ తెచ్చుకుని నా ఎదురుగా కూచుంది

" చలిగాలి వీస్తోంది. పైగా తల స్నానం కూడా చేసావు. జలుబు చేస్తుంది ,లోపలికి వచ్చెయ్యి "

" ఎలా ఉంది శృతీ.ఇప్పుడు కాస్త నయంగా ఉందా? సుబ్బరంగా స్నానం చేసావు, మొహం నీటుగా ఉంది. ఇప్పుడు కూడా మత్తుగా ఉందా? కొంచెం టీ తేనా? " ఎంతో నెమ్మదిగా,అడిగింది.

తలని అడ్డంగా ఊపాను.ఇద్దరం ఇశ్శబ్దంగా అలాగే కూచున్నాం.

ఇదివరకూ ఇలా కాదు,నన్ను చూడగానే,టీ తాగేసి చదువుకో , అని ఓ అధికారంతో అనేది అమ్మ. అమ్మ బాగా మారింది. అని అనుకున్నాను.

"బాగానే ఉంది" అని అన్నాను.

"అయితే గుడికి వెళ్దామా. ధనుర్మాసం కదా తెల్లారు ఝామునే గుడి తెరిచేస్తారు . అభిషేకాలు అవీ చేస్తున్నారు. చూసొద్దాం "

"నాకు ఎక్కడికీ రావాలని లేదు " కోస్త విసుగ్గానే అన్నాను. అమ్మ అర్ధం చేసుకుంటుందని అనుకున్నాను. కానీ లేదు. నాదగ్గరికి వచ్చి,నా మొహంలోకి చూసింది.

" ఒక్క పది నిమిషాలు అవి అన్నీ చూసి వచ్చేద్దాం. బావుంటుంది. ఏం...సరేనా...? "

"ఎన్ని సార్లు చెప్పాలీ, నేను రానంటే వినిపించుకోవేంటీ, నేను రాను,రాను,రానూ.అంతే. నన్ను వదిలెయ్యి. నీకంతగా వెళ్ళాలని ఉంటే నువ్వు వెళ్ళు" గట్టిగా కోపంగా అన్నాను. అమ్మ భయపడింది. గబుక్కున కుర్చీలోంచి లేచి , కళ్ళు పెద్దగా చేసి నన్నే చూస్తోంది.

" ఇంత రాత్రి వేళ ఏ౦విటీ న్యూసెన్స్ ? " అంటూ  సరిగ్గా అదే సమయానికి. నాన్నగారు వచ్చారు. వస్తూనే నా దగ్గరికి వచ్చి అమ్మఖాళీ చేసిన కుర్చీలో కూచున్నారు. ఏదో అంటున్నారు, అమ్మతో ఏదో మాట్లాడుతున్నారు. నాకేం అర్థం కావడంలేదు.

" ఆ డాక్టరిచ్చిన మందులు అవీ వాడుతున్నాం కానీ ఏదో గాలి సోకింది. అక్కడెక్కడో ఎవరో ఓ స్వామిగారు ఉన్నారు,ఓ సారి తీసుకెళ్తే"

స్వామి అన్న మాట వినిపించింది,అంతే మళ్ళీ లోపల్నించి కోపం వచ్చేసింది

"నేనెక్కడికి రాను" అని గట్టిగా అరిచాను. అమ్మ ఏదో అనబోయింది. నాన్న వెంటనే బాల్కనీ లోంచి లోపలికి వెళ్ళిపోయారు. అమ్మని లోపలికి రమ్మన్నారు.

"మనకో ఇల్లుంది అందులో మాట్లాడుకోవచ్చు, ఈ బాల్కనీ జస్ట్ కూచోడానికి,అంతేకానీ ఇలా ఆర్గ్యూ చేసుకోడానికి కాదు"

అమ్మ ఏం మాట్లడలేదు.నేను కూడా లోపలికి వచ్చేసాను.

" నిజమే, అది బాల్కనీలో గట్టిగా అరిచింది. దానికి ఏం తెలీడం లేదు. నీకు తెలుసు కదా,ఇప్పుడు దానితో పాటూ మనం కూడా గట్టిగా మాట్లాడామనుకో,  బయటంతా నిశ్శబ్దంగా ఉంది. అందరికీ వినపడుతుంది. అందరూ లేస్తారు. దీనికేదో అయిందని,మనకేదో అయిందనుకుంటారు. ఎంతో సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుంది. మనది మనమే బయట పెట్టుకున్నట్లవతుంది "అంటూ బాల్కనీ తలుపు వేసేసారు.

నాకు కోపం వచ్చిది. "అంటే నా మూలంగా , చుట్టు పక్కల వాళ్ళు మూలంగా అవమానం జరుగుతుందా!"  వెంటనే గట్టిగా అరిచాను.

ఇద్దరు గబగబా నా దగ్గరికి వచ్చారు. " మెల్లిగా మాట్లాడమ్మా. అందరికీ వినపడుతుంది "

" ఏం వినపడితే ? వినపడితే వినపడనీ.ఇప్పుడు నువ్వేం అన్నావ్ నాకు పిచ్చా ? నాకు పిచ్చంటావా.అందు కని ఆ స్వామి దగ్గరికి తీసుకెల్తారా ? నాకు పిచ్చేంటి ? నాక్కాదు.నీకు పిచ్చి  ? నేను మామూలుగానే ఉన్నాను నాకేం పిచ్చి లేదు,అయినా పిచ్చి అని అంటారా" ఆ మాటే పైకి అంటూ ఏడ్చేసాను.

" లేదులే ఏదో తెలీక మీ అమ్మ అనేసింది. నీకేం పిచ్చి లేదు. నిన్ను ఏ స్వాముల దగ్గరికి తీసుకెళ్ళం "

" నేను ఏం అన్నాను ? ఆ స్వామివారి దగ్గరికి తీసుకెళ్దాం అని. అంతకన్నా ఏంఅన్నాను?"

"అన్నీ అనేసి ఏం అన్నానంటున్నావు  అయినా ఈ. డిప్రెషన్ కి ఆ బాబా ఏం చేస్తాడు ?  సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళాం , ట్రీట్మెంటు ఇప్పిస్తున్నాం. మళ్ళీ డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. మందులు పూర్తిగా వాడాం కదా, ఏం జరుగుతోందో ఆవిడకి చెప్పాలి. అతే కానీ ఈ బాబాలూ స్వాములూ ఏంచేస్తారు ?"

నా ముందరే వాళ్ళు వాదించుకుంటున్నారు. నేను గదిలోకి వెళ్ళాను. పదిహేను రోజులూ అయిపోయాయి. డాక్టరు రాసిచ్చిన మందులు అయిపోయాయి. నాన్నగారు అపాయింట్మెంట్ తీసుకున్నారు.

మళ్ళీ ఆ డాక్టరు.మళ్ళీ అవే నిద్ర మందులు. ఆ తరవాత ఇలాగే ఈ గదిలో, ఈ చీకట్లో,ఈ మంచం మీదే దొల్లుతూ. ఇంతేనా! దీని తరవాత జీవితం లేదా ! ఉంది. కాని, నేను అందులోకి  తొంగి చూడడానికి ఇష్టపడడం లేదు.  నేను మారాలి. ఇది వరకూ లాగా అయిపోవాలి.

మెల్లిగా లేచాను. పుస్తకాల షెల్ఫ్ దగ్గరికి వెళ్ళాను. ఎందుకో చూడబుద్ధి కాలేదు. ఆ పక్కనే ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. స్నానం చేసిన తాజాదనం ఆ ముఖంలో లేదు. అన్నం తిని ఎన్నో రోజులయినట్లుగా ఉంది. లంఖణాలు చేసినట్లుగా నీరసంగా నిద్ర వస్తున్నట్లుగా ఉంది.

పూర్తిగా తెల్లారింది. నాన్న టాబ్లెట్,అమ్మ మంచినీళ్ళతో రెడీగా ఉన్నారు,కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. నాకు తెలీకుండానే మంచం మీద వాలిపోయాను,మళ్ళీ నిద్ర. మళ్ళీ అన్నం తినే టైముకి లేచాను.తినేసి పడుకున్నాను.

“శృతీ ,లే లే,సాయంత్రం అయిపోయింది. పడుకున్నది చాలు” అంటూ అమ్మ లేపింది.

బలవంతంగా లేచాను. బాత్రూంలోకి వెళ్ళాను. అమ్మ నా వెనకాలే ఉంది.నా చేయి పట్టుకుని టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళింది. నాన్న గారు ఇంకా రాలేదు, అమ్మ వేడి టీ ఇచ్చింది.తాగాను, అమ్మ నేను తాగుతున్నంత సేపు నన్నే చూస్తోంది. ఏదో అడుగుతోంది.

నేనేం మాట్లాడ లేదు. అమ్మ చెప్తున్నది వినిపిస్తోంది. వినడం వేరు వినిపించుకోవడం వేరు.వినడం యాంత్రికం. వినిపించుకోవడం మానసికం. నేను ఇప్పుడు ఓ యంత్రం. నడుస్తూ,ఊపిరి పీలుస్తున్న యంత్రం. అందుకే ఏం వినపడడంలేదు.

ఈ లోకంతో సంబంధం లేనట్లుగా ఉంటున్నాను. కుర్చీలో కూచున్నాను. అమ్మఆ రోజు పేపరు ఇచ్చింది. ఒక్క ముక్క కూడా చదవలేక పోయాను. అక్షరాలు మర్చిపోయినట్లుగా ఉంది. అసలు నేను చదువుకున్నదాన్ని అన్న సంగతి కూడా గుర్తు రావడం లేదు. అందుకని పేపర్ని ఓ పక్కకి పడేసాను.

అది అమ్మ గమనించింది.

“శృతీ, టీవీ చూడు, కాస్త మత్తు అదీ తగ్గుతుంది,రా,ఇలా కూచో ” అంటూ టీవీ పెట్టింది.

నేను ఏం మాట్లాడకుండా,టీవీ ముందు కూచున్నాను. ఏ‌ంవిటో అన్నీ అలాగే ఉన్నాయి.ఆస్తి తగాదాలు, అక్రమ సంబంధాలు,విష ప్రయోగాలు, చంపడాలు, నేరాలూ, ఘోరాలూ. ఓ యంత్రం లా చూస్తూనే. అలాగే నిద్ర పోయాను. నేను పడుకున్నానని అమ్మఅనుకో లేదు. చూస్తున్నానని అనుకుంటోంది. అందుకే డిస్టర్బ్ చేయలేదు.

అమ్మ అన్నానికి పిలిచినా వెళ్ళలేదు. నిద్ర వస్తోందని గదిలోకి వెళ్ళి పోయాను. ఎప్పటికో తెలివి వచ్చింది. గది అంతా చీకటిగా ఉంది.పగలో రాత్రో తెలీడం లేదు. మంచం మీద నుంచి లేచాను కానీ నీరసంగా అనిపిస్తుంటే, అక్కడే కింద కూచున్నాను. తెలీకుండా ఆ మత్తులో అక్కడే నేల మీద ముడుచుకుని పడుకున్నాను. ఎంత సేపున్నానో తెలీదు. అమ్మ వచ్చి లేపే వరకూ తెలివి రాలేదు.

“ లే.లే.యీ బాత్రూంలో ఇలా పడుకున్నావేంటీ ?”

ఉలిక్కిపడి చుట్టూ చూసాను. ఇది బాత్రూమా ! ఇక్కడికి ఎప్పుడొచ్చాను ! ఆ విషయమే పైకి అన్నాను. దానిగురించే ఆలోచిస్తున్నాను.

“మంచం మీద నుంచి ఎప్పుడు లేచి బాత్రూం కెళ్ళావో ,కానీ ఇక్కడే పడుకున్నావు. ఎంత సేపట్నించి ఇక్కడున్నావో కాని ఇదేం నిద్ర ? ఇదేం మందులో ఏంటో ? డాక్టరు గారికి ఇవన్నీ చెప్పాలి. ఏమీ తగ్గినట్లుగా లేదు. రాను రాను ఎక్కువైపోతోంది ” అంటూ కంగారు పడుతూనే లేపుతోంది.

అమ్మ ఎన్ని సార్లు లేపినా లేవలేక పోతున్నాను. కళ్ళు విడడంలేదు. లేవాలనిపించడం లేదు. బలవంతంగా తెరిచాను. కిటకీ లోంచి వెలుగు కిరణాలు కళ్ళల్లో గుచ్చుకున్నాయి.అది పగలు అన్న విషయం చాలా సేపటికి తెలిసింది. రాత్రంతా పడుకున్నానా! అలా నేలమీద ఉండిపోయానా! లేవడానికి రావడం లేదు. ఏదో పెద్ద జబ్బు చేసినట్లుగా ఫీల్ అవుతున్నాను.

“లే.లేచి మొహం కడుక్కో. నీకు తెలుసా నువ్వు బాత్రూంలో పడుకున్నావు. ఈ సారి ఇంకెక్కడ పడుకుంటావో ! నిన్నొక్క దాన్ని ఉంచడం భయమే. ఇవాళ నుంచి,నువ్వు ఒక్కదానివి పడుకోకు,నేను కూడా నీ దగ్గర పడుకుంటాను ” అంటూ నన్ను లేపింది.

నాకేమీ అర్థం కాలేదు.సగం వినపడింది.సగం వినిపించుకోలేదు.ఏకాగ్రత లేదు.

“ కొంచెం బావుంటుంది.కాస్త కాఫీ తాగితే హాయిగా ఉంటుంది ” వాష్ బేసిన్ దగ్గరికి తీసుకెళ్ళింది.

వేడి నీళ్ళు ఓ మగ్ లో పెట్టి “,,మొహం కడుక్కో, పడుక్కోకు “ అంటూ బాత్రూం లోంచి వెళ్ళి పోయింది. నేను కడుక్కోలేదు.అలాగే ఉన్నాను. అద్దంలో నా మొహాన్నే చూస్తూండిపోయాను.

అంతలో అమ్మ వచ్చి, మొహం కడుక్కోడంలో సాయం చేసింది.” మెల్లిగా టేబుల్ దగ్గరికి రా” అని వెళ్ళిపోయింది.

అలాగే చేసి, డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి కూచోవాలని ఉన్నా కూచోలేకపోయాను. అంతే మళ్ళీ మంచం మీద పడుకుండి పోయాను. చిన్న చిన్న పనులు కూడా చేయలేక పోతున్నాను. కనీసం కూచోవడం కూడా.ఇలా ఓ మొద్దులా. నాకు ఏం రాదు, ఏం చేయలేను. ఇలా మంచం మీద పడుకోవడం ఒక్కటే వచ్చు. మళ్ళీ ఏడుపొచ్చింది. నేనిందుకిలా అయిపోయాను? నా మెదడులో ఏ రసాయన మార్పులు జరుగుతున్నాయి ? దేనిమూలంగా నేనిలా అయ్యాను?

నేను ఆ నేనుని కాను. పదో క్లాసులో స్కూలు ఫస్ట్ వచ్చిన నేను, డిబేట్లలో ప్రైజులు అవీ వచ్చిన నేనుని కాదు. అవి ఏవీ నాకు కాదు. నా చదువు, నా మార్కులు ఎవరికో ! ఇప్పుడు నేను ఆ మనిషిని కాను. ఈ పరిస్థితికి రాజీ పడాలా.! పడకూడదా ! రాజీ పడలేను.

ఎలాగో పదిహేను రోజులు గడిచాయి. వెళ్ళకూడదని అనుకుంటూనే డాక్టరు దగ్గరికి వెళ్ళాను. అదే నవ్వు. అదే పలకరింపు. ఒంటరిగా మాట్లాడాలని అంది. అమ్మా వాళ్ళు బయటికి వెళ్ళిపోయారు. ఒక్కదాన్ని ఆమె ముందు ఉన్నాను.

ఎందుకో భయం వేసింది. కాళ్ళూ చేతులూ చెమటలు పట్టేసాయి. ఆమెని చూడాలంటే భయం వేస్తోంది. నన్ను ఏదో చేస్తుందనిపించింది చంపెస్తుందేమో. భయంతో అరవాలనిపించింది. కానీ అరవ లేక పోయాను. ఆమె మొహంలోకి చూడలేకపోయాను. కళ్ళు దించుకున్నాను. ఆమె నన్ను ఏం అడిగిందో తెలీదు. నేనేం జవాబిచ్చానో తెలీదు. బయట ఉన్న అమ్మా నాన్న ని లోపలికి పిలిచింది.

“ఈ అమ్మాయికి డిప్రెషన్అని చెప్పాను కదా దానికి ఈ ట్రీట్ మెంటు ఇలాగే చెయ్యాలి.”

అమ్మా వాళ్ళు ఏం మాట్లాడ లేదు.అది వాళ్ళకి తెలిసిందే.

“ఇదివరకూ నిద్ర తక్కువగా ఉందని అన్నారు. ఇప్పుడు ఈ మందులకి నిద్ర అదీ బాగా వస్తుంది ”

అమ్మా వాళ్ళు ఏం చెప్తారా అని చూస్తున్నాను.

“అవును డాక్టరు గారూ,నిద్ర బాగా పోతోంది.అన్నీ కంట్రోల్ లో ఉన్నట్లుగానే ఉన్నాయి ”

అమ్మా ,నాన్న గారు నా గురించి సరిగా చెప్పడం లేదు. నిద్ర బాగా పోతోందన్నారు కానీ అది అతి నిద్ర అని నాకే తెలుస్తోంది. ఏమాత్రం చురుగ్గా లేను. మొద్దులా ఉంటున్నాను.

కానీ అమ్మా వాళ్ళన్నట్లుగా నేను కంట్రోల్ లో లేను. నాలో ఓ శవం ఉంది అది నన్ను ఆక్రమించేస్తోంది. నీ మందులతో నువ్వు నన్ను మెల్లి మెల్లిగా చంపేస్తున్నావు అని గట్టిగా ఆ డాక్టర్ తో అనాలనిపించింది.

" గుడ్. అదే కావాలి. మరో మందుంది. అది బాగా పనిచేస్తుంది. దాన్ని మొదలు పెడదాం. అది సెరోటోనిన్ లెవెల్స్ ని బాలెన్స్ చేస్తుంది. మూడ్ మీద ప్రభావం చూపిస్తుంది, అరవడం, ఏడవడం, అతిగా యాక్టివ్ గా ఉండడం, కొట్టడం లాంటివి తగ్గిపోతాయి" అంది నన్నుచూస్తు.

" ముందు రాసినవి వద్దా! "అని నాన్న అడిగారు.

" అది తీసుకోవాలి. వాటితో పాటూతీసుకోవాలి. ఇది రియల్ ట్రీట్ మెంటు. దీన్ని వాడాకా ఆ తేడా మీకు స్పష్టంగా తెలుస్తుంది " అంటూ తల ఎత్తి ,ఊపింది .

దానర్థం మా అందరికీ తెలుసు, ఇంక చెప్పేందుకు ఏం లేదని.

" మళ్ళీ" అమ్మ నసుగుతూ అడిగింది.

" అదేనమ్మా మళ్ళీ పదిహేను రోజుల తరవాత రండి. ఈ లోపల సగం తగ్గిపోతుంది "

ఇదివరకూ లాగా మందులు కొన్నాక ఇంటికి వెల్కాం. మళ్ళీ నాన్న టాబ్లెట్ ,అమ్మ మంచినీళ్ళ సీసాతో నుంచున్నారు.

ఈ కొత్త మందు వేసుకుంటున్నాను కానీ అది ఏం మందో తెలీదు. కానీ గొంతు ఎండి పోతున్నట్లుగా ఉంది. ఊపిరి కూడా కొంచెం కష్టం గానే ఉంటోంది. రాత్రి పూట విపరీతమైన దాహం. రాత్రి మంచి నీళ్ళు తాగడానికి చాలా సార్లు లేవాల్సి వస్తోంది. ఎన్నిసార్లు నీళ్ళు తాగుతున్నానో అన్ని సార్లూ ఆ వెంటనే బాత్రూముకి కూడా వెళ్ళాల్సి వస్తోంది. విపరీతమైన చెమట పట్టేస్తోంది. అంతకు ముందు ఇలా లేదు. ఇప్పుడు నా స్థితి ఇదివరకటి కన్నా అధ్వాన్నంగా ఉంది. నరకంలోకి వెళ్ళిపోతున్నట్లుగా ఉంటోంది.

" తల దువ్వుతాను రా " అంటూ అమ్మ నాచేతికి అద్దం ఇచ్చింది.

జుట్టు పిచ్చిగా చెదరి ఉంది. తలని ఎప్పుడు దువ్వి,జడ వేసుకున్నానో తెలీదు. మొహం రంగు కూడా మారింది ఎండ తగలక పోవడం వల్ల తెల్లగా మారింది. ఆ తెలుపు లో నిగారింపు లేదు. బుద్ధిగా తల దువ్వించుకున్నాను.

బతికినన్నాళ్ళూ ఇంతే ఇలాగే ఉండాలా !మరి చచ్చిపోతే ఈ కష్టాలేం ఉండవు కదా ! పైగా ఈ నరకం నుంచి విముక్తి లభిస్తుంది . విముక్తి పొందాలంటే నేను ఈ లోకంలోంచి వెళ్ళిపోవాలి. ఎలా వెళ్తాను?

ఈ ఆలోచన వచ్చిన ప్రతీసారీ అది సులభం కాదని తెలుసు .సాధ్యం కాదని తెలుసు.అంత ధైర్యం నాలో లేదని కూడా తెలుసు.కాని ఎన్నాళ్ళు ఇలా ?

పదిహేను రోజులు గడిచిపోయాయి.

"రెండు నెలలనుంచి ఈ సైకియాట్రిస్ట్ శిఖా దగ్గరి కెళ్తున్నాం. నాకు ఆ మందులు పని చేయడం లేదనిపిస్తోంది." అని అమ్మ నాన్నతో అంది.

ఆ సంగతి నాకెప్పుడో తెలుసు అని నా మనసులో అనుకున్నాను. నాకు తెలిసినది వీళ్ళకి తెలియడం లేదు. కాని వీళ్ళకి మాత్రం ఇప్పుడు తెలిసింది..

"అవును ఇంప్రూవ్ మెంటు కనిపించడంలేదు అని అనిపించింది.అయితే డాక్టర్ ని మారుద్దాం "అని వెంటనే అనేసారు.

మరో డాక్టరు,వేరే మందులు.మరో రకం నరకం. నాకు వేరే మార్గం లేదు.వాళ్ళ మాట వినాల్సిందే. నాకు ఛావు రాదు. ఆత్మహత్య చేసుకునే ధైర్యం లేదు. కానీ పదో క్లాసులో ఎలా ప్రయత్నించాను,తెలీదు.

"ఈ సారి మన సిటీ లోనే పెద్ద , గొప్ప సైకియాట్రిస్ట్ ట ,అతని అపాయింట్ మెట్ దొరకడం చాలా కష్టంట. ఆ అపాయింట్ మెంటు కూడా కొన్నివారాల ముందే తీసుకోవాలిట. అలాంటి బిజీ డాక్టరు అపాయింట్ మెంట్ దొరికింది " ఆయన నన్ను చూడడానికి డేటు ఇచ్చాడని అమ్మా,నాన్న సంతోషించారు. పైగా అదృష్టం అని అన్నారు.

కాని నాకు అలాంటి కృతజ్ఞతా భావం రాలేదు. సంతోషం కూడా కలగలేదు. ఓ మొద్దులా ఉన్నాను, నాకు ఫీలింగ్స్ ఏం లేవు.

ఆ డాక్టరు క్లినిక్ ఓ పెద్ద కాంప్లెక్స్ లో ఉంది. ఆ కాంప్లెక్స్ లో అన్ని రకాల డాక్టర్లూ ఉన్నారు. ఈ డాక్టరు సాయంత్రం మాత్రమే ఉంటాడు. పగలు మరో నాలుగు చోట్ల ఇతర ఆసుపత్రులలో పని చేస్తాడుట.

ఈ గొప్ప డాక్టరు క్లినిక్ కి వెళ్ళాం.అక్కడో ఓ అర డజను బోర్డులున్నాయి.అదే క్లినిక్ లో ఓ ఫిజియో థెరపిస్ట్,ఓ స్కిన్ స్పెషలిస్ట్, ఓ ఎముకల డాక్టరు, ఓ ఫిజీషియన్ వాళ్ళ టైమింగ్స్ ప్రకారంగా ఒకళ్ళ తరవాత మరొకరు వస్తూంటారు. అక్కడున్న క్లినిక్ లన్నీ అలాంటివే ,అందుకే ఒక్కొక్క క్లినిక్ పైన నలుగురు ఐదుగురు డాక్టర్ల పేర్లున్నాయి.

మేము వెళ్ళగానే ,అక్కడున్న ఓ అబ్బాయి నా పేరూ వయసూ అదీ ఓ పేపర్ మీద రాసుకున్నాడు. అంతలో ఫోన్ మోగింది. ఆ అబ్బాయి తీసాడు. అవునండి ,ఇప్పుడుండరు,ఆ డాక్టరు పగలు పన్నెండు గంటలకి వస్తారు. మీరు మీ ఫోన్ నంబరు ఇవ్వండి, నేను రేపు మీకు డాక్టరు గారు వచ్చాకా ఫోన్ చేస్తాను. అంటూ పెట్టేసాడు. మరో ఫోను, పేపరు మీద వాళ్ళ పేరు రాసుకున్నాడు. వాళ్ళకి నంబరు ఇచ్చాడు. అక్కడున్న డాక్టర్లందరికీ కలిపీ ఈ అబ్బాయి ఒక్కడే రిసెప్షనిస్ట్ అయి ఉంటాడు.అందుకే అన్ని ఫోన్లకి సమాధానాలిస్తున్నాడు. .

అది ఓ పెద్ద మలిగి. మన ఇళ్ళల్లోని చిన్న హాలులా ఉంది. దాన్ని సగం చేసారు. ఓ వైపున వరసగా నాలుగు విజిటర్స్ కుర్చీలున్నాయి. మిగిలిన సగంలో వరసగా నీట్ గా పార్టిషన్లున్నాయి. ఒక్కొక్క పార్టిషన్ పైన డాక్టరు పేరు, టైమింగ్స్ రాసి ఉన్నాయి. డాక్టరు రూం చిన్నది, కానీ నీట్ గా ఉంది. మేము వెళ్ళిన సమయం ఈ సైకియాట్రి డాక్టరుది. అక్కడ ఎదురు చూస్తున్నవాళ్ళు ఈ డాక్టరు కోసమే. అపాయింట్ మెంట్ ఉన్నా మేము వెయిట్ చేయాల్సి వచ్చింది.

"ఇంత పెద్ద పేరున్న డాక్టరు క్లినిక్ ఇంత చిన్నగా ఉందేంటి అని అమ్మ నాన్నతో అంటోంది.నాలుగు చోట్ల క్లినిక్ లున్నాయంటే చిన్నవే ఉంటాయి.పెద్దవి ఎందుకు పెట్టుకుంటారు "

లోపల ఉన్న మనిషి ఎవరో కాని చాలా సమయం తీసుకుంది. మమ్మల్ని పిలిస్తే మేము ముగ్గురం లోపలికి వెళ్లాం. ముగ్గురం వెళ్ళేసరికి గది మరీ ఇరుకైపోయింది. మమ్మల్ని చూడకుండానే కూచోమన్నాడు. కూచున్నాం. మనిషి సన్నగా పొడుగ్గా.తెల్లగా బాగానే ఉన్నాడు. కాని నాకేం నచ్చలేదు, మొహంలో సౌమ్యత తక్కువనిపించింది. ఆయన నాతో ఏం మాట్లాడ లేదు. తలెత్తి నా ఎదురు గానే నాన్నగారితో మాట్లాడాడు.

అంతకు ముందు డాక్టరిచ్చిన రిపోర్టులు అవీ చూసాడు. మందులు రాసాడు . ఆ ప్రిస్క్రిప్షన్ నాన్నగారి కిస్తూ మా మొహాల్లోకి చూసాడు.

ఇలా మందులూ అవీ వాడినా మీకు ఫలితం కనపడకపోతే ,మరోసారి ఈ మందులూ అవీ వాడే కన్నా , నేను మీకు ఓ సలహా ఇస్తాను. మీరు మీ అమ్మాయిని హాస్పిటల్ కి తీసుకెళ్తే మంచిది. ఎక్కడో బెంగలూరు వెళ్ళక్కర్లేదు, మన దగ్గర కూడా మంచి సెంటర్ లున్నాయి. మెంటల్ హెల్త్ అండ్ న్యూరోలాజికల్ సైన్సెస్ కి తీసుకెళ్తే మంచిది.

ఇంతేనా! అంటే ఈయన వల్ల కాదని ఒప్పుకుంటున్నాడా. ఇన్ని రోజులు వెయిట్ చేయించి, అంత డబ్బు తీసుకుని ఈ సలహా ఇవ్వడానికేనా ?

రోజులు గడుస్తున్నాయి. నాలో మార్పు ఏం లేదు.అలసిపోవడం,ఆకలి లేకపోవడం, నిద్ర లేకపోవడం, మత్తు, కలత నిద్ర,బద్ధకం, అన్నీ అలాగే ఉన్నాయి నాలో నిరాశ ఇంకా ఎక్కువైంది. మాట్లాడాలంటే ఎక్కడ లేని నీరసం వచ్చేస్తోంది. మాట్లా డాలనిపించడం లేదు.

కాలేజీకి ఎందుకు వెళ్ళ లేకపోతున్నానో ఎవరికీ చెప్పలేక పోతున్నాను. ఎవర్నీ చూడాలని అనిపించడంలేదు. స్కూల్లో ఉన్నప్పుడు ఎన్నో జోక్స్ వేసేదాన్ని. ఇప్పుడు అదేం లేదు.అసలు ఓ చిన్న వాక్యం కూడా మాట్లాడ లేక పోతున్నాను.ఎందుకీ బతుకు...!.నేను ఉండడం దండగ.ఛావాలి అన్న కోరిక రోజు రోజుకి ఎక్కువైపోతోంది.

ఆత్మహత్య ఎన్ని విధాలుగా చేసుకోవచ్చో ఆలోచిస్తున్నాను. బతకడానికి ఎన్ని మార్గాలున్నాయో, ఛావడానికి కూడా ఎన్నో మార్గాలున్నాయి.

విషం తీసుకోవడం. ఎండ్రిన్ లాంటి పురుగుల మందు తాగడం. ప్చ్ లాభం లేదు.వెంటనే తెలిసిపోతుంది. ఆసుపత్రికి తీసుకెళ్తారు. డాక్టర్లు వెంటనే కడుపుని సుబ్బరంగా క్లీన్ చేస్తారు. ఇప్పుడు ప్రాణ భయం ఏం లేదు. ఓ సారి అనుభవం అయింది.అందుకని అలా అని అనడానికి బతకడానికే అవకాశాలే ఎక్కువ.

మణికట్టు దగ్గర కోసుకుంటే . అలా కోసుకున్నచేతిని నీళ్ల టబ్ లోనో వాష్ బేసిన్ లోనో ఉంచితే ఆ రక్తం పోతూంటుంది. అలా చచ్చి పోవడం సినిమాల్లో చూపిస్తూంటారు. మా ఇంట్లో బాత్ టబ్ లేదు, వాష్ బేసిన్ కష్టం. ప్రాణం పోయే వరకూ నుంచోవాలి. బక్కెట్ తో సరిపెట్టచ్చు. కానీ బాత్రూం అంతా అసహ్యంగా అవుతుంది. పైగా ఈ మెథడ్ చాలా స్లో. శ్వాస ఆగేవరకూ ఆ చేతిని నేను అలాగే నీళ్ళల్లో ఉంచాలి ఈ లోపలే ఎవరో వచ్చేస్తారు . ఇల్లు ఏం పెద్ద మహల్ కాదు. అమ్మో,నాన్నో, ఎవరో ఒకరు చూస్తారు. లాభం లేదు.

కిరసనాయిలు పోసుకుని కాల్చుకుంటే. కిరసనాయిల్ ఇంట్లో ఉండదు. పనిమనిషికి రేషన్ లో ఇచ్చే కోటా లోంచి తీసుకోవాలి. అది వెంటనే అమ్మకి చెప్పడానికి వెనకాడదు. అప్పుడందరికీ తెలుస్తుంది. ఒకవేళ ఎవరికీ తెలీకుండా మేనేజ్ చేసి కిరసనాయల్ తెచ్చుకుని కాల్చుకుంటే. అమ్మా వాళ్ళు నా ఉత్తరాలు కాల్చేసినట్లు. ఇది కూడా సందేహమే. ఇందులో ఫెయిల్ అవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి . టీవీల్లో ఎన్నోసార్లు , ఎంతోమంది ఫొటోలు వీడియోలూ చూసాను. పూర్తిగా కాలక పోతే ఎలాంటి నరకాన్ని అనుభవించారో చూసాను. నేను కూడా అలాగే. ఛావక పోతే! లోపలంతా వంకాయ కాలినట్లుగా అయిపోతే! పూర్తిగా మొహం మారిపోతే ! ఆ బాధని భరించడం కష్టం. పోనీ,సీలింగ్ ఫాన్ కి ఏ తాడో, ఏ చీరో తీసుకుని ఉరేసుకుంటే. ?

ఒక్కసారి రజని గుర్తొచ్చింది. సునీత గుర్తొచ్చింది. హటాత్తుగా వాళ్ళిద్దరే ఎలా గుర్తున్నారు? కారణం ఇద్దరూ కూడా హాస్టల్ గదిలో ఉరి వేసుకుని పోయారు. పోలీసులు వచ్చి,కేసుని తీసుకునే వరకూ వాళ్ళిద్దరి శరీరాలూ అలా వేళ్ళాడుతూనే ఉన్నాయి. ఆ సంఘటనల తరవాత చాలా రోజులు నిద్ర పట్టలేదు భయంతో నిద్ర పోలేదు. వాళ్ళు ఎందుకు చచ్చిపోయారో. మాకు అర్థం కాలేదు. ఊగుతున్న శరీరాలు.కళ్ళు పైకొచ్చి,నోరు తెరుచుకుని ఉన్న వాటిని దింపడాలూ, ఎంత భయంకరంగా మారిపోయారో! మమ్మల్ని ఎన్నో ప్రశ్నలు. అంతా గొడవ గొడవ . ఉహూఁ నేనలా చావను.

అయినా రోజూ ఎక్కడో అక్కడ ఈ మెథడ్ ని అవలంబించి, రైతులు, కట్నం వేధింపుల బాధితులు, అప్పులు తీర్చలేని వాళ్ళు, చేస్తున్నది ఇదే. ఇది చాలా కామన్ మెథడ్ అయిపోయింది . అమ్మ చీర తీసుకుని ,ఫాన్ కి కట్టేసి, నేను గనక ముడి సరిగా వేయగలిగితే సక్సెస్ అవుతాను కాని ఈ ప్రాసెస్ లో పూర్తిగా ఉండగలనా. మరోసారి ఇంటర్ లో ఉండగా ఇలాగే పోయిన క్లాస్మేటులు ఇద్దరూ గుర్తొచ్చారు, ఆ రోజున ఎంత గొడవ జరిగిందో పోలీసులు ,పేరెంట్స్, విద్యార్థి సంఘాలు. రిపోర్టర్లు, పోస్ట్ మార్టం, చాలా తతంగం. ఊహించుకున్నాను. ఆ కష్టం అమ్మా వాళ్ళకి ఇవ్వ దలుచుకోలేదు. చావడానికి ఇంకా ఏం మార్గాలున్నాయో ఆలోచిస్తున్నాను.

పోనీ నేను తీసుకునే మందు ఎక్కువ వేసుకుంటే. దాన్ని నాన్న ఫ్రిజ్ పైన ఓ ప్లాస్టిక్ పెట్టెలో ఉంచారు. దాన్ని తీసుకుని వేసుకోడం పెద్ద కష్టం కాదు. ఐతే అవి పూర్తిగా పని చెయ్యకపోతే. రోజుల తరబడి అలా నిద్ర పోతూంటే, కోమా లోకి వెళ్ళిపోతే.ఎవరు చూడాలి? ఆసుపత్రిలో ఉంచేస్తే, రోజూ అటూ ఇటూ ఎవరు తిరగాలీ? ఈ వయసులో నేను ఇలాంటి ప్రయత్నాలు చేస్తే అమ్మా నాన్నని కష్ట పెట్టడం తప్ప మరేం లాభం ఉండదు.

అన్నిటికన్నా సులువు కాదు కానీ ష్యూర్ గా పోయే విధానం. టెర్రేస్ మీద నుంచి కిందకి పడడం. ఆ ఆలోచన రావడమే తడవు గదిలోంచి బయటికి వచ్చాను. అమ్మ అనుమానంగా చూసింది, ఎక్కడికీ అన్నట్లు. "టెర్రేస్ పైకి,చక్కటి గాలి వీస్తోంది.కొంచెం చేంజ్.".అని అన్నాను. ఎంత సులభంగా అబద్ధం ఆడేసాను. ఈ మధ్యనాకు అబద్ధాలు ఆడడం బాగా వచ్చింది. ఏమాత్రం ఆలోచించకుండా ఆడేస్తున్నాను. అమ్మ వెంటనే తన చీరని సవరించుకుంది. జుట్టుని పైపైనే వేళ్ళతో దువ్వుకున్నట్లు చేసింది. "పద నేను కూడా వస్తాను," అంటూ తాళం చేతులు తీసుకుంది.

నేను ముందు నడుస్తూంటే అమ్మనా వెనకాలే టెర్రేస్ మీదకి వచ్చింది. నేను ఓ వైపు నడిస్తే అమ్మ మరో వైపు నడుస్తోంది. గోడ మీద నుంచి కిందకి చూస్తూ కొంచెం దూరం నడిచాను. లాభం లేదు,ఇక్కడ అన్నీ బాల్కనీలు అడ్డొస్తున్నాయి. ఇక్కడి నుంచి దూకడం కష్టం. పైగా ఎవరి బల్కనీలో నైనా పడితే పరవాలేదు, కానీ,సగం సగం గా పడితే,పడుతున్నప్పుడు వచ్చే శబ్ధం చుట్టు పక్కల వాళ్ళకి తెలివి వచ్చేస్తే..పెద్ద గొడవ. అదో పెద్ద సినిమా.

కొంచెం దూరం నడిచాను. కిందకి చూసాను. కింద వాకింగ్ ట్రాక్. చెట్లు. కొన్ని పొట్టి చెట్లు. కొన్ని పొడుగువి. ఇక్కడ చెట్లు అడ్డొచ్చాయి. చెట్టు మీద పడితే. లాభం లేదు. ఇంత కన్నా మంచి చోటు చూసి పడాలి. అలా అలా చూస్తూ వెళ్ళాను. కిందనుంచి పైవరకూ ఉన్న పైపులు మూలంగా తెలుస్తోంది అక్కడ బాత్రూములు,టాయిలెట్లున్న ప్లేస్ అది అని. ఇది కరెక్ట్ ప్లేస్ ,చాలా కరెక్ట్ గా ఉంటుంది అనిపించింది. అక్కడ ఏదీ అడ్డు రాదు. డైరెక్ట్ గా కింద పడతాను. అంతే అక్కడితో ఈ ఛాప్టెర్ క్లోజ్,అయిపోతుంది. నేను నుంచున్న దగ్గరే ఓ నీళ్ళ టాంకు ఉంది. టాంకుకి పిట్టగోడకి మధ్య ఉన్న స్థలం సన్నగా ఉంది. అక్కడ మనుషులు ఎవరున్నా దూరంనుంచి కనిపించరు. అక్కడినుంచి కింద పడినా ఎవరికి పెద్దగా కనిపించదు. ఎందుకంటే ఆ టైములో ఎవరూ జాగింగ్,వాకింగ్ అదీ చెయ్యరు. అంతే కాకుండా యాంగిల్ అది సరిగ్గా ఉంటుంది. రోడ్డు కూడా చాలా వెదల్పుగా ఉంటుంది. ఐడియల్ ప్లేస్.

అంత పెద్ద టెర్రేస్ మీద ,రాత్రి వేళ ఏమాత్రం కన్ఫ్యూజన్ అవకుండా ఆ నీళ్ళటాంకు బండ గుర్తు పెట్టుకున్నాను. ఏదో కాస్సేపు అటూ ఇటూ చూస్తూ అమ్మవైపు చూసాను ఇంక వెళ్దామన్నట్లుగా. అమ్మకూడా తల ఊపి నా చేయి పట్టుకుని ఇంటికి తీసుకొచ్చింది.

రాత్రి మామూలుగానే ఉన్నాను. మనసులో నేను చేయబోయే దాని గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. అన్నం తిన్నాను. మందులు వేసుకున్నాను. అలవాటయి పోయిందేమో ఇది వరకూ లాగా వెంటనే నిద్ర రావడం లేదు. మంచం మీద పడుకున్నాను. గడియారం కేసి చూస్తున్నాను. నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. ఓ మొద్దులా ఉన్న నేను ఇంత పెద్ద ప్లాను ఎలా వేసాను.?ఇప్పుడు దాన్ని ఎక్జిక్యూట్ చేసే ప్రయత్నంలో ఉన్నాను. అయితే నేను సక్సెస్ అవుతానా

అమ్మా నాన్న గారు పడుకున్నారని గట్టిగా నిశ్చయించుకున్నాకా మెల్లిగా లేచి పైకెళ్ళాను. పైన అంతా నిశ్శబ్ధంగా ఉంది. ఆకు కూడా కదలడం లేదు. మామూలుగా అయితే వాచ్మెన్ ఓ కర్ర పుచ్చుకుని టక టకమంటూ కొట్టుకుంటూ బిల్డింగ్ ల మధ్య నుంచి వెళ్తూంటాడు. నాకు ఈ సంగతి బాగా తెలుసు ఎందుకంటే రోజూ నిద్ర లేని రాత్రుళ్ళు కాబట్టి, ఈ శబ్ధాలు వింటూ గడిపేదాన్ని. ఎందుకో మరి,ఇప్పుడు ఆ శబ్ధం కూడా లేదు.

ఓసారి చుట్టూ చూసాను. ఎవరూ లేరని పించింది.నీళ్ళటాంక్ వైపు వెళ్ళాను. మెల్లిగా టాయిలెట్లుండే వైపు వెళ్ళాను, ఓసారి చుట్టూ చూసాను. ఎవరూ కనిపించలేదు. ఇప్పుడు టెర్రెస్ గోడ ఎక్కాలి. ఇంక ఇవే ఆఖరి క్షణాలు. మరో ఐదు నిమిషాలకి నాకు ఈ ప్రపంచంలో ఏం జరుగుతోందో తెలియదు. సంబంధం ఉండదు. అలా అనుకుంటూంటే భయం వెయ్యలేదు. పిచ్చి ధైర్యం. మొండిధైర్యం. నాకే తెలీదు ఎక్కడినుంచి వచ్చిందో......

ఎందుకైనా మంచిదని మరోసారి అన్నివైపులా చూసాను. కిందకి కూడా చూస్తున్నాను. సరిగ్గా అదే సమయానికి ఏవో గుసగుసలు నాకు వినిపించాయి. అంటే నేను కాకుండా ఇంకా ఎవరో అక్కడ ఉన్నారు.

" నేను నిన్ను నిజంగానే ప్రేమిస్తున్నాను. నన్ను నమ్ము నిన్ను నేను పెళ్ళి చేసుకుంటాను. దాని గురించి ఆలోచించ మంటున్నాను. మీ అమ్మా వాళ్ళని నేను ఒప్పిస్తాను " ఓ మొగ గొంతు.

ఒక్కసారి భయపడ్డాను. కొయ్యబారి పోయాను. ఆర్ణవ్ అక్కడ ఉన్నాడా? ఇక్కడికి వచ్చాడా? నేనెలా ఉన్నానో చూడడానికి వచ్చాడా? అవి ఆర్ణవ్ మాటలు. ఆర్ణవ్ పోయాడు కదా పోయిన వాళ్ళు వస్తారా? రివెంజ్ తీసుకోడానికి వచ్చాడా? అంటే దెయ్యం! ఆ తర్వాత ఆలోచించడానికి భయపడ్డాను. ఆ మాటలు నన్ను ఉద్దేశించి ఎవరైనా అంటున్నారా? నన్ను కాదు అని చాలా సేపటికి తెలుసుకున్నాను.

అంటే అక్కడ నేను కాక ఇంకా ఎవరో ఉన్నారు, ఎవరు వాళ్ళు? నన్ను చూసారా? చూసి ఉండరు. వాళ్ళెవరో నాకన్నా ముందే వచ్చారు. ఈ టాంక్ వెనకాల ఉన్నారు. వాళ్ళకి నేను కనపడే అవకాశమే లేదు

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను " మళ్ళీ అదే మాటలు. అక్కడ ఆర్ణవ్ ఉన్నట్టుగా అనిపిస్తోంది.

అయోమయం. అక్కడ ఎవరున్నారో తెలీదు, కాని ఇలాగే ఇవే మాటలు నాతో ఆర్ణవ్ అన్నాడు. ఇప్పుడు అక్కడ ఉన్నది ఆర్ణవ్ కాదు. ఆర్ణవ్ ఎలా వస్తాడు? చచ్చి పోయాడు కదా, నామూలంగానే ఆ ఆలోచనకి. ఒక్కసారి నా వెన్నెముకలోంచి కరెంటు ప్రవహించినట్లయింది.

అది ఆర్ణవ్ కాదు,ఇక్కడ మరొక మనిషి ఉన్నాడు. ఎవరో చూడడం కోసం పక్కకి జరిగి ఓ రెండు అడుగులు వేసి అటువైపు చూసాను.

" నా ప్రేమని అవమానించకు.. తేలిగ్గా చూడకు " సరిగ్గా ఇవే మాటల్ని ఆర్నవ్ బొమ్మ నాతో అంది.

నేను ఆర్నవ్ ని అవమానించలేదు.నా కలల్ని ,ఆశలని నిజం చేసు కోవాలను కుంటున్నాని అన్నాను. ఆ లక్ష్యం ముందు ప్రేమ చాలా చిన్నది అని కూడా అన్నాను. దానికే ప్రాణాలు తీసుకుంటాడా ఆర్ణవ్? కళ్ళ ముందు ప్రేమతో అన్న మాటలు, ఆ గొంతులోని మార్దవం అన్ని వినిపిస్తున్నాయి. నేను దోషినా! కావచ్చు. కాని నేను తప్పించుకున్నాను. నేను చాలా సెల్ఫిష్. నాది నేను చూసుకున్నాను. నేను సేఫ్ జోన్ లో ఉండడంకోసం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వణికిపోతున్నాను. చెమటలు పట్టేస్తున్నాయి. కాళ్ళకింద నేల కదులు తున్నట్లుగా అనిపించింది. కాని ఒక్క ఇంచి కూడా కదల్లేక పోయాను.

ఆర్ణవ్ చేసిన దానికి అందరూ బాధ పడ్డారు, ఆర్ణవ్ ఓ బలహీనక్షణం లో తీసుకున్న బలమైన నిర్ణయం అది. అనాలోచితంగా చేసాడు. అని అన్నారు,

అంటే ఇప్పుడు నేను కూడానా  అలాంటి బలహీనమైన స్థితిలో ఉన్నానా అవును. ఉన్నాను. అందుకే  ఆ రోజున ఆర్ణవ్ చేసిందే ఈరోజు నేను చేయబోతున్నాను. అంటే నాది కూడా అలాంటి బలహీన క్షణంలో తీసుకున్న నిర్ణయం అవుతుందా . కానీ ఇది ఇప్పటికిప్పుడు నేను తీసుకున్న నిర్ణయం కాదు. ఎప్పటి నుంచో నాలో ఈ ఆలోచన ఉంది. ఇంకా ఇక్కడే ఉంటే ఈ బలహీన క్షణం ఇంకా బలహీన పడిపోతోంది. ఏంచెయ్యను, అక్కడే అలాగే నుంచుని ఆలోచిస్తున్నాను.

"శృతీ ఇక్కడేంచేస్తున్నావ్?" చీకట్లోంచి అమ్మ గొంతు వినిపించింది. ఆ గొంతులో భయం, ఆశ్చర్యం, ఏడుపు,అన్నీ ఉన్నాయి. ఉలిక్కి పడ్డాను . ఊహించని విధంగా అమ్మ గొంతు వినపడేసరికి భయం వేసింది.

నాకు ఏం చెప్పాలో తెలీలేదు. నేను ఆత్మహత్య చేసుకోడానికి వచ్చానని ఎలా చెప్తాను.  అందుకే ఏం మాట్లాడ లేదు.

" నువ్వు నిద్ర పోయావో లేదో చూద్దామని, నీ గదిలోకి వచ్చాను. నువ్వు లేవు.  బాత్రూంలో కూడా లేవు. మెయిన్ తలుపులు తీసి ఉన్నాయి. కిందకి దిగి సెక్యూరిటి ని అడిగాను. నిన్ను చూడలేదని అన్నాడు. వెంటనే పైకి వచ్చాను.  చెప్పు...ఎందుకొచ్చావు?  ఏఁవిటిది ? ఇందుకేనా సాయంత్రం ఈ టెర్రేస్ మీదకి వచ్చావు చెప్పు. ఏం చేయాలనుకుని ఇక్కడికి వచ్చావ్"  ఏడుపు గొంతుతో చేతుల్ని పట్టుకుంది. వెంటనే ఆ చేతుల్ని తన మొహానికి ఆనించుకుని ఏడ్చేసింది. ఆ నిశ్శబ్ధంలో ఆమె ఎక్కిళ్ళ  ఆ శబ్ధం బయిటికి రాకుండా చీర కొంగుని నోట్లో కుక్కుకుంది.

నాకేం చెప్పాలో తెలీడం లేదు. ఎందుకొచ్చానో సరిగ్గా చెప్పలేను. చెప్పలేదు. కాని నా ఆలోచనని అర్థం చేసుకుందేమో అనిపించింది. నన్ను గట్టిగా కౌగిలించుకుంది.

ఆ పక్కనే నిశ్శబ్ధంగా ఏడుస్తున్న గొంతు . అమ్మ భుజం మీదనుంచి చూసాను. ఆ చీకట్లో  ఓ నీడలా అమ్మ పక్కనే ఉన్న మనిషి , నాన్న . ఆయన ఏడుపు పైకి రాకుండా, ఆయన చేసే ప్రయత్నం

ఆ భుజాల కదలికని చూసి గుర్తు పట్టగలను. నాన్నగారు ఏడవగా ఎప్పుడూ చూడలేదు. చాలా ధైర్యం గల మనిషి. అలాంటి నాన్న ఈ క్షణాన, ఓడిపోయి నట్లుగా నా ముందు నుంచున్నారు. నిస్సహాయంగా తలని బాగా వొంచి నుంచున్నారు. ఆయన ఇన్నేళ్ళూ తన జీవితాన్ని దిద్దుకున్నారు. మా జీవితాలని దిద్దుతూ వచ్చారు. ఏ లోటు లేకుండా పెంచారు .అంతా మంచే చేసారు. ఓ నాన్నలాగా అన్నీమాకు చేసారు.

అలాంటి నాన్న ఇప్పుడు నా మూలంగా ఇలా అన్నీ పోగొట్టుకున్నట్లుగా నా ఎదురుగా నుంచున్నారు. ఒక్కమాట కూడా అనలేదు. కోపంగా చూడలేదు. అరవలేదు. తిట్టలేదు.అలా చేసినా బావుండేది. ఆ మాటల్ని భరించగలను. కాని ఈ మౌనం ,నిశ్శబ్ధం భరించ లేకపోతున్నాను.

అదే నిశ్శబ్ధం తో కళ్ళు తుడుచుకున్నారు. అమ్మ ఓ చేత్తో నా పొదివి మరో చేత్తో నా చేయి పట్టుకుని ముందుకి నడిచింది. నాన్నఅమ్మభుజం చుట్టూ చేయి వేసి, మా ఇద్దర్నీ నడిపిస్తున్నారు. ఆరో అంతస్తులో ఉన్న మా ఇంటికి తీసుకెళ్ళారు.

నా గదిలోకి రాగానే "సారీ..".అని ఒక్కసారి ఏడ్చేసాను. నాన్న నా తల నిమురుతూ నిశ్శబ్ధంగా ఉన్నారు. అమ్మ కింద కూచుని మొహం కప్పుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

ఓ నాలుగురోజులు ఎవరం ఎవరితో మాట్లాడుకోలేదు. కానీ నాన్నగారు మాత్రం ఎవరికో ఫోన్ లు చేస్తున్నారు, ఏవో కనుకుంటున్నారు.

" రేపు పొద్దున్న ఎనిమిది గంటలకి మరో డాక్టరు దగ్గరికి వెళ్తున్నాం. అన్ని కనుకున్నాను. ఇతను చాలా పెద్ద సైకియాట్రిస్ట్. అతను పరీక్షించి చెప్తాడుట. బెంగులూరులో పని చేసి వచ్చాడు. చూద్దాం. అన్నీ మంచే జరుగు తుందనే అనుకుందాం. ఇంతవరకూ ఇద్దరయ్యారు. ఇతను మూడో మనిషి. మూడో డాక్టరు. మూడోసారి ప్రయత్నిద్దాం. మన ప్రయత్నంలో లోపం ఉండకూడదు "

మర్నాడు, అందరం ఓ పాత ఇండిపెండెంట్ బంగ్లా కి వెళ్ళాం, అది ఎవరిదో ఇల్లులా ఉంది. గేటునుంచి కొంచెం దూరం నడిచాకా మెట్లు ఎక్కి, ఓ వరండా లోకి వెళ్ళాం. తిరుగుతున్న ఫాన్లూ,నున్నటి గోడలు,కొటేషన్లతో ఉన్న పెయింటింగ్ లూ,ఏదో హోటల్ లోని రిసెప్షన్ హాలులా ఉంది.అక్కడన్నీ చిల్లులున్న ఇనప సిల్వర్ రంగు కుర్చీలున్నాయి. ఓ పది మంది కూచుని ఉన్నారు. ఆ తర్వాత పెద్ద గది అని పొడుగ్గా ఉన్న గోడని చూస్తే తెలుస్తోంది. గాజు తలుపులున్న ఆ గది పక్కనే గోడకి ముగ్గురు డాక్టర్ల పేర్లు రాసి ఉన్న మూడు చిన్న బోర్డులున్నాయి..

ఇది మూడోసారి. మూడో డాక్టరు. మూడోసారి నా జీవితాన్ని,ఇతని ముందు తెరుస్తాను. అని మనసులో అనుకున్నాను.

నా వంతు వచ్చింది. నర్సు ఓ నంబరు గట్టిగా పిలిచింది.

అమ్మ నాన్న ఇద్దరూ ఒక్కసారి లేచారు. నేను లేవలేదు. కాని " అమ్మ లే అది నీ నంబరే. ఇక్కడ పేర్లు పెట్టి పిలవరు " అని నన్ను కూడా లెమ్మన్నట్లు తట్టారు.

నా పేరు పిలవలేదు. నాపేరు ఆమెకి అక్కర్లేదు. ఇప్పుడు నేను ఓ నంబరు గా మాత్రమే గుర్తింపబడతాను. నా పేరు లేనప్పుడు నా ఎక్సిస్టెన్స్ ఉన్నట్టా లేనట్టా !

ముగ్గురం తలుపు తెరుచుకుని గదిలోకి వెళ్ళాం. తలుపులు ఆటోమాటిక్ గా మూసుకుపోయాయి . భయపడిపోయాను ఓ సారి మూసుకున్న తలుపులు వైపు చూసి, ఓ పెద్ద టేబుల్ వెనక కూచున్న వాళ్ళని భయంగా చూసాను.

" కూచోండి " అన్న మనిషిని చూసాను.టేబుల్ కి ఇవతల వైపున్న కుర్చీల్లో మేము కూచున్నాం.

మనిషి చామనఛాయ, చిన్న గడ్డం. సన్నమీసాలు. నల్ల ఫ్రేమున్న కళ్ళద్దాలు. మరీ లావు కాదు, మనిషి ఎలా ఉన్నా గొంతు బావుంది, వెంటనే ప్రద్యుమ్న గుర్తొచ్చాడు. ప్రద్యుమ్న గొంతు కూడా చాలా బావుంటుంది. మంచి హిందీ పాటలు పాడి దాని అర్థం,దాని లోతు ,చెప్పేవాడు. నేనెందుకు రావడంలేదో అతనికి తెలీదు. తెలిస్తే ఎలా ప్రవర్తిస్తాడు. ఎలా తెలుస్తుంది. తెలిసే అవకాశమే లేదు

" నీ పేరు ఏఁవిటీ? "

చెప్పాను.

" అడిగినదానికి నీకు తోచిన జవాబులు ఇయ్యి "

ఇది వరకూ కూడా ఇద్దరు డాక్టర్లు ఇలాగే అన్నారు. ప్రశ్నలు అడిగారు. నేను సమాధానాలు ఇచ్చాను. కానీ ఏం జరిగింది ? ఏం జరగలేదు. నేను రోజు రోజుకి నిరాశలో కూరుకుపోతున్నాను. నాకు తెలుసు, ఇప్పుడు కూడా అదే జరగబోతోంది.

అంతలో ఓ అసిస్టెంట్ వచ్చారు. డాక్టరుగారు ఏవో అడిగారు. నేను ఏం చెప్పానో నాకు తెలీదు. కాని జవాబులిచ్చాను. నేను మాట్లాడినదంతా రికార్డు చేస్తున్నారు. డాక్టరు కూడా రాసుకుంటున్నారు. ఆయన రాసుకోవడం పూర్తయ్యాకా నా వైపు చూసారు. ఆధునిక పరికరాల సాయంతో పని చేస్తున్న ఈ టీం, వీళ్ళ ప్రొసీజర్ ఏదో బాగానే ఉన్నట్టనిపించింది. ఇంతకు ముందు ఇద్దరు ఇలాగా లేరు. వాళ్ళిద్దరూ కూడా ఓ మామూలు డాక్టర్లలా క్లినిక్ పెట్టుకున్నారు. ఇది అలా లేదు. ఏదో హోటల్ గదిలా ఉంది.ఇక్కడ ఇద్దరు డాక్టర్లున్నారు. నేను చెప్పింది విన్నారు. రికార్డు చేసారు. ఇది డిఫరెంటుగా ఉంది. అయినా కొంచెం సంతృప్తిగానే ఉంది.

"నువ్వు బయట కూచో. మీ పేరెంట్స్ తో మేము మాట్లాడాలి. మరో ముగ్గురు డాక్టర్లతో చర్చించాలి " నేను బయటికి వచ్చేసి అక్కడున్న ఓ ఇనప కుర్చీలో కూచున్నాను. చుట్టూ చూసాను. ఓ ఇద్దరు పేషెంట్లు,వాళ్ళ తాలూకూ బంధువులుఉన్నారు. ఎవరూ ఎవరితో మాట్లాడుకోవడం లేదు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు.

ఓ పావుగంట తరవాత అమ్మా ,నాన్న బయటికి వచ్చారు. వాళ్ళ మొహాల్లో సంతోషం లేదు. బాధగా ఉన్నాయి.

" శృతీ నీ గురించి చాలా మాట్లాడారు. నిన్ను, అబ్సర్వేషన్లో పెడితేనే మంచిదన్నారు "

నా నోట మాట రాలేదు. నా కేసంతా సీరియస్సా? ఆ సంగతి అంతకు ముందు డాక్టర్లకి తెలియలేదా ? లేకపోతే ఈ మూడు నెలల్లో ఎక్కుయిందా? అంటే ఇప్పుడు నేను మామూలుగా లేనా, మామూలుగా లేను అందుకే ఇప్పుడు నేను హాస్పిటల్ లో ఇన్ పేషెంటుగా ఉంచి అబ్సర్వ్ చేస్తారా?

" మరి మీరేం అన్నారు….?" అన్నాను ఆందోళనగా .

" సరే అన్నాం. నువ్వు తొందరగా బాగా అయిపోతావని అన్నారు. మాకు అదే కావాలి. అందుకే సరే అన్నాం "

ఒక్కసారి ఏడ్చేసాను.

"సరే అన్నారా. ఎలా అన్నారు.? ఎందుకన్నారూ? నేనేం ఉండను. నన్ను మీతో తీసుకెళ్ళిపోండి. నేను మీకు ఎలాంటి ప్రాబ్లెం ఇవ్వను. నేను మంచిగా ఉంటాను మీకు ప్రామిస్ చేస్తున్నాను. ఏం గొడవ చెయ్యను. చచ్పోతానని అనను. కావాలంటే కాలేజీకి కూడా వెళ్తాను. హాస్పటల్లో అడ్మిట్ అవడం అంటేనే భయం " నేను ఏడ్చేసాను. అమ్మకూడా కళ్ళు తుడుచుకుంది..

" నిన్నిక్కడ ఉంచడం మాక్కూడా ఇష్టం లేదు. వాళ్ళు ఇచ్చిన సమాధానాలు విన్నాకా సరే అన్నాం. తప్పదు, ఇదే మనందరికీ మంచిది. ఇలా ఈ స్థితిలో ఎన్నాళ్ళుండ గలవు? నీకు తగ్గుతున్నట్లుగా అనిపించడం లేదు, ఇప్పటికే ఇద్దరి దగ్గరికి తీసుకెళ్ళాం. ఏం జరిగిందో నీకు తెలుసు, మాకు తెలుసూ. మరో ప్రయత్నం చేద్దాం. చెయ్యడంలో తప్పులేదు కదమ్మా. ఇతను మన దేశంలో ఉన్న మంచి డాక్టరని అంతా అన్నారు. పైగా బెంగలూరు ఇన్సిటిట్యూట్ లో చాలా ఏళ్ళు పనిచేసాడుట, నిన్ను బాగా చూసుకుంటారని డాక్టరుగారి మాటల్ని బట్టి మాకు అర్థం అయింది " అంది అమ్మ కళ్ళు తుడుచుకుంటూ అంది. నాన్న గంభీరంగా దిక్కులు చూస్తున్నారు.

ఓ గంట తరవాత మేము డాక్టరు గారు చెప్పిన ఆసుపత్రికి వెళ్ళాం. అది సిటీకి చాలా దూరంలో ఉంది. అసలు అక్కడ ఆసుపత్రి ఉందని కూడా ఎవరికీ తెలీదు. అక్కడ ఓ పెద్ద బోర్డుంది. దానిమీద మెంటల్ హెల్త్ అండ్ న్యూరోలాజికల్ సైన్సెస్ అని రాసి ఉంది.మెంటల్ హెల్త్ అంటే ఆ తరవాత ఇంక ఆలోచించడానికి ఏం లేదు. అంటే నేను ఓ మెంటల్ హాస్పిటల్ లో అడ్మిట్ అవుతున్నానా ? అంటే నేను నిజంగా ఓ పిచ్చి దానినా? సైకలాజికల్ గా నాలో సమస్యలున్నాయా? నేను మామూలుగానే ఉంటున్నాను కదా? అయినా కూడానా. నమ్మలేకపోతున్నాను. నాకు నేను మామూలుగా ఉన్నట్టుగా అనిపిస్తోంది. వీళ్ళ దృష్టిలో నేను నార్మల్ గా లేను. అందుకే ఇక్కడ ఉంచుతున్నారు. చుట్టూ పరికించి చూసాను. ఇది ఓ ఆసుపత్రిలాగా లేదు. కొత్తగా కట్టిన ఓ కాలేజీలా, ఉంది. పొడుగ్గా ఉన్న ఓ రెండంతస్థుల బిల్డింగ్ చుట్టూరా చెట్లు. చాలా స్థలం. కాంపౌండు,

లోపలికి వెళ్ళాం. అందరం ఓ గదిలోకి వెళ్ళాం, అందంగా లేత పసుపు రంగు గోడలు.గోడలకి సీనరీలు, పువ్వులు ఉన్నపెయింటింగ్ లు. అక్కడ కుర్చీలు. మళ్ళా వెయిటింగ్. ఆ హాల్లో చాలా మంది, వాళ్ళ తాలూకు వాళ్ళు ఉన్నారు. ఎవరూ కూడా పిచ్చి వాళ్ళ ల్లాగా కనిపించలేదు. అంతా మామూలుగా కనిపిస్తున్నారు. నేను కూడా అంతే కదా, పైకి మామూలుగానే ఉంటున్నాను. కానీ నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు .

మళ్ళీ నంబరు పెట్టి పిలిచారు. ముగ్గురం లోపలికి వెళ్ళాం. నాన్న అంతా చెప్పారు. ముగ్గురం కుర్చీల్లో కూచున్నాం. అంతకు ముందు డాక్టరిచ్చిన రిపోర్టులన్నీ ఇచ్చాం. ఆయన వెంటనే చూసి సిస్టర్ ని పిలిచారు, నన్ను తీసుకెళ్ళమని చెప్పారు.

మమ్మల్ని సిస్టర్ రమ్మంది.అమ్మా నాన్నకూడా మా వెనకాలే వచ్చారు

"శృతీ ,ఇది నీ గది. ఇక్కడ నువ్వుండాలి "నాకు ఇచ్చిన గదిని అమ్మా వాళ్ళు కూడా చూసారు. కాస్సేవున్నారు. వాళ్ళు వెళ్ళి పోతూంటే చిన్నపిల్లలా గట్టిగా ఏడ్చాను.

“ఛ.ఛ చిన్నపిల్లలా ఆ ఏడుపేంటీ.? వీళ్ళందరూ నిన్ను బాగా చూసుకుంటారు. ఏం భయం లేదు. నువ్వు మళ్ళీ మామూలుగా అయిపోతావు ” అని మెల్లిగా చెప్పి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక్కదాన్నిఆ గదిలో, మళ్ళీ ఇదివరకు లాంటి ఫీలింగ్స్. భయం. నాకు అమ్మకావాలి. కాని అమ్మకి నేనక్కర్లేదు . అమ్మ కూడా నాలాగే ఫీల్ అవుతుందనుకున్నాను కాని లేదు. తల తిప్పుకుని వెళ్ళిపోయింది. నాన్నకూడా అంతే. నన్ను వదిలేయడానికి ఎలా ఒప్పుకున్నారు

నన్ను ఇక్కడ అడ్మిట్ చేసి వెళ్ళిపోయారు. కోపం వచ్చేస్తోంది, కోపం ఎలా తగ్గుతుంది ? పిడికిళ్ళు బిగించాను. అక్కడున్న తలుపు మీద కొట్టాను. ఆ చర్యని అడ్డుకోడం కోసం నా చేతిని వెంటనే సిస్టర్ పట్టుకుంది. నన్ను గట్టిగా ఓ పక్కకి లాగింది. నాకు ఇంకా కోపం వచ్చింది. నేను ఏంచేస్తున్నానో నాకే తెలీదు. అంతే నేను ఆమెని కొట్టాను. ఇక్కడ నేనుండను, అంటే వినిపించుకోవేంటీ ? అసలు నువ్వెవరు నన్ను పట్టుకోడానికి ? “ అని గట్టిగా అరిచాను. సిస్టర్ నన్ను పట్టుకుని ఏదో నచ్చ చెప్ప బోయింది.

“ చెప్తూంటే అర్థం అవడంలేదా?” మరోసారి అరిచాను. అయినా ఆమె ఏదో అనబోతోంది. నా మాటని లెఖ్ఖచెయ్యడం లేదని కోపం వచ్చేస్తోంది.

“నన్ను వదలండి” అని గట్టిగా అరిచాను. నా గొంతు పెంచానని నాకు తెలీదు. ఆమె ఏం మాట్లాడలేదు. మరో సిస్టర్ కూడా ఆ పక్కనే ఉంది. ఆమె చేతిలో ఓ సిరింజ్ ఉంది. ఓ ఆయా వచ్చింది. ఆమె నన్ను పట్టుకుంది. అటూ ఇటూ గింజుకున్నాను. ఆమె చెంప మీద ఒక్క లెంపకాయ ఇవ్వాలని ఉంది. కాని కుదరదు. ఎందుకంటే వాళ్ళు నా చేతులు పట్టుకున్నారు, కాలు స్వేచ్ఛగా ఉంది. అంతే కాలితో ఒక్క తన్ను తన్నాను.

**అసలు వీళ్ళెవరు** నన్ను పట్టుకోడానికి ? నేను నా ఇష్టం వచ్చినట్లు నేనుండచ్చు.ఆ స్వతంత్రం నాకుంది. అది నాహక్కు. దాన్ని నేను వాడుకుంటాను. కాని,అప్పటికే సిస్టర్ ఇంజెక్షన్ ఇచ్చేసింది. నా మాట వినలేదు. ఓడిపోయాను. వాళ్ళే గెలిచారు. నాకు పెద్ద అవమానం జరిగిపోయింది. నిస్సహాయంగా చూస్తూండిపోయాను. కళ్ళు మూసుకు పోతున్నాయి. ఎంత సేపు అలా ఉన్నానో తెలీదు. అంటే నిద్ర పోయాననిపించింది.

తెలివి వచ్చాక అంతా ప్రశాంతంగా ఉంది. కాని తలనొప్పి,నోరు కూడా ఎండి పోతున్నట్లుగా ఉంది. అంతకు ముందున్న భయం ఇప్పుడు లేదు . కోపం లేదు.

కాని కళ్ళు తెరవడానికి రాలేదు, ఎంతో ప్రయత్నం మీద కళ్ళు తెరిచాను. కలలా ఉంది . టెర్రేస్ పైనుంచి పడాలనుకున్నాను. పడ్డానా,కిందమెత్తగా ఉంది. పరుపులాగా ఉంది. నేల లాగా లేదు. అంటే నేను కింద పడలేదా! పడలేదు. వీపుకి గట్టి నేల తగలడం లేదు. మెత్తటి పరుపుంది. మరైతే ఎక్కడున్నాను? మాఇంట్లోనా? మా ఇంట్లో గోడలు ఈ రంగులో లేవు. ఒక వేళ ఉన్నా ఏ గదిలో? గుర్తుకు రావడం లేదు. అలా ఆలోచిస్తూండగానే సిస్టర్ వచ్చింది. ఆమె బట్టలని బట్టి అనుకున్నాను.

“ శృతీ ఎలా ఉంది ? తల దిమ్ముగా ఉందా? కడుపులో ఏమైనా తిప్పుతోందా. వాంతి వచ్చేట్లుగా ఉందా ? ”

“ఇది హాస్పటలా ! నేను ఓ పేషెంటునా ! ” ఆమె డ్రెస్ ని బట్టి ఆమె ఓ నర్స్ లాగా అనిపించింది.

“ అవును . మానసిక రోగుల చికిత్స కేంద్రం లో ఉన్నావు. ఈ రోజు పొద్దున్న జాయిన్ అయ్యావు. ఇప్పుడు సాయంత్రం అయింది ”

నాకు నోట మాట రాలేదు. మానసిక చికిత్స అంటే నేను మెంటల్ ఆసుపత్రిలో ఉన్నానా! పదో క్లాసులో స్కూలు ఫస్ట్, క్లాస్ లీడర్, స్కూల్ కాప్టెన్, అన్నింట్లో ఫస్ట్ ఇంటర్ లోకూడా అంతే. కాలేజి బ్యూటి,మొగ పిల్లలు ఉత్తరాలు రాసేవారు. అందరూ ఆరాధించే విధంగా ,ఎంతో స్మార్ట్ గా తెలివైన అమ్మాయి అయిన నేను ఈ మెంటల్ ఆసుపత్రిలో ఉండడం ఏంటీ? అపనమ్మకంగా ఆమెని చూసాను.

“నేను సిస్టర్ మమతని. ఎలా ఉన్నావ్? పొద్దున్న నీకు కొంచెం బాగాలేదు. మంచినీళ్ళు కావాలా?” అంటూ నా మణికట్టు పట్టుకుంది.

అప్పుడు గుర్తొచ్చింది,ఉదయం ఆమెని గట్టిగా కొట్టాను. అరిచాను. కొంచెం సిగ్గు పడ్డాను.

“ ఇప్పుడు నాకు బాగానే ఉంది. పొద్దున్న నేను టూమచ్ గా బిహేవ్ చేసాను కాని ఇప్పుడు బాగానే ఉంది సారీ ” అన్నాను.

“ అవును బాగానే ఉంటుంది. ఎందుకంటే ఈసీటి కదా ”

“ ఈసీటీ అంటే ? ”

“ ఎలక్ట్రిక్ షాక్ తెరపీ, మీకింకా దీనిని గురించిన వివరాలు కావాలంటే, డాక్టర్ గారిని అడగండి. ఆయన మీకు చెప్తారు ”

షాక్ తిన్నట్లు చూసాను. మాట పడిపోయింది. నాకు ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చారా? అంటే సినిమాల్లో ల్లాగా అన్నీ వైర్లు పెట్టి కరెంటు పాస్ చేస్తూంటే ఆ పేషెంట్ ఎగిరి ఎగిరి పడడం, ఆ తరవాత ఏం జరుగుతుందో సినిమాల్లో చూపించ లేదు. నాకు అంతవరకే తెలుసు. ఇప్పుడు నాకు అలా చేయించారా? నాలో అసలు ఏం జరుగుతోంది? ఇప్పుడు నిజంగా నాకు పిచ్చి పట్టేలా ఉంది. ఆ ఆలోచన రాగానే ఏడుపొచ్చింది. అంతే. నిశ్శబ్ధంగా ఉన్నాను. ఆమె నా వైపు చూసింది.

“ కొంచెం సేపట్లో డాక్టరు గారు వస్తారు. అతను మీతో మాట్లాడుతారు”

ఆమె అన్నట్లు గానే అంతలో డాక్టరుగారు వచ్చారు. మరో ఇద్దరు కూడా అతని వెనకాల ఉన్నారు.

“ నేను ఈ వింగ్ కి డాక్టర్ ని. నాపేరు పాల్ ”

ఎందుకో వెంటనే డాక్టరు గారి మాటలు వినగానే వంశీ గుర్తొచ్చాడు. వంశీ కూడా అంతే. ప్రతీసారి నేను వంశీ కృష్ణ ని, ఈ క్లాసులో చదువుతున్నాను. అంటూ తనని తాను పరిచయం చేసుకుంటాడు. నేను నవ్వేసే దాన్ని. ప్రతీ సారి నిన్ను నువ్వు ఎందుకు పరిచయం చేసుకుంటావు. మూడేళ్ళ నుంచి మనిద్దరం ఒకే క్లాసులో ఉంటున్నాం కదా. నువ్వు ఎవరో మాకు తెలుసు. అనేవాళ్ళం.

“ఏదో ఓ మానరిజం ఉంటేనే కదా మనం గుర్తుంటాం” అని వంశీ నవ్వేవాడు.

ఆ మాట నిజం అందుకే కదా ,ఆ మానరిజంతోనే కదా, ఈ రోజు వంశీ గుర్తొచ్చాడు. చాలా రోజులయింది, వంశీ నుంచి ఉత్తరం అందుకని. ఎందుకో ఉత్తరం రాయలేదు. ఉత్తరం రాసినా అమ్మా వాళ్ళు కాల్చేసి ఉండచ్చు. ఉత్తరం కాల్చేస్తున్నట్లు,ఎన్నో,ఇంకాఎన్నో భయంకరమైన కళ్ళముందు ఉత్తరాలని కాల్చేస్తున్నదృశ్యం. కోపం వచ్చేస్తోంది. నా ఎదురుగా డాక్టరున్నారో,మరెవరున్నారో కూడా చూడలేదు. కోపాన్ని కంట్రోల్ చేసుకోలేను. ఎందుకు చేసుకోవాలి ?

" నాకు ఈసీటి ఇచ్చారా? నాకు తెలీకుండా ఇస్తారా? నాకు చెప్పక్కర్లేదా! నాకు తెలీకుండా, నన్నడగకుండా అలా ఎలా ఇస్తారు? " అని గట్టిగా అరిచాను.

డాక్టరు ఓ సెకెండు నావైపు చూసి, అక్కడ ఉన్న సిస్టర్స్ని బయటికి వెళ్ళమన్నట్లు తల ఊపాడు. గదిలో నేను డాక్టరు గారు ఇద్దరమే ఉన్నాం.

"శృతీ నీకు ఏం ఉందో మేము చెప్పాలి. ఇది మానిక్ డిప్రెషన్. సివియర్ డిప్రెషన్ అని అంటారు " అంతే నేను కళ్ళప్పగించి , నోరు తెరిచి,ఆతని మొహం చూస్తూండి పోయాను. అతని మాటలు నాకు ఏం అర్థం కాలేదు, ఒక్కటి మాత్రం నిజం. నేను మామూలుగా ప్రవర్తించడం లేదు. దానికి ఓ కారణం ఉంది. దానిపేరు మానిక్ డిప్రెషన్.

జీవితంలో మొదటిసారి ఆ మాటని వింటున్నాను. మొదటి సారి నాకు ఏ రోగం ఉందో డాక్టరు అంటూంటే వింటున్నాను.

"ఇది ఓ డిసీస్. మిగిలిన రోగాల్లాంటివే ఇది కూడా. నీ మెదడులో జరిగే రసాయనక చర్యల్లో బాలెన్స్ లేకపోతే, నీ మూడ్ మీద ప్రభావం చూపిస్తుంది. ఇది నీకు తెలీకుండా, నీ ప్రమేయం లేకుండా జరిగి పోతున్నాయి. దీనికి నువ్వు సిగ్గు పడక్కర్లేదు. నువ్వు కావాలని చెయ్యడం లేదు. నిన్ను సరి అయిన వాళ్ళ దగ్గరికే మీ వాళ్ళు తీసుకొచ్చారు. మైండ్ కి ప్రాబ్లెమ్ వస్తే, మనిషి ప్రవర్తనలో మార్పులొస్తే మా సైకియాట్రిస్ట్ ల దగ్గరికి వెళ్తారు. ఈ డిప్రెషన్ లో మనిషి మూడ్ మారిపోతుంది. అది అలల్లాగా ఓ సారి ఎక్కువ అవుతుంది ,ఓ సారి తగ్గుతుంది. ఇది ఎక్కువవకుండా ముందరే డాక్టర్ల దగ్గరికి వస్తే ఈ డిసార్డర్ కొంచెం తగ్గడానికి అవకాశాలున్నాయి. కాని చాలా మంది మా దగ్గరికి రావడానికి ఇష్ట పడరు. సమాజానికి భయపడి సైకియాట్రిస్ట్ దగ్గరికి వెళ్ళరు. బయటి వాళ్ళకి తెలిస్తే పిచ్చి అనుకుంటారని భయం. అసలు అది ఓ రోగం అని కూడా అనుకోరు. కాని నిన్ను బాగా గమనిస్తూ, నీకు ట్రీట్ మెంటు అవసరం అని అనుకుని నిన్ను తీసుకొచ్చిన మీ వాళ్ళకి ధన్యవాదాలు" డాక్టరు నా కళ్ళల్లోకి చూస్తూ అన్నారు.

" శృతీ, ఈ ఈసీటీ నీకిచ్చాం. నీకు చెప్పలేదని నీకు కోపం వచ్చింది. దీని గురించి నీకు చెప్తాను. ఈ.సీ.టీ అంటే ఎలెక్ట్రో కన్వ ల్సివ్ థెరపీ, నీ రిపోర్టు లన్నీ చూసాకా, ఇదే మంచిదనిపించింది. సీవియర్ డిప్రెషన్ ఉన్నప్పుడు, యాంటీ డిప్రెసెంట్స్ పని చేయనప్పుడు సూసైడల్ థాట్స్ ఉన్నవాళ్ళకి ,ఈ షాక్ థెరపీ ఇస్తారు. కానీ దీని మూలంగా నీ మూడ్ మామూలుగా అవుతుంది. ఎందుకంటే నీ ట్రీట్ మెంట్ లో ఇది ఓ భాగం. నువ్వుఇక్కడికి రాగానే నీ ట్రీట్ మెంట్ మొదలు పెట్టేసాం. ఇది మనిషిని మామూలుగా చేస్తుంది. మంచి ఫలితాలని ఇస్తుంది .ఇప్పుడు నువ్వు ఈ రోగంలో అడుగున ఉన్నావు. నిన్ను నువ్వు ఏదైనా చేసుకుంటావు, మేము ఈ విధమైన ట్రీట్ మెంటు ఇవ్వకుండా, నీకు యాంటీ డిప్రెసెంట్స్ ఇవ్వచ్చు. కాని అవి వాడడం మొదలు పెట్టాకా వెంటనే ఏం తెలీదు. ఫలితాన్ని ఇవ్వడానికి అది ఓ మూడు వారాలు తీసుకుంటుంది . నీ గురించి మీ వాళ్ళు చెప్పాకా ఇది మంచిదనిపించింది. ఎందుకంటే, ఈసీటీ ఇచ్చాకా ఆత్మహత్యా ప్రయత్నాలు చాలా

వరకూ తగ్గాయని లెక్కలు తేలాయి. ఇది వారానికి రెండు సార్లు ఇవ్వాలి. ఓ వారం తర్వాత ఫలితాలు అన్నీ చూసాక ఈ రకమైన ట్రీట్ మెంటు అవసరమా లేదా అని ఆలోచిస్తాం "

నాకేం చెప్పాలో తెలీలేదు. నాకేం గుర్తు లేదు. నేను ఆత్మహత్యా ప్రయత్నాలు చేసానా?! మణికట్టు దగ్గర కోసుకోవడం, టెర్రేస్ మీద అమ్మా,నాన్నగారు నన్ను చూడడం అన్నీ అలాంటి ప్రయత్నాలా! నాకు తెలీకుండా చేసేస్తున్నానా? చాలా సేపటికి నేను చేసిన ప్రయత్నాలు నాకు ఏదో లీలగా చూచాయగా ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయి. ఆశ్చర్యంగా ఉంది, నాలో యింత తెగింపు ఉందా! ఆ తెగింపు, ఆ మొండితనం రావడానికి, ఉండడానికి కారణం, ఇవాళ డాక్టరు గారి మూలంగా తెలిసింది.

ఒక్కటి మాత్రం నిజం, ఈ డాక్టరు నా గురించి చెప్పారు. ఇన్ని నెలల్లో మొదటి సారి నాకేం అయిందో, నాలో ఏం జరుగుతోందో నాకు అర్థం అయ్యేలా చెప్పారు. అంతా సద్దుకుంటుందని అని కూడా అన్నారు. ఈ డాక్టర్ని నేను నమ్ముతాను. ఎందుకంటే ఆయన నన్నుఓ పేషెంటులా చూడడం లేదు. ఏదీ దాచలేదు. అన్నీ వివరంగా చెప్పారు. అది చాలు నమ్మడానికి.

ఇన్ని నెలల తరవాత నాతో ఓ వ్యక్తి ఇంత సేపు మాట్లాడారు. నన్ను ఓ మామూలు మనిషిగా గుర్తించారు. నా గురించి నేను సిగ్గు పడక్కర్లేదు. అని ధైర్యం చెప్పారు. సిస్టర్ ని పట్టుకుని గట్టిగా అరిచాను. అప్పుడు అలా అన్నందుకు ఇప్పుడు ఫీల్ అవుతున్నాను. అంటే నేను ఈ తేడాని కనిపెట్ట గలుగుతున్నాను. అంటే నేను కావాలనుకుంటే నా ఆలోచనలని మార్చుకుని మామూలుగా అవచ్చు.

నాలాంటి వాళ్ళు ఈ ప్రపంచంలో ఎంతో మంది ఉన్నారు.వాళ్ళు ట్రీట్ మెంటు చేయించుకుంటున్నారని అని డాక్టరు గారు అన్నారు. ఆయన మాటలని బట్టి , తెలుస్తోంది నేను సరి అయిన డాక్టర్ల దగ్గరికే వచ్చాను. ఈ మాట ఓ పెద్ద రిలీఫ్ గా అనిపించింది.

ఆ రోజు నాన్న గారు ఎంతో మందితో మాట్లాడుతూ కనిపించారు. ఎంతో మంది ఫోన్ నంబర్లు తీసుకున్నారు. ఎక్కడెక్కడికో ఫోన్ చేసారు.ఆఖరికి ఇక్కడికి తీసుకొచ్చారు. సరి అయిన సమాచారం తీసుకున్నారు. సరి అయిన ఆసుపత్రి అని అంటున్నారు. నిజమే ఇది సరి అయిన ఆసుపత్రే.

"మేము నీతో ఉంటాము. నీకు తగ్గేలా చేస్తాము. అన్ని విధాలా నువ్వు మాకు సహకరించాలి. ఇక్కడ నీకు కొంచెం కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ కొన్ని టైమింగ్స్ అవీ ఫాలో చెయ్యాలి. అది నీకు ఇబ్బంది గా ఉండచ్చు. ఇన్ని రోజులూ నువ్వు, నీ ఇష్టం వచ్చినట్లుగా ఉన్నావు. కానీ ఇక్కడ నువ్వు మేము చెప్పినట్లుగా ఉండాలి. ముందు నీ మైండ్ సెట్ మారేలా చేస్తాం.

ఎందుకంటే నీకు ఏం రాదని,ఎందుకూ పనికి రావని,డిప్రెషన్ లోకి వెళ్ళిపోయావు. ఒక్కొక్కసారి, నువ్వేం చేస్తున్నావో,ఏం మాట్లాడు తున్నావో నీకే తెలీదు. ఒక్కొక్క సారి నిన్ను నువ్వే బాధ పెట్టుకుంటున్నావు, ఇవన్నీ తెరలు తెరలుగా ,తరంగాల్లాగా వస్తూంటాయి. అందులో చిక్కుకు పోకుండా బయట పడాలి, అంటే నువ్వు ప్రయత్నించాలి. నువ్వు బయట పడడానికి మా సహకారం, సాయం ఉంటుంది

మృత్యువు మీద మనకు అదుపు లేదు. కాని మన జీవితం మీద మనకు ఉంది. ఇప్పుడు నువ్వు గతం వేపు చూడకు. ఈ రోజున నీకు కావలసినది మానసిక దారుఢ్యం,పాజిటివ్ యాటిట్యూడ్ ,ఇప్పుడు నీకు అదే ఆక్సిజన్. జీవితానికి ఓ కాలిక్యులేషన్ ఉంది. అది అదృష్టానికి సంబంధించినది కాదు. ఆలోచనా ధోరణికి చెందిన క్వాలిటీ అది. జీవితంలో ఉన్నకష్టం అంతా మనకి ఏం కావాలో తెలుసుకోవడం లోనే ఉంది."

చాలు ఈ మాత్రం ప్రోత్సాహం చాలు. ఈమాత్రం ఆశ చాలు. నన్ను నేను రక్షించకోడానికి. డిప్రెషన్ లో పూర్తిగా మునిగి పోకుండా చేయి అందిస్తున్నట్లుగా అనిపించింది.

డాక్టరు గారు వెళ్ళిపోయారు. మళ్ళీ గదిలో ఒంటరిగా.ఆక్సిజెన్ లేకుండా మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాల్సి వచ్చినట్లుగా ఉంది.

కిటకీలకి గట్టిగా ,లావుగా ఉన్న గ్రిల్స్. నాలుగ్గదుల మధ్య ఉన్న నేను స్వేచ్ఛగా లేను అనిపించింది. బంధీ అయిపోయాను. ఇది మామూలు ఆసుపత్రి కాదు, మెంటల్ పేషెంట్ల హాస్పటల్. ఆ పిచ్చి వాళ్ళు కిటికీలోంచి కిందకి దూకకుండా. అలాంటి ప్రయత్నాలు ఏమీ చేయకుండా,కావచ్చు. ఆగదిలో ఏమీ లేదు. నేను పడుకున్న మంచం తప్ప.

ఈ ఖాళీ గది, నా ఖాళీ బుర్రకి సరిపోయింది. ప్రశాంతంగా ఉంది. ఇదే ఇల్లయితే , మందు వేసుకో, స్నానం చెయ్యి, తల దువ్వుకో, తయారవ్వు, కాలేజీకి వెళ్ళాలి, చదువుకో, అది చెయ్యి, ఇది వద్దు, లాంటి ఆంక్షలు ఏం లేవు. వొత్తిడి లేదు. ఏం చెయ్యక్కర్లేదు. నా సమయం. నా ఇష్టం. అసలు ఇలాంటి టైం వస్తుందని అనుకోలేదు. ఇది ఓ చిన్న గూడు. బయటి వార్తలు,కఠినమైన నిజాలు చెవులకి చేరని గూడు, ఇది ప్రస్తుతం నేనుంటున్నది. ఆశ్చర్యం, ఇది నాకు బావుంది. హాయిగా ఉంది. ఎంత భయంకరమైనవి జరగాలో అన్నీ జరిగిపోయాయి. ఎన్నో సార్లు నన్ను నేను బాధించుకున్నాను. ఛావాలనుకున్నాను. అవన్నీ ఈ క్షణాన పీడకలల్లా అనిపిస్తున్నాయి.

ఒక్క రోజులోనే ఇంత మార్పా! ఓ మనిషి తన మాటలతో డిప్రెషన్ లో ఉన్నవాళ్ళని మార్చగలడా. మార్చగలడు అని ఈ డాక్టరు మాటలతో తెలుస్తోంది.

డాక్టరు పాల్ గారు నన్ను బాగా అర్థం చేసుకున్నారు. నా మైండ్ ని చదవగలిగారు. చాలా అనుభవం ఉన్న డాక్టరు, అందుకే నన్ను ఎలా ప్రశాంతంగా ఉంచాలో కూడా అతనికి తెలుసు. ఓ విధంగా ఆశ , ఉత్సాహం , స్ఫూర్తి, ఇవన్నీ నాలో కలిగాయంటే దానికి కారణం ఈ డాక్టరు గారే. డాక్టర్లలోనే ఎంత తేడా అంతకు ముందు నేను వెళ్ళిన ఇద్దరు డాక్టర్లకి ఈ డాక్టరుగారికి సహస్రం తేడా. వాళ్ళకి తెలియనిది యితను కనిపెట్టారు.

ఇప్పుడు నాకు నా రెండో జీవితం ప్రారంభం అయినట్లుంది. ఈ మనిషి మూలంగానే. నన్ను మనిషిని చేసారు. నాతో మాట్లాడారు. అదే నాకు ఊపిరి. నామీద ఎంతో శ్రద్ధ పెట్టారు. మా వాళ్ళు కూడా చూపించనంత శ్రద్ధ డాక్టరుగారు చూపించారు. ఆత్మీయంగా మాట్లాడడం,దగ్గర కూచుని ప్రేమ కనపరచడం నేనున్నానన్న భావం కలిగించడం, చూపిస్తున్న ఈ శ్రద్ధ మనిషిని నిటారుగా నుంచో పెడుతుంది. దాని కున్నశక్తి అలాంటిది. అదే,మేమున్నాం అన్న భరోసా. ఆ భరోసాని ఇక్కడ ఇస్తున్నారు.

ఇది వరకూ ఇద్దరు డాక్టర్లు ప్రిస్క్ రైబ్ చేసిన మందులని డాక్టరు పాల్ గారు ఆపేసారు. ఇప్పుడు ఒక్క మందు మీదే ఉంటున్నాను. ఈ డ్రగ్ సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి కానీ మా జాగ్రత్త తీసుకుని నీకు దీన్ని ఇస్తాము అని డాక్టరు అన్నారు. అదే లీథియం.ఆ టాబ్లెట్ ని రోజుకి రెండు సార్లు వేసుకుంటున్నాను. ఈ టాబ్లెట్ మా లాంటి వాళ్ళకి లైఫ్ సేవర్ అని అన్నారు.

" ఇది ఇప్పుడు వాడుతున్నాం, నువ్వు బాగానే ఉంటున్నావ్, అది వాడుతున్నంత సేపూ బాగానే ఉంటుంది. దీని వల్ల కొంచెం బరువు పెరుగుతుంది. చర్మం పైన దద్దుర్లు లాంటివి రావచ్చు, అందుకని చాలా జాగ్రత్తగా నీ డోసుని డివైడ్ చేసి ఇస్తాం. అది లేకుండా కూడా

నువ్వు బాగా ఉన్నావనుకో, అప్పుడు ఈ మందుని పూర్తిగా మానేయచ్చు ఇంకా ఈ లిథియం గురించి తెలుసుకోవాన్న ఉత్సాహం ఉంటే నీకు దీని గురించిన వివరాలు అన్నీ ఇస్తాను ” అని అన్నారు.

నేను చదువుకున్న దాన్ని. ఇంటర్ లో నా గ్రూపు బైపీసీ, కెమిస్ట్రీ ఉంది, బీఎస్సీలో కూడా అదే. అయినా నేను ఈ లిథియం గురించి తెలుసుకోడానికి ఏమాత్రం ఇంట్రెస్ట్ ఎందుకు చూపించడం లేదు. తెలీదు.

ఇదొక్కటే నాకు కావలసిన మందు. మరి అంతకు ముందు డాక్టర్లిద్దరూ కూడా సీవియర్ డిప్రెషన్కి మందులిచ్చారు. అవి డిప్రెషన్ కి మాత్రమే. అంతే కాని ఆ ఇద్దరూ కూడా నా లో ఏం జరుగుతోందో కూడా తెలుసుకోడానికి ఏ మాత్రం ప్రయత్నించలేదు. తెలుసుకుని ఉంటే ట్రీట్ మెంటు మార్చేవారా. కానీ వాళ్ళు నాతో సరిగా మాట్లాడ లేదు. నన్ను ఓ పేషెంటులాగే చూసారు. ఓ అంటరాని పేషెంటులా చూసారు.

కానీ ఈ డాక్టరు గారు నన్ను ఓ మనిషి లాగా చూసారు. ఒక పేషెంటుని అయినా మామూలుగా చూసారు. నాతో ఎంతో సేపు మాట్లాడారు. చాలా సపోర్టివ్ గా ఉన్నారు. ఇలాంటి కేసులు ఎన్నో చూసినట్లు, వాటిని ట్రీట్ చేసినట్లున్నారు. అందుకే ఎంతో నమ్మకంగా, కాన్ఫిడెంటుగా మాట్లాడుతున్నారు. నేను మామూలు మనిషిని అయిపోతానని గట్టిగా చెప్తున్నాడు. ఆ నమ్మకమే నాకు బలాన్ని, ధైర్యాన్ని ఇస్తోంది.

నేనిలా ఉండడం నా తప్పు కాదు అని డాక్టరుగారు చెప్పారు. ఇందులో నేను చేసిన నేరం ఏమీ లేదు. ఒక్కొక్కసారి ప్రవర్తనలో హెచ్చు తగ్గులు వస్తాయి. ఆ హెచ్చు తగ్గులు రాకుండా ఉండడం కోసం మందు మొదలు పెట్టామని డాక్టరుగారు అన్నారు. అది కూడా నాకెంతో ధైర్యాన్నిస్తోంది. అందరు డాక్టర్లూ ఇలా ఉంటే బావుంటుంది . కాని ఉండరు అని అంతకు ముందు నేను వెళ్ళిన ఇద్దరు డాక్టర్ల మూలంగా తెలుస్తోంది. ఏదైతేనం నేను ఇప్పుడు సేఫ్ హాండ్స్ లో ఉన్నాను.

ఓ రెండు రోజులు గడిచాయి.

డాక్టరు గారు అందరినీ చూసాకా ఆఖరున నా దగ్గరికి వస్తారు. వచ్చాక తన వెంటఉన్న వాళ్ళని వెళ్ళి పొమ్మని సైగ చేస్తారు. వాళ్ళు వెళ్ళిపోగానే నాతో చాలా చక్కగా హాయిగా మాట్లాడుతారు.

ఆ గదిలో డాక్టరు గారితో మాట్లాడడం కన్నా నాకింకేం కావాలి. ఆయన మాటలు నాకు పెద్ద ఆశని జీవితం మీద ఉత్సాహాన్ని కలిగిస్తోంది. దాన్ని పట్టుకుని నడుస్తున్నాను.

“ నిన్ను ఎలాగైనా మామూలు శృతిని చేయాలి, పాత శృతి గా చేయడానికి ప్రయత్నిస్తాను ”

“ చాలా థాంక్స్ డాక్టరుగారు,నా మీద అంత శ్రద్ధ తీసుకుంటున్నందుకు ” అన్నాను ఎంతో నిజాయితీగా.

డాక్టరుగారు నిమిషం కళ్ళు మూసుకున్నారు. కుడిచేతిని ఛాతి ఎడమ వైపున ఉంచారు.

“ మీకు దేవుడంటే బాగా నమ్మకం అనుకుంటాను ”

" అవును. బాగా అని చెప్పలేను కానీ నమ్మకం ఉంది. దేవుడిమీద నమ్మకం లేకపోతే మనమీద కూడా మనకి నమ్మకం ఉండదు. నామీద నాకు నమ్మకం కుదరాలంటే ఆధ్యాత్మికత ఉండాలి. ఎందుకంటే రోజూ నన్ను నమ్మి వచ్చే వాళ్ళతో ఉంటాను. వాళ్ళ నమ్మకాన్నినా వైద్యానికి ఉపయోగించుకుంటాను. ఏ వైద్యానికైనా డాక్టరు మీద నమ్మ కం ఉండాలి అప్పుడే మందులు వైద్యం పనిచేస్తుంది "

అందుకనా అంత శ్రద్ధగా చూస్తున్నారు.!

"నీ మీద శ్రద్ధ తీసుకోవడానికి , ఓ కారణం ఉంది. నీకో సంగతి చెప్తాను, నేను స్కూల్లో చదువుకునే రోజుల్లో నా క్లాస్ మేట్ ఓ రోజున పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకుంది. ఆమెలో అలాంటి ఆలోచన ఉందన్న సంగతి కాని, ఉద్దేశం ఉందన్న సంగతి కాని, ఎనాడూ ఎవరికీ కొంచెం కూడా అనుమానం రాలేదు.

ఆమె పైకి బాగానే ఉండేది. కానీ లోపల ఏం ఉందో ఎవరికీ తెలీదు. కానీ ఏదో ఉంది. అది ఆమెని కష్టపెట్టి ఉండచ్చు. బతికి ఉండడం అనవసరం అనుకునే లాగా చేసి ఉండచ్చు. ఆమె ఎవరితో తన బాధని పంచుకోలేదు. చెప్పుకోలేదు. చెప్పి ఉంటే బాగుండేది. ఎంతో విలువైన జీవితాన్ని తృణప్రాయంగా వదిలేసింది. అందుకే తన జీవితాన్ని అంతం చేసుకుంది. ఆమె మరణం మా స్కూల్లో అందరినీ కుదిపేసింది. ఓ షాక్ లో పడేసింది.

మా అందరికీ ఎన్నో ప్రశ్నలు, జవాబులు దొరకని ప్రశ్నలు. జవాబులు లేవు. ఆమె ఎంతో బాగా చదువుకునేది. ఎప్పుడూ మంచి మార్కులు వచ్చేది. ఎప్పుడూ తిట్లు కూడా తినలేదు. ఎవరితోను అవమానింప బడలేదు. ప్రేమలో పడలేదు. అది కూడామాకు తెలుసు. ఆమె ఇంట్లో వాళ్ళు కూడా అలాంటిది ఏం లేదనిఅన్నారు. సాధారణంగా ప్రేమ వ్యవహారాల మూలంగానే,సూసైడ్ లు సంభవిస్తూంటాయి. ముఖ్యంగా ఆమె వయసు వాళ్ళల్లో, కానీ ఆమెఎందుకు చనిపోయిందో తెలీదు. ఏం జరిగి ఉంటుందో కూడా తెలుసుకోడానికి ప్రయత్నించాం. అందులో భాగంగానే ఆమె ఇంటికి వెళ్ళి అందరిని కలిసి అన్నీ కనుకున్నాం. అప్పుడు మాకు నిజం తెలిసింది. ఆమెకి సవితి తల్లి, ఆమె పెట్టే ఆరళ్ళు భరించలేక పోయింది.

ఆ భాధలు చెప్పుకునేందుకు సరి అయిన స్నేహితులు ఎవరూ లేరు అని. ఆమె ఒంటరిగానే ఉండేది అని. ఎవరితో మాట్లాడేది కాదని. అందుకని ఆమె సమస్య ఏంటో మాకు తెలీదు. కానీ ఏదో జరిగింది. ఆమె షేర్ చేసుకోలేదు. మామూలుగా ఆమె చాలా సెన్సిటివ్. ప్రతీ చిన్న విషయాన్ని ఎంతో సీరియస్ గా తీసుకునేది. అయితే ఆమె ఆత్మహత్య అప్పటి కప్పుడు తీసుకున్న నిర్ణయం కాదు. చాలా రోజుల్నించి ఆమె తీసుకున్న నిర్ణయం అది. ఇవన్నీ మానసిక సమస్యలు అని మాకు తెలీలేదు. ఇంట్లో, క్లాసులో ఒంటరిగానే ఉండేది. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళుండే వాళ్ళు అందుకే ఆమెని పట్టించుకోలేదేమో. ఎందుకిలా చేసింది? కారణాలు ఏంటీ ? ఇంకా ఎన్నో ప్రశ్నలు

సరి అయిన సమాధానం రాలేదు, మేమంతా అయోమయంలో ఉండిపోయాం. ఈ అయోమయం మమ్మల్ని, శూన్యంలోకి విసిరేసింది. క్లాసులో అందరం ఇదే అనుకునే వాళ్ళం. అలా ఎలా సూసైడ్ చేసుకుంది ? ఏం బాధలున్నాయి ? ఏం కష్టం వచ్చింది?

**ఆలోచిస్తూంటే** ఒకటే మాకు అర్థం అయింది. పైకి కనిపించని యీ వేదన మానసిక రోగంలాంటిది ఏదో ఆమెలో ఉంది. అది ఎవరూ ఆఖరికి ఇంట్లో వాళ్ళుకూడా కనిపెట్ట లేక పోయారు.

ఆమె ఓ బలహీన క్షణంలో తీసుకున్న బలహీనమైన నిర్ణయం. అదే ఆత్మహత్యకి దారి తీసింది. ఆ బలహీన క్షణం దాటితే,ఆ నిర్ణయం అంతగా బలపడేది కాదు. అలాంటి బలహీన క్షణాలు రాకుండా ఉండాలంటే,ఇంట్లో వాళ్ళ సపోర్ట్ ఉండాలి. ఏదో ఒక యావోగేషన్ ఉండాలి. అది మనిషి ఒంటరి తనాన్ని దగ్గరికి రానీదు.

అందుకని అలాంటి వాళ్ళూ మరీ ఒంటరితనంతో బాధ పడుతూంటే అనాధాశ్రమాలకి, వృద్ధాశ్రమాలకి వెళ్ళి అక్కడి వాళ్ళతో కొంచెం సమయాన్ని గడపితే వాళ్ళముందు తామెంత అదృష్టవంతులో తెలుసుకుంటారు. కాని వాళ్ళకి ఎవరు సలహా ఇస్తారు. ఎవరో ఒకళ్ళు చెప్పాలి. ఆ ఎవరో అంటే మానసిక వైద్యులు, వాళ్ళే సలహా ఇవ్వగలరు.

అప్పుడే అనుకున్నాను, నేను ఇలాంటి చదువునే చదవాలి, ఇలాంటి మానసిక రోగులకి సాయ పడాలి అని. అదే నేను సైకియాట్రి చదవడానికి కారణం అయింది. నా ధ్యేయం ఈ ఆత్మహత్య చేసుకోవాలి అన్న బలహీనత ఉన్నవాళ్ళకి సాయపడడం. ఆ బలహీన క్షణాలు దాటాలంటే ఏదో ఒక మంచి హాబీని కల్టివేట్ చేయించాలి, తనని తాను మర్చిపోయేలాంటి ఓ చక్కటి యావోగేషన్ ఉండేలా చేయాలి. అన్నింటికీ మించి ఒంటరితనం దగ్గరికి రాకుండా చేయాలి.

మనసులో ఉన్నది చెప్పుకోడానికి ఎవరూ లేరు, ఫీలింగ్స్ పంచుకోడానికి ఎవరూ లేరు,అని అనుకున్న వాళ్ళు నేను ఒంటరిని, నాకీ లోకంలో ఎవరూ లేరు,అన్న భావం వచ్చిందంటే ఏ రోజునైనా ఆత్మహత్య చేసుకుంటారు. ఈ ఒంటరితనం మూలంగానే కదా మనసులో ఉన్నవి చెప్పుకుని పంచుకునేంత దగ్గర వాళ్ళు ఎవరూ లేరనే ఫీలింగ్ తోనే కదా సినిమా వాళ్ళల్లో చాలా మంది సూసైడ్ చేసుకుంటూంటారు. ఈ ఒంటరితనాన్ని ఎలా దూరంచేసుకోవాలన్నది ఎవరికి వారే ప్లాన్ చేసుకోవాలి. లేకపోతే డాక్టర్లని అడగాలి సలహా తీసుకోవాలి.

ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళంతా దారుణమైన స్వార్థపరులు. మా క్లాస్మేట్ కూడా అంతే. జీవించి ఉండడం వేస్టనుకుంది.

జంతువులు ,చెట్లు ఆత్మహత్య చేసుకోవు. ఒక్క మనిషి మాత్రమే చేసుకోగలడు. కారణం ఏంటో తెలుసా. మనసు. ఈ విశ్వం లో మనిషికి మాత్రమే ఆ సౌకర్యం ఉంది. కాని అసలు ఆ మనసుకే ఎసరు తెస్తూంటే ఏంటీ దాని ప్రయోజనం.?

జీవితం ఓ గొప్ప వరం. మన మనసు అనే బంతిని ప్రపంచం అనే గోడకి కొట్టినప్పుడే బతుకు అనే ఆట ఏ స్పీడ్ లో ఆడాలో తెలుస్తుంది. ఆ పనిని ఆపేయడం ఆత్మహత్య. ఆపకుండా ఆటని అలా ఆడుతూ ఉంటే స్థితప్రజ్ఞత అవుతుంది. ఆ స్థిత ప్రజ్ఞత వచ్చినప్పుడు ఆత్మహత్య, అనేది మనసులోకి రానే రాదు. అందుకే ఈ లక్షణాలున్న వాళ్ళని కాస్త గమనిస్తే ఈ ఆత్మహత్యలని ఆపచ్చు. విలువైనవాటిని అవి ఏదైనా జీవితం కానీ మరోటి కానీ,అలా తృణప్రాయంగా పారేసుకోకూడదు. విలువైన దానిని అనుభవించాలి దాచుకోవాలి ,కాని, పోగొట్టుకోకూడదు " అతని గొంతులో జీర.

"అయ్యో.....ఐయామ్ సారీ...." నాకేం ఇంక చెప్పాలో తెలీలేదు.

"అలా అనకు.ఆమె మరణం నన్ను స్ట్రాంగ్ చేసింది. నేను ఏం చెయ్యాలో, నా లక్ష్యం ఏంటో తెలిపింది. నన్ను ఓ డాక్టర్ని చేసింది. నేను ఓ మామూలు డాక్టర్ని కాను. ఓ పెద్ద పేరు పొందిన డాక్టరుగా నన్ను తయారు చేసింది. కాదు ,అలా నా జీవితాన్ని నేను తయారు చేసుకున్నాను. నా గురించి ఆలోచించు కున్నాను కాబట్టి నలుగురికి సాయపడేలా నన్ను చేసింది. నేను అలాంటి దారిని ఎంచుకున్నాను. నన్ను అలా ఉండేలా చేసిన ఆమెకి మనసులోనే దండం పెట్టుకుంటాను. "

“ఆమె అంటే మీకు...”

“అభిమానం. ఆ వయసులో నేను ప్రేమించిన మొదటి అమ్మాయి ఆమె . నామొదటి లవర్. ఆమెని మర్చిపోలేదు. అందుకే నా పేషెంట్లతో మాట్లాడటప్పుడు దేవుడిని తలుచుకుంటాను, ఆ అమ్మాయిలాగా కాకుండా వీళ్ళు మంచి మార్గాన వెళ్ళాలి ”

మరి నేను, నా సంగతి ఏంటీ. నా ప్రేమ ఏంటీ . నిజంగా నేను ప్రేమించానో లేదో ఆ సంగతి నాకు తెలీదు కానీ ముగ్గురు నా జీవితంలోకి వచ్చారు. వాళ్ల ఎవర్నీ నేను మర్చిపోలేదు.

“ ఇప్పుడు నువ్వు నీ గురించి ఆలోచించుకోవాలి. నువ్వు కాలేజీ మానేసావంటే, అన్నీ ,అంతా అయిపోయిందని అనుకోకు. చదువు ఒక్కటే జీవితం కాదు. అదే నీ జీవితానికి ఆఖరు కూడా కాదు.జీవితంలో ఎన్నో చేయచ్చు. ఎన్నో ఉన్నాయి.అదే ఆలోచించుకోవాలి. ఆలోచించడం మొదలు పెట్టు. నా ఆలోచనలు నన్నునీలాంటి ఓ నలుగురికి సాయపడేలా చేసాయి. అందుకే ఈ క్షణం నుంచే నీ గురించి ఆలోచించు. ఏంచెయ్యాలో ,ఏంచేస్తే బావుంటుందో ఆలోచించు ”

మొదటి సారి నాకు ఓ ఛాయిస్ ఇస్తూ మాట్లాడిన మనిషి నా ఎదురుగా ఉన్నారు. మొదటి నుంచి నాకు ఓ ఛాయిస్ ఇవ్వాలని మా వాళ్ళు ఎప్పుడూ కూడా అనుకోలేదు. అన్నీ వాళ్ళు చెప్పిందే చేసాను అందులో ఇంతటి నిరుత్సాహం ఉందన్న సంగతి ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. ఇప్పుడిప్పుడే డాక్టరుగారు మాట్లాడాకా నాకు నిజంగా నా మీద ఉత్సాహం పెరిగింది. నా మీద కన్నా నా జీవితం మీద అనే చెప్పుచ్చు.

నేను నా ఆలోచనలో ఉండగానే డాక్టరు గారు వెళ్ళి పోయారు.

ఇప్పుడు ఆయన నాకు ఇచ్చింది జీవితాన్ని గురించిన ఇన్ ఫర్మేషన్ కాదు, జీవితం ఎలా ఉండాలో , దానికి ఏం చెయ్యాలో అనే ఓ ఆలోచనకి ఓ చిన్న విత్తనం వేసి వెళ్ళారు. ఇప్పుడు నేను చేయాల్సింది ఒకటే, నేనే మట్టినయి, కొద్దిగా కొద్దిగా నీరు పోసి వేరు నుంచి పైకి లాక్కుని రావాలి . పూల మొక్కని పెంచాలి. అది నాలో ఓ చిన్న ఆశా కిరణం కనిపిస్తోంది. ఆ తలుపు సందుల్లోంచి నా వైపు ప్రసరిస్తోంది.

ఇన్ని నెలల తరవాత నేను నా భవిష్యత్తు గురించి ఇప్పుడు ఆలోచించాలి. ఏంచేయాలి ? అసలు ఏం చెయ్య గలను ?

ఇదివరకు ఏం చేసానో గుర్తు లేదు. ఇన్ని ఏళ్ళూ ఏం చేయకుండానే ఇంత పెద్దగా అయ్యానా ఏదో చేసాను. కానీ ఏం చేసానో గుర్తు లేదు. గుర్తు రాకపోతే నేను ముందుకి ఎలా వెళ్తాను?

చదవడం రాయడం ఎప్పుడో మానేసాను. అసలు అక్షరాలు కూడా మర్చిపోయానేమో అన్న భయం ఇంకా ఎన్నో భయాలు. మర్నాడు డాక్టరు గారు వచ్చినప్పుడు నా భయాలు అన్ని చెప్పుకోవాలి. ముఖ్యంగా నేను నా చదువు గురించి...

రాత్రి ఎప్పుడవుతుందా. ఎప్పుడు తెల్లారుతుందా, అని ఎదురు చూసాను. నాకు తెలిసి ఈ మధ్య కాలంలో ఇదే మొదటి సారి సూర్యోదయం కోసం ఎదురు చూడడం. అది కూడా . ఎంతో ఉత్సాహంగా ఎదురు చూడడం. ఎందుకంటే ఎప్పుడూ నిద్రే. ఎప్పుడు సూర్యుడు వస్తున్నాడో ఎప్పుడు వెళ్ళిపోతున్నాడో తెలీదు. ఇప్పుడు ఈ ఎదురు చూస్తుంటే టైము గడవడం లేదనిపించింది. ఉదయం ఎప్పటికీ రావడంలేదని ఎప్పటికీ తెల్లారడం లేదని మొదటి సారి గమనించాను.

డాక్టరు గారు రాగానే నా మనసులో ఉన్న ఆలోచనలు అన్నీ చెప్పాలి అని అన్నాను. ఆయన నా తల మీద చేయి వేసి నిమిరారు. అందులో చెప్పు అన్న అర్థం ఉంది. డాక్టరుగారు నాకు చాలా దగ్గరయ్యారు. ఆయనతో నిస్సంకోచంగా ఎన్నో చెప్పగలుగుతున్నాను.

" నా గురించి ఆలోచించి నప్పుడు, కొన్ని అనుమానాలు నన్ను చుట్టుముట్టాయి. ఆ అనుమానాలు, నా భయాలు మీకు చెప్పుకోవాలి డాక్టరు గారూ , మొదటిది నేను చదవడం ,రాయడం . ఆ రెండూ చేయలేక పోతున్నాను.ప్రయత్నించాను. కానీ అది ఇదివరకూ లాగా చేయలేక పోతున్నాను . ఎంతో చదవాలని ఉంది కాని ,చదవలేక పోతున్నాను. ఏమో ముందు ముందు కూడా ఇలాగే ఉండచ్చు. నా భావి జీవితానికి కావలిసిన ఈ రెంటిని నేను చేయలేకపోతే , అప్పుడు జీవితాంతం ఇక్కడే ఉండాల్సి వస్తుందేమో,నేను పాత శృతిలాగా చదవడం రాయడం చేయగలిగితేనే కదా నేను ముందుకు వెళ్ళేది."

డాక్టరుగారు తలని అడ్డంగా ఊపుతూ నవ్వారు. "ఆ భయం నీక్కర్లేదు . నువ్వు ఇక్కడ ఉంటానన్నా మేము ఉండనివ్వము. నిన్నుఇక్కడినుంచి నేనే పంపిస్తాను.నిన్ను సంపూర్ణ ఆరోగ్యవంతురాలిలా తయారు చేస్తాం. ఆ విధంగా తయారు చేస్తాం "

" నన్ను ఆరోగ్యవంతురాలిలా తయారు చేసి మీరు పంపించినా లాభం ఏం ఉంటుంది డాక్టర్...నేను ఇక్కడి నుంచి వెళ్ళాకా ఏం చేయగలను? అసలు ఏం చేస్తాను ? "

డాక్టరు గారు,తన చేతి వేళ్ళతో అక్కడున్న టేబుల్ మీద చిన్నగా కొట్టారు.

" సరిగ్గా ఇదే నేను కూడా అనుకున్నాను. ఇక్కడి నుంచి వెళ్ళాకా నువ్వు ఏం చేయగలవని, అందుకే నేను ముందే ఊహించాను , నీలో ఇలాంటి భయాలుంటాయని, దానికి జవాబు కూడా సిద్ధంగా ఉంది.

నీకు ఇప్పుడు బాగానే ఉందంటున్నావు, మాకు కావలసినది కూడా అదే. అయితే మేము నీకు మందులు రాసి ఈ మందులు వాడు, ఆ తరవాత నెల కో సారి రమ్మని అనం. అది కేవలం డాక్టరు పేషెంటు బంధం మాత్రమే.అది మాకిష్టం లేదు. కాని మనది అలా కాదు.అలా చేయడం నా కిష్టం లేదు. నీ భవిష్యత్తుని మేము తీర్చాలి కదా. అది చేయలేనప్పుడు ఇక్కడ వైద్యం చేయించుకుని లాభం ఏం ఉంది ? అందుకే దానికి ఏం చేయాలన్నది కూడా ఆలోచించాము.

ఏది చేసినా మేము నీవైపు నుంచి కూడా చూడాలి. నీ శక్తి ఎంత వరకూ సహకరిస్తుందో కూడా గమనించాలి. మానసికంగా అస్తవ్యస్తంగా ఉన్ననువ్వు ఇప్పుడిప్పుడే కొంచెం కొంచెంగా తేరుకుంటున్నావు. నీకు పూర్తిగా తగ్గి పోలేదు. ఇంత వరకు జరిగినది మొదటి మెట్టు మాత్రమే. ఇంకా నువ్వు ఎక్కాల్సిన మెట్లున్నాయి. అందుకని నిన్ను ఇక్కడి నుంచి డైరెక్ట్ గా ఇంటికి పంపించము.

ఇక్కడనుంచి నిన్ను మరో వింగ్ కి పంపిస్తాము. అక్కడ నీకివ్వబోయే థెరపీ నీకు అన్ని విధాలా నయం చేస్తుంది. ఆ ప్రోగ్రాం కూడా ఈ కాంపస్ లోనే ఉంది. అది నీకు అన్ని విధాలా తోడ్పడుతుంది. అప్పుడు నీకు గతం అంతా ఓ పీడకలలా అనిపిస్తుంది "

నాలో ధైర్యాన్ని పంప్ చేసారు.అయితే ఓ సందేహం వచ్చింది . ఈ డాక్టరు గారు అక్కడికి వస్తారా అని. ఎందుకంటే ఆయన నా జీవనరేఖ. ఆయన ఆక్సిజన్ లాంటి ఆశని నాలో చిగురింప చేసారు. ఆయనని చూడకుండా మాట్లాడకుండా ఎలా ఉండ గలను. అదే విషయాన్ని ఆయననే అడిగేసాను.

డాక్టరు గారు తలని చిన్నగా అడ్డంగా ఊపారు.

" అక్కడ వేరే డాక్టర్లుంటారు.ఆ వింగ్ ఇంచార్జి కూడా వేరే "

నేను ఒక్కసారి కుంగిపోయాను. డాక్టరు ని చూడకుండా ఎలా ! ఆయనతో మాట్లాడకుండా ఎలా  డాక్టరుగారితో మాట్లాడడం నా రొటీన్ లో ఓ భాగం అయిపోయింది. అది ఆయనకి  అర్థం అయినట్లుంది.  చిన్నగా పెదవులు విడకుండా చిరునవ్వుతో చూసారు.

"నా రౌండ్లు పూర్తయ్యాక నేను రోజూవస్తాను. అది నీకోసం "

అతని మాటలు నాకు ఎంతో సంతోషాన్ని కలిగించాయి.ముఖ్యంగా నీ కోసం. అన్న మాట. అంత పెద్ద మనిషి, నాకోసం ఆ వింగ్ లో పని లేక పోయినా, నా కోసం వస్తానంటున్నారు. ఆ ఒక్క పదం దానిలోఎంతో బలం ఉన్నది. ఎంతో శక్తి ఉంది. ఆ సంతోషంలో ఆనందంగా డాక్టరు గారిని చూసాను. ఆనందంలో పెదవుల విడకుండా చిరునవ్వు నవ్వాను.

"నువ్వు ఇలాగే ఎప్పుడూ చిరునవ్వుతూ ఉండాలి. నీ మొహం ఇలాగే వెలుగుతూండాలి నవ్వుతూంటే నువ్వు బావుంటావు, అద్దంలో ఓసారి నిన్ను నువ్వు చూసుకో "

ఆయన మాటలకి ఒక్క సారి నా గుండె సంతోషంతో పొంగిపోయింది. వెంటనే మొహం అద్దంలో చూసుకోవాలనిపించింది. చిరునవ్వుతో మొహం వెలుగుతూంటూంటే ఎలా ఉంటుందో.

డాక్టరుగారు వెళ్ళాకా నవ్వు మొహం పెట్టి, నన్ను నేను అద్దంలో చూసుకున్నాను. ఇది వరకూలాగా లేకపోయినా నా మొహం బాగానే ఉన్నట్లనిపించింది. అద్దం అబద్ధం చెప్పదు. కాబట్టి నేను బావున్నాను.

మరో వింగ్ కి వెళ్ళడానికి మానసికంగా తయారయి పోయాను. నేను మామూలుగా ఆరోగ్యంగా ఉండాలంటే వీళ్ళు చెప్పినది చెయ్యాల్సిందే. పైగా డాక్టరు గారు వస్తానని అన్నారు కూడా. నాలాంటి వాళ్ళని బాగు చెయ్యడమే ఓ ఛాలెంజ్ గా తీసుకున్నారు. అలాంటప్పుడు నేను పూర్వపు శృతి లాగా తప్పకుండా అయిపోతాను. అయిపోవాలి.

మరో నాలుగు రోజులకి నన్ను మరో వింగ్ కి మార్చారు.

ఇది వేరేగా ఉంది ఇదివరకూ ఉన్న ప్రపంచానికి భిన్నంగా ఉంది. మెయిన్ బిల్డింగ్  నుంచి చాలా దూరంలో ఉంది. పైగా అంతా చెట్లు. పెద్ద చెట్లు ,ఎండ రాకుండా నాలుగు వైపులకి వ్యాపించిన గొడుగు లాంటి చెట్లు. వాటి కింద చిక్కగా దట్టంగా పెరిగి అల్లుకుపోయిన గడ్డి, పూలమొక్కలు, క్రోటన్ మొక్కలు, అది ఓ హాస్పటల్ లాగా అనిపించడం లేదు. ఏదో గెస్ట్ హౌస్ లాగా ఉంది. ఓ రిసార్ట్ లాగా ఉంది. ఈ మూల నుంచి ఆ మూల వరకూ ఉన్న పొడుగాటి బిల్డింగ్. ఒకటే అంతస్తు. దాని ముందు లాన్లు, పూల మొక్కలు, పూలు పూయని క్రోటను మొక్కలు. ఎటూ చూసినా పచ్చదనం. కళ్ళకి హాయిగా అనిపించింది.

నన్ను తీసుకెళ్ళి, నా గది చూపించారు. అంతకు ముందున్నగదిలో ఒక్క మంచం మాత్రమే ఉంది. ఇంకేమీ లేదు. కానీ ఇక్కడ ,మామూలుగా ఓ హాస్పటల్ లో ఉండే గదిలాగా ఉంది. ఓ సీలింగ్ ఫాను. రెండు సింగిల్ మంచాలు. ఓ టేబుల్, ఓ కుర్చీ, పెన్నులు పెనసళ్ళు. ఓ పుస్తకం. టేబుల్ పైన గోడకి ఓ ఛార్ట్ తగిలించి ఉన్నది. ముందు నేను దాన్నిపట్టించు కోలేదు.

నాతో వచ్చిన సిస్టర్ ఆ చార్ట్ ని చూపిస్తూ అంది.

“అందులో మీరు ఏం చెయ్యాలో , టైము టేబుల్ ,అంతా రాసి ఉంటుంది. మీకు అర్థం కాకపోతే మేము చెప్తాం. మేము గుర్తు చేస్తాం. మీకు అన్ని విధాలా సాయం చేస్తాం ”

ఆ చార్ట్ ని చూసాను కాని చదవలేక పోయాను.ఆ సిస్టర్ నిఅందులో ఏం ఉందో చదవ మన్నాను.

అలాగే అన్నట్లుగా చిరునవ్వుతో నన్ను చూసి చదివింది.

దానిమీద నా పేరుంది. డాక్టరుగారి పేరుంది. దాని కింద ఏ టైముకి ఏం చెయ్యాలో వివరంగా రాసి ఉంది. ఇది మీ టైం టేబుల్ . ఉదయం నడక ,బ్రేక్ ఫాస్ట్, రిక్రియేషన్, మధ్యాహ్నం భోజనం, రెస్ట్,తోటపని, సైకో థెరపీ, కౌన్సిలింగ్. లైబ్రేరీ, యోగా, రెస్ట్, భోజనం, నిద్ర.ఆ తరవాత ఆమె వెళ్ళి పోయింది.

ఆశ్చర్యం వేసింది. టైం టేబుల్ అంటే నాకు తెలిసినవి రెండు. క్లాసు ,పీరియడ్లూ,సబ్జెక్టులు. అది స్కూల్లో. ఇంట్లో టైం టేబుల్ వేరేగా ఉంటుంది. ఏ సబ్జెక్ట్ ,ఎంత సేపు.ఏరోజు ఎన్ని సబ్జెక్ట్లు . కానీ ఈ టైం టేబుల్ వేరేగా ఉంది. కొత్తగా ఉంది.

టైం టేబుల్ చదివాకా, ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాను. ఇన్ని రోజులు ఏం చేసాను? టైం ఎలా గడిపాను ? ఏం చేసాను ? ఏం చెయ్యలేదు రోజులు గడిచాయి. కాని ఇందులో ఉన్న విధంగా మాత్రం గడప లేదు. ఈ ఛార్ట్ లోఉన్నట్లుగా మాత్రం చెయ్యలేదు. ఖాళీగా కూచోడం, పడుకోవడం, లేకపోతే కిటికీ లోంచి చూడడం. మొద్దులా తయారైన నేను ఇప్పుడు బిజీగా ఉండగలనా! ఇందులో రాసి ఉన్నట్లుగా చేయగలనా ?అలా ఉంటే బాగానే ఉంటుంది . ఏదో ఓ దినచర్య. ఖాళీగా ఉండక్కర్లేదు. చదవక్కర్లేదు. పరీక్షలూ,మార్కులూ ,ప్రెషర్స్ ఏం ఉండవు.

నాకు చూపించిన గదిని నాకు అలాట్ చేసిన దానిలో సెటిల్ అయ్యే సరికి పదకొండు అయిపోయింది.

రిక్రియేషన్ టైము అని ఓ మనిషి వచ్చి చెప్పి వెళ్ళి పోయాడు. నా గదిలోంచి బయిటికి వచ్చాను.

ఈ రిక్రియేషన్ లో ఏం ఉంటుందో, తెలీదు. అదేదో చూద్దామని వెళ్ళాను. ఆ గది కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. అది ఓ పెద్ద గదిలా ఉంది. ఓ పక్కన టీవీ ,సోఫాలు,మరో పక్కన పుస్తకాలు ,పేపర్లు, అవీ ఉన్న ఓ టేబుల్ . దాని చుట్టూ కుర్చీలున్నాయి. అక్కడ ఓ వయసు మళ్ళిన అతను చదువుతూ కనిపించారు.

పేపర్లు మాగజైన్లున్నాయి. పేపరు చదివితే. అక్కడ ఉన్నపేపర్లలో ఒకటి తీసుకుని చూసాను. అక్షరాలు చూసినట్లుగా అనిపిస్తున్నాయి. కానీ ఏ అక్షరం ఏంటో తెలీడం లేదు. ఓ పదినిమిషాలు అతి కష్టం మీద చదివాను. కానీ నాకేం అర్థం కాలేదు. ఆ పేపర్ ని,అక్కడే పెట్టేసి, లేచాను.

" కూచో . నీకు చివరకు మిగిలేది చెప్పాలి " అంటూ తన పక్కనున్న కుర్చీ చూపించి కూచోమన్నట్టు చేత్తో సైగ చేసారు. మనిషి రంగు చామన ఛాయ. పైజామా లాల్చీ ,వయసు ఓ డెబ్బై వరకూ ఉండచ్చు. ముందు జుట్టు లేదు. బట్టతల. మందపాటి కళ్ళద్దాలు.

నాకు ఏం అర్థం కాలేదు. చివరకు మిగలేది ఏంటో , ఎవరి చివరకు మిగిలేది. దేని గురించి మాట్లాడుతున్నారో అర్థం కాలేదు. కూచున్నాను.

"చివరకు ఏం మిగలదు. ఈ గుప్పిట మూసుకుంటే లోపల ఏం ఉందో తెలీదు. తెరిస్తే అంతా శూన్యం. అంతే మన జీవితాలు అంతే. నీదైనా అంతే. నాదైనా అంతే. ఇప్పుడు అసమర్థుడి జీవయాత్ర చదివితే అందులో మనమే కనపిస్తాం. అంతా మనో వైజ్ఞానికం అనుకో . నామటుక్కు నేను దాన్ని పది సార్లైనా చదివాను, విశ్వనాథ సత్యనారాయణ పుస్తకాలు చదివావా"

చదవలేదన్నాను. నా సమాధానికి ఆయన పెద్ద ప్రాముఖ్యం ఇవ్వలేదు. ఇంత వరకూ నాతో మాట్లాడిన అతను ఎవరో నాకు తెలీదు. నేనెవరో అతనికి తెలీదు. సాహిత్యం అంటే ఇష్టం ఉంది కాబట్టి, అతని మాటలు విండానికి బాగానే ఉన్నాయి. పైగా నా స్పందనల కోసం ,జవాబుల కోసం అతను ఏం ఆగలేదు. అతనలా పుస్తకాల గురించి మాట్లాడుతూనే ఉన్నాడు. నేను వింటున్నానో లేదో కూడా గమనించడం లేదు. నేను అక్కడినుంచి వెళ్ళడం కూడా గమనించ లేదు.

నాకు దేని మీద ఇంట్రెస్ట్ ఉందో నాకు తెలీదు. పేపర్లూ, పుస్తకాలు కష్టం. చదవడం ఇబ్బంది. ఓ మూల ఉన్న పెద్ద కిటికీకి దగ్గరకి వెళ్ళాను, అక్కడ ఓ ఈసల్ , దాని పక్కన ఓ టేబుల్ దానిమీద తెల్ల కాగితాలూ, ఆ పక్కనే రంగులు, బ్రష్ లు ,అన్నీ ఉన్నాయి. అక్కడ ఎవరూ లేరు. ఇది ఓ మానసిక రోగులుండే ప్రదేశం అని ఎవరూ అనుకోరు. ఓ మనిషి మానసికంగా ఆరోగ్యంగా ఉండడానికి ఇలాంటివి అవసరం అని చెప్పే ప్రదేశం. ఇలాంటి హాబీలుండాలి. ఒకప్పుడు నాకూ ఉండేవి ,కానీ, ఇప్పుడు ఏం లేదు. అన్నీ మర్చిపోయాను.ఇప్పుడు కూడా ఏదో వేసెయ్యాలన్న ఉత్సాహం కూడా లేదు.అందుకే అక్కడి నుంచి కదిలాను.

ఈ గది ఓ మనిషి మానసికంగా ఆరోగ్యంగా తయారవడానికి ఇది ఏర్పరిచిన దారి. ఇక్కడ ఉన్నవాళ్ళంతా పైకి బాగానే కనిపిస్తున్నారు. వీళ్ళుఏవో పరిస్థితుల వల్ల నా లాగా అయ్యారా. అందుకే ఈ దార్లోంచి నడుస్తున్నారా.

నాకేం చేయాలో తెలీలేదు, మిగిలిన చోట్లకి వెళ్ళాలని లేదు. ఎక్కడికో వెళ్ళి అక్కడెవరుంటే వాళ్లని పరిచయం చేసుకుని, ఆ పరిచయాన్ని పెంచు కోవాలని లేదు. అందుకని నాలుగువైపులా చూసి నడుస్తూ అలా డ్రాయంగ్ పేపర్లున్న చోటుకి వెళ్ళాను. ఏదో చెయ్యాలి. ఆలోచించాను. అక్కడున్న రంగుల్ని బ్రష్ ల్ని చూసి కొంచెం వెనకాడాను.

ఒకప్పుడు ఇవి నాకెంతో ఇష్టమైనవి. బాగా చిన్నప్పుడు అమ్మ బలవంతం మీద డ్రాయింగ్ పెయింటింగ్ క్లాసులో చేరాను. మొదలు పెట్టాకా క్లాసులు ఎంతో ఉత్సాహాన్ని కలగ చేసింది. మొదటి రోజు వెళ్ళినప్పుడు , అక్కడ రంగు పెన్సిళ్ళతో సీనరీ వేసినప్పుడు కలిగిన లాంటి ఆనందమే ఇంకా ఏమీ వేయకుండానే ఇప్పుడు కూడా కలిగింది. అప్పుడు ఎలాంటి భావోద్వేగానికి లోనయ్యానో కూడా గుర్తొచ్చింది.

ఎంతో సంతోషంగా ఉత్సాహంగా ఉండేదాన్ని. మళ్ళీ ఆ ఆనందం ఉత్సాహం అవన్నీ తిరిగి వస్తాయా! పోనీ ఓసారి వేస్తే ప్రయత్నిస్తే. ఆ ఆలోచనకే చేతులు వణికాయి. ఏదో భయం.

చాలా సేపు అలాగే నుంచున్నాకా నాలోని భయం కొంచెం తగ్గాకా , ధైర్యం చేసి ముందుకి వెళ్ళి ఓ సారి రంగుల్ని పేపర్లని చూసి, పెయింట్ చెయ్యడానికి నిశ్చయించుకున్నాను. బ్రష్ పట్టుకుని తెల్లకాయతం కేసి చూసాను. ఒక లాంటి ఫీలింగ్.

ఏది వెయ్యాలి ఏం వెయ్యను కిటికీలోంచి చూసాను. చైత్ర మాసం. గుత్తులు గుత్తులుగా ఉన్న ఎరుపు రంగు పూలతో, ఆకుపచ్చని ఆకులతో చక్కటి కాంట్రాస్ట్ తో ఉన్న గుల్ మోహర్ కొమ్మలు కనిపించాయి. ఎండ ఆ పూల కొమ్మల మీద పడుతోంది. ఆకులు ,పూలు మెల్లిగా ఊగుతున్నాయి. అది వేస్తే బాగుంటుదనిపించింది. పదో క్లాసులో, ఇంటర్ లో, బీఎస్సీలో బాటనీ, జువాలజీ రికార్డ్ లో డయాగ్రంస్ ఎంతో నీట్ గా వేసి, లేబిలింగ్ చేసే దాన్ని.

ఈ క్షణాన అవి గుర్తొచ్చాయి. ఎంతో శ్రద్ధగా వేసాను. రికార్డ్ లో ఎప్పుడూ ఫుల్ మార్క్స్, ఆ రోజులు గుర్తుకి రాగానే కుంచించుకు పోయాను. నాలో ఎంత మార్పు. ఆ మార్పుని కనిపెట్టడానికి ఎనిమిది నెలలు పట్టింది. అందుకే ఇప్పుడు ఇలా ఇక్కడ. ఈ ఆసుపత్రిలో.

చేయలేను అని అనుకోకు, నువ్వు మనసులో గట్టిగా అనుకుంటే అన్నీ చేయగలవు. అది మొదటి మెట్టు. అన్న డాక్టరు గారి మాటలు గుర్తొచ్చాయి.

**శృతీ, మొదలు పెట్టు**,అని లోపల్నించి ఎవరో అంటున్నారు. ఆ ఎవరో నాకు తెలుసు. అది నా అంతరాత్మ. ఇన్ని రోజులూ పాస్సివ్ గా ఉండిపోయాను. ఇవాళ ఈ రిక్రియేషన్ గదిలో వీటిని చూసేసరికి ఏదో చేయాలన్న ఉత్సాహం కలుగుతోంది.

అంతే. మొదలు పెట్టాను.వణుకుతున్న బ్రష్ ని పేపర్ మీద పెట్టాను. ఏదో వేస్తున్నాను. అది ఏంటో చూడ దలుచు కోలేదు. అలా వేస్తూ పోయాను. నేనెక్కడున్నానో నాకు తెలీదు.చుట్టూ ఏం ఉందో, ఎవరున్నారో చూడడంలేదు. రంగులు ఒక దాని తరవాత లేయర్లు లేయర్లుగా వేస్తున్నాను. ఎంత సేపో తెలీదు. ఎలా వచ్చిందో ఒక్కసారి కూడా ఆ రంగుల్ని చూడలేదు.

కాళ్ళు నొప్పిపెట్టడం లేదు. నడుము వంచి అలా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాను. ఎవరో నా వెనక చిన్నగా మాట్లాడు కుంటున్నారు. అయినా నేను వెనక్కి తిరగ లేదు , ఎవరో ఉన్నట్టుగా అనిపించింది. వేయడం పూర్తయ్యాకా వెనక్కి తిరిగాను.

ఓ ఇద్దరు సన్నగా పొడుగ్గా చామన ఛాయతో, జీన్స్ టీషర్టుతో ఉన్నారు. వయసుని అంచనా వెయ్యలేను. ఇక్కడ వయసుదేం ఉంది. నాకు ఆ రోజు మొదటి రోజు కాబట్టి, అంతకు ముందు వాళ్ళనిచూసే అవకాశం లేదు, కాబట్టి వాళ్ళని నేను చూళ్ళేదు,

వాళ్ళిద్దరూ నాకు కుడిపక్క గా ఓ రెండు అడుగుల వెనక నుంచుని నిశ్శబ్ధంగా చూస్తున్నారు.

" ఓ పెయింటింగ్ ని, కలర్, టెక్స్చర్ హైలైట్ చేస్తాయి. ఇదే కిటికీ, ఇదే చెట్టు, ఇదే బాక్ గ్రౌండ్ తో ఎంత మంది వేసినా బాగానే ఉంటుంది. " అంటున్న వాళ్ళ మాటలు నా వెనకాల నుంచి వినపడ్డాయి.

నేను వేస్తున్నదానికి ఎవరో ప్రేక్షకులుండాలని అనుకోలేదు. మెచ్చుకోవాలని కూడా అనుకోలేదు. వాళ్ళ మాటలకి ఏం అనాలో తెలీలేదు. డాక్టరు గారితో తప్ప మరెవరికీ జవాబులివ్వని నేను, ఎలా రెసిప్రొకేట్ చెయ్యాలో మర్చిపోయాను.

ఇలాంటి పొగడ్త కి ఏం అనాలో ఎలాంటి జవాబివ్వాలో వెంటనే గుర్తు రాలేదు. కాస్సేపయ్యాకా గుర్తు తెచ్చుకుని, "థాంక్యూ" అన్నాను.

థాంక్స్ చెప్పాను కదా అని వాళ్ళిద్దరూ మాటలు పొడిగించారు. కాసేపు పేయింటింగ్ , దానికి వేసిన రంగుల గురించి గురించి మాట్లాడారు.

వాళ్ళకి పెయింటింగ్స్ గురించి,పెయింటర్ల గురించి  చాలా తెలుసనుకుంటాను,  నందలాల్ బోస్, అవనీంద్ర నాథ్ టాగోర్,రవీంద్ర నాథ్ టాగోర్, రాయ్ చౌదరీ ల ఎక్కువ బెంగాలీ చిత్రకారుల గురించి మాట్లాడు కుంటున్నారు.  వాళ్ళ గురించి చెప్తున్నారు. నాకు వాళ్లెవరూ తెలీదు. అయినా వాళ్ళ మాటలు వింటున్నాను.

చాలా రోజుల తరవాత నా గూడు లోంచి బయటికి వచ్చాను.  బయటి ప్రపంచంలో ఉన్న మనుషులతో మాట్లాడగలుగుతున్నాను. అంతేకాదు నాపేరుని వాళ్లు అడిగితే  చెప్పుకున్నాను. అంటే నా పేరు నాకు గుర్తుంది.

"ఇప్పుడు టైము పన్నెండు దాటింది. ఇది లంచ్ టైము,వెళ్దామా " అంటూ కదిలారు ,వాళ్ళిద్దరు .  అది నాకు కూడా వర్తిస్తుంది. నా చేతిలో ఉన్న వి పక్కనున్న టేబుల్  ఉంచి ,చేతులు తుడుచుకున్నాను.   వాళ్ళ వెనకాలే వెళ్ళాను. ఎక్కువ దూరం వెళ్ళ కుండానే  డైనింగ్ రూం కనిపించింది.

డైనింగ్ రూం అంటే ఓ పెద్ద గది లా ఉంది. ఓ పక్కన వండిన వన్నీ ఓ పొడుగాటి టేబుల్ మీద పెట్టి ఉన్నాయి. ఇన్ని రోజులు నా తిండి గురించి  నేను పట్టించుకోలేదు. ఏం తిన్నానో నాకు తెలీదు. అమ్మ ఏం తెస్తే అదే తినేదాన్ని. ఆమెకి ఏం బావుంటుందని అనిపిస్తే ,ఓ కంచం లో పెట్టేది. స్కూలుకి వెళ్ళే రోజుల్లో కూడా అంతే. అమ్మఏది వండితే అదే. అమ్మ ఏది పెడితే అదే. వాళ్ళ ఛాయిస్ తో ఏది తెస్తే అదే తిన్నాను.

కాని ఇప్పుడు ఇక్కడ రకరకాలున్నాయి. నాకు కావలసినది , నాకు ఇష్టమైనది , నేను వడ్డించు కోవచ్చు.

ఓ ప్లేటు తీసుకుని అన్నం కూర వేసుకున్నాను. కంచం లోకి చూసాను. కంచం మధ్యలో అన్నం పక్కనే కూర. తెలుపు ఆకుపచ్చ, కలర్ ఫుల్ గా కంచం. కళ్ళకింపుగా ఉంది. నేనేం తింటున్నానో కూడా చాలా రోజుల తర్వాత చూస్తున్నాను.

ఇన్ని రోజులూ తిన్నాను కాని నేను జీవించడానికి మాత్రమే తిన్నాను. కాని ఇప్పుడు ఏం తింటున్నానో చూస్తున్నాను. మెల్లిగా తినడం మొదలు పెట్టాను. అన్నీ రుచిగా న్నాయి.  అమృతం తింటున్నాను. నా ప్లేటు తీసుకుని వాళ్ళిద్దరి దగ్గరికి వెళ్ళాను. వాళ్ళు చిన్నవాళ్ళు కారు. ఓ నలభై ఏళ్ళున్న వాళ్ళల్లాగా అనిపించారు. జుట్టు అక్కడక్కడా  తెల్లబడింది.

వాళ్ళిద్దరూ పెయింటింగుల గురించి మాట్లాడడం విన్నాను. ఇప్పుడు సినిమాల గురించి పాటల గురించి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళు అన్ని సినిమాలు చూస్తారని, వాళ్ళిద్దరూ పుస్తకాలు బాగా చదువుతారని వాళ్ళ మాటలని బట్టి అర్థం అయింది. నేను కూడా అంతే,స్కూల్లో ఉన్నప్పుడు వార పత్రికలూ,మాస పత్రికలూ చిన్న పుస్తకాలూ,స్కూలు లైబ్రరీలో కూచుని చదివే దాన్ని.

మా ఇంట్లో పుస్తకాలు అవీ తెప్పించే వారు కాదు. క్లాసులో లంచ్ టైములో సినిమాల గురించి,పాటల గురించి,మాట్లాడుకునే వాళ్ళం. ఇంక ఇంటరు నుంచి అన్నీ బంద్. ఇంటికి పేపరు మాత్రం వచ్చేది. దాన్ని చదివే సమయం ఉండేది కాదు.ప్రేయర్ లో ఆరోజు న్యూస్ చదివే నా వంతు అయితే హెడ్ లైన్స్ రాసుకుని వెళ్లి చదివే దాన్ని.

కానీ క్లాసు పుస్తకాల్లోని కవుల గురించి ,సాహిత్యం గురించి స్కూల్లో,కాలేజీలో మాట్లాడుకునే వాళ్ళం. ఎందుకంటే అలా డిస్కస్ చేస్తే బాగా గుర్తుంటుంది, పరీక్షల్లో మాకు రాయడం ఈజీగా ఉండేది. మళ్ళీ ఇన్నాళ్ళకి ఇప్పుడు వీళ్ళతో మాట్లాడుతున్నాను. అన్నీ ఒక్కొక్కటే గుర్తొస్తున్నాయి, కానీ ఇప్పుడు,మాత్రం విన్నదే ఎక్కువ. వాళ్ళిద్దరే చాలా సేపు మాట్లాడారు..

అంత సేపు కలిసి ఉన్నాం. కానీ నేనిక్కడ ఎందుకున్నానో ఎవరూ అడగ లేదు. నేను కూడా వాళ్ళని అడగలేదు. నాలాగే అందరికీ పైకి చెప్పుకోలేని, చెప్పుకోడానికి ఇష్టపడని,గతం ఉందా,అంతే అయి ఉంటుంది. ఎందు కంటే నా గతం ఇక్కడ ఎవరికీ తెలీదు అని నాకు నమ్మకం ఉంది. ఇతరులకి తెలియనంత సేపూ, నేను ఎవరో తెలవనప్పుడు , నాకు నామీద గట్టి నమ్మకం,అదే మాకు రక్షణ, ఎవరికీ తెలియక పోవడం నన్ను సురక్షితంగా ఉంచింది.

వాళ్ళతో మాట్లాడుతూ,నవ్వుతున్నాను.మాట్లాడుతూ తినడం వల్ల అన్నం కూడా ఎక్కువే తిన్నాను. చాలా రోజుల తరవాత,భోజనం చేసాకా ఆయాసం గా అనిపించింది.

గదిలోకి వచ్చాకా మంచం మీద పడుకున్నాను. ఆ రోజున నేను చూసిన వాళ్ళ గురించి ఆలోచిస్తున్నాను. అందరూ పైకి మామూలుగా ఉన్నారు. వాళ్ళకి మానసిక వైకల్యం ఉన్నట్టు

కనిపించడం లేదు. మరి నేను కూడా అంతేనా బయటి వాళ్ళకి మామూలుగా కనిపిస్తానా !

ఎప్పుడో నిద్ర పట్టేసింది. చాలా ప్రశాంతమైన నిద్ర. చాలా రోజుల తరవాత మంచి నిద్ర.

ఇది వరకూ ఎప్పుడూ మత్తుగా ఉండేది .ఇప్పుడు అలా కాదు. ఎంత నిద్ర పోవాలో అంతే పోతున్నాను..

తలుపు మీద ఎవరో టక టక మని కొడ్తుంటే బలవంతంగా కళ్ళు తెరిచాను. కళ్ళు తెరిచానే కానీ నేనెక్కడున్నానో తెలుసుకోడానికి టైం పట్టింది. తలుపు యెవరు కొట్టారో అని వెళ్ళి తలుపు తీసాను. అందరూ కారిడార్ లోంచి వెళ్తూ కనిపించారు.”సాయంకాలం.గదిలో ఉండద్దు, బయటికి రావాలి “అని అన్నారు.

నన్ను గౌరవిస్తూ రమ్మని పిలుస్తున్నారు.వెళ్ళక పోతే బావుండదు. నన్ను నేను అగౌరవ పర్చుకున్నట్లు అవుతుంది.వెళ్ళాలి. నన్ను నేను చూసుకున్నాను. పంజాబీ డ్రెస్ లో ఉన్నాను.

అది బాగానే ఉంది, కాని కాటన్ కాదు.బట్టలు మార్చుకోవాలి. మొహం కడుక్కోవాలి. కాస్త తయారవ్వాలి. ఇదివరకు నామీద శ్రద్ధ తక్కువగా ఉండేది. డాక్టరుగారు అన్నారు కదా నవ్వుతే బావుంటానని. అందుకని అద్దంలో నవ్వుతూ మొహం చూసుకుంటూ తయారయ్యాను. నా జుట్టుని బాగా దువ్వి, పైకి కట్టాను. నూలు బట్టలు వేసుకుని వెళ్ళాను.

ఓ చోట బాడ్మింటన్ ,ఆడుతున్నారు. ఓ నలుగురు వాకింగ్ చేస్తున్నారు.

నేను ఏంచెయ్యాలి ? స్కూల్లో ఉన్నప్పుడు ఆటల పీరియడ్ లో బాగా ఆటలు ఆడేదాన్ని. అంతే నిజానికి మా ఇంట్లో ఆటలని ఎప్పుడూ ఎంకరేజ్ చెయ్యలేదు. అందుకే నాకు ఏ ఆట కూడా రాదు.

అమ్మ వద్దనేది. అదంతా టైం వేస్టనేది. ఆ టైంలో చదువుకుంటే మరో రెండు మార్కులైనా వస్తాయనేది. నేను కూడా పెద్దగా అడిగే దాన్ని కాదు.

ఇంక ఇంటర్ లో అయితే ఆటలనేదే లేదు. అది టైం వేస్ట్ అని మానేజిమెంట్ ఉద్దేశం .పైగా ఆటలకోసం అని ప్రత్యేకంగా ఏం లేదు. అందుకే నేను ఏ ఆట ఆడినా స్కూల్లో ఉన్నప్పుడే. ఇప్పుడు ఆడగలనా ప్రయత్నిస్తాను.

ఇప్పుడు ఇక్కడ అన్నీ చూస్తూ తిరిగుతూంటే , స్కిపింగ్ తాళ్ళు కనిపించాయి. అది తీసుకుని కాస్సేపు స్కిపింగ్ చేసాను. ఎవరో రింగ్ ఆడుతూంటే అది ఆడాను. నేను మళ్ళీ మామూలుగా అవుతున్నాను. బాగా అలసి పోయాను. ఓ చోట అంశమాన్, షమీ బాడ్మింటన్ ఆడుతూ కనిపించారు. వాళ్ళిద్దరూ నాకు అక్కడే పరిచయం అయ్యారు. వాళ్ళ పేర్లు వాళ్ళు చెప్పుకున్నారు. నేను వాళ్ళ దగ్గరికి వెళ్ళాను. నాకు ఆట కాస్త నేర్పించారు. కాస్సేపు ఆడాను. బాగా అలిసి పోయాను. అక్కడ కోర్టులోనే ఓ వారన కింద కూచున్నారు. నేను వాళ్ళ దగ్గరికెళ్ళి కూచున్నాను.

వాళ్ళిద్దరూ ఆటల గురించి, క్రికెట్ గురించి , ఒలంపిక్స్ గురించి, చాలా సేపు మాట్లాడారు,అవన్నీ నాకు తెలీదు కాబట్టి ఎంతో ఆసక్తితో విన్నాను.

అంశుమాన్ మా అందరిని చూస్తూ అన్నాడు. "మా ఫాదర్ కొన్ని పుస్తకాలు పంపారు. అందులో యాంద్రె అగాస్సి , నదాల్ రాసిన పుస్తకాలు కూడా ఉన్నాయి, ఆ రెండూ నేను చదివే సాను. ఎవరైనా కావాలంటే తీసుకోవచ్చు, రాత్రి డిన్నర్ లో కలిసినప్పుడు తెస్తాను. అప్పుడు తీసుకోవచ్చు"

స్కూలులో ఉన్నప్పుడు లైబ్రెరీ కి వెళ్ళినప్పుడు బాగా చదివాను. ఇంక ఇంటర్ లోకి వచ్చాకా ఈ ఎంసెట్ మూలంగా మంచి పుస్తకాలు చదవలేక పోయాను. బీఎస్సీ లోకి వచ్చాకా అలవాటు తప్పింది. బీఎస్సీ ఫైనల్ హైద్రాబాదు కాలేజీలో చేరినప్పుడు, కోచింగ్ క్లాసుల నుంచి వస్తూ తెచ్చుకుని చదివేదాన్ని, మళ్ళీ ఇన్నాళ్ళకి ఇప్పుడు మళ్ళీ ధ్యాస మళ్ళుతోంది . ఇప్పుడు పూర్వపు రోజులు వస్తాయా ? నేను చదవడమే మానేసాను కదా, మళ్ళీ చదవగలనా? అంశమాన్ చెప్పిన పుస్తకాలు చదవగలనా ? చదవలేకపోతే! ఇంక వీటిని , ఇలాంటి గొప్ప పుస్తకాలని ఇంక ఈ జన్మలో చదవలేనా. ఏం చెయ్యాలి ?

అంతకు ముందే డాక్టరు గారికి నా భయం చెప్పాను. ఆయన ఆ లోటు పూర్తి చేస్తామని అన్నారు.

అదే కనక జరిగితే నా అంత అదష్టవంతులు ఉండరు. నేను నా ఆలోచనల్లో ఉన్నప్పుడు, వాళ్ళు

బయోగ్రఫీ ల గురించి మాట్లాడుకున్నారు. గాంధీ ,నెహ్రూ ల నుంచి, ఇప్పటి హైద్రాబాదీ లక్ష్మణ్ వరకూ, ఎంతో మంది గురించి మాట్లాడారు. నాకు ఈ సంభాషణలు చాలా నచ్చాయి. ఎందుకంటే వాళ్ళు మాట్లాడుతున్నది నాకు తెలియనిది. వాళ్ళ సాంగత్యంలో ఎన్నో నేర్చుకున్నాను. ఎన్నిరోజులయిందో బాగా చదువు కున్న వాళ్ళ మాటలు విని. ఈ క్షణాన వాళ్ళ మధ్య ఉన్నాను. నేను ఇక్కడ ఉండడం కూడా ఓ విధంగా మంచిదే అయింది అనిపించించింది.

ఆ రోజు డాక్టరు పాల్ గారు వస్తారేమో అనుకున్నాను. కాని ,రాలేదు.మరో డాక్టరు వచ్చారు. నేను మామూలుగా టైం టేబుల్ లో ఉన్నట్లుగా కౌన్సిలింగ్ , సైకో థెరపీ గదిలోకి వెళ్ళాను. అక్కడ టేబుల్ మీద చిన్న బోర్డు, దానిపైన డా.పూర్వి దేశాయ్ అని ఉంది.

నేను గదిలోకి వెళ్ళగానే ఆమె నవ్వుతూ నన్ను పలకరించింది, ఓ కాటన్ చీర. క్లోజ్ నెక్ జాకెట్, చాలా హుందాగా ఉంది. ఒక్కసారి ఎలా గుర్తొచ్చిందో, తెలీదు కానీ,ఇంటర్ లో మా బాటనీ లెక్చరర్ , పేరు గుర్తు రావడంలేదు కానీ, ఆమె కూడా ఇలాగే కాటన్ చీరలు కట్టుకుని చిన్న మెడ ఉన్న బ్లౌజులు వేసుకునేది. ఇప్పుడు ఆవిడ ఎందుకు గుర్తొచ్చిందో అర్థం కాలేదు. కానీ ఒక్కటి మాత్రం స్పష్టం అయింది. నేను ఏదీ మర్చి పోలేదు. అన్నీ తాత్కాలికంగా ఎక్కడో వెనక్కి వెళ్ళి పోయాయి. సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టీ , ఎప్పుడో జరిగిపోయినవి, ఒకప్పటివి అన్నీ అడుక్కి వెళ్ళిపోయినవి మెల్లిగా ఒకొక్కటిగా పైకొస్తున్నాయి. మామూలుగా పూర్వ శృతిలా అయిపోతున్నాను. పాజిటివ్ గా ఉండమన్నారు కదా. నాకేం కాలేదు అని అనుకోమన్నారు కదా. ఇప్పుడు అలాగే అనుకుంటాను.

“హలో శృతీ, నేను నీ కౌన్సిలర్ ని ” అని అనగానే ఈ లోకం లోకి వచ్చాను.

” హలో, మేడం ” అన్నాను. నాకేం కాలేదు అని అనుకున్నా ,కౌన్సిలర్ నా ఎదురుగా ఉండడంతో నేను మామూలుగా లేను అని వాళ్ళు అనుకుంటున్నారు.

అందుకే ఈ కౌన్సిలర్ ముందు కూచున్నాను. ఒక్కసారి మనసు ములిగింది. ఆమె వైపు చూసాను.

ఆమె ముందు నా ఫైలుంది. ఆ ఫైలు నాది. అందులో నా జీవితం.

“శృతీ ,మేము ఇక్కడ నీకు అన్ని విధాలా తోడ్పడడానికి ఉన్నాం. నువ్వు బాగా ప్రోగ్రెస్ అవుతున్నావు. ఇంకొన్ని రోజుల్లో పూర్తిగా మామూలుగా అయిపోతావు ”

అలాగా అన్నట్లు తల ఊపాను. కాని నాకు కోపంగా ఉంది. ఆమె నా ఫైలు తీసింది. చూసింది అంటే ఆమె నా జీవితాన్ని చదివింది. నా గత జీవితంలోని ప్రతీ చిన్న విషయం ఆమెకి తెలిసిపోయింది.

డాక్టర్ పాల్ గారితో నాకేం అభ్యంతరం ఏం లేదు. కాని, ఈ డాక్టరుకి ఆ అధికారం ఏం లేదు. ఈమె నా మనసుని , నా మైండుని చదివింది. కాదు చదివేసింది.

“ డాక్టర్ పాల్ గారికి,మీ కేసు మీద చాలా ఇంట్రెస్ట్ ఉంది ”

" కాని ఆ డాక్టర్ గారు రాలేదు కదా "

"వస్తారు, ఆయన వచ్చే వరకు నేను నీతో మాట్లాడుతాను. నీ గురించి మనం మాట్లాడుకోనక్కర్లేదు మనం సినిమాల గురించి, పాటల గురించో, కథల గురించో ఏదైనా సరే. నీకు ఏది ఇంట్రెస్టో దాని గురించి లేకపోతే హీరో , హీరోయిన్స్ , కమేడియన్స్, గురించి మాట్లాడుకుందాం "

ఆమె మాటలకి ఏం అనాలో తెలీలేదు. ఈమెతో మాట్లాడాలని నాకు లేదు. ఇప్పుడు నాకు దేని మీదా ఇంట్రెస్ట్ లేదు. ఆమె నా వైపు ఓసారి చూసి , నా ఫైలు తీసి చూస్తోంది..

"సరే అయితే , డాక్టరు గారు వస్తారు "

" నేను కూడా డాక్టర్ గారు వచ్చే వరకూ ఆగుతాను " అని అన్నాను.

ఆమె ఏం మాట్లాడ లేదు. అటూ ఇటూ చూసింది.

ఓ పావు గంట తరవాత,డాక్టరుగారు వచ్చారు. ఆమె పాల్ గారితో జరిగినదంతా చెప్పినట్లుంది.

" శృతీ, ఇక్కడ పని చేసే డాక్టర్లందరూ బాగా ట్రెయిన్ అయిన వాళ్ళు. ఆక్యుపేషనల్ థెరపీలో ట్రెయినింగ్ చేసిన వాళ్ళే. పూర్వి చాలా మంచి వ్యక్తి. నేనే ఆమెను నీ కోసం అసైన్ చేసాను. నీ ఫైలు బాగా చదివింది ,అర్థం చేసుకుంది "

" కావచ్చు డాక్టర్, కానీ నేను ఆమె దగ్గర కంఫర్ట్ గా లేను "

నా మాటలు విన్నాకా డాక్టర్ పూర్వీ వెళ్ళిపోడానికి ,వెనక్కి తిరిగారు.

అది చూసాకా అనిపించింది. అలా అనకుండా ఉండాల్సిందని.

"ఓకే. నీతో ఓ విషయం మాట్లాడాలి. డాక్టర్ పూర్వీ మీరు కూడా ఉండండి " అని ఆమెని ఆపారు.

"ఈ డాక్టరు గారు కూడా ఇక్కడే ఉంటారు. వింటారు . ఆమె కి కూడా నీ గురించి పూర్తిగా తెలియాలి కదా. ఇంకో విషయం శృతీ, నువ్వు మర్చిపోయావు నీలో ఓ అద్భుతమైన కళ ఉంది. నువ్వు చాలా టాలెంటెడ్. చాలా బాగా కవిత్వం రాయగలవు. దాన్ని డెవలప్ చేసుకుంటే బావుంటుంది. పెయింటింగ్స్ కూడా అంతే. బావున్నాయి నీకంటూ ఉన్న ఓ చక్కటి కాలక్షేపాన్ని డెవలప్ చేసుకుంటే నువ్వు ఈ డిప్రెషన్ నుంచి బయట పడతావు. నువ్వు మామూలుగా అవడానికి మేము చేస్తున్న ప్రయత్నాలకి ,ట్రీట్ మెంటుకి నీ వంతుగా నువ్వు మాకు సాయం చేసినట్లవుతుంది. సరేనా "

నేను కవిత్వం రాస్తానని ఇతని కెలా తెలుసు ? పెయింటింగ్స్ అంటే అర్థం ఉంది, నేను వేసిన దాని గురించి విని,వాటిని చూసి ఉంటాడు.

మరి నేను రాస్తానని , ఎలా తెలిసింది, అన్నట్లు గా డాక్టరు గారిని చూసాను. ఆయనకి నా భావం అర్థంఅయింది.

"ఎలా తెలుసని అనుకుంటున్నావా! నీ ఫ్రెండుకి నువ్వు రాసిన ఉత్తరం. అది ఒకటి కాదు ,రెండు కాదు, ఏకంగా ఓ ముప్పైపేజీల ఉత్తరం చూసాను. అది పేరుకి ఉత్తరం కానీ అందులో కవిత్వం ఉంది. అది ఓ దీర్ఘ కవితలా ఉంది " అని నా వైపు చూసారు.

నేనా ఎప్పుడు రాసానూ! ఆలోచిస్తున్నాను. ఎవరికి రాసాను? తెలీడంలేదు..

" గుర్తు తెచ్చుకో " అంటూ ఆగారు నన్నే చూస్తూ.

" సారీ ఎవరికి రాసానో తెలీదు నాకు గుర్తు లేదు " తలని అడ్డంగా ఊపుతూ అన్నాను.

" పరవాలేదు. నేను గుర్తు చేస్తాను. ఆ అమ్మాయిపేరు సువర్ణ. హైదరాబాదు రాకముందు,నువ్వు ఇది వరకు చదివిన కాలేజీ బీఎస్సీలో నీ క్లాస్ మేట్ "

అయినా గుర్తు రాలేదు.

" ఓకే మరో చాన్స్, ఆమె ఫొటో చూపిస్తాను " అంటూ తన తెల్ల కోటు జేబులోంచి ఓ కవర్ తీసి అందులోంచి ఓ ఫొటోని తీసి నా చేతిలో పెట్టారు.

అది చిన్నదైతే చెప్పలేను. కానీ అది నా అరచెయ్యంత సైజులో ఉంది. చాలా సేపటికి గుర్తుకొచ్చింది. సువర్ణ . అడుగు పొరలని చీల్చుకుంటూ పైకొచ్చింది. గుర్తొచ్చింది. సువర్ణ. నా స్నేహితురాలు. ఇది ఆమెకు నేను రాసిన ఉత్తరం. ఓ రాత్రి , నిద్ర పట్టక పోతే కూచుని రాసేసాను. ఉత్తరం అంటే అది ఉత్తరంలా లేదు. నా మనసులో ఉన్నది రాసాను. అందుకే కావచ్చు దీర్ఘ కవితలా ఉందని డాక్టరు గారు అన్నారు. అది నేను సువర్ణ కి రాసినదే . అందులో ఏం ఉందో నాకు గుర్తు లేదు. ఇప్పుడు నేను దాన్ని చదవ లేను.

ఇప్పుడు అది పైకి వచ్చింది. పైకి రావడం కాదు, ఊరు కూడా దాటింది. డాక్టరు గారి దగ్గరికి వచ్చింది. అంటే నా విషయం సువర్ణకి కూడా చెప్పేసారా !

ఎవరికీ చూపించద్దు అని రాసినట్లు గుర్తు. చూపించడం కాదు ,అది యేకంగా ఉత్తరం ఇచ్చేసింది. అది నన్ను మోసం చేసింది. దాన్ని వీళ్ళ కి ఇచ్చినట్లుంది. వీళ్ళకెందుకు ఇవ్వాల్సివచ్చింది? మరోసారి, నా గతం చెప్పుకోడం అవుతుంది.

నన్ను నేను బంధించుకున్న తాళ్ళని నేను విప్పుకోక తప్పడం లేదు. ఇప్పుడు నా గురించి పూర్తిగా తెలిసి పోయింది. మరో పొర తీస్తున్నాను. ఇంతవరకూ వచ్చాకా నేను దాచగలిగింది ఏం లేదు. అయినా ఇది నాకు మేలు చేస్తుందనే నమ్మకం ఉంది.

" ఈ ఉత్తరం మా దగ్గరికి ఎలా వచ్చిందో అని అనుకుంటున్నావా. నీ గురించి తెలుసుకోడానికి మీ నాన్నగారు,ఇది వరకు మీరున్న ఊళ్ళో నీ స్నేహితుల దగ్గరికి వెళ్ళి కనుక్కున్నారు.

మీరు హైద్రాబాదు వచ్చాక , నీలో జరుగుతున్న మార్పులు . ఎవరితో మాట్లాడక పోవడం, ఒంటరిగా ఉండడం, ఎక్కువగా కోపం తెచ్చుకోవడం, ఇవన్నీ మీ వాళ్ళని చాలా భాధపెట్టాయి. దీనికి తోడు నువ్వు చేసిన ఆత్మహత్యా ప్రయత్నాలు అంతులేని దుఃఖాన్నిచ్చింది. తమ ఎదురుగా కూతురు ఛావాలని చేస్తున్న ప్రయత్నాలు కన్న వాళ్ళకి ఎంత పెద్ద దెబ్బ. అప్పుడు మీ నాన్నగారు ఇదివరకూ ఉన్న ఊరు

వెళ్ళారు. నీ స్నేహితురాలిని కలిసారు. ఆ సమయంలో ఆమె ఇచ్చిన ఈ ఉత్తరం యొక్క ఫొటోకాపీ నాకు పంపారు. దాన్ని మేము నీ ఫైల్లో పెట్టాము.

ఇంతకు ముందు నిన్ను చూసిన డాక్టర్లు ఓ మామూలు డిప్రెషన్ కి ట్రీట్ చేసారు. నీ కేసు వేరు, మామూలుగా పుస్తకాల్లో, ఉండేది రెఫరెన్స్ కోసం, వాడే కేసులు వేరు. నెట్ లో కనపడే కేసు కూడా కాదు. అందుకే నిన్ను ఇంతకు ముందు చూసిన డాక్టర్లు వేరే దారిలో వెళ్ళి, నీకు చేసిన వైద్యం పనికి రాలేదు ”

అతని మాటలని నేను నిశ్శబ్ధంగా వింటున్నాను.

నేను సువర్ణ కి రాసిన ఉత్తరాన్ని ఈ డాక్టర్లు పూర్తిగా చదివి, దాన్ని ఓ సర్జరీ చేసినంతగా పరీక్ష చేసి చర్చించుకుని ,నా లోని లోపాన్ని ఎనలైజ్ చేసి, దానికి ఓ మెడికల్ టర్మ్ ఇచ్చి, సైకాలజికల్ డిసార్డర్ మానిక్ డిప్రెషన్ అని కనుకున్నారు. దానిని ఎలా నయం చేయాలో అన్నీ ఆలోచించుకుంటున్నారు.

“శృతీ నువ్వు రాసిన ఉత్తరం మాకు చాలా ఉపయోగ పడింది. నీలో జరుగుతున్న మార్పులు అన్నీ తెలుసుకున్నాం. వైద్యం కూడా ఆ దిశగానే ఇస్తున్నాం. ఇవన్నీ నిన్నుమామూలుగా చేసేందుకే. నీ ఉత్తరం మా దగ్గరికి వచ్చిందని, దాన్ని మేము చదివాము అని నువ్వు బాధ పడక్కర్లేదు ”

నా ఆలోచనలని కనిపెట్టినట్టున్నారు.అందుకే ఆవిధంగా మాట్లాడారు.

“నువ్వు ఇన్నాళ్ళూ జీవితాన్ని ఫీలవడం మానేసి, భరించడానికి అలవాటు పడ్డావు, నిన్ను నువ్వే కష్ట పెట్టు కున్నావు, ఓ ప్రపంచం లో ఉండిపోయావు. ఒంటరితనంతో స్నేహం చేసావు. నీలోని క్రియేటివ్ ఎనర్జీ పోతున్నది ఇక్కడే. నీలో ఓ సృజనాత్మకత ఉందన్న సంగతి కూడా మర్చిపోయావు. ఇవన్నీ నీకు తెలీకుండా జరిగిపోతోంది.

శృతీ నీలో సృజనాత్మకత ఉంది. అది నువ్వు రాసిన ఉత్తరంతో ,పెయింటింగ్ తో తెలుస్తోంది. దీనితో నీకు ఇంకో విషయం కూడా చెప్పాలి.ఈ క్రయేటివిటీ అన్నది,ఒక్కొక్క సారి నీ డిసార్డర్ కి సంబంధించినది. ఇది యూనిక్.

శృతీ నీకు దేవుడు ఓ శక్తినచ్చాడు . మామూలు వాళ్ళకి లేనిది. అది నీలో ఉంది. నీకు తొందరగా ఇమోషన్స్ వచ్చేస్తాయి. ఆ ఇమోషన్స్ కి ఓ రూపం ఇచ్చుకో గలిగే శక్తి కూడా నీలో ఉంది.

ఓ సారి చరిత్ర తీసుకుంటే ఎన్నో ఉదాహరణలున్నాయి. ఇలా డిప్రెషన్ తో బాధపడే వాళ్ళల్లో రచయితలున్నారు. చిత్రకారులున్నారు.అయితే వాళ్ళు ఈ సమాజానికి ఎంతో విలువైనవి అందించారు.

అందుకని వాళ్ళు ఆ భావాలని కాగితం మీద కాని,రంగుల్లో కాని వ్యక్తీకరించారు. నీకు విన్సెంట్ వాన్ గో తెలుసా. అతని పేరు విన్నావా ” డాక్టరు గారి గొంతు చాలా మృదువుగా ఉంది. ఆ గొంతులోని ఆ మార్దవం ,మృదుత్వం,అంటే నాకిష్టం.

“ వాంగో తెలీకపోవడం ఏంటండి డాక్టరుగారు,నాకు బాగా తెలుసు. అతని చిత్రాలని గురించి ప్రద్యుమ్న చెప్పాడు. ఆయన వేసిన పెయింటింగ్ లు చూపించాడు. ఆయన ఎంత బీదరికంతో బతికాడో అన్నీ చెప్పాడు. ఆయన బతికి ఉన్నప్పుడు ,అతని పెయింటింగ్ లు ఒక్కటి కూడా

అమ్ముడు పోలేదు కాని అతను పోయాకా వాటికి మిలియన్స్ వచ్చాయి అని కూడా చెప్పాడు " ఉత్సాహంగా అన్నాను.

**"అతనికి ఇదే** మానిక్ డిప్రెషన్. ఈ డిసార్డర్ " అని నా వైపు చూసారు.

డాక్టరుగారి మాటలు నా మీద బాగా పని చేసాయి.అంటే నేను కూడా స్పెషల్ . నా రాతలు,నా గీతలు, నన్ను ఫేమస్ చేస్తాయి. నాలో కొత్త ఉత్సాహం వచ్చేసింది.

"కాని అతను ఈ డిసార్డర్ లో ఓ చెవి కోసాడు. ఒక్కొక్కసారి ఎక్సెంట్రిక్ లా ప్రవర్తించే వాడు, ఈ డిసార్డర్ తో బాధ పడ్డవాళ్ళల్లో కొంత మంది ఆత్మహత్యలు చేసుకున్నారు "

అతని మాటలకి కుంచించుకు పోయాను. నాలో కూడా ఇలాంటి ఫీలింగ్స్ ఉన్నాయి. నేనుకూడా ఆత్మహత్యకి ప్రయత్నించాను! ఈ ఆలోచన నాలో ఓ లాంటి సిక్ ఫీలింగ్ ని కలగ చేసింది. వాంగో ఎందుకలా చేసాడు ? నిస్సహాయంగా ఉన్నప్పుడు చేసి ఉంటాడు, నేను అంతే కదా. అతని బాధని నేను అర్థం చేసుకున్నాను.

" నువ్వు అలా కాదులే. నువ్వు చాలా ధైర్యం కల దానివి. నీకున్న ఈ పది వేళ్ళు నీ స్నేహితులు, ఈ నీ పది మంది ఫ్రెండ్స్ నిన్ను పూర్తిగా ఎంగేజ్ చేస్తారు. క్షణం తీరిక కుండా చేస్తారు. మనసుని ఖాళీగా ఉంచనివ్వరు. నువ్వు చేసే పనిలో పూర్తిగా మునిగి పోతావు. ఇమ్మర్స్ అయిపోతావు. నాకు నీమీద నమ్మకం ఉంది "

ధైర్యం కలదానిని అని అంటూంటే సంతోషం అనిపించింది. నిజమే ఇన్నాళ్ళూ పిరికిదానిలా ఓ గదిలో ఉండిపోయాను. నలుగురితో మాట్లాడడానికే ఇష్టపడలేదు. ఇప్పుడు డాక్టరు గారు అంటూంటే నిజమేనేమో అనిపిస్తోంది. సరే అన్నట్లుగా ,నేను కూడా తల ఊపాను.

నామీద నాకు నమ్మకంఏర్పడుతోంది .డాక్టరు గారి మీద నాకు నమ్మకం ఉంది. నా మీద అతనికి నమ్మకం ఉంది. ఈ నమ్మకం అనేది చాలా అద్భుతమైనది అని డాక్టరు గారికి తెలుసు.

"నీకు నా మీద నమ్మకం ఉంది . దాన్ని నేను వమ్ము చేయదల్చుకోలేదు , నీకు ఇచ్చిన మాటని కూడా నిలబెట్టుకుంటున్నాను. అది ఏంటో తెలుసా "అంటూ నన్ను చూసారు. తెలీదన్నట్లుగా తలని ఊపాను.

" నీకు చదువు. చదవడం, ఇక్కడి నుంచి వెళ్ళే లోగా అన్నీ నేర్పిస్తామని అన్నాను. ఇప్పుడు మనం అదే ఆ విధంగా వెళతున్నాం " డాక్టరుగారి మాటల్ని, డాక్టరు పూర్వి కూడా విన్నారు. క్లాసు సమయం అయిపోవడంతో వాళ్ళిద్దరూ వెళ్ళి పోయారు.

ఆ మర్నాడు డాక్టరుగారు, డాక్టరు పూర్వి తో కలిసి వచ్చారు. వాళ్ళ చేతుల్లో రెండు సంచులున్నాయి.

"శృతీ,నీకు ఇప్పుడు, కొంచెం ముందుకు వెళ్ళే అవకాశం. మొదటి అడుగు వేయడం కష్టమే కాని వెయ్యక తప్పదు. దానికి డాక్టరు గారు సాయం చేస్తారు. ఇవేళ నువ్వు ఈ సంచుల్లో ఏం ఉందో చూడు. వాటిని చూస్తూంటే నీకు ఉత్సాహం కలుగుతుందని అనుకుంటున్నాము. రేపు ఇందులో ఉన్న వాటి గురించి క్లాసు తీసుకుంటాం" అని కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోయారు.

డాక్టర్లంటే ఇలా ఉండాలి. పేషెంటుని మామూలు మనిషిగా చూడాలి. అందుకే ఇక్కడివాళ్ళతో మాట్లాడుతూంటే నాకేదో అయింది, అందుకే నేనిక్కడ ఉన్నానన్న విషయం కూడా గుర్తుండదు.

వాళ్ళు వెళ్ళగానే సంచీలో ఏం ఉందోనని చూసాను. దాన్నిండా పుస్తకాలు.

సంచీలో పుస్తకాలన్నీ ఒక్కొక్కటే తీసి టేబుల్ పైనఅన్నీ కనపడేలా పరిచాను. టేబుల్ నిండి పోయింది. ఒకప్పుడు నా స్టడీ టేబుల్ ఇలాగే ఉండేది. నా టేబుల్ పైన టెంత్, ఇంటర్, ఎంసెట్ ,బిఎస్సీ పుస్తకాలు వాటి నోట్స్ లు, పెన్నులూ, పెన్సిళ్ళూ, బాక్సులూ, పెరేడ్ చేసేవి. అలాంటిది ఇప్పుడు మళ్ళీ పుస్తకాలు. ఎంతో ఉత్సాహంగా కుర్చీ లో కూచుని చూసాను.ఆ రోజంతా అలాగే గడిపేసాను.డాక్టరు గారన్నట్లుగానే నిజంగానే ఎన్నో మర్చిపోయాను.నన్ను నేను కూడా మర్చి పోయాను.

మర్నాడు అంతా ఒక్కొక్క పుస్తకాన్ని తీసి చూస్తుండి పోయాను. అవి ఏంటో , వాటి మీద ఏం రాసి ఉందో చదవడానికి ప్రయత్నించాను. ఆ అక్షరాలని అతి కష్టం మీద గుర్తు తెచ్చుకున్నాను.

ఆ పేర్లు చదివాకా, ఆ బొమ్మలు అవీ చూస్తూంటేనే అర్థం అయిపోయింది. అన్నీ చిన్నపిల్లల పుస్తకాలు. అన్నీఅమర్ చిత్ర కథ పుస్తకాలు. ఓ వంద వరకూ ఉంటాయేమో. లెక్క పెట్టడానికి అంకెలు కూడా గుర్తు లేదు. అందుకని లెక్క పెట్టలేదు. కానీ చాలా ఉన్నాయి.

## 3

ఒక్కసారి కళ్ళు మూసుకుంది శృతి. గొంతు ఎండిపోయినట్లుగా ఉంది. కళ్ళు తెరిచి పెదవులు నాలుకతో తడుపుకుంది. అది చూసి, మానవ్ వెంటనే లేచి మంచినీళ్ళు, రెండు గ్లాసుల్లో ద్రాక్ష పళ్ల జ్యూస్ తెచ్చి మధ్యన ఉంచాడు.

“ వెళ్ళి పోదామా?“ అని అంది.

“ పూర్తి చేసెయండి. వింటూంటే నాకు ఇది మీ జీవితంలా అనిపించడం లేదు. ఎక్కడో ఎవరికో జరిగిన దాన్ని నాకు చెప్తున్నట్లుగా అనిపిస్తోంది“

శృతి ఏం మాట్లాడ లేదు. చేతికున్న వాచీలో టైము చూసింది.

“బాబోయ్ టైం రెండైంది.మామూలుగా ఆదివారాలు వృద్ధాశ్రమానికి,అనాధాశ్రమానికి వెళ్తాను. అక్కడికి వెళ్తే నన్ను నేను మర్చిపోతాను. వాళ్ళకి పేపరు చదివి వినిపిస్తాను. పిల్లలకి కథలు, అవీ చెప్తాను. పిల్లలకి కథలు ఎంత ముఖ్యమో నాకు బాగా తెలుసు. ఎందుకంటే ఆ ఆనందం నాకు చిన్నప్పుడు దొరకలేదు. పిల్లలు ఓ మంచి కథ వింటే వాళ్ళకి మంచి అంటే ఏంటో చెడు అంటే ఎంటో తెలుస్తుంది. ఏం చెయ్యకూడదో, ఎందుకు చెయ్య కూడదో తెలుస్తుంది. ఎందుకంటే అందులో నీతి ఉంటుంది. మరి నేను వెళ్తాను. నా కోసం ఎదురు చూస్తూంటారు.“ మరోసారి వాచి చూసుకుంది.

మానవ్ కంగారుగా ఆమెని చూసాడు.

“ అయ్యో అప్పుడేనా, మీరు చెప్పడం ఇంకా పూర్తవలేదు . పూర్తి చేయకుండా ఎలా వెళ్తారు ? పూర్తి చేసెయండి. ఒకే చోట ఇలా కూచోడం విసుగనిపిస్తే ఇక్కడ వద్దనుకుంటే , రిసెప్షన్ లో ఉన్న ఖాళీ సోఫాల్లో కూచుందాం. నేను బిల్ పే చేసి వస్తాను, మీరు వెళ్ళి అక్కడ కూచోండి. అంటూ అక్కడినుంచి వెళ్ళి పోయాడు. శృతి అక్కడి నుంచి కదిలింది.

ఇద్దరూ విశాలంగా ఉన్న ఆ రిసెప్షన్ హాల్లో, రెండు సోఫాల్లో ఎదురెదురుగా కూచున్నారు.

4

టేబుల్ నిండా పుస్తకాలు. అవిచూసాకా మనసులోనే ఏడ్చేసాను. అంతకు ముందు ఉన్న ఉత్సాహం ఎగిరిపోయింది. ఒక్కసారి కుంచించుకు పోయాను. ఎంతో మంచి మంచి క్లాసు పుస్తకాలు, లాంగ్వేజి లో నాన్ డిటెయిల్స్ అవి చదివిన నేను, ఈ లెవెల్ కి వచ్చాను.

కాని ఒక్కటి మాత్రం నిజం. నేను ఇంతకు ముందు ఇలాంటి పుస్తకాలని చూడలేదు. చిన్నప్పుడు చూసే ఉంటాను. కాని పెద్దగా గుర్తు లేదు. ఎందుకంటే మా ఇంట్లో ఇలా కథల పుస్తకాలూ అవి కనిపిస్తే నాన్నగారు చింపి బాయలర్ లో పడేవారు.

రాత్రిళ్ళు పడుకునేప్పుడు అమ్మ కథలు కాకుండా, పుస్తకాల్లోని ప్రశ్నలు ఫార్ములాలు, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్ లాంటివి అడిగేది. అలాంటిది ఇప్పుడు ఇవి చూస్తుంటే ఏదో కొత్త ప్రపంచానికి వచ్చినట్లుంది. ఆ బొమ్మలు ,అవీ చూస్తూ అలాగే చాలా సేపుండిపోయాను. ఎంత సేపున్నానో నాకే తెలీదు.

ఆ మర్నాడు ఎప్పటి లాగే రిక్రియేషన్ రూంకెళ్ళాను. అంతకు ముందు నాతో మాట్లాడి తెలుగు నవలల గురించి మాట్లాడిన మనిషి, అదే చోట కూచుని ఉన్నారు. నన్ను చూడగానే పలకరింపుగా నవ్వి, రమ్మన్నట్టు సైగ చేసాడు. వెళ్ళాను. ఈసారి, తెలుగు పుస్తకాల గురించి కాకుండా, నాటకాల గురించి, ఎంతో ఉత్సాహంగా అలా చెప్తూ పోయాడు.

గ్రీకు ట్రాజెడీ, ఇంగ్లీష్ కామెడీ, ఇండియన్ సాఫీకం ఇలా చాలా చెప్పాడు. కర్నాడ్ యయాతి, హయవదన, తుగ్లక్ , అబ్బో అవి ఎంత గొప్ప నాటకాలో మాటల్లేవు, అందుకే , వాటిని చాలా సార్లు చూసాను. కానీ విజయ్ టెండూల్కర్ ఘాషీరామ్ కోత్వాల్ చూసే అవకాశం రాలేదు, కానీ,అతనిదే శాంతతా కోర్ట్ చాలూ ఆహే మాత్రం టీవిలో చూసాను, సులభా దేశ్ పాండే,అరవింద్ దేశ్ పాండే ఇద్దరు కూడా అందులో ఉన్నారు. నాటకాలంటే అవి. ఇలా ఆయన నాటకాల గురించి చెప్తూంటే ఎంతో ఉత్సాహంగా విన్నాను. నాకు నాటకాల గురించి ఏం తెలీదు. అందుకే అతను మాట్లాడుతూంటే అస్సలు విసుగనిపించలేదు. అతను చెప్పే విధానం చూస్తే అతను ఇలా చెప్పడంలో చాలా అనుభం ఉన్నట్లనిపించింది. చాలా విషయాలు తెలుసుకున్నట్లనిపిస్తోంది. అతని పేరు తెలీదు. నాపేరు అతను అడగ లేదు.

అక్కడినుంచి బయటికి వచ్చాను. ఆ పెయింటింగ్స్ గురించి మాట్లాడిన వాళ్ళిద్దరు కనిపించారు.నన్ను చూడగానే దగ్గరికొచ్చారు.

“ శృతీ నీకు ఓ పుస్తకం తీసుకొచ్చాం. పధ్నాలుగు ,పదిహేను ,పదహారు శతాబ్దంలోని పెయింటింగ్ లు అన్నీ ఉన్న ఈ పుస్తకం నీకు నచ్చుతుంది ”

ఆ పుస్తకం నా చేతికిచ్చారు. ఇలాంటి అనుభవం ఈ మధ్య కాలంలో జరగలేదు. నామీద ఎంతో అభిమానం చూపిస్తున్నారు. పుస్తకం ఓ సారిచూసాను. అదిచూసి మళ్ళీ నాలో అలజడి. ఒక్కొక్క బొమ్మ అద్భుతంగా ఉంది. దాని గురించిన వివరాలు అన్నీ కూడా ఆ పక్కనే ఉన్నాయి. అలా ఎన్నోఉన్నాయి.

చూసిన వెంటనే చదవలేకపోయాను. ఈ పుస్తకం చదవడం కోసమైనా కష్టపడాలి. అందుకని పైపైనే చూసి,.తలెత్తి వాళ్ళిద్దరిని చూసాను.

మళ్ళీ నువ్వు తిరిగి ఇచ్చెయ్యాలి. ఎందుకంటే ఇది యూరోప్ కి వెళ్ళినప్పుడు మా ఫాదర్ తెచ్చి నాకు ఇచ్చారు. అందుకని ”

తను ఎంతో ఇదిగా అపురూపంగా చూసుకున్న దాచుకున్నఆ పుస్తకాన్ని నాకోసారి చూపించాలి, అని మనసులో రావడమే గొప్ప విషయం. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాళ్ళ అభిమానానికి,

అయితే అంతకు ముందు కలిగిన సంతోషం ఎగిరిపోయింది. బొమ్మలు చూడడం అనేది యాంత్రికం, దానికి చదువక్కర్లేదు. మరీ చిన్నపిల్లల్లాగా బొమ్మలు చూస్తే చాలు. చదువు లేకపోయినా చదువు రాకపోయినా పరవాలేదు, కానీ ఇప్పుడు అలా కాదు. చదువు రావాలి. అదేం బొమ్మో , ఎవరు వేసారో అని తెలియాలి . కానీ ఎలా ? అక్షరాలు గుర్తు పట్టగలిగినా చదవగలనా ? ఈ మధ్య కొన్ని నెలలుగా చదవడమే లేదు. సందేహమే, ఎన్నో మర్చిపోయాను. అందులో అక్షరాలు కూడా ఉన్నాయి, ఈ విషయంలో డాక్టరు గారు కూడా సాయం చేస్తానన్నారు. మళ్ళీ చదువు కొనసాగిస్తానేమో....

ఆ పుస్తకాన్ని ఓ చెట్టు కిందకి తీసుకుని వెళ్ళి తెరిచి , చదవ బోయాను. అక్షరాలు గుర్తొస్తున్నాయి కానీ,అవి ఏంటో తెలీడంలేదు. అందుకే పైకి చదవలేక పోతున్నాను. పరవాలేదు.కొన్ని రోజులు పోయాకా నేను చదవ గలను. దానికి కొంత సమయం పడుతుంది. అందుకని దాన్ని నా గదికెళ్ళాకా టేబుల్ మీద ఓ చోట పెట్టాను..

అనుకోని మార్పులు. నాకు మరో ఇద్దరితో పరిచయం ఏర్పడింది. ఒకరు వయసు దాటిన అతను. మరొకరు గృహిణి, వాళ్ళిద్దరూ ఎందుకున్నారో నాకు తెలీదు. కాని వాళ్ళతో మాట్లాడుతూంటే బాగానే ఉన్నట్టనిపిస్తూంది. అతను అస్తమానం సైన్సు ,టెక్నాలజీ గురించి మాట్లాడుతూంటే, ఆమె వంటలు ఎలా చెయ్యాలో అందులోకి ఏం వెయ్యాలో విసుగు లేకుండా చెప్తూంటూంది. వాళ్ళకోసం పిల్లలూ, పెద్దలూ, ఎవరో ఒకరు అప్పుడప్పుడు వస్తూంటారు. వాళ్ళ కోసం ఏవేవో తెస్తూంటారు .

ఆ మర్నాడు తోటపని చేసి వస్తూంటే డాక్టరు పూర్వీ దేశాయ్ గారు కనిపించారు

హలో డాక్టర్ అని పలకరించాను.

ఆమె నవ్వింది. ”నన్ను పూర్వీ అని పిలు. డాక్టర్ అని పిలుస్తూంటే ఏదో పరాయి గా అనిపిస్తుంది, నువ్వు నాకు బాగా దగ్గర ”

నేను చిరునవ్వు నవ్వాను.

“పుస్తకాలు చూసావా? ”

నా మొహం మాడిపోయింది. చదవలేక పోయాను.

"చూసాను, బొమ్మలు మాత్రమే చూసాను. చదవడానికి భయపడ్డాను. చదవలేననిపించింది. అందుకే చదవలేదు. కొంచెం ప్రయత్నించాను. కాని " మెల్లిగా అన్నాను.

"పరవా లేదులే శృతీ, ఇందులో నీ తప్పేం లేదు అని మేము ముందరే చెప్పాం కదా, అంత సిగ్గు పడాల్సిందేం లేదు. నేనున్నాను కదా. నిన్ను మామూలుగా చెయ్యడానికి. ఇది నా ఛాలెంజ్ . పద నీ గదికి వెళ్దాం" ఇద్దరం గదిలోకి వచ్చాం. టేబుల్ కి దగ్గర ఉన్న రెండు కుర్చీలని లాగి, ఇద్దరం కూచున్నాం. ఇద్దరం కూడా టేబుల్ మీద ఉన్న పుస్తకాల కేసి చూసాం.

ఒకప్పుడు టేబుల్ పైన పూర్తిగా నా క్లాసు పుస్తకాలు ఉండేవి. అవి నా తెలివికి,నా మేధకి,అద్దం అని అనేవారు. అమ్మ తో అదే అనేవారు. ఇప్పుడు నేను ఆ నేనుని కాను. అన్ని మర్చిపోయిన దాన్ని. మొదటికే వచ్చాను. ఓ చిన్నపిల్లలా ,కొత్తగా స్కూలుకి వెళ్ళడం మొదలు పెట్టిన చిన్న పిల్లలా కుంచించుకు పోయాను. అప్పుడే రాయడం చదవడం నేర్చుకుంటున్న పిల్లని.

చదవగలనా అన్న నాచూపులు అర్థం చేసుకున్నారు అందుకే తప్పకుండా, అని డాక్టరుగారు నా మీద ఎంతో నమ్మకం తో అన్నారు

"నీకు అన్నీ ఇది వరకూ లాగా వచ్చేస్తాయి, ఆ నమ్మకం నాకుంది. ఆ బాధ్యత నాది. నీకు మంచి డాక్టరుని అరేంజ్ చేస్తాను."అని పాల్ గారు అన్నారు, ఆయన అన్నట్లుగానే చేసారు. నేను ఇప్పుడు భయపడి వెనక్కి తగ్గితే ఆయనని అవమానించినట్లు అవుతుంది.

ఇప్పుడు నా వయసు ఇరవై ఒకటికి దగ్గర్లో ఉంది. ఎప్పుడో అప్పుడు ఎక్కడో ఒక చోట నుంచి చదవడం మొదలెట్టాలి. అన్నీ చిన్న పిల్లల పుస్తకాలు. డాక్టరుని ఓసారి చూసి ఓ పుస్తకం తీసుకున్నాను. నా పక్కనే ఉన్న పూర్వి నన్నే చూస్తోంది.

ఇంట్లో ట్యూషన్ చెప్పు కుంటున్నట్లుగా ఉంది. ఓ ట్యూషన్ టీచరు,ఓ స్టూడెంటు కూచున్నట్లుగా కూచున్నాం. పుస్తకం చేతిలో ఉంచుకుని,అక్షరాలని గుర్తు తెచ్చు కుంటున్నాను. ఆఖరికి ఎలాగైతేనేం ఆ పుస్తకం పైన ఉన్న అక్షరాలని కష్టం మీద ఏంటో చదివాను.

అది పెద్ద బాలశిక్ష. ఒక్కసారి నోరు తెరుచుకుని ఆమెని చూసాను. మరోసారి ఆ పుస్తకం కేసి చూసాను. అదేపుస్తకమా ఆ పుస్తకం పేరు సరిగ్గా చదివానా.ఎన్ని సార్లు చూసినా,చదివినా,అది పెద్ద బాలశిక్షే.

అంటే నేను బాలశిక్ష చదివే స్టేజ్ లో ఉన్నానా ? ఇంతగా జారిపోయానా ?

నేను చదివింది కరెక్టే అన్నట్లుగా తల ఊపింది. తరవాతది చదువు, అన్నట్లుగా చేయి ఊపింది. అందులోనే చిన్న చిన్న కథలలున్నాయి. అందులోంచి ఓ కథ చదవమన్నారు. అన్ని అక్షరాలు గుర్తుకువస్తున్నాయి. ఇన్నిరోజులూ ఈ అక్షరాలు ,పదాలూ ఎక్కడ దాగున్నాయో ఏంటో కాని ఇప్పుడు మాత్రం అన్నీ గబ గబా బయటికి వచ్చేస్తున్నాయి. ఓ రెండు వాక్యాలు చదివాను. గుడ్ అని అంటూంటే సంతోషంగా చూసాను. వెంటనే నేనేం చదివానో ఆమె చెప్పమంది. ఒక్కసారి తడబడ్డాను. ఏం చదివాను, ఆలోచించాను. గుర్తు రాలేదు.

" పరవాలేదు , అక్షరాలన్నీ గుర్తున్నాయి, ఇప్పుడు చదవినట్లుగానే చదువుతూ వెళ్ళు " అలాగే అని, చదువుతూ వెళ్ళాను. చదివిన దాన్లో ఒక్కపదం కూడా నా బుర్రలోకి వెళ్ళడం లేదు. ఆగాను. ఏం చదివానో జ్ఞాపకం తెచ్చుకోడానికి ప్రయత్నించాను. ఫలించలేదు. అయోమయంగా డాక్టరుని చూసాను. ఏం పరవాలేదు అంటూ ఎడమ చేత్తో భుజం తట్టింది. కానీ నాకు పరవా ఉంది. నేను ఎప్పటికీ ఇలాగే ఉంటానా! ఈ చిన్నపుస్తకం, పెద్ద బాలశిక్ష ని అర్థం చేసుకోలేక పోతున్నాను. జ్ఞాపకం పెట్టుకో లేకపోతున్నాను. ఒక్కసారిగా ఏడ్చేసాను.ఆమె అది చూసింది.

"శృతీ నువ్వు చదువుతున్నావు. అంత వరకూ పరవాలేదు.గుర్తుకు రావడం అన్నది, ప్రాక్టీసు మీద వస్తుంది. నువ్వు తీసుకుంటున్న ఈ ఆక్యుపెషనల్ థెరపీ అందుకోసమే. నీకు మెల్లిగా అన్నీ గుర్తొస్తాయి. నీ పూర్తి దినచర్య అంతా మామూలైపోతుంది. కానీ నువ్వు ఇంకా కష్ట పడాలి. ఇప్పుడు నువ్వు ఇందాకా చదివిన ఆ కథలోని మొదటి వాక్యాలని మళ్ళీ చదువు "

అలాగే అన్నాను మళ్ళీ అదే విధంగా అయింది. తెల్లమొహం వేసాను. ఎందుకిలా జరుగుతోంది?

నా బ్రెయిన్ ఏదైనా దెబ్బ తిందా ? ఏదైనా నరాలు పని చేయడం మానేసాయా ?

ఇంతేనా ! జీవితాంతం ఇలాగే ఓ చదువు రాని మొద్దమ్మాయిలా ఉండిపోతానా ? అలా అయితే ఎలా?

ఆమె నా బాధ అర్థం చేసుకున్నట్లుంది,

"ఓ పని చేద్దాం, ఈవేళ్టికి ఇది చాలు ఇక్కడితో ఆపేద్దాం. మళ్ళీ రేపు "

మర్నాడు కూడా అలాగే జరిగింది. చదివింది మళ్ళీ చెప్పలేక పోయాను,

ఈసారి అక్షరాలు గుర్తున్నాయి కాబట్టి ,రాయి.చూద్దాం. అంటూ ఆవిడ ఓ రెండు పదాలని డిక్టేట్ చేసారు. అవి రాయలేక పోయాను.అక్షరాలని చూసి రాసాను . కానీ ఆ రాయడానికి కూడా చాలా సమయం తీసుకున్నాను. ఎందుకంటే దాన్ని చూసి ఎలా రాయాలో ఓ రెండు సార్లు ప్రాక్టీస్ చేసాకా రాసాను. మరో రెండు పదాలు.ఈ సారి కూడా రాసేసాను.

" ఏం రాసావో ఓ సారి చదువు " వెంటనే చదివేసాను. ఎందుకంటే ఏం రాసానో ప్రాక్టీస్ చేసాను కాబట్టి.

"ఇది సరిగ్గా ఉంది.రెండు సార్లు చదవడం కన్నా,ఓ సారి చూసి రాస్తే బాగా గుర్తుంటుంది. ఇప్పుడు అదే జరిగింది, నీ విషయంలో. ఇదే మెథడ్ చిన్న పిల్లలకి స్కూల్లో చెప్తారు. రాస్తే తొందరగా గుర్తు పెట్టుకుంటారని. ఈ సారి ఓ వాక్యం చెప్తాను ,అలాగే రాసెయ్యి " ఉత్సాహంగా తలనూపాను. ఆమె ఓ వాక్యం చెప్పారు. అక్షరాలని చూసి రాసాను. చదువు అంటే చదివేసాను.

" అయితే ఇప్పుడు నువ్వేం రాసావో గుర్తుందా?"ఆలోచించాను. లేదు.

" సరే. మరో సారి రాయి. రాసాను.

"ఇప్పుడు గుర్తుందా..!"



కౌముది

ఆశ్చర్యం. గుర్తుంది.ఎ గిరి గెంతులెయ్యాలనిపించింది. ఆ మాటే ఆవిడతో అన్నాను

"పది సార్లు చదివే కన్నా ఓ రెండు సార్లు రాస్తే గుర్తుంటుంది. అయితే ఇంకా డిక్టేట్ చేస్తాను. అదే ఉత్సాహంతో రాసెయ్యి" అలా ఓ గంట కూచున్నాం. ఒక్క పేజీ రాసాను. అందులో ఉన్నది రాసింది పది వాక్యాలు మాత్రమే.

"శృతీ ఇవేళ్టికి  చాలు.ఇన్ని నెలలు నువ్వు ఒత్తిడికి లోనయ్యావు, నువ్వు చాలా సున్నితమైన దానివి కాబట్టి, ఆ ఒత్తిడిని తట్టుకోలేక పోయావు, చదవ గలిగినా రాయలేకపోయావు. కాస్త కష్టపడ్డాకా చదివినది రాయగలిగావు. తరవాత గుర్తు పెట్టుకోగలిగావు. నువ్వు మామూలుగా అయిపోతావు. నేను రేపు మళ్ళీ వస్తాను" అంటూ ఆవిడ వెళ్ళిపోయారు.

**ఆమె వెళ్ళిపోయాకా**,నేనేం రాసానో చూసాను. చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను

అంతే ఒక్కసారి గట్టిగా ఎక్కిళ్ళు పెడతూ ఏడిచేసాను. ఒళ్ళంతా కదిలిపోతోంది,ఆ సంగతి గమనించాను. పెద్ద బాలశిక్ష లోని ఓ పది వాక్యాలు రాయడానికి యెంత కష్టపడ్డాను. ఓ చిన్నపిల్లల పుస్తకం చదివి రాసే స్థాయికి దిగి పోయాను.

ఒకప్పుడు నా తెలివి మీద నాకు,ఇంట్లో వాళ్ళకి,స్కూల్లో వాళ్ళకి,చాలా నమ్మకం. పదో క్లాసులో స్కూలు ఫస్ట్. ఇంటర్ లో మంచి మార్కులు వచ్చాయి. బిఎస్సీ మొదటి రెండు సంవత్సరాలు, పాసయ్యాను, కానీ ఫెయిలవలేదు. ఎంసెట్ ఎంట్రెన్స్,మూడుసార్లూ ఎంతో కష్ట పడి రాసాను. రాంకు వచ్చినా మెడిన్ లో సీటు రాలేదు.

నేను పనికి రానిదన్నట్లుగా ఇంట్లో వాళ్ళు  అనుకుంటూంటే నా మీద నాకే నమ్మకం తగ్గిపోసాగింది. నేను మెల్ల మెల్లగా కిందకి వెళ్తున్నాను. ఎందుకు. ఒత్తిడి అని అన్నారు. నిజంగా అదేనా! నేను వేస్ట్ అని నాకే అనిపించేదా. దానికే సూసైడ్ అటెంప్ట్ చేసానా! ఆర్ణవ్ మరణం తో నాలో అలజడి మొదలైందా! అదే డిప్రెషన్ కి దారి తీసిందా ! ఇవన్నీ నేను ఆలోచించదలుచు కోలేదు. గతంతో పని లేదు. దాన్ని పాతి పెట్టాలి. ఇప్పుడు నాకున్నది ఒక్క వర్తమానం ,నా మీద నాకు నమ్మకం

లేచి మొహం కడుక్కుని వచ్చాను . పాటలు  మర్చిపోయాననుకున్నాను. కాని కూనిరాగాలు తీస్తూ పాడుకున్నాను. డిన్నర్ టైము. వెళ్ళాను. అంశుమాన్,షఫీ కనిపించారు. వాళ్లతో పాటల గురించి మాట్లాడాను.  మాట్లాడుకుంటూ మధ్య మధ్య పాడుకుంటూ భోంచేసాం.

ఆ రాత్రి మంచి నిద్ర పట్టింది. పాటలు కావచ్చు, చదివి ,రాసి, గుర్తుపెట్టుకున్నానన్న సంతోషం కావచ్చు.

మెదడుకి, మనసుకి, శరీరానికి మంచి ఎక్సర్ సైజులు, పెయింటింగ్ లు, చదువు, రెగ్యులర్ గా యోగా,తోటపని,ఆటలు చేస్తూ  ఓ రొటీన్ లో పడిపోయాను.

డాక్టరుగారు,నన్ను పొగడారు. కరెక్ట్ గా,సరి అయిన దారిలో వెళ్తున్నానని అన్నారు. భుజంతట్టి, ఇంక కొద్ది రోజులకి నేను మామూలుగా అయిపోతానని అన్నారు. నేను పాత శృతి లాగా అయిపోతానని అన్నారు. ఇదివరకూ లాగే ఉంటానని అన్నారు. నాకు ఆయన  ఆశల దారాలని కలిపించారు. నేను అందుకోడానికి, అల్లడానికి  ప్రయత్నిస్తున్నాను.

నెలలు గడుస్తున్నాయి. నేను రోజు రోజుకి పూర్వశృతిలా అయిపోతున్నాను. చాలా సంతోషంగా ఉంది.

ఇప్పుడు పుస్తకాలే లోకం అయింది. చిన్నపిల్లల పుస్తకాలు అన్నీ చదివేసాను. పేరుకి చిన్నపిల్లలవి కాని,వాటిని ఇదివరకూ చదవలేకపోయాను. ఇప్పుడు మాత్రం నేను బాగా ఎంజాయ్ చేసాను. మంచి నీతి ఉన్నకథలు. చిన్న పిల్లల స్థాయిలో,వాళ్ళ కోసమే  రాసిన ఇంగ్లీష్ పొయెట్రీ క్లాసిక్స్, తెలుగు భాషలోని కవిత్వం, కథలూ ,నవలలు,అన్నీ చదువుతున్నాను, అంతే కాదు చదివినది గుర్తు కూడా ఉంటోంది. గుర్తు పెట్టుకోడానికి ఇదివరకులాగా రాయక్కర్లేదు.

నా మెదడు బాగానే ఉంది. పైగా ఇదివరకూ లాగా కాకుండా, ఓ పుస్తకాన్ని, ఒక్క రోజులో పూర్తి చేస్తున్నాను. మొదలు పెట్టాకా ఆప బుద్ధి కావడం లేదు. పుస్తకం పూర్తి చేయడానికి నేను చూపే ఉత్సాహం ఆనందం దేనితో కూడా పోల్చలేను. ఆ ఆనందం లో ఎవరు కనపడితే వాళ్ళకి, నేను ఈ పుస్తకాన్ని పూర్తి చేసాను దాన్ని గుర్తు పెట్టుకున్నాను,అని చెప్పాలనిపించింది. కానీ నా ఉద్వేగాన్ని, భావాల్ని, నాలోనే నొక్కి పెట్టాను. నా ఆనందం ఎదుటి వాళ్ళకి అర్థం కాదు. అందులోని డెప్త్ ని అర్థం చేసుకోరు.

ఇప్పుడు ఆ టేబుల్ మీద ఉన్న పుస్తకాలన్నిటిని చదివేయలన్నంత ఉత్సాహం నాలో వచ్చేసింది.

ఇన్నాళ్ళ నా ప్రయాణం ఓ ఎడారిలో సాగింది. ఇప్పుడు దాహం వేస్తున్న నాకు ఒయాసిస్ కనపడినంత సంతోషం, ఆనందం.ఉత్సాహం,అన్నీ కలిపినట్లుగా ఉంది పైగా మందు కూడా,నిశ్శబ్దంగా అద్భుతాలని, చూపిస్తోంది.

డాక్టరుగారు నన్ను చూడడానికి వచ్చినప్పుడు అడిగారు,

" మీ వాళ్ళని చూస్తావా. వచ్చేవారం వస్తున్నారు " చూస్తాను అని సమాధానం ఇచ్చాను.

ఇన్ని నెలల తర్వాత అమ్మని నాన్నగారిని చూడబోతున్నాను.

" నేను ఈ పుస్తకాలు చదివేసాను.మరి కొన్ని తేగలరా ? "

" అంత కన్నా కావలసినది ఏముంది, సంతోషంగా ఇస్తాను. ఇక్కడే నా రూం లోనే ఉన్నాయి. ఎవరితోనైనా పంపుతాను "

ఇదివరకూ లాగా కాకుండా, ఇప్పుడు అద్దంలో నా మొహం చూసుకుంటున్నాను. ఈ మధ్య నామొహాన్ని తరచూ అద్దంలో నవ్వుతూ చూసుకుంటున్నాను. నాకే ఆశ్చర్యం వేస్తోంది. కళ్ళల్లో ప్రశాంతత, చర్మంలో నిగారింపు, నున్నగా దువ్విన జుట్టు. పాత శృతిని. మునపటి శృతిని. అప్పటి లాగానే ఉన్నాను. ఇప్పుడు థాంక్స్ ఎవరికి చెప్పాలి.?

ముందు అమ్మా వాళ్ళకి. నాలో జరుగుతున్న మార్పులని తొందరగా గమనించారు. రియాక్ట్ అయ్యారు. కూతురు పిచ్చిదైంది అన్న ఇతరుల మాట వినాల్సి వస్తుంది అన్న భయం పెట్టుకోకుండా, సిగ్గు పడకుండా, సంకోచించకుండా , సమాజానికి భయపడకుండా, సరి అయిన ట్రీట్ మెంటుకోసం,సరి అయిన స్పెషలిస్టుల దగ్గరికి తీసుకెళ్ళారు.

ఆ తరవాత డాక్టరు పాల్ గారికి, ఈ ఆక్యుపేషనల్ థెరపీలో ఉంచినందుకు, ఇక్కడ చదవడంలో సహకరించిన పూర్వీ దేశాయి గారికి, నా వ్యక్తిగత విషయాలు అడగకుండా నాతో ఎన్నో విషయాలు పంచుకున్న ఎన్నో విధాలుగా ఎంతో ఉత్సాహపరిచిన నవలల మనిషి ,ఆ ఇద్దరు యువకులు, ఆ వంటల గృహిణి, ఆ సైన్సు చెప్పే ముసలాయనా , నర్సులు అందరికి. థాంక్స్ . మళ్ళీ జీవించి ఉన్నందుకు,ఆ అవకాశం మరోసారి ఇచ్చినందుకు ఆ దేవుడికి థాంక్స్.

నా జీవితం నిస్సారంగా నడుస్తున్నప్పుడు అన్ని విధాలా మోరల్ సపోర్ట్ ఇచ్చారు. నేను మామూలు మనిషిని కావడానికి వీళ్ళు కూడా కారణమే.

ఆ రాత్రి డిన్నర్ టైం లో వాళ్ళిద్దరూ చేరో ఒక చిన్న పాకెట్ నా చేతికిచ్చారు. మనసులోనే ఆనందించాను. వాళ్ళ ముందే ఆ పాకెట్ కి ఉన్న కవర్ ని విప్పాను. రెండు సీడీలు. ఒకటి రవిశంకర్ సితార్ . రెండోది జగ్జిత్ సింగ్ గజల్స్. ఆ ఇద్దరి పేర్లు విన్నాను కానీ, ఇలా సీడీ వేసుకుని ఎప్పుడూ వినలేదు.

ఈ గజల్స్ గురించి ప్రద్యుమ్న నాతో ఎప్పుడూ మాట్లాడే వాడు. ఎన్నో సార్లు,క్లాసులో పాడాడు, పాడిన ప్రతీ గజల్ అర్థం కూడా చెప్పాడు. అలా ఆనాడు పాడిన ఆ గొంతు ఇప్పుడు ఈ గదిలో నాలుగు వైపులా వ్యాపించి చెవుల్లో గింగురు మంటోంది.

నేనేమయ్యానోనని అనుకుంటాడా? ఇంటికి ఫోన్ చేసి ఉంటాడా ? ఎప్పటిలాగా అమ్మ ఏదో చెప్పి ఉంటుందా? నేను ఆలోచించినట్లుగానే తను గూడా నా గురించి ఆలోచిస్తాడా? అసలు ఏం అనుకుంటున్నాడో ? నేను మాయమైపోయాననుకుంటాడా ?

ఆలోచిస్తూంటే ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చాను? ఆఖరికి ఈ మెంటల్ ఆసుపత్రిలో ఉన్నాను. నా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు. ఎన్నోతుఫాన్లు, ఎంతో ప్రశాంతంగా గడిచిపోతున్న జీవితంలో ఎన్నో మార్పులు,ఊహించని మార్పులు, మలుపులు.

నేను వెళ్ళే రోజు దగ్గరికి వస్తోంది. ఏ రోజు అని కచ్చితంగా తెలీదు. ఓ వారం పదిరోజుల్లో అని తెలుస్తోంది. అందుకని అంశుమాన్ ది, షమీ ది పుస్తకాలు చదివాను . ఇచ్చేసాను.

నేను వెళ్ళే సమయం వచ్చింది. ఇప్పుడు నేను ఫ్రీ. సంపూర్ణ ఆరోగ్యవంతురాలిని. జీవితం మీద నమ్మకం. నామీద నాకు నమ్మకం, పూర్తిగా వచ్చింది. మానసికంగా దృఢంగా ఉన్నాను. అన్నీ కూడా ఈ ప్రపంచంలోనే నేర్చుకున్నాను. అయితే ఈ ప్రపంచాన్ని నా వెనకాల వదిలి వెళ్తున్నాను. . కొన్ని వారాలు నెలలు ఇది నా నివాసం అయింది . కానీ ఎవర్నీ ఎప్పటికీ ఇందులో ఉంచుకోరు. నాలాంటి మరొరి కోసం గది ఖాళీ చేసి వెళ్ళాలి.

. " డాక్టరుగారు మీరు నన్ను ఓ మనిషిని చేసారు. నరకంలో మగ్గి పోతున్న నాకు సంతృప్తి ద్వారాలు తెరిచారు. మూసుకుపోయిన జీవితం ఆ తాళం చేతులు నాచేతికిచ్చారు. నాతో తెరిపించారు. " అదే అన్నాను.

దేవుడిని చాలా తక్కువ అంచనా వేసాను. కాని కాదు. దేవుడు నాకు ఎంతో మేలు చేసాడు. ఎన్నో ఇచ్చాడు. నా ఆలోచనలను మార్చాడు. మనసులోనే దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

ఆయన నా తల నిమిరారు. మెల్లగా కొట్టారు.

" సంతృప్తి నీకన్నా మాకే ఎక్కువగా ఉంది. నీ కేసుని ఓ ఛాలెంజ్ లాగా తీసుకుని నిన్ను మామూలు మనిషిని చేసాం. ఇంత కన్నా మాకు ఏం కావాలి ? "

" నిజమే మీ అందరికీ ధన్యవాదాలు ఎలా చెప్పుకోనూ. మీ ఋణం ఎలా తీర్చుకోనూ "అన్నాను కళ్ళు తుడుచుకుంటూ.

" అది మాకర్తవ్యం. ఓ పేషెంటుకి వైద్యం చేసి ఆరోగ్యవంతురాలిని చేయడం కోసమే కదా మేమిక్కడ ఉన్నది. మాకూ ఎథిక్స్ ఉంటాయి. ఇక్కడికి వచ్చే వాళ్ళు మామూలు వాళ్ళు కాదు. అందుకని మేము ప్రతీ కేసు ని ఎంతో జాగ్రత్తగా డీల్ చేస్తాము.

కాని మేము నీ కేసుని ఓ ఛాలెంజ్ గా తీసుకున్నాము. నువ్వు నిండా ఇరవై ఏళ్ళు కూడా లేని చిన్నమ్మాయివి. జీవితంలో ఏం అనుభవించావు? ఏమీ లేదు. ఏమీ చూడలేదు. అసలు నీ జీవితం అంతా ముందుంది, అలాంటి నీకు ఇదేంటీ ,మీ వాళ్ళ కన్నా ఎక్కువ బాధ పడ్డాను. నిన్ను ఎలాగైనా మామూలు మనిషిని చేయాలని నేను అనుకున్నాను. దానికి ఇక్కడి వాళ్ళూ, నువ్వు కూడా బాగా సహకరించావు. నీ విల్ పవర్ కూడా ఓ కారణమే "అన్నారు నా తల నిమురుతూ.

" టాబ్లెట్లు రోజుకి ఒక టి చొప్పున రెండు వారాలు వాడాలి. ఆ తర్వాత వారం మానేసి మళ్ళీ అన్నమాట. మందుని పూర్తిగా మానేయద్దు. అలా మానేయడం వల్ల ఇంకా ఎక్కువయ్యే అవకాశాలుఉన్నాయి " అన్నారు.

నాకు తగ్గిపోయింది. నేను నార్మల్ అయిపోయాను. వెళ్తానని తెలిసినప్పటి నుంచి,డాక్టరు గారు, సలహాలు ఇస్తున్నారు.

" శృతీ నువ్వు ఎప్పుడూ ఖాళీగా ఉండకు. అసలు ఆ స్థితిని రానీయకు. నిన్ను నువ్వు తక్కువ అంచనా వేసుకోకు. నీ లోని క్రియేటివ్ ఎనర్జీ పోయింది ఇక్కడే. నీలో చెలరేగే ,అలజడిని అరికట్టాలి అంటే నువ్వు చేసే ప్రతీ పనిలో ఇమ్మర్స్ అయిపోవాలి. లేకపోతే ఇదివరకటిలాగా ఓ రకమైన డిప్రెషన్ లోకి వెళ్ళిపోడానికి అవకాశాలు ఎక్కువ .

గొప్ప గొప్ప విజేతలలో కొందరు ఈ డిప్రెషన్ మూలంగా పిచ్చివాళ్ళుగా మారి పోయిన వాళ్ళూ ఉన్నారు. సంతృప్తి లేదు. అది కావాలి ఇది దొరకాలి,అని, అన్నీ వదిలేసుకుని ,తమకి నచ్చినట్లు , ఇష్టం వచ్చినట్లు తాము జీవించడం అనేది ఆఖరి అన్వేషణ, అదే నిజమైన సంతృప్తి అనుకునే వాళ్ళున్నారు."

అన్నింటికీ తల ఊపుతున్నాను.

" మరోసారి చెప్తున్నాను. నీలో మంచి టాలెంట్ ఉంది. భావుకత ఉంది. దాన్ని వ్యక్తీకరించి, గబగబా రాయగలిగే శక్తి ఉంది. మంచి మంచి రచనలు చేయగలవు. అలాగే పెయింటింగ్. వాటికే నీ సమయాన్ని వినియోగించు.

నీ టాలెంటు నీకు దేవడిచ్చిన వరం. నువ్వు అదృష్టవంతురాలివి. నీ మనసుని వర్తమానంలో ఉంచడం నీకు చాలా అవసరం. గతం అంతా భయంతో,వైఫల్యాలతో ఉంది. అందుకని గతాన్ని తవ్వకు.అటువైపు తొంగి చూడకు. నీకు చెప్పాను కదా మళ్ళీ చెప్తున్నాను,

నీ పది వేళ్ళు నీ స్నేహితులు. అర్థం అయిదా. రచనలు చెయ్యి,బొమ్మలు గియ్యి "అంటూ నవ్వారు. నేనూ నవ్వేసాను.

" డాక్టరు గారూ మీరు రచనలు చెయ్యమని అంటున్నారు,బావుంది,అలా అయితే మొట్ట మొదటగా చిన్నపిల్లల కథే రాస్తాను. దానితోనే మొదలు పెడ్తాను. చిన్నవయసులో చదివిన కథలు పిల్లలని మానసికంగా ఎదగనిస్తాయి. దానికి మీతోనే ముందు మాట రాయిస్తాను. ఎన్నో ఆశలు ,కలలూ ఉన్న ఓ మధ్య తరగతి అమ్మాయి ఓ మెంటల్ ఆసుపత్రి లోకి ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది.ఎలా మామూలుగా మారింది. అక్కడి డాక్టర్లు ఎలా సాయ పడ్డారు."

"అంతకంటేనా !".

నేను నవ్వేసాను.ఈ మధ్య నేను నవ్వుతున్నాను.

నవ్వుతే బావుంటానని డాక్టరు గారు అన్నప్పటి నుంచి నవ్వు మొహమే పెడుతున్నాను.

వెళ్ళే ముందు ఏదైనా నా స్నేహితులకి ఇస్తే బావుంటుందనిపించింది. ఎందుకంటే ఇచ్చి పుచ్చుకోడంలో ఉన్న ఆనందం అనుభవించిన దాన్ని కాబట్టి. నేను హైదరాబాదు వచ్చేప్పుడు నా స్నేహితులు నాకు వాళ్ళకి తోచినవి బహుమతిగా ఇచ్చారు. నేను కూడా అంతే. ఇప్పుడు వీళ్ళు నాకు చక్కటి బహుమతులు ఇచ్చారు. వీళ్ళకి కూడా ఏదైనా ఇవ్వాలనిపిస్తోంది.

ఆలోచించాను. ఏం ఇవ్వాలి. నేను నిజంగా ఎప్పుడూ ఇంతల్లాగా ఆలోచించలేదు. కానీ ఇప్పుడు ఆలోచిస్తున్నాను. అసలు ఏం ఇస్తే బావుంటుంది.? ఏదైనా బజారు నుంచి తెచ్చే ఇచ్చే స్థితిలో నేను లేను. అందుకని నేనే ఏదో తయారు చేసి ఇస్తే బావుంటుంది. తయారు చెయ్యడం అంటే నాకున్న లిమిటెడ్ రిసోర్సెస్ నేను ఉపయోగించుకుని నేను ఇవ్వగలిగేది, ,కవితలు. పెయింటింగ్ లు. అవే ఇవ్వడానికి నిశ్చయించుకున్నాను.

ఓ రెండు కవితలు రాసాను. ఇంగ్లీషులో కవితలు ఓ రోజులో రాసేసాను , ఇద్దరు డాక్టర్లకి. అంశుమన్ కి, షమీ కి పెయింటింగ్ లు . అందుకని రెండే రాసాను.

ఇంక పెయింటింగ్ లు. ఏది వెయ్యాలి బాగా ఆలోచించాను. నా దగ్గరున్న పుస్తకాలు చూసాను. చూసి వేయడానికి కావలసినవి కనిపించాయి.

రిక్రియేషన్ రూంకి తొందరగా వెళ్ళి వేయడం మొదలెట్టాను. చిన్నవి అయితే తొందరగా అవుతాయని, చిన్నవే తీసుకున్నాను. నాలుగు వెయ్యడానికి నాలుగు రోజులు పట్టింది.

అన్నిటిని విడివిడిగా, గాలికి ఆర పెట్టాను. అవి ఆరడానికి టైం పట్టింది.

ఇంక తరవాత వాటిని ఎందులో పెట్టి ఇవ్వాలి. కవర్లు అడిగితే ఇస్తారేమో ,కాని అడగదలుచుకో లేదు. రిక్రియేషన్ రూంలో అన్నీ ఉన్నాయి. అక్కడ నుంచి అన్నీ తెచ్చుకుని చేయచ్చు. ఆ ఆలోచన రాగానే కాగితాలు గమ్ బాటిల్ తెచ్చుకుని, తెల్లకవర్లుగా తయారు చేసి అందులో పెట్టాను.

నాకే ఆశ్చర్యంగా ఉంది, నేను ఇంత య్యాక్టివ్ గా ఉంటానని ఎప్పుడూ అనుకోలేదు.

చదువుకునే రోజుల్లో కూడా నేనింతయాక్టివ్ గాలేను.రెండు కవితలు రాసాను.నాలుగు పెయింటింగ్ లు వేసాను.అది కూడా అతి కొద్ది సమయంలో చేయగలిగాను.

నాకింతకన్నా ఏం కావాలి ? నేను మామూలు మనిషిని అయ్యాను. కవితలని మరోసారి చదవాలని కవర్ లోంచి తీసాను.పైకి చదివాను.

నాకు బాగా లేనప్పుడు సాయం చేసారు.

దారి తప్పి, గుడ్డిదాన్ని అయిపోయినప్పుడు చక్కటి దృష్టి నిచ్చారు

జీవితంలో కిందకి జారిపోతున్నప్పుడు మీరందరూ చేయి అందించి పైకి తెచ్చారు.

మీరు ఓ డాక్టరు కావచ్చు కానీ నాకు మాత్రం ఓ గురువు.

నా గురించి నాకు తెలియచేసారు.

నాకు ఓ జీవితాన్నిచ్చారు. నా జీవితానికి ఓ అర్థం  చూపిచారు.

. జీవితానికోగుర్తింపు ఉండాలి.దానికో వెలుగు ,ఆనందంఉండాలి.ఇవన్నీ ముందు ముందు నేను చేయాల్సినవి,నాకు చెప్పకనే చెప్పారు..మీరు నాకు ఓ దేవుడు.నా మనసులోది ఇలా ఆయనకి ఎన్నో ఓ కవితలో రాసాను.

డాక్టరు గారు వచ్చినప్పుడు అది అందించాను".ఏంటిదీ! "అని అంటూనే తెరిచారు.

" నేను మీకు ఎంతో ఋణ పడి ఉన్నాను.జీవితం యొక్క విలువని చూపించారు, బోధించారు. మొదట్లో ఏం చెయ్యాలో తోచక, ఇక్కడ సీనరీలు వేసాను. కాని ఇప్పుడు కాదు. ఈ రెండు నెలలు ఎంతో ఇష్టంగా ,మనసు పెట్టి వేస్తున్నాను. ప్రతీ క్షణం జీవిస్తున్నాను. నేను మీకు ఏది ఇచ్చి ఋణం తీర్చకో గలను ? ఇది ఓ గొప్ప బహుమతి కాదు, కానీ,దీని కోసం  ఎంతో సమయాన్ని, తీసుకున్నాను. నా మనసుని  ప్రేమని ఇందులో ఉంచాను." అంటూంటే కళ్ళల్లో నీళ్ళూరాయి.

నేను మాట్లాడున్నంత సమయంలోనే,డాక్టరు గారు పెయింటింగ్ ని చూసారు. కవితని చదివారు. చాలా నిశ్శబ్ధంగా ఉండిపోయారు. కరిగిపోయారనిపించింది. అతని కళ్లల్లో గదిలో వెలుగుతున్న లైట్ల ప్రతిబింబాలు. అది అతని కళ్ళల్లో నిలిచిన నీళ్ళ మూలంగా అని తెలుసు  కవితని, పెయింటింగ్ ని తిరిగి కవర్ లో పెట్టేస్తూ, నా మొహం లోకి చూసారు. ఆ కళ్ళల్లో తడి ఇంకా ఉంది. కుడి చేతిని ఛాతిఎడమ వైపు ఉంచి రాసుకున్నారు. కళ్ళు మూసుకున్నారు.

దాని అర్థం నాకు తెలుసు దేవుడి సాయం కావాలని. మానసిక బలం కావాలని.

అంటే నేను వెళ్తూంటే ,బాధ పడుతున్నారు. డాక్టర్లు కూడా సెన్సిటివ్ గా ఉంటారు. బంధాలు పెంచుకంటే తెంపుకోడం చాలా కష్టం అనిపించింది. కొంచెం సేపటికి మామూలు అయ్యారు.

"బ్యూటిఫుల్. మంచి ఎక్స్ ప్రెషన్,రెండూ చాలా బావున్నాయి. వాటిని ఫ్రేము కట్టించి నా క్లినిక్ లో పెట్టుకుంటాను" అని అన్నారు.

"థాంక్యూ"  అని అక్కడి నుంచి కదిలాను.

డాక్టరు పూర్వీకి ఇవ్వడానికి బహుమతిని తయారు చేసాను. చేసిన కవరు సైజు సరిపోలేదు. మరో కాగతం  తెచ్చి కవరు తయారు చేసే సమయం లేదు..

పోనీ చేద్దామన్నాఅంతకు ముందు తెచ్చిన తెల్ల కాగితాలు అయిపోయాయి. ఓ న్యూస్ పేపరు దొరికింది. అందులో జాగర్తగా పెట్టాను.

డాక్టర్  పూర్వీ దేశాయ్ గారి దగ్గరికి వెళ్తూంటే ఆవిడే దార్లో కనిపించారు. పలకరించాను, చేతిలో ఉన్నది ఆమె చేతిలో ఉంచాను.

ఆవిడ ఆశ్చర్యంగా చూస్తూ ,చేతిలోకి తీసుకుంది.ఏంటిదీ. అంటూ న్యూస్ పేపర్ పక్కకి తొలగించింది. పేయింటింగ్  పైన కవిత ఉన్న కవర్ ఉంది..

ఆవిడ కవిత ఉన్న కవర్ తెరిచారు. చదువు కున్నారు.

" చదువు రాని పిల్లలా ఉన్న నాకు పెద్ద బాలశిక్ష నుంచి మొదలు పెట్టి, నా ఒరిజినల్ లెవెల్ కి తీసుకొచ్చారు. నాకు చదవడం రాయడం మళ్ళీ నేర్పించారు. అక్షరాల , పదాల విలువని చూపించారు. చదవడం రాయడం జీవితానికి ఎలా ఉపయోగ పడతాయో, మానసిక దృఢత్వానికి పుస్తకాలు ఎంత ఉపయోగ పడతాయో ప్రాక్టికల్ గా చూపించారు. అన్న అర్థం ప్రతిబింబించేలా కవిత రాసాను "

నేను వేసిన పెయింటింగ్ తీసి చూసారు.

చీకటిని చీల్చుకుంటూ పైకి వస్తున్న ఎర్రటి సూర్యుడు.

ఆవిడ తడిసిన కళ్ళతో నన్ను చూసారు.బావుందన్నట్లు తల ఊపారు.

" అన్నీ మరిచి పోవడం అంటే చీకట్లో ఉండిపోవడమే కదా డాక్టర్. నేను అందులో మగ్గి పోకుండా

వెలుగుని చూపించారు. అదే ఆ పెయింటింగ్ లో వేసాను ”

“ నీ గదిలోకి వెళ్దాం.పద ” అంటూ భుజం తట్టారు.

డాక్టర్ నా రూముకి వచ్చినప్పుడు,ఆవిడ రెండు చేతులు నా చేతులోకి నా గుండెలకి దగ్గరగా ఉంచాను. ఆవిడ తన చేతుల్ని తీసుకోలేదు.

నాకు దుఃఖం ఆగడం లేదు. ఆమె ఋణం ఎలా తీర్చుకోగలను ? నాకు మరో జన్మనిచ్చారు. మర్చి పోయిన ఎన్నింటినో నేర్పించారు. అని పైకి అంటూంటే ఏడుపు ఆగలేదు. ఆమె చేతుల్ని అలాగే నా కళ్ళకి ఆనించుకున్నాను. కదులుతున్న నా శరీరం చూసి ఆమె నా స్థితిని అర్థం చేసుకుంది. వెంటనే నన్ను తన దగ్గరికి తీసుకుంది. మా మధ్య మాటలు లేవు. దాని అవసరం కూడా లేదు. మౌనమే మాభాష. అక్షరాలు ఎందుకు అక్కర్లేదు.

ఆమె పేపరుని తప్పించింది.”చీకటి లోంచి వెలుగు లోకి..” పెయింటింగ్.

“ఈ సూర్యుడికి అస్తమయం ఉండకూడదు. ఎప్పుడూ వెలుగుతూ ఉండాలి. నలుగురికి ఆ వెలుగులు పంచాలి. చక్కటి దారిని ఎంచుకో. అదే నేను కోరేది ”ఆమె కూడా కళ్ళు తుడుచుకుంది.

“ ఏడ్పించేసావు శృతీ “ అంది నాభుజం తడుతూ.

నిజమే చక్కటి దారిని ఎంచుకోవాలి. వెలుగులు పంచాలి అంటే టీచింగ్ అవుతుందా! లేకపోతే రచనలు చేయడమా

బరువెక్కిన గుండెతో అలాగే ఎంతో సేపు కూచుండి పోయాను.

**షఫీ, అంశుమాన్** బహుమతులు చూసాను. వాటిని కవరులో పెట్టాలి. పేర్లు రాయాలి. అది ఎంతో సమయం తీసుకోదు. కానీ ఇంక ఇప్పుడు చెయ్యడానికి మనసు రాలేదు. రిక్రియేషన్ టైం లో కలసి నప్పుడు ఇవ్వాలి. పొద్దున్న లేచాకా చేయచ్చు.

ఉదయం వరకూ ఎందుకూ. ఇప్పుడు డిన్నర్ టైం లో ఇచ్చేస్తే . అందుకని మర్నాడు ఇచ్చే ఆలోచన మానుకున్నాను. వేసిన సీనరీలని మరో సారి చూసాను. వాటిని చక్కగా పేపర్లో ఎంతో జాగ్రత్తగా పెట్టాను. దాని మీద వాళ్ళ పేర్లు రాసాను.

డిన్నర్ లో కలుసుకున్నప్పుడు వాళ్ళిద్దరికి ఇచ్చాను.

“ఇది సెలిబ్రేషన్. నువ్వు వెళ్ళిపోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. బాధగా కూడా ఉంది.

ఇక్కడి నుంచి వెళ్ళాక గుర్తు పెట్టుకోమని అనం. మనం ఎలాగైనా ఒకరికొకరం గుర్తుంటాం . మనం ఎన్నో మాట్లాడుకున్నాం. డిస్కస్ చేసుకున్నాం. శరీరానికి శ్రమని,మనసుకి ఆలోచనలని ఇచ్చుకున్నాం.” అన్నారు ఇద్దరూ.

“నేను కూడా ,నాకన్నా ఎన్నో రెట్లు ఎన్నో జ్ఞానం ఉన్న వాళ్ళు మీరిద్దరూ. మీతో మాట్లాడుతున్నప్పుడు ఎన్నో నేర్చుకున్నాను. ఎన్నో తెలుసుకున్నాను. నాకు రాకపోయినా ఎంతో ఓపికతో మొదటి రోజు నుంచీ నాకు బాడ్మింటన్ ఆడడం నేర్పించారు. పుస్తకాల గురించిన జ్ఞానం ఇచ్చారు. అవి నన్ను మరో అడుగు ముందుకి వేయించింది. నామీద నాకు నమ్మకం ఏర్పడింది. దానికి కారణం మీరే కదా.

నాలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. నాకు ఉర్దూ గజల్స్ మీద ,పాటల మీదా ఇష్టాన్ని ఏర్పరిచారు. ఉర్దూ మీద ఇంట్రెస్ట్ కలిగించారు, ఎంతో మంది ఉర్దూ కవులని పరిచయం చేసారు, ఎన్నో పుస్తకాలు చదివిన మీరు , వాటి గురించి చెప్పారు.

నేను నిలబడడానికి నా కాళ్ళకి ఎంతో బలాన్నిచ్చారు. నాకు మరో జన్మని ఇవ్వడంలో మీ వంతుగా మీరు సాయం చేసారు ” అంటూ ఉద్వేగానికి లోనయ్యాను.

వాళ్ళుకూడా నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఆ తరవాత తేరుకుని వారి మామూలు ధోరణి లో చర్చలు సాగించారు. నేను కూడా వాళ్ళతో కూచున్నాను. జీనితంలో మళ్ళీ మేము కలుసుకునే అవకాశం రాదేమో నన్నట్లుగా ఆ సమయం ఎంతో విలువైనదిగా అనిపించింది.

అసలు వాళ్ళు ఎందు గురించి ఇక్కడ ఉన్నారో తెలీదు. నేను కూడా ఎప్పుడూ అడగలేదు.నేను అడిగితే వాళ్ళు నాది అడుగుతారు. నాది నేను చెప్పలేను.అందుకే ఒకరి గురించి మరొకరికి తెలీక పోవడమే మంచిది. తెలిసిందంటే మాలో కాంప్లెక్స్ వచ్చెస్తుంది. కాని వాళ్ళిద్దరూ చాలా యాక్టివ్,.. బాగా చదువుకున్నవాళ్ళు. అన్ని సబ్జెక్ట్స్ , అన్ని విషయాలు చక్కగా మాట్లాడుతారు.

"శృతీ సాయంత్రం మీ పేరెంట్స్ వస్తారు నువ్వు రెడీగా ఉండు".

నా సామాను ఏమీ ఎక్కువగా లేదు. అయినా ఓ మనిషి వచ్చి నేను అన్నీ సద్దుకోడంలో సాయం చేసాడు.

ఇక్కడికి వచ్చినప్పుడు అన్నీ స్పర్శలు కోల్పోయిన ఓ మొద్దుని. ఇప్పుడు అణువణువున చైతన్యం నింపుకున్న మనిషిని. ఈ గాలి,ఈ చెట్లు ఈ డాక్టర్లు ఎలా మర్చెస్తాయో, వాటికున్న శక్తి అది.

అమ్మా ,నాన్న నన్ను తీసుకెళ్ళడానికి వచ్చారు. వాళ్ళు నాకోసం ఎదురు చూస్తున్నారు. నాకోసం ఎదురు చూడడం అమ్మ కి అలవాటే. నేను స్కూలుకి వెళ్ళే రోజుల్లో ,స్కూలు బస్సు కోసం ఎదురు చూస్తున్నప్పుడు నా స్కూలు బేగ్ ని పట్టుకుని అమ్మ నుంచుంటే నేను మిగిలిన పిల్లలతో ఆడుకుంటూ మాట్లాడుతూండే దాన్ని. సాయంత్రం కూడా అదే సీను. నాకోసం ఎదురు చూసేది. బస్సులోంచి నేను దిగగానే నా బేగ్ పట్టుకుని నడిచేది. నేను మిగిలిన పిల్లలతో కబుర్లు చెప్పుకుంటూ వచ్చేదాన్ని.పదో క్లాసు బోర్డు పరీక్షలకి నేను పరీక్ష రాసి బయటికి వచ్చే వరకూ అక్కడే కూచునేది. ఇప్పుడు కూడా నాకోసం ఎదురు చూస్తోంది.

ఆఫీసులో ఉన్నారని అంటే నేను వాళ్ల దగ్గరికి వెళ్ళాను. అక్కడ అమ్మా నాన్న గారు కూచుని ఉన్నారు వాళ్ళల్లో చాలా మార్పు, జుట్టు,రంగు,చర్మం అన్నింట్లో మార్పు, వయసు పై బడ్డ వాళ్ళ ల్లాగా కనిపిస్తున్నారు. ఇలాంటి పెద్ద వాళ్ళని బాధపెట్టాను. వాళ్ళ ని చూడడానికి సిగ్గుగా ఉంది. ఎంత ఏడ్పించానో, నా మూలంగా రాత్రిళ్ళు నిద్ర లేకుండా చేసాను. ఎన్ని విధాలుగా బాధ పెట్టాలో అన్ని విధాలుగా బాధ పెట్టాను. అయినా నన్ను క్షమించేసారు. నాకు కూడా ఇదివరకూ ఉన్న నెగిటివ్ ఫీలింగ్స్ ఇప్పుడు ఏంలేవు. ఒక లాంటి ఉద్వేగం. నోట్లోంచి మాట రాలేదు. నేను నేల వైపు చూస్తూండిపోయాను.

వాళ్ళు అక్కడ కూర్చున్న డాక్టరు గారితో మాట్లాడుతున్నారు. ఆయన నన్ను చూసారు. రమ్మన్నట్లుగా తల ఊపారు. నేను మెల్లిగా వెళ్ళాను, మెల్లిగా అమ్మ నన్ను దగ్గరికి తీసుకుని తల,జుట్టు నిమిరింది. అమ్మ ఏడుస్తోందని అర్థం అయింది. నాన్నగారు నా భుజం తట్టారు. వాళ్ళు తమ ప్రేమని ఎక్స్ ప్రెస్ చేసారు , కాని నేను తల వంచుకని ఉండిపోయాను.

డాక్టరు గారు,మందులు మానకుండా వేసుకోవాలన్నారు. వాటి ప్రాముఖ్యం గురించి చెప్పారు. అప్పుడప్పుడు కలుస్తూండమని, టచ్ లో ఉండమని అన్నారు. ఇంకా ఏవో చెప్పారు.నాతో ఎలా ప్రవర్తించాలో వాళ్ళకి కూడా చెప్పినట్లున్నారు. డాక్టరుగారు ఏం చెప్తే వాటన్నిటికీ తల ఊపుతున్నారు.

టాక్సి మాట్లాడారు. టాక్సీలో కూచుంటూ చుట్టూ చూసాను. ఇది యిన్ని నెలలు నేనున్న,భిన్న ప్రపంచం . తలుపు వేసాను. టాక్సి కదిలింది. నేనున్న ప్రపంచం మెల్లిగా వెనక్కి వెళ్ళి పోతొంది. మామూలు ప్రపంచం లోకి వచ్చాము. ప్రతీది ఆశ్చర్యంగా కనిపిస్తోంది. ఏంటో అన్నీ అందంగా కనిపిస్తున్నాయి. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్. అవును జీవితం అందమైంది. ఇంటికొచ్చేసాం.

.అంతకు ముందు నాకున్న కల ఓ డాక్టర్ని అవ్వాలని, అసలు నేను ఏంటో ఈ లోకానికి నిరూపించుకోవాలని అనుకునేదాన్ని. నా గురించి మా బంధువులందరూ గొప్పగా చెప్పుకోవాలని ఉండేది. ఇప్పుడు అదంతా సిల్లీగా అనిపిస్తోంది. మీనింగ్ లెస్ గా ఉంది.

నేను నాకోసం జీవించాలా, ఇంకోళ్ళ కోసమా.

ఇప్పుడు. నా మనసు ,నా ఆలోచనలూ,ఊహలూ,అన్నీ మారిపోయాయి. జీవితాన్ని మరో విధంగా చూడడం తెలుసుకున్నాను. కొత్త జీవితంలోకి అడుగు పెట్టడానికి ఒక్కసారిగా తలుపులు బార్లా తెరిచుకున్నాయి.

నన్ను మళ్ళీ కాలేజీలో చేరమని ఇంట్లో నాన్న అంటున్నారు. బిఎస్సీ కంటిన్యూ చెయ్యమని అన్నారు. ఆ తరవాత ఎమ్మెస్సీ చేయచ్చు అని అన్నారు.

ఏం చెప్పి, ఎలా చెప్పి వాళ్ళని కన్విన్స్ చేయగలను ?

నేను ఇదివరకూ శృతిని కాను. నాలో ఎన్నో మార్పులు జరిగాయి. అన్న సంగతి వాళ్ళకి తెలీదు. నేను ఈ మధ్య కాలంలో ఎంత కష్ట పడ్డానో, ఓ చిన్న పుస్తకాన్ని చదవడానికి ఎంత కష్ట పడ్డానో ఎలా చెప్పగలను

ఓ పెద్ద కొండని ఎంత కష్టంతో ఎలా ఎక్కానో ఎలా చెప్పగలను. ఇప్పుడు నాకు ఏది ఇష్టం అని ఎలా చెప్పగలనూ ? ఇవి నాకు ఇష్టమైనవి, అత్యంత విలువైనవి అని ఎలా చెప్పగలను? చెప్పలేను.

జీవితం అంటే డాక్టరు చదువు ఒక్కటే కాదు. జీవితానికి అర్థం ఇచ్చేవి చాలా ఉన్నాయి.

ఇవన్నీ చెప్పలేదు, కానీ మనసు మార్చుకున్నానని చెప్పాను. ఓ రెండు నెలలు వదిలేయమని కూడా అన్నాను. నాకు ఉత్సాహం ఇచ్చేవి , ఆనంద పరిచేవి చేస్తాను. అలాంటిదే చదువుతాను.

" నీ ఇష్టం నిన్నుబలవంత పెట్టం. నీ కు నచ్చింది చెయ్యి "

జీవితంలో నాకు ఏం కావాలో, ఏం అనుకుంటున్నానో, వాళ్ళకి తెలిసాకా నన్ను ఏం అనలేకపోయారు. మాంటిసోరి టీచర్స్ ట్రైనింగ్ , అది నాకు ఇష్టం. నేను చదివిన చిన్న పిల్లల పుస్తకాలు, ఆ పుస్తకాలు చదువుతున్నప్పుడు నేను ఆనందిచినట్లు, వాళ్ళు కూడా ఆనందించాలి.

పుస్తక పఠనం ఎంత ఉత్సాహాన్నిస్తుందో, ప్రాక్టికల్ గా తెలుసుకుంటారు.

ఆ ఆలోచన మనసులోకి రాగానే నేను చాలా ఎక్సైట్ అయ్యాను. అంతేనా. నా రచనలు అందరూ చదవాలి. రచనలు చెయ్యాలంటే పుస్తకాలు చదవాలి, అంటే నేను లైబ్రెరీ లో పనిచెయ్యాలి. దానికోసం లైబ్రెరీ సైన్స్ చదవాలి. అది ఏంచెయ్యాలన్నా డిగ్రీ పూర్తి చెయ్యాలి. అది ఉంటేనే గానీ నేను మరో డిప్లొమా చేయాలేను. అందుకని ముందు బీఎస్సీ కంప్లీట్ చెయ్యాలి.

ఆతరవాత పిల్లలకోసం ఎన్నో కథలూ, నవలలూ రాసినట్లుగా ఫీలయ్యాను. నేను చిన్న పిల్లల మధ్య కూచుని వాళ్ళకి కథలు చెప్తున్నాను,నేను రాసినది ఎంతో మంది చదువుతున్నారు. నేను వేసిన పెయింటింగ్ లు నా కళ్ళముందు కదులుతున్నాయి.

ఇది కల, ఇప్పుడు నేను కంటున్న కల. కొత్తగా కంటున్న కల.

ఇదివరకు కన్న కలల్లాంటివి కాదు.అవి నన్ను మోసం చేసాయి.బాధించాయి.

ఇది నా కళ్ళల్లోంచి,చూస్తూ నేను కన్నకల

అమ్మా వాళ్ళ కళ్ళల్లోంచి చూసి, వాళ్ళ కల కాదు.

దీన్ని నేను నిజం చేసుకో గలను. ఇందులో ఫెయిల్ అయ్యే అవకాశం లేదు ఒక వేళ అయినా కూడా మళ్ళీ ప్రయత్నిస్తాను. వెయ్యి సార్లు ఫెయిలయ్యాకనే కదా, ఎడిసన్, బల్బు కనిపెట్టడంలో కృతకత్యుడయ్యాడు. నేనూ అంతే. ఈ కలని నిజం చేసుకుంటాను. దీని గురించిన ఆలోచనలతోనే నాలుగు రోజులు గడిచిపోయాయి.

ఇంటికెల్ళాకా నేను లేనప్పుడు వంశీ చాలా సార్లు ఫోన్ చేసాడని అమ్మ అంది. నేను స్వగ్రామానికి వెళ్ళానని అమ్మ చెప్పిందిట, ఫోన్ నంబర్ అడిగితే అక్కడ ఫోను సౌకర్యం అదీ లేదని కూడా అందిట. నా గురించి చెప్పడానికి సిగ్గు పడ్డారు. అందుకే అబద్ధం ఆడేసారు. అలా చెప్పడానికి ఎంతటి బాధని అనుభవించారో. ఎలాంటి మాటలని వినాల్సి వచ్చిందో! ఎన్ని ఎదుర్కొని ఉంటారో ! అయితే అదంతా ఓ చరిత్ర ,నిన్నటిది అంతా చెత్త కుప్ప. కానీ ఈరోజున అందరం పరిస్థితులు ఇచ్చిన ధైర్యంతో శక్తితో,నిబ్బరంగా ఉంటున్నాం..

నేను వచ్చానని తెలిసి నా కాలేజి స్నేహితులు వచ్చారు . ఇదివరకూ లాగా అమ్మ అభ్యంతరం పెట్టలేదు. అడ్డు పెట్ట లేదు.

. ఎవరికైనా చెప్పాలా వద్దా అన్న దాని మీద నాకేమాత్రం అనుమానం లేదు.ఎందుకంటే డాక్టరు గారు అన్నారు కదా, నీకు జరిగినది చెప్పుకోడానికి నువ్వు సిగ్గు పడక్కర్లేదు. అవును ,నేనెందుకు సిగ్గు పడాలి ఇందులో సిగ్గుపడేందుకు ఏముంది?

నేను ఓ మానసిక రుగ్మతతో బాధ పడ్డాను. దానిని ఎంతో వేదనతో ఎదుర్కొన్నాను. అది ఓ యుద్ధమే. పోరాడాను. దానిని గెలిచాను.

అదే ఇప్పుడు నాలో ఉంది. ఇప్పుడు నాలో ఉన్నవన్ని కూడా నేను నిస్సంకోచంగా వ్యక్తీకరించగలను. ఇదివరకు నేను నాకు తోచినట్లు రాసేదాన్ని. ఇప్పుడలా కాదు. చదువు విలువ ,పదాల విలువ నాకు బాగా తెలిసింది. రాయడం విలువ తెలుసు. నేను రాసే ప్రతీ పదం ఓ మేలిమి రత్నం.

ఏదైనా పోగొట్టుకున్నప్పుడే దాని విలువ తెలుస్తుంది. అప్రీషియేట్ చేస్తాం. నా విషయంలో కూడా ఇదే జరిగింది. మెడిసిన్ లో సీటు కోసం మూడు సార్లు ఎంట్రెన్స్ రాసాను .రాలేదు. నేను కన్నకల నెరవేర లేదు. బిఎస్సీ లో చేరాను. నేను,ఎమ్మెస్సీ చేసి పీఎచ్ డీ చేయాలని మరో కల కన్నాను. చిన్నప్పటి నుంచి నేను చాలా తెలివైన దాన్నని ఇంట్లో వాళ్ళ నమ్మకం. నాక్కూడా ఉండేది. ఎలాగైనా డాక్టర్ని అవ్వాలన్న కోరిక బలంగా ఉండేది. అందరికన్నా గొప్పగా ఉండాలన్నకోరిక కూడా అందులోంచే వచ్చింది. అవి ఏవి నెరవేర లేదు.

అయితే నా కలలని నెరవేర్చుకోడంలో ఏం పోగొట్టుకున్నానో చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. ఈ లోపల జరగాల్సిన నష్టాలు జరిగిపోయాయి.

నాశరీరంలో ఎన్నో మార్పులు ,రెండు సార్లు ఆత్మహత్యా ప్రయత్నం చేసాను. నరకంలో చీకట్లో మగ్గిపోయాను. మెల్లి మెల్లిగా డిప్రెషన్ లోకి వెళ్లి పోతున్నానని చాలా ఆలస్యంగా తెలుసు కున్నాము. అయితే ఇది ఒకప్పుడు.

ఇప్పుడు కాదు. నేను ఆ శృతిని కాను. నేను చాలా మారిపోయాను. నేను గత కొన్ని వారాలుగా మెంటల్ హాస్పటల్ లో ఉన్నాను. ఇప్పుడు నేను మామూలుగా ఉన్నాను. అందుకే నేను నా కథ చెప్పడానికి బతికి ఉన్నాననిపిస్తోంది. నేను ఆక్యుపేషనల్ థెరపీ లో ఉన్నన్ని రోజులు ఎంతో సంతోషంగా ఉన్నాను. మొదటి సారి మంచివి చేసాను. మానసిక సమస్యలున్న నేను ఇప్పుడు. నేను దేనిని కేర్ చేయను. మానసికంగా ఆరోగ్యంగా ఉండడం ,లేకపోవడం మధ్య ఉన్నది ఓ చిన్న గీత మాత్రమే. దాన్ని చెరపడానికే చేసిన ప్రయత్నం ఫలించింది.

నేను నా దినచర్య,మర్చిపోయాను. అందులో నిద్ర ఒకటి., దాన్ని కూడా పోగొట్టుకున్నాను.

డాక్టర్లు. డిప్రెషన్ అన్నారు. మందులు ,దాని సైడ్ ఎఫెక్ట్ నిద్ర. ఎప్పుడు లేస్తున్నానో,ఎప్పుడు తింటున్నానో, నా ఇష్టమైనట్టుగా ఉన్నాను. చదువు ,పుస్తకాలు అంటే ఏంటో తెలీనట్లుగా అయిపోయాను. చదవడం రాయడం గుర్తు పెట్టకోడం ఇంకా చాలా చాలా మర్చిపోయాను. నేను ఓ మెంటల్ హాస్పిటల్ ఉన్నాను. అక్కడ నాకు ఆక్యుపేషనల్ థెరపీ ఇచ్చారు. ఇది నన్ను మార్చేసింది.

ఇందులోనే జీవితంలోని అందాన్ని చూసాను. ప్రతీ చిన్న విషయం ఎంత ఆనందాన్నిస్తాయో అనుభవ పూర్వకంగా తెలుస్తున్నాను. ఇది ఓ వరం.

రోజులో ఒక సారైనా నవ్వక పోతే,మరో మనిషిని సంతోష పరచకపోతే,ఎదుటి మనిషిలోని మంచిని ,ఆ మనిషి చేసిన పనులని ఎప్రీషియేట్ చెయ్యకపోతే,ఈ భూమ్మీద నువ్వు ఆ రోజుని వృధా చేసినట్లే.ఓ నడి వీధిలో నుంచుని ఈ విషయాన్ని గట్టిగా అరవాలనిపిస్తోంది. కనపడ్డ ప్రతీ మనిషిని పట్టుకుని ఊపి,ఊపి చెప్పాలని ఉంది.కాని అలా చెయ్యలేను అలా చేస్తే మళ్ళీ పిచ్చి ఎక్కిందేమో అనేస్తారు.

నాకు ఈ వైద్యం జరుగుతున్న ఇన్సిటిట్యూట్ లో కొంత మందిని కలుసుకున్నాను. ఆ అవకాశం దొరికింది. వాళ్ళతో స్నేహం.ఎంతో అద్భుతమైనది. వాళ్ళ సాంగత్యంలో నేను ఎన్నో నేర్చుకున్నాను. ఎన్నో చెప్పలేను. నమ్మకం ప్రేమ ,ఈ రెండూ కూడా అద్భుతాలని చేస్తాయి స్నేహం,ప్రేమ ఈ రెండింటికి ఎంతో శక్తి ఉంటుందని తెలుసుకున్నాను. తరిచి తరిచి చూస్తుంటే,ప్రతీ క్షణం సహజంగా,ఆనందంతో అనుభవిస్తున్నానిపించింది.

ఇప్పుడు నేను. కొత్త శృతిని.జీవితాన్ని కొత్త దార్లోంచి కొనసాగించాలని అనుకుంటున్నాను. ఇప్పుడు నాకు రాయడం విలువ తెలుసు కున్నాను. రాస్తూంటే మనలోని ఎన్నో అవయవాలు యాక్టివ్ గా మారిపోతాయి. ఆ చేతనత్వాన్ని మనం ఎందుకు వదులు కోవాలి, "

ఇది నా గతం. జీవితాన్ని ఒక్కసారి కుదిపేసి న గతం. అల్లకల్లోలం అయిన గతం. ఇప్పుడు అదేంలేదు. కామ్ గా అంది. నిశ్శబ్ధంగా సాగిపోయే వాహిని.

శృతి వర్తమానం లోకి వచ్చింది. మానవ్ ఆమెనే చూస్తున్నాడు.

"మానవ్, ఇది నీకు తెలియని శృతి జీవితం. నేను నీతో ముందే అన్నాను, నా లోపల ఉన్న మరో శృతిని గురించి నీకు తెలియాలి అని. ఇంత వరకూ నా జీవితం లో జరిగిన ఎత్తులూ పల్లాలూ, దాని కోసం నాకు జరిగిన వైద్యం గురించి కూడా చెప్పాను. నేను ఏమాత్రం ఒత్తిడిని తట్టుకోలేను అని నాకు అనుభవ పూర్వకంగా తెలుసుకున్నాను.

పెళ్ళి చేసుకుంటే ఎంత లేదన్నా ఏదో ఓ రకమైన స్ట్రెస్ ,టెన్షన్ లూ ఉంటాయి. నేను చాలా సెన్సిటివ్ అవన్నీ ఎదుర్కొంటూ, ప్రవర్తనలో మార్పులు ఎదుర్కొంటూ,మళ్ళీ పాత జీవితానికి వెళ్ళాలని అనుకోడం లేదు.

ఇప్పుడు నా వయసు ముప్పై, నాకు ఈ లైబ్రేరీ, నా చుట్టూ పెరేడ్ చేస్తున్నఈ పుస్తకాలు, అందులో ఉన్న మహానుభావుల, ఆలోచనలు,అభిప్రాయాలు,సిద్ధాంతాలూ ,బోధలూ వాటి పరిమళాలు అన్నీ ఆస్వాదిస్తూ గడపడం కన్న వేరే ఏం అక్కర్లేదు.

నేను ఏం నేర్చుకున్నానో దాన్ని ఆచరించడమే జ్ఞానం. ఏ భాషలో రాసినా వ్యక్తిత్వ వికాసంలో ఇదే తొలి పాఠం. ఒకప్పుడు చదువంటే బోర్ అనుకున్నాను , కానీ తరవాత ఎంతో ఇష్టపడి బీఎస్సీ పూర్తి చేసాను.ట్రైనింగ్ అయ్యాను.ఓ నాలుగైదు వాటిల్లో డిప్లొమా తీసుకున్నాను. లైబ్రేరీ సైన్సు చదివాను.

నన్ను నేను మర్చిపోడానికి నా గతం మళ్ళీ నావైపు చూడకూడదని వృద్ధాశ్రమానికి అనాధాశ్రమానికి వెళ్తూంటాను.,ఆ పిల్లలు ,వాళ్ళ మధ్య కూచుని వాళ్ళల్లో నన్ను నేను చూసుకుంటూంటాను. పసితనాన్ని చూసుకుంటూంటాను.

రోజూ వాళ్ళని చూస్తూ నేను తెలుసుకున్నదేంటంటే వాళ్ళు అవసరమైన దానికే ఏడుస్తారు. మనం ప్రతీ దానికీ ఏడుస్తాం. అందుకే మన మనసుని పసిగా ఉంచుకోవాలి, కసిగా కాదు. నిజం చూపించే అద్దంలా ఉంచుకోవాలి. అప్పుడే అన్నిటి పట్లా సమ భావంతో ఉండగలం . అనవసరమైనవివదిలేయగలం. మొక్కలు,ఆక్సిజన్ పీల్చి కార్బన్ డై ఆక్సైడ్ వదిలేసినట్లు, మంచివి,పనికొచ్చేవి విని మనలో పనికిరాని కార్బన్ డై ఆక్సైడ్ ని వదిలేయాలి.

ఎందుకంటే జీవితాంతం మనం గడిపేది మనతోనే.అందుకే మన సమయాన్ని,శక్తిని,తెలివిని,కేవలం రసాయయనక చర్యగా వాడేసుకోకుండా,జీవశక్తిని అమృతంగా మార్చుకోవాలని అనుకుంటున్నాను.

మనం స్నేహితులుగా ఉందాం అంటే నాకేం అభ్యంతరం లేదు. అది నీ ఇష్టం "

అంతవరకూ శృతి చెప్పినదంతా విన్న మానవ్ ఓ పది నిమిషాల వరకూ మామూలు మనిషి కాలేక పోయాడు. చేతనత్వం కోల్పోయన వాడిలాగా అయిపోయాడు.

"నేను కదిలిపోయాను శృతీ, ఇది నీ జీవితం కాదు ఓ రెఫరెన్స్ పుస్తకం, ఈ పుస్తకం చదువుతూ నేను నేర్చుకోవలసినవి ,తెలుసుకోవలసినది,చాలా ఉన్నాయి. పెళ్ళి కన్నా నీతో స్నేహం నాకు ముఖ్యం. దాన్ని వదులుకోను."

ఇద్దరూ హొటల్ బయటికి వచ్చారు.సన్నటి తుంపర.ఒక్కసారి ఇద్దరూ కూడా ఆకాశం వేపు చూసారు.

"తొందరగా ఇళ్ళకి చేరుకుంటే మంచిది. పెద్దగానే పడచ్చు. "అంటూండగానే సెక్యూరిటీ కారు తీసుకొచ్చి తాళాలు మానవ్ కిచ్చాడు. ఇద్దరూ కూచున్నారు.

కారు స్టార్ట్ చెయ్యబోయి, పక్కన ఉన్న శృతిని చూసాడు.

" నిన్ను చూసి చాలా నేర్చుకోవాలి. సముద్రంలోని అలలు ఎలా పాఠం నేర్పుతాయో, నువ్వుకూడా పాఠం నేర్పుతున్నావు. నువ్వు ఓ పడి లేచిన తరంగానివి, ఇంక కింద పడకుండా అదే నిబ్బరంతో ఉండు. నీకెప్పుడు పెళ్ళి చేసుకోవాలన్న ఆలోచన వస్తే నన్ను ముందు గుర్తుంచుకో. "

"ఒకప్పుడు నేను దిశనిర్దేశం లేక అయోమయంగా ఉన్నాను. భూమికి గజం లోతు కూరుకు పోయి ఉన్నాను. ఇప్పుడు నన్ను చూసి నేర్చుకోడానికి చాలా మంది ఉన్నారు,నిజానికి నేను నేర్చుకోవాల్సినదే చాలా ఉంది. జీవితం ఉన్నన్ని రోజులూ ఏదో ఒకటి నేర్చుకోవాలి. ఎన్నిరోజులుంటామో తెలీనప్పుడు ప్రతీ క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేననుకుంటాను "

కారు కిటికీ తలుపు వేయబోయి,రాలుతున్న సన్నటి ఆవాల సైజున్న చినుకులని చూసి,వెంటనే దిగిపోయింది శృతి.ఆశ్చర్యంగా ఆమెనే చూస్తున్నాడు మానవ్.ఆమె ఆకాశం కేసి చూస్తోంది. తను కూడా పైకి చూసాడు. ఆకాశం అంతా నల్లటి మేఘాలతో నిండి ఉంది. సన్నగా చినుకులు రాలుతున్నాయి.

చల్లని గాలి ఒంటిని తాకుతూంటే తన చేతులు రెండూ గాల్లోకి చాపింది. చేతిమీద,నీటి ముత్యాలు. తలని ఎత్తి, ఆకాశాన్ని చూసింది. ముక్కు మీద కంటి రెప్పల మీద ఆనందం తో మెరుస్తున్న నీటి బొట్లు. ఆ నీటిబొట్లు సప్తరంగుల కిరణాలు వెదజల్లు తున్నాయి

ఆ ఇంద్ర ధనుస్సులు క్షణికాలు కావు. ఎప్పటికీ వెలసిపోని రంగుల పండగ, జీవితాంతం నిలిచి పోయేవి. ఎవరి జీవితానికి వాడే దేవుడు. ఎవరి జీవితాన్ని వాళ్ళే రాసుకునే రచయిత, రంగులు నింపుకునే చిత్రకారుడు అని అనుకుంది. దీనికి వన్నె తెచ్చేవి ఆలోచనలే. ఆ ఆలోచనలే విజ్ఞానం. ఆ విజ్ఞానమే కనువిప్పు. అదే చీకట్లో దివ్వె.అదే విముక్తి. అదే శక్తి. అని మనసులో అనుకుంది శృతి.

శృతిని దింపుతూ అన్నాడు, మనం స్నేహితులం. ఓ కే.

శృతి తల ఊపి నవ్వింది.

ఊఊఊ